



శ్రీ బి.ఎస్.రాములుగారి పేరు ఆధునిక సాహితీలోకంలో సుప్రతిష్ఠితం. ఆయన మూర్తిమత్వం ఎంతోమందికి ఆదర్శం. తెల్లటి జుట్టు, తెల్లటి గడ్డం, నవ్వుతున్న ముఖంతో అనుభవాల పంటగా కనిపిస్తారు. వాస్తవానికి సరిహద్దుగా నమ్మకమిస్తారు. ఈ పుస్తకాన్ని చదివితే నేనన్న మాటల్లో ప్రతీ అక్షరానికి సాక్ష్యం దొరుకుతుంది.

శ్రీ బి.ఎస్.రాములుగారు భిన్న ప్రక్రియల్లో ఎనభై రచనలు చేశారు. నవల, కథ, విమర్శ, ఉద్యమ నేపథ్యగ్రంథాలు, చారిత్రక నిరూపక గ్రంథాలు ఇలా ఎన్నో ఉన్నాయి. వీటితోపాటు కేవలం రచనలకే పరిమితం కాక తెలంగాణ రాష్ట్రసాధనలో ఆయన మమైక్యం చెందారు. తెలంగాణ తల్లి రూపకల్పనలో ఆయనది ప్రముఖపాత్ర. ఆయన రచించిన గ్రంథాలు, గ్రంథభాగాలు ఉన్నతస్థాయి విద్యాభ్యాసకులకు పాఠ్యాంశాలుగా గుర్తింపు పొందాయి. ఒక్క ముక్కలో... రచయిత - సామాజిక బాధ్యత అనే అంశానికి శ్రీ బి.ఎస్.రాములుగారు ఉదాత్తమైన ఉదాహరణ.

అలాంటి రాములుగారి రచనలలో ఒకటైన 'బతుకు పయనం' కథాసంపుటిని ఎమ్.ఫిల్ పరిశోధనాంశానికి స్వీకరించిన మొయిలి మోహనరావు విషయ విశ్లేషణలో, నిరూపణలో నూటికి నూరుపాళ్లు విజయం సాధించాడు. ఏ అంశాన్నీ గోడ దాటించలేదు. రచయిత శ్రీ బి.ఎస్.రాములు గారితో పలు దఫాలు ప్రత్యక్షంగా సంప్రదించాడు. ఎన్నెన్ని ప్రశ్నలు సంధించినా సమాధానం చెప్పే సహనం రాములుగారిది. తెలుసుకోవాల్సిన విషయాన్ని తెలుసుకునేదాకా పట్టు విడువని పరిస్థితి మోహనరావుది. మొయిలి మోహనరావు కష్టానికి, సామర్థ్యానికి ప్రతిరూపం ఈ సిద్ధాంతవ్యాసం.

-డా.జి.ఎస్.భాస్కర రావు,
అసోసియేట్ ప్రొఫెసర్, పి.ఎస్.తెలుగు యూనివర్శిటీ, బొమ్మూరు

b.s.ramulu
'bathuku payanam'
kathalu - parisheelana
(m.phil. thesis) by
moyili mohana rao



b.s.ramulu
social philosopher

బి.ఎస్.రాములు 'బతుకుపయనం' కథలు పరిశీలన మొయిలి మోహనరావు

బి.ఎస్.రాములు

'బతుకుపయనం' కథలు

పరిశీలన



మొయిలి మోహనరావు

బి.ఎస్.రాములు
'బతుకుపయనం' కథలు
పరిశీలన

మొయిలి మోహనరావు

ప్రచురణ
విశాల సాహిత్య అకాడమీ
హైదరాబాద్ - 500 044
2011

బి.ఎస్.రాములు
'బతుకుపయనం' కథలు
పరిశీలన
పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం
ఎం.ఫిల్ పట్టా పొందిన లఘు సిద్ధాంత వ్యాసం

మొయిలి మోహనరావు
కాజీపేట (గ్రామం), అరసవల్లి (పోస్ట్),
శ్రీకాకుళం (మండలం, జిల్లా) - 532 401
ఫోన్ : 9951488146

ప్రథమ ముద్రణ : 2011
పేజీలు : 152


పొట్టిశ్రీరాములు తెలుగువిశ్వవిద్యాలయం వారి
పాక్షిక ఆర్థిక సహాయంతో ప్రచురించబడింది.

కవర్ డిజైన్ : రమణజీవి
డిటిపి : ఏవిఎమ్ గ్రాఫిక్స్, 9440096321
ముద్రణ : కర్షక్ ప్రింటర్స్, హైదరాబాద్, 040-27653348

Publishers & Distributors:
Vishala Sahitya Academy
2-2-186/53/5, Rama Krishna Nagar,
Bagh Amberpet, Hyderabad - 500 013
& : 09391036987

Rs. **90 /-**

అంకితం



ఎందరికో స్ఫూర్తి...
ఎందరికో ఫ్రెండ్, గైడ్, ఫిలాసఫర్...
సాహిత్యంలో తల్లీ, తండ్రి, గురువై...
నాలాంటి ఎందరికో అన్నీ మీరై...


మీ జీవితం ఎందరికో ఆదర్శం...
మీ మార్గం సుదీర్ఘం...
మీ లక్ష్యం మహోన్నతం...

సామాజిక తత్వవేత్త
బి.ఎస్.రాములు, శ్యామల దంపతులకు...
వినమ్రంగా...

- మొయిలి మోహనరావు

బతుకు పయనం

కథల సంపుటి ముఖచిత్రం



విషయ సూచిక



సామాజికతత్వవేత్త బి.ఎస్.రాములు గారితో పరిశోధకుడు

గురుపూజోత్సవం 5 సెప్టెంబర్ 2010




యం. మోహనరావు, లెక్చరర్‌ను శివాని డిగ్రీ కళాశాల శ్రీకాకుళం, విద్యార్థులు సత్కరిస్తున్న దృశ్యం



ఉభయ గోదావరి జిల్లాల సాహిత్య సదస్సు 2010లో
వరుసగా యం. మోహనరావు,... ప్రసంగిస్తున్న డా॥కె.కూర్మయ్యగారు, తెలుగు రీడర్, ప్రభుత్వ కళాశాల రాజమండ్రి



ఉభయగోదావరి జిల్లాల సాహిత్య సదస్సులో శలాక రఘునాథశర్మగారు,
యం.మోహనరావుగారికి సెమినార్ పత్రం అందచేస్తున్న దృశ్యం...
మధ్యలో డా॥ గరికపాటి నర్సింహారావు, డా॥ ఎండ్లూరి సుధాకర రావు గార్లు



రాజమండ్రి ప్రభుత్వ పి.జి. కళాశాల వార్షికోత్సవం మార్చి, 2008 సందర్భంగా
'ఓటున్న ప్రజలకు కోటి దండాలు' నాటకంలో చిలకమ్మ,
సన్యాసప్పడుగా మోహనరావు

కృతజ్ఞతలు

బి.ఎస్.రాములు 'బతుకుపయనం' కథలు-పరిశీలన అనే అంశంపై ఎం.ఫిల్. పరిశోధన చేయడానికి అవకాశం కల్పించిన పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ఆచార్య అనుమాండ్ల భూమయ్య గారికి అప్పటి రిజిస్ట్రార్ ఆచార్య శ్రీపాద సుబ్రహ్మణ్యం గారికి, ఇప్పటి రిజిస్ట్రార్ ఆచార్య భట్టు రమేష్ గారికి...

సాహితీతత్త్వ సమన్వయంపై అవగాహన కల్పించిన సాహిత్యపీఠం పీఠాధిపతి ఆచార్య ఎండ్లూరి సుధాకరరావు గారికి...

పరిశోధనాంశం ఎన్నుకోవడంలో స్వాతంత్ర్యాన్నిచ్చి, నాలో కలిగిన పరిశోధనాభిలాషకు స్వేచ్ఛనిచ్చి, నన్ను వెన్నుతట్టి సహాయ సహకారాలు అందించిన పర్యవేక్షకులు ఆచార్య జి.ఎస్.భాస్కరరావు గారికి...

సాహితీతత్త్వ సమన్వయం బోధించిన ప్రొఫెసర్ పొన్నా లీలావతి గారికి, సాహితీపీఠం ఆచార్యులు కర్రి నాగార్జునశ్రీ గారికి...

'బతుకుపయనం' కథా సంపుటిపై పరిశోధన చేయడానికి అంగీకరించి, ఇంటర్వ్యూలో తమ జీవిత విశేషాలను వివరించడమే కాక, వారి రచనలన్నింటిని ఇచ్చి, నా సందేహాలను తీర్చి సంపూర్ణ సహకారాన్ని అందించిన సుప్రసిద్ధ కథా రచయిత, సామాజిక తత్త్వవేత్త బి.ఎస్.రాములు గారికి, వారి సతీమణి శ్యామలగారికి...

సరైన సలహాలు, సూచనలు ఇచ్చిన తెలంగాణ తొలితరం కథకులు గూడూరి సీతారాం గారికి...

ఎం.ఏ.లో చేరినప్పుడే సాహిత్యం పట్ల శ్రద్ధ కలిగించిన గురువులు డా॥ డి.మీరాస్వామి గారికి, డా॥ రెంటాల శ్రీవెంకటేశ్వరరావు గారికి, డా॥ ఎం.సి.కనకయ్య గారికి, డా॥ కె.వి.ఎస్.లక్ష్మీపతి గారికి, డా॥ ఎం.వి.ఎస్.ప్రసాదరావు గారికి...

నా పరిశోధనకు సంబంధించిన పుస్తకాలను సకాలంలో అందించి సహకరించిన సాహిత్యపీఠం గ్రంథాలయ అధికారి, అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీమతి ఎ.తారాబాయి గారికి, గ్రంథాలయ సిబ్బంది ఐ.ఎస్.ఎన్.రాజు గారికి, విజయకుమార్ గార్లకు, కార్యాలయ సిబ్బందికి మరియు హాస్టల్ సిబ్బందికి...

తాము చదువుకోలేకపోయినా నన్ను చదవమని మహా ఇష్టంతో ప్రోత్సహిస్తున్న నా తల్లిదండ్రులు మొయిలి అప్పారావు, లచ్చుమ్మ గార్లకు, నా కంటె చిన్న వారైనప్పటికి పెద్ద

మనసుతో ఏ బాధ్యతా నా మీద పెట్టకుండా ప్రోత్సహిస్తున్న నా తమ్ముళ్ళు శ్రీనివాసరావు, ఫల్గుణరావులకు...

అక్షరాభ్యాసం చేసి అ, ఆ లు దిద్దించిన తొలి గురువు ఆదినారాయణ మాష్టారు గారికి, పరిశోధన పట్ల శ్రద్ధ కలిగించిన మా అన్నయ్యలు, వదినలు, డా॥ శ్రీరాములు-ప్రభావతి, జగన్నాథ నాయుడు-హేమలత, విశ్వనాథం-ఈశ్వరమ్మలకు...

నిరంతరం నా ప్రగతిని కాంక్షించే మా తాతయ్య కీ.శే. అసిరన్న, నానమ్మ నీలమ్మ గార్లకు, మా పెదనాన్న చిన్నవాడు, పెద్దమ్మ నారాయణమ్మగార్లకు, చిన్నాన్న సూర్యనారాయణ, చిన్నమ్మ రమాదేవి గార్లకు, మా మామయ్యలు, మేనత్తలు శీర జగన్నాధరావు-నరసమ్మ, మంత్రి సూర్యనారాయణ-సావిత్రి గార్లకు, పెద్ద మనసుతో నాకు బుద్ధులు చెప్పిన మా మేనత్త చిన్నమ్మడుకు, బావలు రమేష్, కోటి, కొండలరావు, రామారావు, ధనుజంయులకు, తమ్ముడు బాలాజీకి, చెల్లెల్లు భాగ్యలక్ష్మి, సురేఖ, సావిత్రిలకు, మరదలు జయలక్ష్మికి...

వీధిబడి నుండి విశ్వవిద్యాలయం వరకు తమ సహాయ సహకారాలందిస్తున్న నా (మా) అభివృద్ధికి కారకులైన ముద్దాడ శ్రీరామమూర్తి, సూర్యనారాయణ, లక్ష్మీనారాయణ, కృష్ణమూర్తి నాయుడు గార్లకు... మా శ్రేయోభిలాషి వి.భీమారావు గారికి...

సాయిగీతమ్ డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ రామారావు (గిరిధర్) గారికి, శివాని డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ జి.అప్పల నాయుడు గారికి, వైస్ ప్రిన్సిపాల్ ఎన్.నారాయణమూర్తి గారికి...

సాహితీ మిత్రులు డి.శివరామకృష్ణ, పి.ఈశ్వరరావు, కె.మనోహర్, ఎ.సూరప్పుడు, బాల్యమిత్రులు జి.కృష్ణారావు, కె.కృష్ణారావు, ఎస్.సత్యనారాయణ, బి.అప్పారావు, పి.రవికుమార్, జె.కృష్ణ, బి.జగన్మోహనరావులకు....

వివాహం అయినా సరే విద్యను కొనసాగించమని ప్రోత్సహిస్తున్న నా సహచరి హారతి గారికి...

మా పిల్లలు చి॥ విజయకృష్ణకు, చి॥ శ్రీనిధి, నా సోదరుడు శ్రీనివాసరావు కొడుకు చి॥ షణ్ముఖ శ్రీహర్షకు ఆశీస్సులు...

అందంగా డి.టి.పి. చేసిన ఏవిఎమ్ గ్రాఫిక్స్ విజయ్‌కుమార్ గారికి...

ప్రత్యక్షంగా, పరోక్షంగా సహాయ సహకారాలందించిన వారెందరో....

అందరికీ నా హృదయ పూర్వక కృతజ్ఞతలు.

- మొయిలి మోహనరావు

మంచికి, కష్టానికి జోహార్లు

శ్రీ బి.యస్.రాములు గారి పేరు ఆధునిక సాహితీ లోకంలో సుప్రతిష్ఠితం. ఆయన మూర్తిమత్వం ఎంతోమందికి ఆదర్శం. ముందుగానే పొగడ్తలతో ప్రారంభించానని అనుకోవద్దు. ఆయనని చూడండి తెల్లటి జుట్టు, తెల్లటిగడ్డం, నవ్వుతున్న ముఖంతో అనుభవాల పంటగా కన్పిస్తారు. వాస్తవానికి సరిహద్దుగా నమ్మకమిస్తారు. ఈ పుస్తకాన్ని చదివితే నేనన్న మాటల్లో ప్రతీ అక్షరానికి సాక్ష్యం దొరుకుతుంది.

ఆశలు, అవాంతరాలు, ఆశయాలు, చేదు అనుభవాలు ఆయన మనసుని సుశిక్షణతో ప్రవర్తించేలా చేశాయి. చెప్పడం వరకే గాక భౌతిక శ్రమతో క్రియాశీలక సాఫల్యానికి పురిగొల్పాయి.

మనిషికి ప్రధానంగా రెండు పార్శ్వాలుంటాయి. చెప్పేదొకటి చేసేదింకొకటి. వీటికి కవి లేదా రచయిత కూడా అతీతుడు కాదు. ఈ భిన్న పార్శ్వాలు పోషించే వాళ్ళ భావాలు మిణుగురుల వెలుతురులాంటివి. చెప్పిన భావాలని క్రియాశీలకంగా ఎవరైతే ఆచరిస్తూ ఉంటారో వాళ్ళు భావితరాలకి పరమాదరణీయమవుతారు. ఆధునిక కాలంలో భవిష్యత్ కీర్తి పతాకని కదపలేనంత కట్టుదిట్టగా పాతుకున్న వారు శ్రీ బి.యస్.రాములు.

మొయిలి మోహనరావు ఈ సిద్ధాంత వ్యాసం మొదటి అధ్యాయంలో శ్రీ బి.యస్.రాములు గారి జీవితాన్ని పరిచయం చేశాడు. అధ్యాయంలోని విషయం చదివినపుడు శ్రీ రాములుగారి జీవితంలో ఆటుపోట్లు స్పష్టంగా గుర్తించవచ్చు. వేగవంతమైన ప్రవాహం చిన్న మొక్కని పెకలించి ఎన్ని వైపులకి తోసేసినా ఒక చోట ఒద్దుపట్టి, మహావృక్షంగా ఎదిగి, దిబ్బకట్టి ప్రవాహాన్ని నిలువరించి ఎన్నో ఫలాల్ని అందించిన స్థాయి బి.యస్.రామలు గారికి అన్వయిస్తుంది.

ప్రగతిని పరమావధిగా భావించే వారికి మార్పు అనివార్యం. బి.యస్.రాములు జీవన సాఫల్యంలో ఆ మార్పే కీలక పాత్ర వహించింది. సాంఘిక బాధ్యత ఆయన

ప్రధాన లక్ష్యం. ఇంతకుముందే ఆ బాధ్యతని సంపూర్ణంగా నిర్వర్తించిన పూలే, అంబేద్కర్, మార్క్స్ ఈయనకి మార్గనిర్ణాయకులు. వారితో పాటు బతుకు పోరాటం జరుపుతున్న సమకాలీన కష్టజీవులూ ఆదర్శమే.

శ్రీ బియస్.రాములుగారు భిన్న ప్రక్రియల్లో ఇంతవరకూ ఎనభై రచనలు చేశారు. నవల, కథ, విమర్శ, ఉద్యమ నేపథ్య గ్రంథాలు, చారిత్రక నిరూపక గ్రంథాలు ఇలా ఎన్నో ఉన్నాయి. వీటితో పాటు కేవలం రచనలకే పరిమితంగాక తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆయన మమైక్యం చెందారు. తెలంగాణ తల్లి రూపకల్పనలో ఆయనది ప్రముఖ పాత్ర. ఆయన రచించిన గ్రంథాలు, గ్రంథ భాగాలు ఉన్నత స్థాయి విద్యాభ్యాసకులకు పాఠ్యాంశాలుగా గుర్తింపు పొందాయి. ఒక్క ముక్కలో చెపితే రచయిత-సామాజిక బాధ్యత అనే అంశానికి శ్రీ బి.యస్.రాములు గారిని ఉదాత్తమైన ఉదాహరణగా గుర్తించక తప్పదు.

అలాంటి రాములు గారి రచనలలో ఒకటైన 'బతుకుపయనం' కథా సంపుటిని ఎం.ఫిల్. పరిశోధనాంశానికి స్వీకరించిన వర్ధిష్ణువు మొయిలి మోహనరావు, విషయ విశ్లేషణలో, విషయ నిరూపణలో నూటికి నూరుపాళ్ళు విజయం సాధించాడు. ఏ అంశాన్ని గోడ దాటించలేదు. రచయిత శ్రీ బి.ఎస్.రాములుగారితో పలు దఫాలు ప్రత్యక్షంగా సంప్రదించాడు. ఒకటి రెండు రోజులు ఉండవలసిన పరిస్థితి ఏర్పడితే రాములుగారు తన ఇంట్లోనే ఉంచుకుని, మోహనరావుని బిడ్డలా ఆదరించారు. ఎన్నెన్ని ప్రశ్నలు సంధించినా సమాధానం చెప్పే సహనం రాములుగారిది. తెలుసుకోవాల్సిన విషయాన్ని తెలుసుకునే దాక పట్టువిడవని పరిస్థితి మోహనరావుది. మొయిలి కష్టానికి, సామర్థ్యానికి ప్రతిరూపం ఈ సిద్ధాంత వ్యాసం. మోహనరావుకి నా హృదయ పూర్వక అభినందనలు.

- డా॥ జి.ఎస్.భాస్కరరావు

అసోసియేట్ ప్రొఫెసర్

స్కూల్ ఆఫ్ లిటరేచర్,

పి.ఎస్.తెలుగు యూనివర్సిటీ

బొమ్మూరు - 533 124.

అభినందన

- బి.ఎస్.రాములు

ఏదో యధాలాపంగా జరిగిందని అనుకుంటాం గానీ ప్రతిదాని వెనుక ఒక సామాజిక చారిత్రక నేపథ్యం వుంటుంది. మొయిలి మోహనరావు ఎం.ఫిల్ వెనుక కూడా అలాంటి నేపథ్యమే వుంది. బీహార్‌లో జవహర్ నవోదయ పాఠశాలలో పని చేస్తున్నప్పుడు శ్రీకాకుళంకు చెందిన డా॥ మొయిలి శ్రీరాములు నల్లగొండ జిల్లాకు చెందిన డా॥ బోయ జంగయ్య 'జాతర' నవలపై ఎం.ఫిల్, గుంటూరు జిల్లాకు చెందిన 'డా॥ కత్తి పద్మారావు సాహితీ సాక్షాత్కారం'పై పిహెచ్.డి. చేశారు. ఆ సందర్భంగా పిహెచ్.డి.కి నా చేత ముందుమాట రాయించారు. అలా పరిచయమైన మొయిలి శ్రీరాములు నా గురించి తెలుసుకొని నా జీవిత చరిత్ర రాయాలని సంకల్పించి ఎన్నో రోజులు చర్చలు చేశారు. సంక్షిప్తంగా కొంతమేరకు రాశారు. పత్రికల్లో ప్రచురించారు. తరువాత కరీంనగర్ జిల్లా చొప్పదండికి బదిలీ అయ్యారు. తన రచన పూర్తి కాలేదని వేదనతో తన సోదరుడు మొయిలి మోహనరావును 'బతుకుపయనం' కథల సంపుటిపై ఎం.ఫిల్ చేయమని సలహా ఇచ్చారు. అలా మొయిలి మోహనరావు ఎం.ఫిల్ చేయడానికి పూనుకోవడం జరిగింది.

తెలంగాణ తొలితరం కథకులు గూడూరి సీతారాం, 'పద్మపీఠం' మాసపత్రిక సంపాదకులు కొక్కుల భాస్కర్ సంపాదకత్వంలో వెలువడిన 'బతుకు పయనం' కథల సంపుటి ప్రధానంగా గ్లోబలైజేషన్, ప్రైవేటైజేషన్, సాంప్రదాయక కులవృత్తుల విధ్వంసం, సాఫ్ట్‌వేర్ రంగం కల్పించిన నూతన ఉద్యోగ అవకాశాలు కుటుంబ సంబంధాల్లో వస్తున్న మార్పులు ఆత్మీయతలు, అనుబంధాలు నూతన రూపాల్లోకి మారుతున్న క్రమాన్ని చిత్రించిన కథలతో ఒక ప్రత్యేక దృష్టితో వారు దీన్ని సంపుటీకరించారు.

ప్రస్తుతం తెలుగు విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్‌గా పని చేస్తున్న డా॥ అనుమాండ్ల భూమయ్యగారు కాకతీయ విశ్వవిద్యాలయంలో నా కథలను ఎం.ఏ విద్యార్థులకు పాఠ్యాంశాలుగా పెట్టడానికి ముందు మీరేమైనా చేనేత వృత్తి గురించి, వారి జీవితాల గురించి కథలు రాశారా అని అడిగారు. చేనేత వృత్తి గురించి రాయలేదని, పద్మశాలీల జీవితాల గురించి కొన్ని కథలు రాశానని 'మమతలు-మానవ సంబంధాలు' కథల సంపుటిలోని పాతచీర, వరుసలు, వరలక్ష్మి, ప్రేమధార, పంజరం, మలుపులు, ప్రేమికులు, మమతలు, వారసత్వం తదితర కథలను వాటి కథాంశాలను సంక్షిప్తంగా వివరించాను. పద్మశాలీలు చేనేత వృత్తి వదిలి ఇతర వృత్తుల్లో చేరిన క్రమాలను, వారి సామాజిక జీవితాన్ని, పరిణామాల్ని, సంస్కృతిని ఈ కథలు చిత్రించాయి అని చెప్పాను.

అయితే అనుమాండ్ల భూమయ్య గారు దాంతో సంతృప్తి పడలేదు. పద్మశాలీల గురించి కాదు, చేనేత వృత్తి చేస్తున్న జీవితాల గురించిన కథలు కావాలి. మీరెందుకు రాయలేదు అని ప్రశ్నించారు. పైన పేర్కొన్న కథలను పాఠ్యాంశాల్లో పెట్టవచ్చు కదా అని సూచిస్తే నిరాకరించారు. 'పాలు' కథల పుస్తకాన్ని ఎం.ఏ. పాఠ్యాంశంగా పెట్టారు.

నేను పూణె ఫిల్మ్ ఇనిస్టిట్యూట్‌లో 1998లో ఫిల్మ్ అప్రిసియేషన్ కోర్సు చేసినప్పుడు ప్రఖ్యాత సినీ దర్శకులు శ్యాంబెనగల్, గిరిష్ కాసరవెల్లి పరిచయమయ్యారు. గిరిష్ కాసరవెల్లి పది సినిమాలు తీసినా అవన్నీ జాతీయ స్థాయి అవార్డులు గెలుచుకున్నా తాను పుట్టి పెరిగిన బ్రాహ్మణ కులం చరిత్రలో నిర్వహించిన పాజిటివ్ పాత్ర ఏమీ లేదా అని దాని గురించి సినిమా ఎందుకు తీయవని ఎందరో అడిగే క్రమంలో కన్నడ నటి 'జయమాల' తల్లిగా సినిమా తీశానని చరిత్రలో మంత్రులుగా బ్రాహ్మణులు రాజ్యాన్ని, రాజరికాన్ని దాని ప్రతిష్టను నిలబెట్టడానికి ఎలా కృషి చేశారో ఆ సినిమాలో చిత్రించానన్నారు.

నేను పుట్టి పెరిగిన పద్మశాలి చేనేత కులాల జీవితాల గురించి మీరు కాకపోతే ఎవరు రాస్తారు అని ఎందరో వేసే ప్రశ్న నన్ను నిరంతరం వెంటాడింది. ఆ క్రమంలో సీరియస్‌గా నా వల్ల ఏదో పొరపాటు జరుగుతున్నదని గిల్టీ ఫీలింగ్. ఈ నేపథ్యంలో చేనేత కులాల, పద్మశాలీల జీవితాన్ని, సంస్కృతిని, చేనేత వృత్తి నిపుణుల దయనీయ జీవితాలను చిత్రించడానికి పూనుకున్నాను.

అయితే 'రచయితా - శిల్పమూ' పుస్తక రచయిత ఇల్యా ఎహ్రెన్‌బర్గ్‌ను ఈ సందర్భంగా గుర్తు చేసుకోవడం అవసరం. కార్మిక జీవితమంటే కార్మికులు పరిశ్రమల్లో, యంత్రాలతో ఎలా పని చేస్తున్నారో ఆ క్రమమంతా రాయడం కాదని ఉత్పత్తి క్రమంలో మానవ సంబంధాల తీరును, సంస్కృతిని చిత్రించడం ముఖ్యమని దశాబ్దాల క్రితం నొక్కి చెప్పారు. అది నా మనసులో బలంగా నాటుకుపోయింది. అందువల్లనే ఏమో ఎన్ని కులాల వారి గురించి రాసినప్పటికీ వారి కులవృత్తులలోని సాధక బాధకాలను కాకుండా ఆయా కులవృత్తి చేస్తున్న ప్రజల గురించి కథలు రాయడం జరిగింది.

అది ఒక మేరకు ఉపయోగమే. కాని శ్యాంబెనగల్ 1983-85లో తీసిన 'సుస్మాన్' సినిమాలో నల్లగొండ జిల్లా పోచంపల్లి చేనేత కార్మికుల జీవితాలను ఒక మహాకావ్యంలా దృశ్యీకరించారు. ఆ సినిమా చూసి ఏడ్చేశాను. నేను ఎందుకు అలాంటి కథలు రాయలేక పోయాను? అని ప్రశ్నించుకున్నాను. అలా చరిత్రలో శతాబ్దాల పాటు సమాజానికి నాగరికత, సంస్కృతి నిర్మాణంలో మహోన్నత పాత్ర నిర్వహించిన చేనేత కులాల నైపుణ్యం, వారి ఉన్నతమైన సామాజిక గౌరవాలు... బట్టల మిల్లుల రాకతో శిథిలమైన చేనేత వృత్తిలోని దైన్యాన్ని, దోపిడీని, వృత్తి నైపుణ్యాన్ని, దాన్ని వెలికి తీయాల్సిన క్రమాన్ని నేను శ్యాంబెనగల్‌లా రాయలేకపోయాననే ఆవేదన ఇప్పటికీ వెంటాడుతూనే వుంది.

1962లోనే డా॥ సి.నారాయణరెడ్డి బొంబాయికి పొట్ట చేత పట్టుకొని వలస వెళ్ళిన

చేనేత కార్మికుల గురించి ఒక తల్లి పల్లెలో పడుతున్న ఆరాటం గురించి 'పొట్ట చేత పట్టుకొని బొంబాయి పోయిండు నా కొడుకు ఏడ వున్నాడో ఏం తిన్నాడో' అని పాట రాశారు. నేను నా కులం గురించి రాయడానికి అడ్డగించింది ఎవరు అని ప్రశ్నించుకున్నాను.

సామాజిక ఆధిపత్య భావజాలం నా కులం గురించి నేను రాయడాన్ని ఇన్ఫిరియారిటీకి గురి చేసింది. నేను బుద్ధిస్ట్, ఫూలే, అంబేడ్కర్ దృక్పథంతో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల ప్రాపంచిక దృక్పథాన్ని దశాబ్దాలుగా ప్రసంగాల్లో, గ్రంథాల్లో విశ్లేషిస్తున్నప్పటికీ కథల్లో రాయడానికి నన్ను గొంతులో ఏదో అడ్డం పడినట్టుగా అడ్డగిస్తూనే వచ్చింది ఏమిటి? ఆధిపత్య వర్గాల, కులాల, హంగోవర్ భావజాలం హెజెమని ఎన్ని రూపాల్లో, ఎంత లోతుగా ప్రజలపై ప్రభావం వేస్తుందో ఇది ఒక ప్రత్యక్ష ఉదాహరణ.

ఆ హెజెమని భావజాలం నుండి అందరూ విముక్తమై స్వీయ చైతన్యంతో స్వస్వరూప జ్ఞానంతో ముందుకు సాగినప్పుడే సమాజంలోని భిన్నత్వంలోని ఏకత్వం, ఏకత్వంలోని భిన్నత్వం, సమస్త కులాల, వర్గాల జీవితం, సంస్కృతి ఆశలు, ఆరాటాలు అన్నీ సాహిత్యీకరించబడి సాహిత్యం సమగ్రంగా ఎదుగుతుంది. దృశ్య మీడియా అయిన సినిమా, టీవీలలో కూడా ఈ క్రమం విస్తృతంగా సాగాల్సి వుంది.

'బతుకు పయనం' కథల సంపుటిలోని కథల్లో చేనేత కులాల కుటుంబాలు వాళ్ల కులవృత్తులు శిథిల మవుతున్న తీరు కొత్త వృత్తుల్లో కూడా ఉపాధి కోల్పోతున్న తీరును 'నానమ్మ', 'ప్రశాంతం' కథల్లో, చేనేత కుటుంబాల్లో వస్తున్న మార్పులు ఎదిగిన ఒకరిపై అనేక మంది ఆశలు పెట్టుకొనే క్రమం 'ఇంటల్లుడు', 'బతుకు పయనం', 'జీవనయానం' కథల్లో చిత్రించాను. 'జీవనయానం' నవలికలో ఆధునిక మధ్య తరగతిగా చేనేత కులాల నుండి ఎదుగుతున్న నూతన తరాలను, అలా సాంఘికంగా, ఆర్థికంగా ఎదిగే క్రమంలో రాజకీయ రంగంలో కూడా ఎలా కాస్త తల ఎత్తుకుంటున్న తీరును చిత్రించాను.

వీటన్నిటినీ మొయిలి మోహనరావు తన ఎం.ఫిల్ లఘు సిద్ధాంత వ్యాసంలో అద్దంలో కొండలా తన వయస్సుకు మించిన స్థాయిలో వాటిని అర్థం చేసుకొని విశ్లేషించాడు. దీనికి పర్యవేక్షకులుగా సూచనలు అందించిన డా॥ జి.ఎస్.భాస్కరరావుగారు మోహనరావును చక్కగా తీర్చిదిద్దిన వైనం ఈ గ్రంథం చూస్తే స్పష్టమవుతుంది.

మొయిలి మోహనరావులో ఒక గొప్ప లక్షణం వుంది. ఒక విషయం చెప్పగానే దాని సారాన్ని వెంటనే అర్థం చేసుకుంటాడు. తనదైన వ్యక్తీకరణతో, దృష్టికోణంతో విశ్లేషిస్తాడు. యువతరంలో భావ వ్యక్తీకరణని ఇంత చక్కగా సాధించడం అభినందనీయం

ఈ పుస్తకాన్ని, ఇందులోని విశ్లేషణను అభినందించకుండా వుండలేం. మోహనరావును సాహితీ వేత్తలు ప్రోత్సహిస్తారని ఆశిస్తున్నాను. మా శ్యామల సహృదయతకే ఈ గ్రంథం అంకితం ఇవ్వబడిందని అనుకుంటాను. మొయిలి మోహనరావు భవిష్యత్తులో గొప్ప జీవితాన్ని, సాహితీ వేత్తగా ఉన్నత స్థానాన్ని సాధించుకుంటాడని ఆశిస్తున్నాను...

ఉపక్రమణిక

ఆధునిక తెలుగు సాహిత్యంలో ఎన్నో రకాలైన ప్రక్రియలున్నాయి. పురాణ, ఇతిహాసాది ప్రక్రియలతో పాటు కథా సాహిత్య ప్రక్రియ కూడా ప్రాచీనమైనది. సంప్రదాయ వాదులు, ఆధునికతను కోరుకున్న వారు అందరూ కథను ఆస్వాదించి తీరుతారు. ఆధునిక ప్రక్రియలన్నిటి కంటే కూడా అనేక విధాలుగా కథ ప్రాముఖ్యాన్ని సంతరించుకున్నది.

బి.ఎస్. గొప్ప సామాజిక తత్త్వవేత్త. ఆయన కథలన్నింటిలో సమకాలీన సమాజం ప్రతిబింబిస్తుంది. ఆయన కాలం కంటే ముందు నడిచే రచయిత అంటే అతిశయోక్తి కాదు.

నేటి జీవితంలో నవరసాలున్నట్టే ఆధునిక కథలలో నవరసాలు ఉంటున్నాయి. ఒక కథలో ఒక రసాన్ని పండించడం ఎంతో సామర్థ్యం వున్నప్పుడే సాధ్యం. ఒకే కథలో నవరసాలు పండించడం మహా రచయితలకే సాధ్యం. అలాంటి మహాకథకుల్లో బి.ఎస్.రాములుగారు ఒకరు. బతుకుబండి ముందుకు సాగడంలో సగటు మానవుని స్థితిని, ప్రయత్నాన్ని బి.ఎస్.రాములు తన కథల్లో చక్కగా చిత్రీకరించారు.

వర్తమాన కాలంలో జరుగుతున్న సంఘటనలకి ప్రతిబింబంగా ఈయన రచన కొనసాగుతుంది అనేది అక్షర సత్యం. ఈయన కథల్లో సమాజం సాక్షాత్కరిస్తుంది. అందుకే కథ ఆబాల గోపాలాన్ని అలరిస్తుంది అనేది నిజం. చిన్న పిల్లల నుండి పెద్దవాళ్ళ దాకా కథల కోసం చెవి కోసుకుంటారు. అటువంటి గొప్ప ప్రక్రియ కథ.

నేను ఎం.ఏ. చదివే రోజుల్లో కథలు బాగా చదివే వాన్ని. అప్పుడు మా సిలబస్‌లో బి.ఎస్.రాములు, పాలు కథా సంపుటి వుండేది. అది చదివిన తరువాత బి.ఎస్. రచనల పట్ల ఆసక్తిని పెంచుకున్నాను.

కథా సాహిత్యంపై పరిశోధన చెయ్యాలనుకున్న నాకు 'బతుకుపయనం' కథా సంపుటిపై ఉత్సాహం కలిగింది. ఇందుకు మా అన్నయ్య డా॥ మొయిలి శ్రీరాములు బోయ జంగయ్య, జాతర నవలపై ఎం.ఫిల్., కత్తి పద్మారావు జీవితం-రచనలపై పి.హెచ్‌డి చేసి దానికి బి.ఎస్.రాములు గారి చేత ముందుమాట రాయించారు. అలా పరిచయమైన బి.ఎస్.రాములు గారి జీవిత చరిత్రను రాస్తూ వారి గురించిన అనేక విషయాలను రికార్డు చేశారు. వారి కథల గురించి, వ్యక్తిత్వం గురించి అన్నయ్య చెప్తున్న కొద్దీ వారి

కథలపై ఎం.ఫిల్. చేయాలని బలంగా నిర్ణయించుకొన్నాను.

బి.ఎస్.రాములు కథలు సామాజిక పరిణామాలకు ప్రతీక. కథల్లోని వ్యక్తులు, పాత్రలు, సన్నివేశాలు, సంఘటనలు కేవలం కల్పన కాదు. అవి సమాజ పరిణామాలకు ప్రాతినిధ్యం వహిస్తాయి. సమాజాన్ని సామాజిక చరిత్రగా చిత్రిస్తాయి. యదార్థ చిత్రణతో సమాజం ముందుకు సాగడంలో తాత్విక ఆశావహ కోణంతో చిత్రించే వారిలో తెలంగాణ నుంచి బి.ఎస్. రాములు ప్రముఖులు. ఆయన వచన కవిత్వంలోను, వ్యాసంలోను, విమర్శలోను, కథలలోను, క్రియాశీలక ఉద్యమాల్లోను, తాత్విక చర్చల్లోను, నూతన సైద్ధాంతిక ప్రతిపాదనల్లోను ప్రఖ్యాతి గడించిన మహోన్నతమైన వ్యక్తి. ఆయన కలం నుంచి జాలువారిన కథలలో 'బతుకుపయనం' కథల సంపుటి ఒక విశిష్టమైన కథల సంపుటి.

'బతుకుపయనం' సంపుటిలోని కథలు 1998 నుండి పత్రికల్లో అచ్చవుతూ 2005లో పుస్తక రూపంలో వెలువడ్డాయి. ఈ కథల సంపుటి విద్యార్థులకు, రేపటి పౌరులకు, భవిష్యత్ సమాజ నిర్మాతలకు అంకితం ఇవ్వబడింది. ఇది డా॥ కస్తూరి సతీష్, డా॥ సుగుణ – రోహిణి నర్సింగ్‌హోం, సిద్ధిపేట వారి సౌజన్యంతో 'విశాల సాహిత్య అకాడమీ' ద్వారా ప్రచురించబడింది. ఇది 'పద్మపీఠం' మాసపత్రిక సంపాదకులు కొక్కుల భాస్కర్, తెలంగాణ తొలితరం కథకులు గూడూరి సీతారాం గారల సంపాదకత్వంలో వెలువడింది. వారి సంపాదకీయంలో "ఒక సామాజిక చరిత్రను, పరిణామాల్ని కథల రూపంలో చిత్రించిన ఈ కథలను ఒక పద్ధతిలో పేర్చి ఒక సంపుటిగా" తీసుకురావడం జరిగిందని పేర్కొన్నారు. ఈ చారిత్రక, సామాజిక, సాంస్కృతిక పరిణామాల నేపథ్యంలో 'బతుకుపయనం' కథల సంపుటి పరిశోధనాంశాలను ఈ క్రింది విధంగా విభజించాను.

మొదటి అధ్యాయం : 'బి.ఎస్.రాములు జీవిత పరిచయం'

రచయిత రచనపై పరిశోధన చేస్తూ రచయిత గురించి, ఆయన పరిచయం గురించి చెప్పకపోవడం సరైన పద్ధతి కాదు. అందులోను ఒక సామాజిక తత్త్వవేత్త గురించి చెప్పకపోవడం అసలు సబబు కాదు. ఎందుకంటే రచయిత జీవితం, ఆచరణ, భావాలు, సామాజిక పరిణామాలు అనుసరించి అతని రచన కొనసాగుతుంది. అందువలన రచయిత జననం, తల్లిదండ్రులు, బాల్యం, విద్యాభ్యాసం, ఉద్యమాలు, ఉద్యోగ జీవితం, వైవాహిక జీవితం, ఆయన రచనలు, ఆయనపై సమాజం వేసిన ప్రభావాలు, విధించిన పరిమితులు, సన్మానాలు, సత్కారాలు మొదలైన అంశాలు ఈ అధ్యాయంలో తెలియజేయడం జరిగింది.

రెండవ అధ్యాయం : 'బతుకుపయనం కథల పరిచయం-వస్తు వైవిధ్యం'

ఇందులో పరిశోధనా గ్రంథంలోని నానమ్మ, రాత్రిపూలు, బతుకు పయనం,

ప్రశాంతం, జైలు జీవితం, ఇంటల్లుడు, జీవనయానం కథల్లో ఉన్న కథ, వస్తు వైవిధ్యం గురించి ఈ అధ్యాయంలో కథా పరిచయం చేసి విశ్లేషించడం జరిగింది.

మూడవ అధ్యాయం:'బతుకుపయనం కథలు-చేనేత వృత్తివారి జీవన చిత్రణ'

ఇందులో కులవృత్తుల పరిణామం, సామాజిక నేపథ్యం, సైన్స్ సామాజిక నేపథ్యం, ప్రపంచీకరణ పరిణామాలు, చేనేత కార్మికుల వలసలు, నేతన్నల వెతలు, ఆత్మహత్యలు, కుటుంబ నియంత్రణ, మిగులు జనాభా సిద్ధాంతం, కుటుంబ సంబంధాలు, సమ సమాజ నిర్మాణం, మొదలైన అంశాల గురించి వివరించడం జరిగింది.

నాలుగవ అధ్యాయం : 'బతుకుపయనం కథలు - సామాజిక స్పృహ'

సాహిత్యం సమాజాన్ని చిత్రిస్తుంది. మానవ సమాజాన్ని అందులోని లోపాలను ఎత్తి చూపి మానవ ప్రగతికి బాటలు వేయాలి. బతుకుపయనం కథల్లో సామాజిక స్పృహ-స్వభావ చిత్రణ, తెలంగాణ చిత్రణ, సామాజిక పరిణామాలు, స్త్రీల జీవన వాస్తవికత, ఒకరు ఎదిగితే ఎంతోమందికి ఆసరాగా సమాజాన్ని మార్పు కోసం ప్రయత్నించే విధానం మొదలైన అంశాలు ఈ అధ్యాయంలో చర్చించడం జరిగింది.

ఐదవ అధ్యాయం : 'బతుకుపయనం కథల్లో శైలీ శిల్ప వైవిధ్యం'

కథను ఎలా నడిపారు, ఎలా ముగించారు, ఎత్తుగడ, సంఘటనలు, సన్నివేశాలు, కథనం, వర్ణనలు, శీర్షికలు, ఇత్యాది విషయాలన్నింటిని ఈ అధ్యాయంలో చెప్పడం జరిగింది.

మానవ సంబంధాలను, సాంఘిక అంశాలను, చేనేత వృత్తి వారి జీవన చిత్రణను, సామాజిక స్పృహ మొదలైన విషయాలు, బతుకు పయనం కథా సంపుటిలో విశిష్ట స్థానాన్ని సంపాదించాయి అనడంలో అతిశయోక్తి లేదు.

పై విధంగా బి.ఎస్.రాములు 'బతుకుపయనం కథలు-పరిశీలన' అనే అంశాన్ని అయిదు అధ్యాయాలుగా విభజించి వాటిని ఉపశీర్షికలలో వింగడించి చర్చించి ఉపసంహారంతో ఈ లఘు సిద్ధాంత వ్యాసాన్ని ముగించాను. ప్రతి అధ్యాయం చివరిలో పాద సూచికలు చేర్చాను. అనుబంధంలో బి.ఎస్.రాములు, వారి సతీమణి శ్యామల గారితో ఇంటర్వ్యూ, ఉపయుక్త గ్రంథ సూచితో ముగించాను.

బి.ఎస్.రాములు జీవిత పరిచయం

1. ప్రవేశిక :

సమాజంలో బి.ఎస్.రాములు ఉనికి ప్రారంభమైనప్పటి నుండి అతని బతుకు పయనంలో ఎన్నో... సంఘటనలు. బి.ఎస్.రాములు తెలంగాణ సామాజిక పరిస్థితులను, కథల నిండా నిక్షిప్తం చేయడం జరిగింది. తెలంగాణలోని గ్రామీణ ప్రజల ఉద్యమాలు, ఆరాటాలు, మధ్య తరగతి ఎదుగుతున్న తీరుతెన్నులు, దళిత బహుజన జీవితాలు, ప్రపంచీకరణ పరిణామాలు, చేనేత కార్మికులు, బీడీ కార్మికుల జీవన విధానం, వారి స్థితిగతులు బి.ఎస్.రాములు కథల నిండా వుంటాయి. వాస్తవిక జీవన చిత్రణని విడమరచి స్పష్టంగా అద్దంలో చూపించినట్టుగా కథను చెప్పడం బి.ఎస్.రాములు ప్రత్యేకత.

ఆధునిక సామాజిక తత్వవేత్తగా బి.ఎస్.రాములు గారు తెలంగాణ ప్రజల జీవన విధానాన్ని, సామాజికాంశాలను తన రచనల ద్వారా అందిస్తున్నారు. తెలంగాణ మాండలికంలోనూ వారి సాహిత్య రచన సాగిస్తున్నారు. వీరిని, వీరి రచనలను అధ్యయనం చేయడమంటే, 60 యేళ్ళ తెలంగాణ సామాజిక పరిస్థితులను అధ్యయనం చేయడమే.

1.1 జననం, తల్లిదండ్రులు :

బి.ఎస్.రాములు తల్లిదండ్రులు కీ.శే. బేతి లక్ష్మీరాజు, కీ.శే. మిట్టపెల్లి నారాయణగారలు. వారికి బి.ఎస్.రాములు ద్వితీయ పుత్రుడు. ఈయన ఆగస్టు 23, 1949వ సంవత్సరంలో కరీంనగర్ జిల్లా జగిత్యాలలో పద్మశాలి కుటుంబంలో జన్మించారు. తండ్రి బొంబాయి బట్టల మిల్లు కార్మికుడు. ఈయన ఆరో సంవత్సరంలో ఉండగా 1955లో తండ్రి పరమ పదించడం జరిగింది. తల్లి బీడీ కార్మికురాలిగా పిల్లలను పెంచి పోషించింది. ఆ తరువాత ఆమె కూడా 1991 జనవరిలో సంక్రాంతి రోజున స్వర్గస్తులైరి.

1.2 బాల్యం విద్యాభ్యాసం

బి.ఎస్. బాల్యంలో సాతాని అయ్యోరు పంతులు జగిత్యాలలోను, ఆ తరువాత ప్రాథమిక విద్య 1955-60 మర్కజి (సెంట్రల్) ప్రైమరీ స్కూల్ జగిత్యాలలోను హైస్కూలు విద్య 1960-67 మల్టీపర్పస్ హైస్కూలు, జగిత్యాలలోను, కళాశాల విద్య 1970-74 డి.ఓ.ఎల్., బి.ఓ.ఎల్. శ్రీ లక్ష్మీ నరసింహ సంస్కృతాంధ్ర కళాశాల, ధర్మపురి, కరీంనగర్

జిల్లాలోను, తెలుగు పండిత శిక్షణ 1979-80 కాకతీయ యూనివర్సిటీ, బీఈడి కాలేజి, హన్మకొండలోను జరిగింది.

1.3 పుట్టుక - స్థానిక నేపథ్యం

బి.ఎస్.రాములు గారి జీవితం తెలంగాణ సామాజిక పరిణామాలకు ప్రతీక. తెలంగాణ సామాజిక పరిణామాలు వారి జీవితం నిండా కనపడతాయి. ఈయన పేరు శ్రీరాములు. ఇంటిపేరు మిట్టపెల్లి. తాత బేతి రాజయ్య, అమ్మమ్మగారైన బేతిరాజమ్మ దంపతులకు సంతానం లేకపోవడం వలన మేనల్లుడు అయిన బి.ఎస్.రాములు తండ్రి మిట్టపెల్లి నారాయణను పెంపకం తెచ్చుకున్నారు. పెంపకం తెచ్చుకున్నాక వారికి ముగ్గురు పిల్లలు కలిగారు. రెండవ సంతానం అయిన లక్ష్మీరాజును మేనల్లుడికిచ్చి పెళ్ళి చేశారు. ఇంట్లోనే పెద్దకొడుకుగా ఉంచుకున్నారు. స్కూల్లో చేర్పించేటప్పుడు బేతి రాజయ్య మనవడిని బేతి శ్రీరాములు అని చేర్పించడంతో మిట్టపెల్లి ఇంటి పేరు బదులుగా స్కూలు రికార్డులో బేతి శ్రీరాములు అని స్థిరపడింది.

1949 ఆగస్టు 23వ తేదీన బి.ఎస్.రాములు పుట్టే నాటికి తెలంగాణ సామాజిక పరిస్థితులు ఇలా వున్నాయి.

1949 నాటికి జగిత్యాలలో చేనేత వృత్తి ఒక మాదిరిగా సాగుతుండేది. వీరి ఇంట్లో చేనేత మగ్గాలు వుండేవి. నూలుకు వీరే రంగులు అద్ది బట్టలు నేసేవారు. క్రమంగా 1949లో జగిత్యాలలో స్థాపించిన చేనేత సహకార సంఘం ఏర్పాటుకు కృషి చేసిన వారిలో బి.ఎస్.రాములు నాన్న ఒకరు.

1.4 బాల్యంలోనే రచనాసక్తి

బి.ఎస్.రాములు 1963లో తొమ్మిదో తరగతిలో సుమారు 14వ సంవత్సరం నుండి రచనలు చేయడం ప్రారంభించారు. పదవ తరగతి నుండి కొన్ని రచనలు అచ్చు అవ్వడం ప్రారంభమైనాయి. తొలుత పద్యరచన చేసేవారు. పాటలు కూడా రాసేవారు. హైస్కూల్లో వ్యాసరచన, ఉపన్యాస పోటీల్లో బహుమతులు గెలుచుకునే వారు. స్నేహితుల అభిమానాన్ని చూరగొన్నారు. వేలాది గ్రంథాలు చదివారు. ఆ దిశగా అయన రచనలు ఎన్నో వచ్చాయి. ఆ విధమైన పట్టుదలతో సమాజాన్ని చదువుకొని సామాజికాంశాలతో కూడిన కథలు, నవలలు, వ్యాసాలు ఎన్నో రాశారు. ఇవన్నీ పలు పత్రికలలోను ప్రచురించబడ్డాయి.

1.5 ఆరెస్సెస్ ముఖ్య శిక్షక్

తొమ్మిదో తరగతి నుంచే బి.ఎస్.రాములు బీడీలు చేయడంలో తల్లికి సహకరించేవాడు. బీడీలకు దారం కట్టడం, బీడీఆకు, తంబాకు (పొగాకు) తేవడం

వంటి పనులు చేసే వారు. బీడీలు చేయడం కూడా నేర్చుకున్నారు. బాల్యం నుండే మహిళా బీడీ కార్మికుల మధ్య బీడీ కంపెనీ వాతావరణంలో పెరిగారు. 1964 సం॥ నుండి ఇంటిముందు ప్రారంభించిన ఆరెస్సెస్ శాఖకు వెళ్ళేవారు.

గడ్డం సంజీవరావు కొంతకాలం ముఖ్యశిక్షక్‌గా పని చేశారు. 1967 నుండి ఆ శాఖకు తానే ముఖ్య శిక్షక్‌గా పనిచేశారు. బి.ఎస్.రాములు ముఖ్య శిక్షక్‌గా పని చేసిపుడు కే.శే. శ్రీధర్‌జీ, కే.శే. కళ్లెపు విద్యాసాగర్‌జీ, జగిత్యాలలో ఆరెస్సెస్ ప్రచారకులుగా వుండేవారు. బి.ఎస్.రాములు ఎంతో మంది మిత్రులను ఆరెస్సెస్ కార్యకర్తలుగా మలిచారు. బీడీలు చేస్తూ, బీడీల కంపెనీ నడిపిస్తూ జగిత్యాల శాఖ గ్రంథాలయానికి వెళ్తూ, ఆరెస్సెస్ శాఖను నడిపిస్తూ, ఆరెస్సెస్ పత్రికలైన 'జాగృతి', 'ఆర్గనైజర్' వార పత్రికలను తెప్పించి పంపిణీ చేస్తూ ఇలా బహుముఖాలుగా ఏకకాలంలో పని చేశారు బి.ఎస్.రాములు. పోస్టల్ డిపార్టుమెంటులో ఉద్యోగం కోసం ఎదురు చూస్తూ కొంతకాలం పేపర్ బాయ్‌గా, పేపర్ ఏజెంట్‌గా పని చేశారు.

బేతి శ్రీరాములు బాలమిత్ర మాసపత్రికకు పంపిన కథ జనవరి 1968 సంచికలో అచ్చయింది. అచ్చయిన మొదటి కథ ఇది. ఉషశ్రీ అనే కలం పేరుతో రాశారు. 'జగిత్యాల కథ' అనే పేరుతో అచ్చయిన ఈ కథలో అర్థశాస్త్రాన్ని, చరిత్రను, కుటుంబ పరిణామాలను మేళవించి రాశారు. జగిత్యాలకు ఆ పేరు ఎలా వచ్చిందో కథ చివరలో ఒక కల్పన చేశారు. అప్పుడు ఆడవాళ్ల పేర్లతో వుంటేనే అచ్చేస్తారు అనే ప్రచారం ఉండేది. అందుకని ఉషశ్రీ అనే పేరుతో ఆ కథని పంపారు.

బి.ఎస్.రాములు గారి బాల్యంలో, విద్యార్థి దశలో అనేక బాధాకరమైన సంఘటనలు వున్నాయి. 10వ తరగతి నుంచి ఇక చదివింది చాలని అమ్మ బెదిరించడం... పూర్‌ఫండ్ బుక్స్ ఇస్తామని నిలబెట్టి అడగడంలో అవమానం... హైస్కూల్‌లో స్కాలర్‌షిప్పులు రాకపోవడం... 10వ తరగతిలో ల్యాబ్ డిపాజిట్ కట్టలేక ఎమ్.పి.సి. బదులు కామర్స్‌లో చేరడం... పోస్టాఫీసులో ఉద్యోగం వస్తుందని డిగ్రీకి కట్టిన 200 రూ.లు ఫీజు వేస్టవుతుందని డిగ్రీలో చేరకపోవడం చాలా బాధించింది...

1960లో జగిత్యాలలో సెకండరీ గ్రేడ్ టీచర్ ట్రైనింగ్ (ఎస్‌జిబిటి) స్కూలు వుండేది. హెచ్.ఎస్.సి. ఫెయిలయిన వారికి ఏడో తరగతి పాసైన వారికి ఎలిమెంటరీ గ్రేడ్ బేసిక్ ట్రైనింగ్ (ఇజిబిటి)లో చేర్చుకొని శిక్షణ ఇచ్చే వారు.

ఉన్నత విద్య చదువుకోవడం వల్ల జీవితం, జ్ఞానం ఎదిగే అవకాశాలను వివరించి చెప్పి సహకరించే వాళ్లు లేకపోవడం, జగిత్యాల్లో వున్న ఎస్‌జిబిటి ఉపాధ్యాయ శిక్షణా కాలేజిలో చేరడం యొక్క ప్రాధాన్యతను ఎవరూ చెప్పలేకపోవడం, సొంత లైబ్రరీ కోసం

సేకరించిన పుస్తకాలను సెకండ్‌హ్యాండ్ రేటుకు రెండు, మూడుసార్లు అమ్మేయాల్సి రావడం, బి.ఎస్.రాములు బాల్య జీవితంలోని విషాదాల్లో కొన్ని మాత్రమే.

1.6. నిరుద్యోగ పర్వం

1967 నుండి 1970 వరకు ఆరెస్సెస్ ముఖ్య శిక్షకునిగా పనిచేసి ఎందరినో ఆరెస్సెస్ కార్యకర్తలుగా బి.ఎస్.రాములు తీర్చిదిద్దారు. 1967 జూన్ నెలలో జగిత్యాల డిగ్రీ కాలేజీలో బి.కాం. కోర్సునందు చేరాల్సి వుండగా చేరలేదు. అందుకు కారణం ఫీజులు చెల్లించి మూడేళ్ళు డిగ్రీ చదవడం కన్నా పోస్టాఫీసులో 12వ తరగతి బోర్డు పరీక్ష మార్కులతో ఉద్యోగం వస్తుందని ఎదురు చూడడం.

వారి పెదనాన్న కొడుకు లింబయ్యకు ప్రథమ శ్రేణిలో హెచ్.ఎస్.సి. పాసైనందున అప్లయ్ చేయగానే పోస్టల్ ఉద్యోగం దొరికింది. తనకు కూడా అలాగే ఉద్యోగం రాకపోతుందా అని పేదరికంలో వుండి ఇంకా చదువు కొనసాగించడం భావ్యం కాదని భావించారు.

ఇక్కడే వీరి జీవితం మలుపు తిరిగింది. అటు పోస్టాఫీసులో ఉద్యోగం రాలేదు. ఇటు డిగ్రీ చదువుకోలేకపోయారు. తన తోటివారు బ్యాంకుల్లో, ఇతర శాఖల్లో ఉద్యోగాల్లో చేరగా తాను మాత్రం 1967-70 వరకు మూడు సంవత్సరాలు ఆరెస్సెస్ శాఖను నడిపిస్తూ పోస్టాఫీసు ఉద్యోగం కోసం ఎదురు చూశారు.

1.7 తెలంగాణలో అశాంతి మూలాలు

తెలంగాణ ప్రాంతంలో విద్యావంతులు పెరుగుతున్న క్రమంలో ఉద్యోగాలు కరువై 1964 నుండి నిరుద్యోగం పెరుగుతూ వచ్చింది. అయితే గ్రామ పంచాయితీ, జిల్లా పరిషత్ వ్యవస్థల ద్వారా గ్రామాల్లో వందలాది పాఠశాలలను ప్రారంభించే క్రమంలో చాలా మందికి ఉపాధ్యాయ ఉద్యోగాలు లభించాయి. అయినా పెద్ద ఉద్యోగాలు, చివరకు కండక్టరు ఉద్యోగాలు కూడా దొరకని దశ వచ్చింది. నిజామాబాద్ జిల్లాలోని పోచంపాడులో ప్రారంభించిన ప్రాజెక్టు పనుల వల్ల కొంతకాలం, కొంతమందికి ఉద్యోగాలు లభించాయి. కాలువల తవ్వకం ద్వారా పాలమూరు లేబరుకు ఉపాధితో పాటు, స్థానిక యువకులకు వర్క్ చార్జి ఉద్యోగులుగా, టెంపరరీ మేస్త్రీలుగా ఉద్యోగాలు లభించాయి. స్థిరమైన ఉద్యోగాలు లభించలేదు.

ఎన్నో కష్టాలు అధిగమించి ఎదుగుతూ వచ్చిన వారికైనా ఉద్యోగాలు దొరకక 1968 సం॥ నాటికి తెలంగాణలో నిరుద్యోగ సమస్య ఇంకా పెరిగిపోయింది. కొత్త ఉద్యోగాలు, ఉపాధి సంపాదించుకోవడం తమ లక్ష్యమని చైతన్యాన్ని పెంచుకొని విద్యార్థులు రోడ్ల మీద పడ్డారు. అప్పటికి ఆంధ్రప్రాంతంలోని నిరుద్యోగులు, తెలంగాణ

ప్రాంతంలోని ఉద్యోగాల్లో చేరడంతో తెలంగాణ వారికి ఉద్యోగాలు దొరకకుండా అవుతున్నాయని విద్యార్థులకు, ఉపాధ్యాయులకు తెలిసి రావడం పెరిగింది.

ఇలా 1968 నాటికి నిరుద్యోగులుగా అసంతృప్తితో రగిలిపోతున్న వారిలో బీసీ, ఎస్సీ, ఎస్టీలతో పాటు వ్యవసాయ కులాల వాళ్ళు, ధనిక రైతుల పిల్లలు వుండే వాళ్ళు. భూస్వాముల పిల్లలు నిరుద్యోగంతో, అసంతృప్తితో వుండే అవసరం పెద్దగా లేకుండేది. మున్నూరు కాపులు, ఇతర వ్యవసాయంపై ఆధారపడిన కుటుంబాల నుండి వచ్చిన వాళ్లు వ్యవసాయ పనులు చేసుకుంటూ చదువుకోవడానికి వస్తూ సగటు మార్కులు తెచ్చుకునే వాళ్లు. బోర్డు పరీక్షల్లో తప్పిన తరువాత చదువు మానేసే వారు. ఇలా ఎంతోమంది ఆగిపోగా కొద్దిమందే ఉద్యోగాల కోసం ఎదురు చూసే వాళ్లు.

1.8 జై తెలంగాణ ఉద్యమం - 1969

అలా ఆంధ్రప్రాంతం నుంచి వచ్చి తెలంగాణ ప్రాంత విద్యావంతులకు రావాల్సిన ఉద్యోగాలను ముందుగానే ఆక్రమించేయడంతో స్థానికంగా నిరుద్యోగం పెరిగి తెలంగాణ అంతటా ప్రజల్లో అసంతృప్తి పెల్లుబుకింది. 'ఆంధ్ర గోబ్యాక్', 'జై తెలంగాణ' ఉద్యమం నిప్పులా రాజుకుంది.

ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి తెలంగాణ ఉద్యమంపై తీవ్ర నిర్బంధాలను ప్రయోగించారు. పోలీసు కాల్పుల్లో 370 మంది చనిపోయారు. విద్యాలయాలు మూతపడ్డాయి. చదువు సాగలేదు.

1968 నుండి 1971 దాకా ప్రత్యేక తెలంగాణ ఉద్యమం విస్తృతంగా సాగింది. ఇందిరాగాంధీ, కేంద్ర కాంగ్రెస్ పార్టీ అధిష్టాన వర్గం కాసు బ్రహ్మానందరెడ్డిని తొలగించి తెలంగాణ ప్రాంతానికి చెందిన పి.వి.నరసింహారావును ముఖ్యమంత్రిని చేశారు. 1972లో పి.వి.నరసింహారావు ముఖ్యమంత్రిగా నక్సల్‌బరి, శ్రీకాకుళ ఉద్యమాలు ముందుకు తెచ్చిన చైతన్యం, పోరాటాల కారణంగా భూసంస్కరణల చట్టాన్ని తెచ్చారు. దాంతో దాన్ని వ్యతిరేకిస్తూ కోస్తాంధ్ర భూస్వామ్య, బూర్జువా వర్గాలు 'జై ఆంధ్ర' ఉద్యమాన్ని ముందుకు తెచ్చారు.

ఆంధ్రపత్రిక, ఆంధ్రజ్యోతి, ఆంధ్రప్రభ దినపత్రికలు, కృష్ణా పత్రిక వంటి వారపత్రికలు ఆ కాలంలో తెలంగాణకు వ్యతిరేకంగా తీవ్రంగా ప్రచారం చేశాయి. సికింద్రాబాద్ నుండి వెలువడే ఆంధ్రభూమి దినపత్రిక ఒక్కటే తెలంగాణ వారికి కాస్త అనుకూలంగా వార్తలను ఎప్పటికప్పుడు అందిస్తుండేది. ఆంధ్రభూమి మాత్రమే తెలంగాణ వారి పత్రికగా తెలంగాణ ప్రజలు భావించారు.

బి.ఎస్.రాములు ఈ సామాజిక ఉద్యమాల కాలంలో నిరుద్యోగిగా ఉద్యోగం కోసం

ఎదురు చూస్తూ, ఆరెస్సెస్ శాఖను నిర్వహిస్తూ, బీడీ కంపెనీ నిర్వహిస్తూ పేపర్ ఏజెన్సీ నిర్వహించే వారు. శాఖా గ్రంథాలయంలోని వందలాది పుస్తకాలు చదువుతూ పఠనాసక్తిని పెంచుకున్నారు.

ఉద్యోగం రాకపోవడంతో పని చేస్తూ చదువుకోవడానికి, స్థానికంగా జగిత్యాలలో తన జూనియర్లతో డిగ్రీ చేయడానికి చిన్నతనంగా ఫీలై ధర్మపురిలోని సాయం కళాశాలలో డిఓఎల్, బిఓఎల్ చదవడానికి బయల్దేరారు. ధర్మపురిలో బ్రాహ్మణ కుటుంబాలు ఎక్కువ. అక్కడ న్యూస్‌పేపర్ ఏజెంట్‌గా, బీడీ కంపెనీ చూసుకునే వారిగా పనిచేస్తూ సాహిత్య సమావేశాలు నిర్వహించే వారు. ఆధునిక సాహిత్య భావనలు వ్యాపింప చేయడంలో, యువ భారతి ప్రచురణలను ప్రజల్లోకి తీసుకెళ్ళడంలో విశేషమైన కృషి చేశారు. ధర్మపురి సాయం కళాశాలలో కూడా ఉద్యమాలను వదలలేదు. రెండు నెలల పాటు కాలేజిని బాయ్‌కాట్ చేసే ఉద్యమాన్ని నడిపారు. బిఓఎల్ చదువుతున్నప్పుడు డిఓఎల్ అర్హతపై ఆదిలాబాద్ జిల్లాలో తెలుగు పండిట్ ఉద్యోగానికి ఎంపికైనట్టు జిల్లా పరిషత్ వాళ్ళు లెటర్ పంపారు. దాంతో సర్కారు నౌకరి త్వరలో దొరుకుతుందని ధర్మపురిలో బీడీ కంపెనీలో పని చేస్తున్న సమయంలో కంపెనీ వారు తమ కూతురునిచ్చి పెళ్ళి చేయాలనుకున్నారు. కానీ చాలామందికి ఆదిలాబాద్‌లో తెలుగు పండిట్ ఉద్యోగం వచ్చినప్పటికీ బి.ఎస్.రాములును ఆ ఉద్యోగం వరించలేదు. న్యూస్ పేపర్ ఏజెన్సీ వల్ల ఏ బస్సుల్లో పేపర్ వస్తుందో నిరీక్షించాల్సి రావడం వల్ల ఆదిలాబాద్‌కు పోలేకపోవడంతో పైరవీ చేస్తానన్నవారు చేస్తున్నట్టుగానే చెప్పి కాలం గడిపారు.

1.9. వైవాహిక జీవితం

బి.ఎస్.రాములు 1968 ఉద్యోగం కోసం ప్రయత్నిస్తూ పెండ్లిని వాయిదా వేస్తూ వచ్చారు. ఆ కాలంలో తెలంగాణ ప్రాంతంలో ఆడపిల్లలకి 9 సంవత్సరాలు, మగపిల్లలకి 13, 14 ఏళ్ళ వయస్సులోనే పెళ్ళిళ్లు జరిపే వారు. 1962 నుంచి బాల్య వివాహాలు ఈ ప్రాంతంలో జరపడం తగ్గిందని చెప్పవచ్చు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో విద్యాలయాలు, పాఠశాలలు పెరిగాక అక్షర జ్ఞానం పెరిగి బాల్య వివాహాలు తగ్గుముఖం పట్టాయి. బి.ఎస్.రాములు చిన్నమ్మ కొడుకు బి.ఎస్.కంటే ఎనిమిదేళ్ళు చిన్నవాడైనప్పటికి బి.ఎస్. కంటే ముందే పెళ్ళి చేశారు.

బి.ఎస్.రాములుకు కూడా 9వ తరగతి నుండే పిల్లను వెతకడం ప్రారంభించారు. ధర్మపురిలో ఉన్నప్పుడు చాలా సంబంధాలు వచ్చాయి. ఉద్యోగం వచ్చాక చేసుకుందామని వాటిని తిరస్కరిస్తూ వచ్చారు. అయినా సరే పిల్లవాడు మంచివాడు అని చెప్పి ధర్మపురిలో బీడీ కంపెనీ నడిపే మిట్టపెల్లి రాజమల్లయ్య, ఈశ్వరీబాయి దంపతులు భావించారు. తమ పుత్రికనే ఇచ్చి పెళ్ళి చెయ్యాలనుకున్నారు. కాని ఇరువురి ఇంటి పేరు ఒకటే కావడం

వల్లనూ, ఇద్దరికీ నల్లదారం వాడకూడదు అనే నియమం వుండడం వల్ల వెనకట వీరంతా ఒకే కుటుంబానికి చెందిన వారని స్పష్టమైంది.

దాంతో ఈశ్వరీబాయి, తన అక్క కూతుర్నైనా పెండ్లి చేసుకుంటే బాగుంటుందని భావించింది. ఈశ్వరీబాయి సొంత అన్న, జగిత్యాలలోని పద్మశాలీ ప్రముఖులు కస్తూరి రాజనర్సయ్య గారి ఇంట్లో పెళ్ళి చూపులు ఏర్పాటు చేశారు. అలా శ్యామలతో మే 17, 1973వ సంవత్సరంలో పైడిమడుగులో, మెట్‌పల్లి తాలూకా కరీంనగర్ జిల్లాలో సాంప్రదాయ బద్ధంగా వివాహం జరిగింది. 1974 జూన్‌లో పెద్దకొడుకు పాణిగ్రాహి జన్మించాడు.

1.10. ఉద్యోగ ప్రాప్తి

ఎట్టకేలకు 1975 సంవత్సరంలో డిసెంబరు నెలలో సోషల్ వెల్ఫేర్ డిపార్టుమెంటులో ఉద్యోగం లభించింది. 1967-75 వరకు ఈ మధ్య కాలంలో నిరుద్యోగ రక్కసి కోరల్లో చిక్కి బాగా బక్క పడిపోయారు. అయితే ఆశించిన ఉద్యోగం రాకపోయినప్పటికి వచ్చిన ఉద్యోగంతో సరిపెట్టుకోవడం అనేది భారతదేశంలో సర్వసాధారణ విషయం. ఇలా తన అభిరుచులకు ఆసక్తులకు సంబంధం లేని శాఖలో డిసెంబర్ 17, 1975న హాస్టల్ వార్డెన్‌గా కరీంనగర్ జిల్లా పూర్వరాజధానియైన ఎలుగందల గ్రామంలో హాస్టల్ వార్డెన్‌గా ఉద్యోగంలో చేరారు.

ఆ శాఖలోని పని విధానాలు మానసిక హింస నిరంతరం భయపెట్టే అధికార యంత్రాంగం భరించలేక స్వతహాగా పోరాట పంథాను ఎన్నుకున్నారు. ఆ పోరాటంలో ఎక్కడా రాజీ పడలేదు. ఉద్యోగం పొందిన అనతికాలంలోనే అందరికంటే జూనియర్ అయి వుండి, సీనియర్ వార్డెన్లనందరిని కూడగట్టి వార్డెన్ల సంఘాన్ని ఏర్పాటు చేశారు.

వార్డెన్ల సంఘాన్ని ఒక బలమైన మరో ఉద్యోగ సంఘంతో అనుసంధానించాలని తీవ్రంగా ప్రయత్నించారు. ఉపాధ్యాయ సంఘంలో అనుబంధ సంస్థగా చేరితే బాగుంటుందా? లేక ఎన్.జి.ఓ. సంఘంలో చేరితే బాగుంటుందా అనే చర్చలు సుదీర్ఘంగా జరిపారు. టి.ఎన్.జి.ఓ. సంఘానికి వార్డన్ల సంఘం అనుబంధంగా చేర్చడం జరిగింది. 1978 జనవరిలో తెలంగాణా వార్డెన్స్ & మెట్రన్స్ అసోసియేషన్ మహాసభలను కరీంనగర్‌లో ఘనంగా నిర్వహించారు. ఆ తర్వాత విప్లవ విద్యార్థి సంఘాల నిర్మాణం జిల్లాలోని హాస్టల్స్‌లో విస్తరించడానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించారు.

1.11. ఆరెస్సెస్ నుండి అంబేద్కరిజం వైపుకు

ఉద్యోగం దొరికాక చాలామంది ఉద్యమాల నుండి ఆగిపోతుంటారు. కానీ రాములు గారు ఉద్యోగం వచ్చాక ఉద్యమాల్లో మరింత దీక్షతో ముందుకు కదిలారు. అలా

విద్యార్థులను, ఉద్యోగులను, రచయితలను ఆర్గనైజ్ చేశారు. ఈ సమాజం కోసం ఏదోఒకటి చేయాలనే తపన అతనిలో నిరంతరం వెన్నాడుతూ వుండేది. తనలాంటి పేద బతుకులకు జీవితం పట్ల ఆశ, విశ్వాసం కలిగించే విధంగా సామాజిక ఏర్పాటు రావాలని అభిలషించారు.

హాస్టల్ లైబ్రరీలో అంబేద్కర్ రచనల అనువాదాలు, దళిత రచనలు వుండేవి. వాటిని బి.ఎస్.రాములు క్షుణ్ణంగా చదివారు. దళితుల పట్ల, వారి కష్టాల పట్ల లోతైన అవగాహన పెంచుకున్నారు. వారి జీవితాల్లో వెలుగు నింపడం కోసం తానున్న ఉద్యోగంలో ఉద్యోగ రీత్యా చేయగలిగిన దానికన్నా అదనంగా ఇంకా ఏదో చేయాలని అనుకున్నారు. ఎమర్జెన్సీలో ఇందిరాగాంధీ ప్రవేశ పెట్టిన 20 సూత్రాల పథకంలో భాగంగా సంక్షేమ హాస్టళ్ళలో వేలాది సీట్లను పెంచారు. 20 మంది వుండే హాస్టల్‌లో వంద సీట్లు పెంచే అవకాశం ఇవ్వడంతో పాటు అధికారులు వత్తిడి చేశారు.

1.12. జీవిత అనుభవం - అధ్యయనం

దాంతో బి.ఎస్.రాములు ఎలుగందుల నుండి సిబ్బందిని తీసుకొని సైకిళ్ళపై బయల్దేరి యాస్వాడ, బావుపేట, నాగుల మల్యాలం, ఒద్యారం, కొదురుపాక, బోయినపెల్లి దాకా పలు గ్రామాలను దళిత విద్యార్థులను హాస్టల్‌లో చేర్పించడం కోసం ఉపాధ్యాయులను, సర్పంచ్‌లను, తల్లిదండ్రులను కలిసి టి.సి.లు తీసుకొని ఎలుగందుల స్కూల్లో, హాస్టల్‌లో చేర్పించారు. అలా వందమందిని నింపే క్రమంలో గ్రామాల్లోని రాజకీయాలు, పెత్తనాలు దళితులను అణచివేయడానికి విద్యకు దూరం చేయడానికి ఎలా ప్రయత్నిస్తారో అనుభవ పూర్వకంగా తెలుసుకున్నారు. ఆయనకు ఈ జీవితానుభవాలే అంబేద్కర్ రచనల అంతస్సారం జీవితంలో భాగంగా మారడానికి దోహదం చేశాయి.

1.13. అంబేద్కరిజం-మార్క్సిజం

అలా అంబేద్కర్ యువజన సంఘాలను, అప్పుడే ప్రారంభమైన గ్రామీణ రైతుకూలి, విద్యార్థి యువజన సంఘాలను, ప్రోత్సహించడంతో పాటు అందులో భాగమయ్యారు. వాటిని నిర్వహించారు. ఇలా ఏకకాలంలో అంబేద్కరిజం, మార్క్సిజం, హేతువాదం, నాస్తికవాదం భావజాలంతో ముందుకు సాగారు. నాస్తిక గోరా, హేతువాద సివి రచనలు, అంబేద్కర్ రచనలు ఆయన దైవభావన వదిలి నాస్తికుడుగా, హేతువాదిగా, బౌద్ధ ప్రేమికుడుగా మారడానికి దోహదపడ్డాయి. 1977లో ఎలుగందులలో తన ఇంట్లో విద్యార్థి, యువజనులకు విప్లవ సిద్ధాంత శిక్షణా తరగతులు నిర్వహించారు. ఎలుగందుల హాస్టల్లో చేర్పించిన విద్యార్థులలో ప్రొ॥ గంటా చక్రపాణి ఒకరు. శిక్షణా తరగతుల్లో పాల్గొన్న వారిలో కవి, గాయకుడు కె.రామలక్ష్మణ్, సుప్రసిద్ధ జర్నలిస్టు మల్లేపల్లి లక్ష్మయ్య కూడా వున్నారు. ఆ శిక్షణా తరగతుల్లో ఆనాటి ప్రసిద్ధ విప్లవ నాయకులు క్లాసులు చెప్పారు.

"ఇలా నక్సలైటు ఉద్యమంతో మమేకమయ్యారు. నక్సలైట్ ఉద్యమ రాజకీయాలను, సాహిత్యాన్ని విస్తృతంగా అధ్యయనం చేసి ప్రచారం చేశారు. జిల్లా అధికారుల అవినీతికి సింహస్వప్నం కావడంతో సస్పెండ్ చేశారు. టిఎన్‌జిఓల సంఘం, వార్డెన్ల ఉద్యోగ సంఘాలు దీనిపై ఉద్యమించాయి. దాంతో తిరిగి సస్పెన్షన్ కాలాన్ని పూర్తిజీతంతో డ్యూటీగా పరిగణిస్తూ 1978 నవంబర్‌లో హుజూరాబాద్‌కు బదిలీ చేశారు. అప్పటినుండి వెనక్కి తగ్గకపోగా మరింత ముందుకే సాగారు. హుజూరాబాద్‌లో పౌరహక్కుల సంఘం, అంబేద్కర్ సంఘం, రాడికల్ విద్యార్థి సంఘం మొదలైన రాజకీయ, సామాజిక కార్యకలాపాలను నిర్వహించారు. హాస్టల్ విద్యార్థులు పేదలని, కనుక పేదలకు ఇచ్చే కంట్రోల్ రేషన్ బియ్యం, హాస్టల్లో కూడా కేటాయించాలని జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. వారితో చర్చించి విషయం వివరించిన తరువాత హాస్టళ్లకు రేషన్ బియ్యం కోటా కేటాయించారు. అప్పుడు మార్కెట్‌లో 5 రూపాయలు కిలో వుండేవి. రేషన్ కోటా ద్వారా రూ.1.90 పై.లకు సప్లయ్ చేయడం వల్ల విద్యార్థులకు ఎంతో మేలు జరిగింది. 1983లో ఎన్.టి.రామారావు ముఖ్యమంత్రి అయ్యాక ఈ స్కీమును రాష్ట్రంలోని అన్ని హాస్టళ్లకు విస్తరింప చేశారు. అలా విద్యార్థుల సౌకర్యం కోసం తమ ఉద్యోగ సంఘం తరపున ఉద్యమించడం విశేషం."[1]

1.14. విరసంలో బి.ఎస్.

1979–80లో బి.ఎస్.రాములు, విప్లవ రచయితల సంఘంలో సభ్యుడుగా చేరారు. 1978 నుంచి హుజూరాబాద్‌కు బదిలీ అయ్యింది. అక్కడికి అరగంట దూరంలో వుండడం వల్ల వరంగల్‌లోని కాకతీయ యూనివర్సిటికి, సృజన కార్యాలయానికి రాకపోకలు, సంబంధాలు పెరిగాయి. హుజూరాబాద్‌లో విద్యార్థి, యువజన, పౌర హక్కుల ఉద్యమాలను, అంబేద్కర్ సంఘాలను, ఉద్యోగ సంఘాలను నిర్మించడంలో క్రియాశీలంగా ముందుకు నడిచారు. 1979 డిసెంబర్‌లో సెలవు పెట్టి కాకతీయ యూనివర్సిటీకి చెందిన బి.ఇడి కాలేజీలో, వరంగల్‌లో తెలుగు పండిట్ శిక్షణలో చేరారు. అలా హనుమకొండలో ఎంతో మంది రచయితలు, విద్యార్థి నాయకులు సన్నిహితమయ్యారు. బి.ఇడి కాలేజీలో కూడా ఉద్యమాలు నిర్మించారు. కాకతీయ యూనివర్సిటీలో పిడిఎస్‌యు, ఆర్‌ఎస్‌యు విద్యార్థి సంఘాలు బలంగా ఉద్యమ నిర్మాణం చేశాయి. వారితో కలిసి ముందుకు సాగారు.

1980 సెప్టెంబర్‌లో బదిలీపై వేములవాడకు చేరిన తరువాత వేములవాడ, సిరిసిల్ల తాలూకాలోని రచయితలను కూడగట్టి సాహిత్య సదస్సులను నిర్వహించారు. జూకంటి జగన్నాథం, తోట మహదేవ్, తదితరులను తీసుకొని 1980లో రచయితలు 'గ్రామాలకు వెళ్ళి ప్రజలను అధ్యయనం చేయాలి' అని విరసం ఇచ్చిన పిలుపుతో సిరిసిల్ల తాలూకాలో గ్రామాలకు బయలుదేరి నిర్బంధించబడ్డారు. 1982 డిసెంబర్‌లో వేములవాడ నుండి మల్యాలకు బదిలీ అయ్యారు. జగిత్యాల సొంత ఊరికి మల్యాల చాలా దగ్గర. జగిత్యాలలో

వుంటూ మల్యాలకు వెళ్ళి వస్తుండే వారు. తాను ఎక్కడ వున్నా హాస్టల్ విద్యార్థులకు అంబేద్కర్ విప్లవ భావజాలాన్ని పరిచయం చేస్తూ ఉద్యమాల్లో పనిచేయడాన్ని ప్రోత్సహించారు. అలా ఎందరో ఉద్యమాల్లో చేరారు. జూకంటి జగన్నాథం, అలిశెట్టి ప్రభాకర్ వంటి ఎందరో రచయితలను విరసంలోకి తెచ్చారు. 1983లో పౌరహక్కుల సంఘం కరీంనగర్ జిల్లా కార్యదర్శిగా పనిచేస్తూ ఎన్నో గ్రామాలు పర్యటించారు.

1.15. అజ్ఞాతంలో బి.ఎస్.

1984-88ల మధ్య పీపుల్స్ వార్ పార్టీకి చెందిన రాడికల్ యువజన సంఘం (ఆర్‌వైఎల్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా అనంతపూర్ రాష్ట్ర మహాసభలో 1985 జులైలో ఎన్నికయ్యారు. అరెస్టు కావడంతో జైల్లో పెట్టడం వల్ల రెండు రోజులకు మించి జుడిషియల్ కస్టడీలో వుండే ప్రభుత్వ ఉద్యోగులను సస్పెండ్ చేయడం ప్రభుత్వ రూల్స్. ఆ ప్రకారంగా బి.ఎస్.రాములు జైలు నుండి విడుదలయ్యాక తిరిగి ఉద్యోగంలో చేరలేకపోయారు. దాంతో ఉద్యమానికి పూర్తికాలం కార్యకర్తగా పనిచేస్తూ ఇతర రాష్ట్రాల నుండి ఉద్యమ విశేషాలను తెలుసుకోవడానికి వచ్చే జర్నలిస్టులను, రచయితలను, పౌరహక్కుల సంఘాల వారిని తీసుకొని గ్రామాలకు పర్యటించి అనేక విషయాలు తెలిపే వారు. పౌర హక్కుల ఉద్యమంలో తీవ్రంగా పనిచేశారు. ఆ క్రమంలో కరీంనగర్ జిల్లా వదిలి హైదరాబాద్ కూడా వదిలి, కోర్టుకేసులకు అటెండ్ కాకుండా ప్రభుత్వ ఉద్యోగాన్ని వదిలి 1985-90లలో గద్దర్, వరవరరావు, సంజీవ్, తదితరులతో కలిసి అజ్ఞాత వాసంలో ఉన్నారు. అజ్ఞాతంలో ఉంటూ అఖిల భారత ప్రజాసమాచార, సాంస్కృతిక పర్యటన చేస్తూ 12 రాష్ట్రాలు సందర్శించారు. ఆయా రాష్ట్రాల్లో పలు సంస్థలతో, సంఘాలతో చర్చలు కొనసాగించారు.

1.16. నిర్బంధం నీడలో కుటుంబ గాథ

బి.ఎస్.రాములు ఉద్యమంలో వున్నప్పుడు పోలీసు నిర్బంధాలతో కుటుంబం నిరంతరం భయం భయంగా బతుకుతుండేది. వారి శ్రీమతి శ్యామల గారు ఇలా వివరించారు.

"మేం బతకడం కష్టంగా వుండేది. ఎక్కడ ఎన్‌కౌంటర్‌లైనా భయంగా వుండేది. రాత్రి పూట పోలీసులు మా ఇంటికొచ్చినప్పుడు పెద్దపెద్ద లైట్లు తీసుకొని తలుపు కొట్టి లేపేవారు. పార్టీలో తిరగడం వల్ల మాకు చాలా ఇబ్బందైంది. పార్టీవాళ్ళు మా ఇంటికి వస్తే మా పిల్లలు రావద్దనే వాళ్ళు. మా బాల్యం ఎంత ఘోరంగా గడిచిందో అని చెప్పేవాళ్ళు. మా ఇంటి మీద ఎప్పుడూ పోలీసుల నిఘా వుండేది. నలుగురు పిల్లల్ని ఎట్లా సాదుతున్నది, సాయం ఎక్కడి నుంచి అందుతున్నది అని ఆరా తీసెటోళ్ళు."[2]

1.17. శ్రీమతి శ్యామల గారి కృషి

"పిలగాండ్లకు పలకా, బలపం పుస్తకాలు కావాలని అడిగినా నా దగ్గర డబ్బులు వుండేవి కావు. ఏం చేయలేక కొట్టేదాన్ని. మా పరిస్థితి చూసి పక్కింటి వాళ్ళే సాయం చేసే వాళ్ళు. వాళ్ళని ఇప్పటికీ మేము మర్చిపోం. బీడీలు చేసేదాన్ని. సీజన్ లేనప్పుడు బీడీలకు ఆకు, తంబాకు తక్కువ ఇచ్చే వాళ్ళు. పిల్లలు వుండి బాధ పడుతుంటే చూసి బీడీ కంపెనీ బ్రాంచి టేకేదారు (కాంట్రాక్టరు) నా పరిస్థితి చూసి ఎంత ఆకు, తంబాకైనా ఇచ్చే వాళ్ళు. అందరికీ తక్కువ ఇస్తే నాకు ఎక్కువగా ఇచ్చే వాళ్ళు. మాకు రేషన్ కార్డు లేదు. వాళ్ళ తమ్మునిది, మా చెల్లెది మేం వాడుకునే వాళ్ళం. మా పెద్దకొడుకు పాణి రేషన్ షాపు కాడ నాలుగైదు గంటలు నిలబడి నూనె, చక్కెర తీసుకొచ్చెటోడు. మా బతుకు బీడీలు చేయటమే. 16 రూ.లకు ఒక జనతా చీర ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా వున్నప్పుడు ఇచ్చిండ్రు. 2 రూ.లకు కిలో బియ్యం, అవే బియ్యం, అవే బట్టలు. నాకు చదువు లేదు కాబట్టి నాకు చదువు మీద ఎక్కువ ఇంట్రస్టు వుండేది. మా పిల్లల మీద ఎక్కువ దృష్టి పెట్టి చదివించిన.

మాకు బట్టలు సరిపడా వుండేవి కాదు. ఆయన ఇంట్లోంచి వెళ్ళిపోయినప్పుడు మా పెద్దకొడుకు 7వ తరగతి చదువుతుండే వాడు. చిన్నకొడుకు ఏడాది పిల్లగాడు. మా ఇంట్లో గడియారం కూడా లేకుంటుండె. పెద్దోడు ఇంటర్‌లో ట్యూషన్‌కు పోదామని ఉదయం అయిదు అయిందనుకొని లేచి క్లాక్‌టవర్ చేరేసరికి రాత్రి మూడు గంటలు కనపడింది. దాంతో రెండు గంటలు అక్కడే చలిలో ఉండి టైము కాగానే ట్యూషన్ సార్ దగ్గరికి పోయేవాడు. మా నాన్న వెయ్యి రూపాయలు ఇస్తే ట్యూషన్‌కు పోయిండు. మా చిన్న కొడుక్కు 6 సం॥ వచ్చే వరకు నాన్న ఎవరో తెలియదు. ఉద్యమం అంటూ వాని కన్న తరువాత పోయిండు. నేను పువ్వులు, బొట్టు పెట్టుకుంటే చుట్టుపక్కల పెద్దమనుషులు ఎప్పుడు చచ్చిపోయిండో ఈమె ఇంకా పూలు పెట్టుకొని, బొట్టు పెట్టుకుంటోందని విమర్శించెటోళ్ళు. వాళ్ళ మాటలకు ఏమనలేక ఏడ్చుకుంటూ ఇంట్లో వుండేదాన్ని. అన్నంలేక బీడీలు చుట్టుకుంటూ రాత్రుళ్ళు ఎన్నోసార్లు నీళ్ళు తాగి పండుకునే దాన్ని. మా బంధువులు నాకు బాగా సపోర్టు ఇచ్చారు. నన్ను కష్టాలలో ఆదుకున్నారు. ఇప్పుడు పిల్లలు ఎదిగాక వారికి పెళ్ళిళ్ళకు, చదువులకు నాకు తోచినంత సహాయం చేస్తున్న."[3]

1.18. శ్యామల గారి దృష్టిలో జీవితం అప్పుడు-ఇప్పుడు

"అప్పుడు తింటానికి తిండిలేదు. ఫ్యాన్లు లేవు, గడియారాలు లేవు, సరైన బట్టలు అందుబాటులో వుండేవి కావు. ఆ రోజుల్లో కట్టెల పొయ్యి, ఇంటి ముందు ముగ్గులు వేయడం, బతుకమ్మ పాటలు పాడటం అవన్నీ కనిపిస్తూ వుండేవి. ఈ రోజుల్లో పల్లెల్లో కూడా ఇవి కనుమరుగవుతున్నాయి. మా పిల్లలు కష్టపడి బాగా చదువుకొని సాఫ్ట్‌వేర్

ఇంజనీర్లుగా విదేశాల్లో మంచిగ బతుకుతున్నరు. కంప్యూటర్లు, కార్లు అన్ని సమకూర్చుకొని తమ పిల్లలను చక్కగా ఏ కష్టం రాకుండా చూసుకుంటున్నరు. నేను మా పిల్లల దగ్గరికి అమెరికాకు మూడుసార్లు పోయి వచ్చిన. అప్పటికీ ఇప్పటికీ తేడా ఏమిటంటే అప్పుడు ఏ కాస్తా తీరిక దొరికేది కాదు. బతుకంతా దుఃఖమే. ఎట్లా తెల్లారుతుందో తెలియదు. ఇప్పుడు పిల్లలు బాగా చదువుకున్నారు. కొడుకులంత చదువుకున్న చక్కని కోడళ్ళు దొరికారు. వారిని, మనవలను చూసుకుంటున్నాను."[4] ఇప్పుడు బంధుమిత్రులు ప్రేమగా శ్యామలగారిని 'మదర్ ఆఫ్ ఇంజనీర్స్' అని పిలుస్తుంటారు.

పోరాటం ఎక్కడో లేదు. బతుకులోనే పోరాటం ఉంది. మా బతుకే ఒక పోరాటం. ఒక స్థాయి బతుకు బతకడమే ఒక పోరాటంగా సాధించుకోవాల్సిన జీవితాలు మావి. మా అమ్మ బతుకే ఒక పోరాటం అని అంటారు బి.ఎస్.

1.19. పునర్జన్మ లాంటి రెండో జీవితం

బి.ఎస్.రాములు అజ్ఞాతంలో ఎన్నోసార్లు ప్రాణాపాయం నుండి తప్పించుకున్నారు. ఆయన తిరిగి కుటుంబాన్ని చూస్తానని అనుకోలేదు. తాను బతుకుతానని కూడా అనుకోలేదు. డా॥ మర్రిచెన్నారెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక 1989 చివరిలో నక్సలైట్లకు పూర్తి స్వేచ్ఛను, అవకాశాలను ఇస్తున్నామని స్వేచ్ఛగా సభలు, సమావేశాలు పెట్టుకోవచ్చని రహస్యం వీడి రావాలని వారి ప్రభుత్వ ఉద్యోగాలు తిరిగి ఇస్తామని పదేపదే ప్రకటించారు. దాంతో రహస్యంగా వుండే వాళ్ళు చాలామంది తిరిగి బహిరంగ జీవితంలోకి వచ్చారు.

అలా 1990 ఏప్రిల్ 2వ తేదీన మంథనిలో జరిగిన కరీంనగర్ జిల్లా ఆర్వైఎల్ మహాసభల్లో బహిరంగ జీవితంలోకి వచ్చారు. ప్రస్తుతం దళితవాద, స్త్రీవాద, విప్లవవాద, బౌద్ధ, మానవీయ వాదాలను సమన్వయిస్తూ తాత్విక, సాంస్కృతిక రంగాల్లో కృషి సాగిస్తూ వచ్చారు.

బి.ఎస్రాములు బహిరంగ జీవితంలోకి వచ్చాక 1990 నుండి రాష్ట్రమంతటా సుడిగాలిలా పర్యటించారు. 1992లో బీసీ, ఎస్సీ, ఎస్టీల వేదికగా ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ దళిత రచయితల కళాకారుల, మేధావుల ఐక్యవేదిక" వ్యవస్థాపక అధ్యక్షుడిగా, గౌరవాధ్యక్షుడిగా పని చేశారు.

బి.ఎస్.రాములు గారు బహిరంగ జీవితంలోకి వచ్చాక ఒక జాతర లాగా జనం, బంధుమిత్రులు ఇంటికొచ్చారు. అందులో మిత్రులెవరో, శత్రువులెవరో తెలియదు. ఏది ఎందుకోసం అడుగుతున్నారో తెలియదు. కుటుంబం బాగా శిథిలమైపోయింది. ఇల్లు శిథిలమై పోయింది. ఇంట్లో పాములు చేరాయి. ఇంటిపైకప్పు నుండి పాములు అప్పుడప్పుడు మీదపడుతుండేవి. అలాంటి దశలో కూడా తమ పంచాయితీలు, సమస్యలు

పరిష్కరించాలని వందలాది మంది ఆశగా డిమాండ్ చేస్తూ వచ్చే వారు. తిరిగి ఉద్యోగంలో చేరిన పరిణామాలను రాష్ట్రంలోని రచయితలకు, కళాకారులకు, బంధుమిత్రులకు బహిరంగ లేఖ రాశారు. దీంతో తన జీవితాన్ని సామాజిక పాత్రను కొత్త రూపంలోకి మలుచుకోవడానికి ప్రారంభించారు.[5]

1.20. తిరిగి ప్రభుత్వం ఉద్యోగంలో చేరిక - వదలని నిర్బంధాలు

బి.ఎస్.రాములు 1984-1990 మధ్య విప్లవోద్యమం నుండి బయటకు వచ్చి తిరిగి ప్రభుత్వ ఉద్యోగం చేశారు. రక్షణ కోసం, భద్రత కోసం జగిత్యాలలోనే స్థానికంగా ఉంటానని చెప్పడంతో కలెక్టర్ జగిత్యాలలోని సాంఘిక సంక్షేమ హాస్టల్‌కు బదిలీ చేసారు. జనవరి 27వ తేదీన (1991) అర్థరాత్రి ఎవరో రెండు కార్లలో సివిల్ డ్రస్‌లలో వచ్చి వారి ఇంటిపై దాడి చేసారు. ఆ సమయంలో ఇంటిలో లేరు. వాళ్ళ అమ్మ మిట్టపెల్లి లక్ష్మిరాజు సంక్రాంతి తెల్లవారి చనిపోయింది. ఆ సందర్భంగా అత్తగారి బంధువులు కుటుంబాన్ని నిద్రకు తీసుకెళ్లారు. అలా ప్రాణాలతో బయటపడ్డారు. దీనిపై 'నేను రచయితగా, సామాజిక సంక్షేమ రంగాల్లో కృషి చేయాలనుకుంటున్నాను. విప్లవోద్యమంలో పనిచేయడం లేదు. విప్లవ రచయితల సంఘంలో ఉంటూ నా రచనా రంగాన్ని కొనసాగించాలనుకుంటున్నాను. నన్ను బతకనీయండి. నా భార్యా, పిల్లలు నాపై ఆధారపడి ఉన్నారు. ప్రజాస్వామిక వాదులారా! ప్రభుత్వ రంగంలోని నాయకులారా! నేను బతికే హక్కు కోసం మద్దతివ్వాలని, ఈ దాడిని ఖండించాలని విజ్ఞప్తి చేస్తున్నాను. అని పత్రికా ప్రకటన చేశారు.[6]

వారి నిర్బంధం పట్ల విరసం కార్యదర్శి చెంచయ్య ఇంటికి వచ్చి పరామర్శించినప్పటికీ విరసం సభ్యులు పెద్దగా స్పందించలేదు. ఇలాంటి సంఘటనల తర్వాత విప్లవ పార్టీకి, ఉద్యమానికి, తనకు మధ్య గల విభేదాలను బహిరంగ ప్రసంగాల్లో చెప్పడం ద్వారా బి.ఎస్.రాములు తనను తాను తన భావజాలంతో స్పష్టంగా వ్యక్తీకరించుకోవడం ప్రారంభించారు. అలా విరసంలో ఉన్నప్పటికీ కుల సమస్యపై, ఉద్యమాలపై తన భిన్నాభిప్రాయాలను వ్యక్తీకరించారు.

తొమ్మిది సంవత్సరాలు చేసిన ప్రభుత్వ ఉద్యోగం వదిలి, ఇల్లు వదిలి విప్లవంలో చేరిన 1985 నాటికి పెద్దవాడు 7వ తరగతి, నాల్గవవాడు ఏడాది పిల్లవాడు. నాల్గవవాడు నెల పిల్లవాడుగా వున్నప్పుడు జైల్లో పెట్టారు. డా॥మర్రి చెన్నారెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు వచ్చిన లీగల్ అవకాశాల్లో 1989లో వరవరావు, గద్దర్, ముందుగా బహిరంగ జీవితంలోకి వచ్చారు. పార్టీలో విభేదాలతో కొనసాగిన బి.ఎస్. రాములు రహస్య జీవితం వదిలి ఇంటికి చేరేసరికి ఇంటి పరిస్థితి ఘోరంగా ఉంది. నిత్య దరిద్ర్యంలో పిల్లలు కుటుంబం కునారిల్లుతున్నది. చిరిగిన పాత చీరలు పక్కబట్టలుగా వాడుకుంటున్నారు.

ఒకటే డ్రెస్సు రాత్రి ఉతికి వేసుకొని తెల్లవారి వేసుకుంటూ పెద్దవాడు ఇంటర్మీడియెట్ అంతా గడిపాడు.

వారి శ్రీమతి శ్యామల, నలుగురు పిల్లలు ఎండిపోయిన చేపవరుగుల్లాగా ఎముకలు తేలి వున్నారు. ఇంట్లో పైకప్పు సందుల్లో పాముల బెడద. అప్పుడప్పుడు పాములు పై నుండి జారి మంచంలో పడేవి. ఇల్లంతా పేదరికం వాసన. తన అవసరం కుటుంబానికి కొంత కాలమైనా ఎంతో అవసరమని భావించారు.

1.21. నూతన సామాజిక ప్రయత్నాలు

1990 ఏప్రిల్‌లో ఆరు సంవత్సరాల రహస్య జీవితం నుండి బహిరంగ జీవితంలోకి వచ్చాక సుమారు 450 మంది పూర్తి కాలం కార్యకర్తలుగా పని చేస్తామని మీరు నాయకత్వం వహించాలని కోరారు. అలా కలిసిన వారిలో పీపుల్స్‌వార్, విమోచన పార్టీల కార్యకర్తలతో పాటు, కారంచేడు ఉద్యమం తరువాత అది ఆగిపోయిందని ఆగిపోయిన దళిత ఉద్యమాన్ని ముందుకు నడపాలని వచ్చిన కార్యకర్తలు కూడా ఎందరో ఉన్నారు.

ఆయా సంస్థల నుంచి బయటకు వచ్చిన దంపతులు ఎందరో తమ కోసం తాము పనిచేసుకొని బతకడం పట్ల అయిష్టంగా వున్నారు. సమాజం కోసం జీవితాలను అంకితం చేయాలని భావించారు. బి.ఎస్.రాములుతో కలిసి పనిచేసిన వారు, స్ఫూర్తి పొందిన వారు ఎందరో బి.ఎస్.పై పూర్తి విశ్వాసం ఉంచారు. వీళ్ళందరినీ శాంతియుత ఉద్యమాల నిర్మాణంలో ముందుకు నడపడం గురించి సీరియస్‌గా ఆలోచించారు. పూర్తికాలం కార్యకర్తలతో ఉద్యమం నిర్మించడం నిర్బంధాలను, విమర్శలను తట్టుకోవడమే కాకుండా ఆర్థికంగా కూడా శాంతియుత పద్ధతిలో ఫండ్స్ సేకరించాల్సిన మార్గాలు కూడా అవసరం. అందుకు అన్వేషణ ప్రారంభించారు.ఏయే రంగాల నుండి శాంతియుతంగా ఉద్యమాలు చేసేటప్పుడు ఫండ్స్ సేకరించవచ్చో అనేక కోణాల్లో రోజుల తరబడి చర్చించారు.

1984-90 నిర్బంధ కాలంలో - లేకలేక దొరికిన ఉద్యోగాన్ని, నలుగురు పసి పిల్లలను, భార్యను వదిలేసి తనను సాకాల్సిన సమయంలో అందరినీ వదిలి వెళ్ళాడని ఆవేదనతో, దుఃఖంతో ఏడ్చిఏడ్చి కొడుకు కోసం కలవరించి, పలవరించి మతిస్థిమితం కోల్పోయిన తల్లి కీ.శే. మిట్టపెల్లి లక్ష్మి రాజు, మనమల అభివృద్ధిని చూడకుండా 60వ ఏట 1991లో కన్ను మూశారు.[7]

1.22. ఉద్యోగ సంఘాల నిర్మాణం-ప్రమోషన్ల సాధన

1990 నుండి బహిరంగ జీవితంలోకి వచ్చాక తిరిగి ఉద్యోగ సంఘాల నిర్మాణంలో చురుకుగా పాల్గొన్నారు. ప్రమోషన్లు లేని హాస్టల్ వార్డెన్ ఉద్యోగాలకు ప్రమోషన్లు సృష్టించాలని మిత్రులతో కలిసి సోషల్ వెల్ఫేర్ కమిషనర్ కార్యాలయం చుట్టూ

సెక్రటేరియట్ చుట్టూ సాంఘిక సంక్షేమ మంత్రుల చుట్టూ నెలల తరబడి తిరిగి చివరకు ప్రమోషన్ ఛానల్ సాధించారు. వార్డెన్‌లలో 10 శాతం మేరకు గ్రేడ్-1 వార్డెన్‌లుగా, ఆ తరువాత సహాయ సాంఘిక సంక్షేమ అధికారులుగా, జిల్లా సంక్షేమ అధికారులుగా ప్రమోషన్లు పొందే కోటాను సాధించడం జరిగింది.

ఈ జీవోలను విడుదల చేయించాక ఎంతో సంతోష పడ్డారు. ప్రమోషన్లు లేని రంగంలో ప్రమోషన్లు సృష్టించాక సాధారణంగా సీనియారిటీ ప్రకారం ప్రమోషన్లు ఇచ్చి తగిన అర్హతలను రెండు సంవత్సరాల లోగా సంపాదించుకోవాలని సూచిస్తారు. దీని ప్రకారంగా అందరికీ ప్రమోషన్లు రావాలి. కాని పైరవీలు చేసి, డబ్బులు పోసి నానా విధాలుగా జూనియర్లు ప్రమోషన్లు పొందారు. దాంతో బి.ఎస్. గారిలో ఒక నైరాశ్యం ప్రవేశించింది. పోరాడింది ఎవరు? ప్రమోషన్లు పొందింది ఎవరు? ఇంకా చాలా విషయాలను ప్రభుత్వం నుండి సాధించుకోవాల్సి వుండె. తన కన్నా జూనియర్లు సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్లుగా ప్రమోషన్లు పొంది రిటైరయ్యారు. పది మందికి చెప్పే పెద్దమనుషులుగా బి.ఎస్.రాములు వంటి సీనియర్లు జూనియర్లను ప్రమోషన్లు ఎలా తీసుకున్నారని నిలదీసి ప్రశ్నించ లేకపోయారు.స్వార్థ పరులు అంటారని ఆ స్వార్థపరులను చూసి మిన్నకుండిపోయారు. అలా వారి పెద్దరికం వారి బలహీనతగా పరిణమించింది.

1997లో సిరిసిల్లకు బదిలీ అయ్యారు. ఆ తరువాత తిరిగి జగిత్యాలకు బదిలీ అయ్యారు. సిరిసిల్ల, జగిత్యాలలోను అనేక సాహిత్య కార్యక్రమాలను నిర్వహించారు. 1998లో బి.ఎస్.రాములు 50వ జన్మదిన స్వర్ణోత్సవాన్ని జగిత్యాలలో మహోత్సవంగా నిర్వహించారు. వందలాది రచయితలు, కళాకారులు, మిత్రులు సభను విజయవంతం చేశారు.

1.23. అజ్ఞాతకాలాన్ని డ్యూటీగా పరిగణించిన క్రమం

1990లో బహిరంగ జీవితంలోకి వచ్చాక పోలీసులు పాతకేసులు తిరగదోడి తిరిగి కోర్టు చుట్టూ తిప్పారు. రెండేళ్ళ తర్వాత కోర్టుకేసు కొట్టివేయబడింది. దాంతో 1984 నుండి 1990లో తిరిగి ఉద్యోగంలోకి ఎక్కే దాకా గల సస్పెన్షన్ కాలాన్ని తన తప్పేమీ లేదని డ్యూటీగా పరిగణించాలని జిల్లా కలెక్టర్‌కు విన్నవించడంతో డ్యూటీగా పరిగణిస్తూ ఆ కాలానికి పూర్తి జీతంతో పాటు ఇంక్రిమెంట్లు, బకాయిలు మంజూరు చేశారు. అలా వాయిదాల పద్ధతిలో డబ్బు చేతికి అందిన కొద్దీ పిల్లల చదువులకు, ఇంటి మరమ్మత్తులకు ఉపయోగపడ్డాయి.

1.24. సాహిత్య సామాజిక రంగాలకు అంకితం కావడానికి వెసులుబాటు క్రమం

అలా బి.ఎస్. పెద్దకొడుకు పాణిగ్రాహి ఏలూరులో సిఆర్ఆర్ కాలేజీలో

ఇంజనీరింగ్‌లో చేరాడు. మిగతా ముగ్గురు కొడుకులు కూడా చక్కగా చదువుకొని సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా ఎదిగారు. ఇద్దరు కొడుకులు కోడళ్ళు అమెరికాలో, మూడవ వాడు ఆస్ట్రేలియాలో పని చేస్తున్నారు. ఇలా పిల్లలు ఎదిగివచ్చే క్రమంలో బి.ఎస్.రాములు సాహిత్య సామాజిక రంగాలకు పూర్తికాలం కేటాయించాలని 2002 నుండి ఉద్యోగానికి లీవు పెట్టి ఆ తరువాత 2006లో సంవత్సరం ముందుగానే రిటైర్‌మెంట్ తీసుకొన్నారు. పిల్లలు ఎదిగి సొంతకాళ్లపై నిలబడ్డం వల్లే ఇది సాధ్యపడింది.

1990 నుండి జగిత్యాల, కరీంనగర్, సిరిసిల్ల, హుజూరాబాద్, కోరుట్ల, గోదావరిఖని లలో అనేక సాహిత్య సదస్సులు నిర్వహించారు. 1998 ఆగస్టు 23న 50వ జన్మదిన స్వర్ణోత్సవ సభలు రాష్ట్ర స్థాయి సాహిత్య సభలుగా మహోన్నతంగా సాగాయి. ప్రతి జన్మదినం సందర్భంగా ఏటా జగిత్యాలలో, హైదరాబాద్‌లో సాహిత్య సభలను నిర్వహిస్తూ విశాల సాహితీ పురస్కారాలను అందజేస్తున్నారు. కథా వర్క్‌షాపులను నిర్వహించడమే కాకుండా వ్యక్తిత్వ వికాసంపై అనేక శిక్షణా తరగతులు నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా కృషి చేయడంతో ఆగిపోకుండా స్థానిక జిల్లాలో తాను పుట్టిపెరిగిన జగిత్యాలలో సాహిత్య వాతావరణాన్ని పెంపొందించాలని అనేక కార్యక్రమాలను తీసుకున్నారు.

2002 నుంచి బి.ఎస్.రాములు జీవితాన్ని సాహిత్య, తాత్విక రంగాలకు అంకితం చేశారు. విరివిగా సాహిత్య, సామాజిక వ్యాసాలు, పుస్తకాలు రాస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం 1996 నుండి ఉద్యమిస్తూ 16 పుస్తకాలు తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల ఏర్పాటు గురించి ప్రచురించారు. రెండు రాష్ట్రాలు ఏర్పడ్డం వల్ల రెండు రాష్ట్రాలు కూడా పోటీపడి అభివృద్ధి చెందుతాయని విశ్లేషించారు. తెలంగాణ తల్లి విగ్రహం, క్యాలెండర్ రూపకల్పన చేశారు.

1.25. దరకమే ఐక్యవేదిక ఆవిర్భావం-నిర్మాణం

1992 జూన్‌లో ఉట్నూరులో గూడ అంజయ్య ఆధ్వర్యంలో జరిగిన దళిత సాహిత్య సదస్సులో దళిత రచయితల వేదికకు బీజం పడింది. 1992 డిసెంబర్ 6వ తేదీన కరీంనగర్‌లో రాష్ట్ర స్థాయి దళిత సాహిత్య సదస్సు ఉదయం నుండి రాత్రి 12 గంటల దాకా సాగింది. దరకమే ఐక్యవేదికకు రాష్ట్ర కన్వీనర్‌గా బి.ఎస్.రాములు ఎన్నికయ్యారు. 1993 ఫిబ్రవరి 12, 13 తేదీల్లో దళిత రచయితల కళాకారుల, మేధావుల ఐక్యవేదిక ప్రథమ మహాసభలను హైదరాబాద్‌లోని ట్యాంకుబండ్ కింద గల డా॥ బి.ఆర్.అంబేద్కర్ భవన్‌లో నిర్వహించారు. దరకమే ఐక్యవేదికకు రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులుగా ఎన్నికై రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో జిల్లా సభలను నిర్వహించారు. వందల, వేల రచయితలను, కళాకారులను సమీకరించారు. సాహిత్య, సైద్ధాంతిక శిక్షణా తరగతులు నిర్వహించారు. విశాఖపట్నం, కాకినాడ, విజయవాడ, గుంటూరు, నెల్లూరు, అనంతపురం, ఆదిలాబాద్,

కరీంనగర్, వరంగల్, హైదరాబాద్ నగరాల్లో ప్రాంతీయ సదస్సులు, మహాసభలు నిర్వహించారు. దరకమే ఐక్యవేదిక తరపున 'గబ్బిలం' పత్రికను నిర్వహించారు.

1.26. ఆం.ప్ర.దరకమే ఐక్య వేదిక ద్వారా కృషి

దరకమే ఐక్య వేదిక రాష్ట్ర వ్యాప్త కార్యక్రమాలు, సభలు, సమావేశాలు, జిల్లా మహాసభలు నిర్వహించారు. దళిత, బహుజన సాహిత్యాన్ని ముందుకు తీసుకు వచ్చారు. వందలాది పాటలు కథలు వెలువడ్డాయి. దరకమే ఐక్యవేదిక కృషితో తెలుగులో, ఇంగ్లీషులో 200 పైగా పుస్తకాలు అనేక ప్రక్రియల్లో వెలువడ్డాయి. కంచ ఐలయ్య గారి నేను హిందువునెట్లయిత గ్రంథం దరకమే ఐక్యవేదిక పునాది నుండి వెలువడిన గొప్ప పుస్తకాల్లో ఒకటి. బి.ఎస్.రాములు స్వయంగా పూనుకొని 'ప్రవహించే పాట ఆంధ్రప్రదేశ్ దళిత పాటలు', 'కరీంనగర్ జిల్లా దళిత పాటలు', 'కె.రామలక్ష్మణ్ దళిత పాటలు', 'కె.సీతారాములు పాటలు', 'విశాల సాహితి బీసీ, ఎస్సీ, ఎస్టీల పాటలు', 'విశాల సాహితి చైతన్య గీతాలు', 'పిల్లల పాటలు' సేకరించి ప్రచురించారు. యువ రచయితల రచనలను తీర్చిదిద్ది విశాల సాహితీ ప్రచురణలుగా పలు పుస్తకాలు ప్రచురించారు. ఇలా 1990 నుండి బి.ఎస్.రాములు కృషి పలు రంగాల్లోకి విస్తరించింది.

1.27. 1992 తర్వాత బి.ఎస్.రాములు వెంట నడిచిన సాహిత్యం

శ్రీశ్రీ 1935 దాకా తెలుగు సాహిత్యం వెంట తాను నడిచానని, 1935 తరువాత నేను తెలుగు సాహిత్యం నడిపానని ఒక చోట అంటారు. అలాగే చెప్పాల్సి వస్తే 1992 దాకా తెలుగు సాహిత్యం వెంట బి.ఎస్.రాములు నడిచారు. 1992 తరువాత బి.ఎస్.రాములు వెంట తెలుగు సాహిత్యం, భావజాలం, నడిచింది. సామాజిక తత్వవేత్తగా సమాజానికి ముందు నడుస్తూ 'గతితర్క తత్వదర్శన భూమిక' పుస్తకం 1991లో ప్రచురించారు. తాత్వికరంగంలో ఈ పుస్తకం ఒక మైలురాయి. సామాజిక, రాజకీయ ఉద్యమాల్లో ఈ పుస్తకం పెను సంచలానికి, మలుపులకు తెరలేపింది. అదే వరసలో 'కన్యాశుల్కంను ఇప్పుడు ఎలా చూడాలి?', 'గతితర్కం-అంబేద్కరిజం-మార్క్సిజం', 'అంబేద్కరిజం-సోషలిజం', 'భౌతికవాద ప్రాపంచిక దృక్పథం', 'జ్ఞానం-పుట్టుక', 'ప్రేమ అంటే ఏమిటి?' మొదలైన తాత్విక గ్రంథాలు రాశారు.[8]

1993లో కరీంనగర్ జిల్లా హుస్నాబాద్‌లో కథా వర్క్‌షాపు నిర్వహించారు. కథలు ఎలా రాయాలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ దృక్పథంతో బుద్ధిజం, అంబేద్కరిజం వెలుగులో జీవితాన్ని, సాహిత్యాన్ని ఎలా పరిశీలించాలో, చిత్రించాలో వందలాది ప్రసంగాలు చేశారు. వ్యాసాలు రాశారు. ఆ క్రమంలో కథలు ఎలా రాయాలో మార్గదర్శనం చేయడానికి తిరిగి కథలు రాయడం ప్రారంభించారు.

బి.ఎస్.రాములు 1982లో 'బతుకుపోరు' నవల ప్రచురించారు. 1991లో కొత్తగూడెం బుక్‌ట్రస్ట్ 'పాలు' కథల సంపుటిని ప్రచురించింది. పత్రికల్లో వచ్చిన తన కథలతో 1997లో 'స్మృతి' కథలు, 2000లో 'మమతలు-మానవ సంబంధాలు', 2003లో 'వేపచెట్టు', 2004లో 'పాలు-ఇతర కథలు', అదే సంవత్సరం 'తేనెటీగలు', 2005లో 'బతుకుపయనం' కథా సంపుటాలను వెలువరించారు. 150కి పైగా రాసిన కథల్లో కొన్ని కథలు దొరకడం లేదు. కొన్ని ఆయా పత్రికల్లో, సంకలనాల్లోనే వుండిపోయాయి. కథలు ఎలా రాయాలో పాఠ్యగ్రంథంగా 1998లో 'కథలబడి-కథా సాహిత్య అలంకార శాస్త్రం' రచించారు. సాహిత్య విమర్శ ఎలా చేయాలో సూత్రీకరిస్తూ 'సమగ్ర సామాజికత తాత్విక భూమిక 50యేళ్ళ తెలుగు కథా తీరుతెన్నులు' గ్రంథాన్ని 2003లో వెలువరించారు. 2004లో 'సాహిత్య చరిత్రను కొత్తచూపుతో తిరగరాయాలి' అనే గ్రంథాన్ని ప్రచురించారు. ప్రస్తుతం 'కథా-వస్తువు, శైలి శిల్పాలు' అనే గ్రంథాన్ని పూర్తి చేసి ప్రచురణ పనిలో నిమగ్నమయ్యారు.

1.28 బి.ఎస్.రాములు గారి రచనలు

బి.ఎస్.రాములు ప్రవహించే ఒక జీవనది లాంటి వారు. ఆయన నిరంతర సాహిత్య శ్రామికుడు. ఈ వయసులో కూడా అలుపెరగని ఉత్సాహంతో రచనలు చేస్తూనే ఉన్నారు. అటువంటి కృషీవలుని యొక్క సాహిత్య రచనలపై ఆంధ్రదేశంలో ప్రతీ విశ్వవిద్యాలయంలో కూడా పరిశోధనలు జరుగుచున్నవి. అలాంటి రచనలు కొన్ని ఈ క్రింది వరుస క్రమంలో ఉన్నాయి.

1.	బతుకుపోరు నవల (మూడవ ముద్రణ-2004)	1982
2.	పాలు - కథల సంపుటి	1991
3.	గతితర్క తత్వదర్శన భూమిక	1991
4	కన్యాశుల్కంను ఇప్పుడు ఎలా చూడాలి? (6వ ముద్రణ-2005)	1993
5.	దళిత సాహిత్య గర్జన (మూడవ ముద్రణ-1995)	1993
6.	గతితర్కం - అంబేద్కరిజం - మార్క్సిజం	1993
7.	సాహూ ఇంటర్వ్యూలు	1994
8.	అంబేద్కరిజం - సోషలిజం	1994
9.	ప్రేమ అంటే ఏమిటి? (మూడవ ముద్రణ-2004)	1996
10.	స్మృతి కథల సంపుటి	1997
11.	జ్ఞానం పుట్టుక	1998
12.	భౌతికవాద ప్రాపంచిక దృక్పథం	1998
13.	నేను ఎవరు? గతితర్క తత్వదర్శన భూమిక	1998
14.	కథలబడి - కథా సాహిత్య అలంకార శాస్త్రం	1998
15.	మమతలు-మానవ సంబంధాలు కథల సంపుటి	2000
16.	వేపచెట్టు తెలంగాణ కథలు	2003
17.	సమగ్ర సామాజిక కథ 50 ఏళ్ళ తెలుగు కథ తీరు తెన్నులు	2003
18.	బహుజనతత్వం (బిసీ, ఎస్సీ, ఎస్టీ సిద్ధాంతాలు-కార్యాచరణ)	2004
19.	బీసీలు ఏం చేయాలి?	2004
20.	బీసీ, ఎస్సీ, ఎస్టీ, విద్యార్థి యువజనులారా!	2004
21.	తేనెటీగలు - కథల సంపుటి	2004
23.	పాలు-ఇతర కథలు	2004
24.	తెలంగాణ తల్లి ఎరుక	2005
25.	భారతీయ సమాజం-నేటి రాజకీయ సామాజిక పరిణామాలు	2004
26.	సాహిత్య చరిత్రను కొత్త చూపుతో తిరగరాయాలి	2004
27.	బతుకుపయనం - కథల సంపుటి	2005
28.	వ్యక్తిత్వ వికాసం-సామాజిక నాయకత్వం	2006
29.	జీవితం అంటే ఏమిటి ?	2006
30.	తెలంగాణ రాష్ట్ర చరిత్ర	2006
31.	తెలంగాణ రాష్ట్రం-నడుస్తున్న చరిత్ర	2006
32.	తెలంగాణ రాష్ట్ర ఉద్యమం - భవిష్యత్ కార్యక్రమాలు	2006
33.	తెలంగాణ జైత్రయాత్ర	2007
34.	అదిగదిగో తెలంగాణ-ఎంతో దూరంలో లేదు	2007
35.	మీ వూరిని మీరే అధ్యయనం చేయండి	2007
36.	తెలంగాణ ఉద్యమంలో నక్సలైట్ల పాత్ర	2007
37.	తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో మలుపులు	2007
38.	యుపిలో బిఎస్‌పి గెలుపు	2007
39.	60ఏళ్ళ తాత్విక సామాజిక పరిణామాలు	2007
40.	బీసీలకు రాజకీయ అధికారం	2007
41.	భారతీయ చరిత్ర శూద్ర దృక్పథం	2007
42.	తెలంగాణ స్టేట్ నీడ్ ఆఫ్ రివైవల్	2008

43. పర్సనాలిటీ డెవలప్‌మెంట్ సోషల్ లీడర్‌షిప్ 2008
44. వాట్ ఈజ్ లైఫ్ 2008
45. తెలంగాణ స్టోరీస్ 2008
46. తెలంగాణ కథకులు-కథన రీతులు (మొదటిభాగం) 2008
47. తెలంగాణ కథకులు-కథన రీతులు (రెండవభాగం) 2008
48. పాట పుట్టుక 2008
49. దళిత సాహిత్య యుగం సంపుటి-1 2008
50. రాజ్యం - ప్రజలు 2008
51. ఆంధ్ర తెలంగాణ రాష్ట్రాలు ఉద్యమాలు 2008
52. సామాజిక న్యాయం అంటే ఏమిటి? 2008
53. ప్రీతి ఎందరేను? (ప్రేమ అంటే ఏమిటి-కన్నడం) 2008
54. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలు, ఉద్యమాలు 2008
55. బీసీలు సాధికారికత 2008
56. ప్రత్యేక తెలంగాణ-ప్రత్యేక ఆంధ్ర సిరీస్ -5 పుస్తకాలు 2010
57. అంతర్జాతీయ పరిణామాలు-దేశీయ మానవ సంబంధాలు 2010
58. కథ-వస్తువు - శైలి శిల్పాలు 2010
59. సత్యాన్వేషణ-ఒక భారతీయుని ఆత్మకథ 2010

ముద్రణలో వున్నవి-అముద్రితాలు

60. భారతీయ చరిత్ర శూద్ర దృక్పథం-2, 3వ భాగాలు
61. పీఠికలు-ముందుమాటలు
62. తెలంగాణ కథలు-కథన రీతులు మూడవ భాగం
63. దళిత సాహిత్యం యుగం నాలుగు సంపుటాలు
64. విశ్వ సహజాతాలు (నవల-1985)
65. దొంగలు (నవల-1983)
66. బి.ఎస్.రాములు కవితలు
67. సారా సారాంశాలు (నవల-1984)
68. క్యాసెట్ కథ (నవల-1984)

బి.ఎస్.రాములు గురించి వెలువడిన ఇతర గ్రంథాలు

69. బి.ఎస్.రాములు50వ జన్మదిన స్వర్ణోత్సవ సంచిక 1998-2000
70. బి.ఎస్.రాములు కథలు-పరిశీలన 2007

కర్రె సదాశివ్, కాకతీయ యూనివర్సిటీ ఎంఫిల్ పొందినగ్రంథం

71. బి.ఎస్.రాములు బతుకుపోరు నవల-సామాజికత 2008
పల్లా మాలతి చంద్ర, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎం.ఫిల్ గ్రంథం
72. బి.ఎస్.రాములు సాహిత్యం - సమగ్ర పరిశీలన అంశంపై 2011
కాకతీయ యూనివర్సిటీలో పిహెచ్.డి పొందిన అముద్రిత గ్రంథం
- డా॥ కర్రె సదాశివ్
73. బి.ఎస్.రాములు కథలు సామాజిక పరిణామాలు అనే అంశంపై 2011
ఉస్మానియా విశ్వవిద్యాలయం ఎం.ఫిల్ పొందిన అముద్రిత గ్రంథం
- నందిగామ నిర్మల కుమారి, ఎం.ఏ., టి.పి.టి.
74. బి.ఎస్.రాములు బతుకుపోరు నవల-పరిశీలన అనే అంశంపై 2011
ఉస్మానియా విశ్వవిద్యాలయం ఎం.ఫిల్ పొందిన అముద్రిత గ్రంథం
-ఎం.లలిత, ఎం.ఏ.
75. అడవిలో వెన్నెల కథలు-సమగ్ర పరిశీలన అనే అంశంపై 2011
హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం ఎం.ఫిల్ పొందిన గ్రంథం
- జరుపుల రమేష్

బి.ఎస్.రాములు రాసిన పాలు, బడి, సహజాతాలు మొదటి భాగం కథలను ఆంధ్ర విశ్వవిద్యాలయం ఎం.ఏ. తెలుగు విద్యార్థులకు పాఠ్యగ్రంథం. కాకతీయ విశ్వవిద్యాలయంలో 'పాలు' కథ ఎం.ఏ. తెలుగు విద్యార్థులకు పాఠ్యాంశం.

అవార్డులు-పురస్కారాలు

1) కొడవటిగంటి కుటుంబరావు స్మారక విప్లవ కథకు ఇచ్చే పురస్కారం - ఆదివాసుల జీవితాన్ని - పోరాటాన్ని చిత్రించిన "అడవిలో వెన్నెల" కథకు 1984 అక్టోబరు 28న తెనాలిలో కాళీపట్నం రామారావు, రావిశాస్త్రి, కొడవటిగంటి వరూధినిల నేతృత్వంలో పురస్కారం.

2) ప్రతియేటా ఇచ్చే "డా॥దాశరథి రంగాచార్య" పురస్కారం బీడీ కార్మికుల జీవితాలను చిత్రించిన 'బతుకుపోరు' నవలకు 1992లో ఇచ్చారు.

3) మాజీ మంత్రి, స్వాతంత్ర్య సమరయోధులు, బీ.సీ. ఉద్యమ నాయకులు, కొండా లక్ష్మణ్ బాపూజీ ఫౌండేషన్ పురస్కారం 1992లో బి.ఎస్.రాములు చేసిన 'సాహిత్య విశిష్ట కృషికి గాను' అందజేశారు.

4) వరంగల్ జిల్లా 'పాలకుర్తి సోమన కళాపీఠం' వారి "పాల్కురికి సోమన" పురస్కారంతో సత్కరించారు.

5) ప్రముఖ హేతువాది త్రిపురనేని రామస్వామి చౌదరి పేరిట గల తెలుగు విశ్వవిద్యాలయం ధర్మనిధి పురస్కారం ఇచ్చి బి.ఎస్.రాములును 'హేతువాది'గా 1995లో సన్మానించారు.

6) ప్రతియేటా తెలుగు విశ్వవిద్యాలయం ఉత్తమ కథా సంపుటికి అందజేసే పురస్కారం 2002 లో బి.యస్.రాములు 'మమతలు మానవ సంబంధాలు' కథ సంపుటికి అందజేశారు.

7) షోలాపూర్-సిరిసిల్ల పద్మపీఠం వారిచే "పద్మాంజలి అవార్డు"తో సత్కరించారు.

8) హర్యానాలోని పానిపట్‌లో ప్రేమ్‌చంద్ సమకాలికులు జయప్రకాశ్ నారాయణ్ సహచరుడైన బిహార్ కథకుడు రామవృక్ష బేనిపురి శతజయంతి పురస్కారాన్ని 2003లో అందుకున్నారు.

9) దళిత సాహిత్య అకాడమీ, ఢిల్లీ వారు మహాత్మా జ్యోతిరావ్ ఫూలే ఫెలోషిప్‌తో 2001లో సత్కరించారు.

10) స్వర్ణకంకణాలు :

టిఆర్ఎస్, కెసిఆర్ నాయకత్వంలో జరిగిన తెలంగాణ సంబురాలు-2007లో తెలంగాణ తల్లి రూపకల్పన చేసిన సందర్భంగా బంగారు గండపెండేరంతో నిజాం కాలేజి, హైదరాబాద్‌లో సత్కారించారు.

11) డా॥ పి.యశోదారెడ్డి స్మారక తొలి పురస్కారం, స్వర్ణకంకణం తేది : 4-11-08. ఆంధ్ర సారస్వత పరిషత్‌లో డా॥ సి.నారాయణరెడ్డి గారు అందజేశారు.

12) రాష్ట్రంలో వివిధ సంస్థల ద్వారా, ఇతర రాష్ట్రాల్లో నాగపూర్, ఢిల్లీ, పానిపట్, నగరాల్లో పలు సత్కారాలు, సన్మానాలు.

13) 125పైగా పుస్తకాలకు పీఠికలు. కథా శిక్షణా శిబిరాలు సాహితీ శిక్షణా తరగతులు సిద్ధాంత అధ్యయన తరగతులు. 150కి పైగా కథలు, ఆరు నవలలు, 150 సిద్ధాంత వ్యాసాలు, 150 సాహిత్య వ్యాసాలు, పది తాత్విక గ్రంథాలు, మూడు అలంకార శాస్త్ర గ్రంథాలు. వివిధ కథా సంకలనాల్లో వీరి కథలు 50 వరకు ప్రచురించబడ్డాయి.

తెలంగాణ తల్లి రూపకల్పన :

తెలంగాణ చరిత్రను, సంస్కృతిని, భాషను వెలికి తీస్తూ, ఉద్యమిస్తూ అందులో భాగంగా తెలంగాణ తల్లి రూపకల్పన చేశారు. క్యాలెండర్‌లు, విగ్రహాలు వెలయించారు.

సామాజిక తాత్విక విశ్వవిద్యాలయం :

2002 నుండి సామాజిక తాత్విక విశ్వవిద్యాలయం స్థాపన. సభలు, సమావేశాలు, పుస్తక ప్రచురణ. విశాల సాహితి, సామాజిక తాత్విక విశ్వవిద్యాలయం తరపున 90 పుస్తకాల ప్రచురణ.

తెలంగాణ తొలితరం కథకులు గూడూరి సీతారాం గారన్నట్లు "నడుస్తున్న భారతీయ సమాజ చరిత్ర, సంస్కృతి అందులో వస్తున్న మార్పులు, మారుతున్న విలువలు జరుగుతున్న సంఘర్షణను, సామాజిక తాత్విక పోరాటాలతో సహ ఉద్యమ జీవితాలు, ప్రజల జీవితాలను తన కథల్లో, రచనల్లో చిత్రించిన బి.ఎస్.రాములు ఒక నిరంతర ఉద్యమ చైతన్యం, భారతీయ కథా తాత్విక రంగంలో 'ప్రవహించే తెలుగు కథా తాత్విక చైతన్యం' ఈ తరం రచయితలకు మార్గదర్శకులు. వారొక కథల బడి, జీవన తత్వనిధి." వీరు రచించిన రచనలన్నీ సామాజిక పరిణామాల ప్రతీకలు. 'బతుకుపయనం' కథల సంపుటిని కొక్కుల భాస్కర్, గూడూరి సీతారాం సంపాదకత్వంలో ప్రచురించారు. ఈ లఘు సిద్ధాంత వ్యాసంలో 'బతుకుపయనం కథలు' గురించి పరిశీలిద్దాం.

పాదసూచికలు

1. 'తెనేటీగలు' కథల సంపుటి - బి.ఎస్.రాములు గారితో సంభాషణ.
2. శ్రీమతి బేతి శ్యామల గారితో సంభాషణ
3. ,,
4. ,,
5. బి.ఎస్.రాములు గారి ముఖాముఖి. తేది : 02-05-2010
6. ,, తేది : 03-05-2010
7. ,, తేది : 04-05-2010
8. ,, తేది : 05-05-2010
9. శ్రీమతి బేతి శ్యామల గారితో ఇంటర్వ్యూ, తేది : 06-05-2010

రెండవ అధ్యాయం

బతుకుపయనం

కథా పరిచయం వస్తు వైవిధ్యం

'బతుకుపయనం' కథల సంపుటిలో 'నానమ్మ', 'రాత్రిపూలు', 'బతుకుపయనం', 'ప్రశాంతం', 'జైలుజీవితం', 'ఇంటల్లుడు', 'జీవనయానం' అనే ఏడు కథలున్నాయి. 'జీవనయానం' చిన్న నవల అని చెప్పవచ్చు. ఈ ఏడు కూడా వైవిధ్య పూరితమైన కథలు. తొలుత కథలను సంక్షిప్తంగా పరిచయం చేస్తాను.

2.1 నానమ్మ

'బతుకు పయనం' కథలో మొదటి కథ 'నానమ్మ'. సుగుణ అనే చెల్లిని లక్ష్మీరాజం అనే అన్నయ్య వాళ్ళ నానమ్మకి సంవత్సరీకం కోసం రమ్మని తన చెల్లికి ఉత్తరం రాస్తాడు. అన్నయ్య రాసిన ఉత్తరంతో కథ ప్రారంభమవుతుంది. ఆ ఉత్తరం చదివి అందులో విషయం తెలియగానే, ఎంత వేగంగా తల్లిగారింటికి పోదామా అనే ధ్యాస సుగుణలో కనిపిస్తుంది. వెంటనే బయలుదేరుతుంది.

బస్సులో కూర్చుని వాళ్ళ నానమ్మ ఈ అమ్మాయికి చిన్నప్పుడు చెప్పిన కథలు, పిడకలు ఏరుకొని రావడం మొదలైన విషయాలన్ని ఆమె ఒకసారి గుర్తు చేసుకుంటుంది. ఆమె రాట్నం వడుకుతూ కష్టపడేటటువంటి విధానం అంతా సుగుణ ఒకసారి గుర్తు చేసుకొని నానమ్మ పోయి అపుడే ఎనిమిది నెలలు అయిపోయిందా అని ఆశ్చర్యపోతూ ఉంటుంది. సుగుణ వాళ్ళ నానమ్మలా ఉంటుందని అందరూ అంటుండేవాళ్ళని, తాను అందుకు ఎంతో సంతోషించేదని, పెద్దదానిలాగా ప్రవర్తించేదని గుర్తు చేసుకుంటుంది.

అమ్మమ్మ, నానమ్మ, తాతయ్య వంటి పెద్దమనుషులు ఇళ్లల్లో ఉంటే ఆ తీరే వేరుగా ఉంటుంది. ఇంటికి ముత్తయిదవతనం వస్తుంది అని కాని ఇప్పుడు ఇళ్ళల్లో నానమ్మ, తాతయ్యలు లేకపోవడం వలన పిల్లలకు కథలు, నీతులు చెప్పేవారు కరువయ్యారు అని ఆమె అనుకుంటుంది.

ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నమై వ్యక్తి కుటుంబాలుగా మారిన ఈ కాలంలో ఇంట్లో పెద్దవాళ్ళను ముసలివాళ్ళని వృద్ధాశ్రమాలకు పంపిస్తున్నారు. నిరాదరిస్తున్నారు. వలసలు, ఉద్యోగాల వల్ల ఎవరి బతుకులు వారివై పోతున్నాయి. నెలకు ఒకచోటికి ఉద్యోగంలో

ట్రాన్స్‌ఫర్ చేస్తే ఎలా వుంటుంది? పెద్దవాళ్ళను కొడుకులు పంచుకొని నెలకు ఒక ఇంట్లో వుండమంటే అలాంటిదే కాదా? అని సుగుణ ప్రశ్నిస్తుంది.

"అమ్మమ్మ నానమ్మ, తాత వంటి పెద్ద మనుషులు ఉంటే ఆ యిల్లు ఆ తీరే వేరు. పెద్ద మనుషులు యింట్లో ఉంటే యింటికి ముత్తయిదువ తనం వచ్చినట్టుంటది. ఇల్లు నిండుగ వుంటది. ఇల్లంతా పండుగ తీరుంటది. పెద్ద వాళ్లనుండి మనుమలు, మనుమరాళ్ళు ఎన్ని విషయాలు నేర్చుకుంటారో... పిల్లలు టి.వి. ధ్యాసలోపడి పాడయిపోతున్నారు. అమ్మను తప్పక తీసుకరావాలె. కమ్మని కథలెన్నో చెప్పించాలె."[1]

పెద్దవాళ్ళ నుండి చరిత్ర వారసత్వాన్ని ఎలా అందుకుంటారో సుగుణ ఇలా అనుకుంటుంది. "నానమ్మ రాట్నం వడుకుతుంటే చూడాలె. రాట్నం ఆముదం కందెనతో మెత్తగా జుమ్మంటుండేది. దారం కండెగా కదురుకు చుట్టుకుంటూ వడుకుతున్న పోగు వెంటదారం ఏకు దాకా జుమ్మంటూ నాదం చేస్తుంటే ఎంత మధురంగా ఉండేదో.

రాట్నం వడుకుతుంటే వీపు మీంచి నానమ్మ మీద వేలాడి చూస్తూ ఉంటే... దారం వడుకుతున్నదే పోగు దొడ్డు వస్తున్నది. లెవ్వె పోరి అని ప్రేమగా విసుక్కుం టుంటే... నానమ్మ చెమట ఎంత కమ్మని వాసన."[2]

తన శోభనానికి నానమ్మ ఎంతో కష్టపడి నూలు వడికి దుప్పటి నేయించి ఇస్తే ఆయన ఛీ గంజి వాసన అని తీసిపారేస్తుంటే సుగుణ మనస్సు కలుక్కుమంది. శాలోల్ల ఇండ్లలో ఉండే పుల్లని గంజి వాసన, తడిసిన నూలు వాసన ఎంతో కమ్మగా ఉంటుందని అది గంజి వాసన వస్తుందా, ఆ వాసన చూస్తే ప్రాణం లేచివచ్చినట్టు ఉంటుంది అని ఆమె అనుకుంటుంది. కాని ఇప్పుడు ఆ చేనేత మగ్గాలు లేక అందరు శాలోల్లు పొట్ట చేతితో పట్టుకొని వలసలు వెళ్ళిపోయారు అని ఆమె అనుకుంటుంది.

సుగుణ నాన్న మిల్లు బట్టతో పోటీపడలేక సాదా మగ్గాలతో కాదని సట్టర్ మగ్గాలు చేయించాడు. బట్టమీద డిజైన్లు రావడానికి ఎన్నో ఉపాయాలు చేశాడు.

"తాత ఓసారి నానమ్మను ఏమాయెనే కండెలు అందియ్యవూ అని పంటెతోని కొట్టిండట. నానమ్మ పిల్లల్ని సగవెట్టుకుంట అలికి వంట చేసుకుంట కండెలు వడుకాలె. వీపుల దెబ్బదాకి "నీ యింట్ల పీనుగెల్ల ఆడ్సిపడ్డల(అకస్మాత్తుగా) ఎంత దెబ్బగొడ్తివి" అని అదే పంటె(నూలుచుట్టేది) దీస్కొని తాతను రెండు ఈడ్చి కొట్టిండట. ఇక అప్పట్నించి తాతది మాట బెదురే తప్ప చెయ్యి లేపలేదట."[3]

ఆలోచనలో బస్సు గమ్యం చేరి సుగుణ దిగాల్సిన స్థలం వచ్చింది. వెంటనే తేరుకొని బస్సు దిగి చేతిలో లగేజి పట్టుకొని ఇంటికి చేరుకునే తోవలో నడుస్తుంటుంది. తోవలో ఒక గుంపు నిశ్శబ్దంగా ఉంటుంది. మరలా ఎవరూ చనిపోలేదు కదా! అని సుగుణ

మనసులో శంకిస్తుంది. వాళ్ళు దగ్గర చుట్టాలే, వాళ్ళ కూతురు ఎవరితోనో లేచి వెళ్ళిపోయిందట అనే విషయం సుగుణకు తెలుస్తుంది. కట్నం ఇవ్వలేక, ఉపాధి లేక కూతురు పెళ్లిని చేయలేకపోతున్నందుకు ఆ కూతురు ఎవరితోనో లేచిపోతున్నట్టు అందుకు ఎవరు బాధపడద్దని ఉత్తరం రాసిపోయినట్టు తెలుస్తుంది. సుగుణను మేనకోడలు సుజాత చూసి ఎదురొస్తుంది. సుజాత మొహంలో నానమ్మే కనిపిస్తుందని మురిసిపోతుంది సుగుణ.

నానమ్మలా కనిపించిన మేనకోడలు సుజాతకు తాను నగలు చేయించుకొని రాకపోతినని మనసులో విలవిలలాడుతుంది సుగుణ. మేనత్త సూట్కేసు తీసుకొని మేనకోడలు సుజాత ఇంటికేసి దారితీసింది అనే వాక్యంతో 'నానమ్మ' కథ ముగుస్తుంది.

2.2 రాత్రిపూలు

'రాత్రిపూలు' కథలో ప్రమీల అనే ఒక చెల్లెలు, రమేష్ అనే అన్నయ్య ఉంటారు. చెల్లెలు ఆసుపత్రిలో తుదిఘడియల్లో వుంటుంది. తాను చనిపోతుందని ప్రమీలకు తెలుసు. ఆమెకు జీవిత చరమాంకంలో అనేక విషయాలు గుర్తుకు వస్తాయి. అన్నయ్య తమ కుటుంబం కోసం, సమాజం కోసం చేసిన త్యాగాలు ప్రమీలకు అన్నయ్య పట్ల అపారమైన గౌరవాన్ని కలిగిస్తాయి.

హాస్పటల్లో చెల్లెలుకు సేవలు చేస్తూ మంచం పక్కనే కూర్చున్న రమేష్, ప్రమీల మధ్య సంభాషణ రూపంలో కథ సాగుతుంది. అన్నయ్య జీవితం, తన జీవితం ఇలా ఎందుకయ్యాయని వివేచిస్తుంది. హాస్పటల్లో కాలం కోసం ఎదురు చూడడంతప్ప చేసేదేమీ వుండదు. అందుకని చెల్లెలు అన్నయ్యను ఎన్నో విషయాలు అడిగి తెలుసుకుంటుంది. తన జీవితంలో అంతదాకా అన్నయ్యకు ఎదురు పడి ప్రశ్నించడం తెలియని ప్రమీల చివరి ఘడియల్లో ధైర్యం తెచ్చుకుంటుంది. అన్నయ్యకు సూచనలు చేయాలనుకుంటుంది. అందరిలాగా అన్నయ్య తిరిగి జీవించాలని కోరుకుంటుంది. అప్పటికే రమేష్ అన్నయ్య బతుకుపొద్దు పడమటికి వంగిపోయింది. అన్నా, చెల్లెల్ల సంభాషణలో దశాబ్దాల వారి జీవిత పరిణామాలు చోటుచేసుకుంటాయి.

రమేష్ అన్నయ్య ఏవో కొన్ని భావాల్ని ఏర్పర్చుకొని పని చేస్తుంటాడు. రమేష్ యవ్వనంలో వున్నప్పుడు 'రాజ్యం' అనే అమ్మాయిని ప్రేమిస్తాడు. కాని రాజ్యం అతని ప్రేమను నిరాకరిస్తుంది. నిజానికి రమేష్ తన ప్రేమను సరిగ్గా వ్యక్తం చేయలేదు. తన పట్ల ప్రేమను బాగా వ్యక్తం చేసిన తాను ఇష్టపడిన వ్యక్తిని రాజ్యం పెళ్ళి చేసుకుంటుంది. ఎందుకో రమేష్ పెళ్ళి చేసుకోకుండా వుండిపోతాడు.

"అన్నయా! రెండు నెలలుగా మంచంలోపడి చావు అంటే ఏమిటో తెల్సుకున్నాను. నాకిపుడు నా గురించి బాధలేదు. నా మనస్సు చాలా ప్రశాంతంగా ఉంది. నీ కన్నా

చాలా చిన్నదాన్ని. కాని ఒక్కటి అడుగుతాను. ఈ క్షణంలో నీవు చనిపోతావని తెల్సింది. ఏం చేస్తావు? ఇపుడు అదే చేయి. నీ త్యాగం, నీ భావాలు నిన్ను నీవు శిక్షించుకోవడంగా పరిణమించకూడదు కదా!"

నీ భావాల వల్ల ఎంతో నష్టపోయావు అని ప్రమీల అంటుంది. కాని దానికి సమాధానంగా ఏమీ అనలేక, నేను జీవితంలో ఏమీ నష్టపోలేదు అని అంటాడు రమేష్ అన్నయ్య. తాత్విక అంశాలను అన్నాచెల్లెల్లు లోతుగా చర్చిస్తారు. ఎవరి వాదన వారిదే సబబుగా వున్నట్టు భావిస్తారు. రమేష్ అన్నయ్య చెల్లెలుకు ఇలా జవాబిస్తాడు.

"ప్రమీ! నేను చాలా కోల్పోయానని, జీవితాన్ని నష్టపోయానని ఎందుకు బాధపడ్తావు. అది నీ దృష్టి... నేను కోల్పోయిందానికన్నా పొందిందే ఎక్కువ. మీ ప్రేమ నేను చేసిందానికన్నా ఎన్నో రెట్లు ఎక్కువ." నేను జీవితాన్ని ఓడిపోలేదని, ఉన్నతమైన జీవితాన్నే గెలుచుకున్నాననే తృప్తినైనా నాకు మిగల నివ్వు".

"అన్నయా! అంత మాటంటే నిన్ను ఏమీ అడగను". అన్నయ్య కళ్ళల్లోకి సుదీర్ఘంగా చూసి కన్నీళ్ళు పెట్టుకొంది ప్రమీల. కనురెప్పలు మూత పడ్డాయి. చెంపమీదుగా సన్నని ధార మగతగా ఒరిగింది. ఏవేవో జ్ఞాపకాలు...

తనకు నచ్చని త్యాగాలను చూసి మనిషి అసూయ పడ్తాడా? ఆ అసూయ జాలి, సానుభూతి రూపంలో వ్యక్తమవుతుందా! మొదటిసారిగా ప్రమీలకు సందేహం కలిగింది. రమేశ్ అన్నయ్య కుటుంబం కోసం చాలా చేశాడు. సమాజం కోసంకూడా చాలా చేశాడు. రక రకాల ఉద్యమాల్లో తిరిగాడు. ఎన్నో ఉద్యమాలు తానే ముందుండి నడిపాడు. ఉద్యమం ఒక నిర్మాణ రూపం తీసుకోగానే క్రమంగా నాయకత్వ పోటీ నుండి తప్పుకునేవాడు. పోటీ పడ్డం అతని స్వభావం కాదు. పోటీ నుండి తప్పుకోవడం అతని సహజ లక్షణమైపోయింది. పోటీ నుండి తప్పుకొని తనదైన దారిలో కొత్త దారి వేసేవాడు.

'రాజ్యం'ను ఈ పోటీలో గెలుచుకోవడం యిష్టం లేదు. పోటీపడి గెలుచుకోవడం నామోషి అన్పించింది. తన ప్రేమను, యిష్టాన్ని ఉదాసీనతగా మార్చుకున్నాడు. రాజ్యం తన ప్రేమను వ్యక్తం చేయలేకపోయింది. పైగా 'అన్నయ్య' ప్రేమించడం మానేశాడని గొణిగింది. తప్పు పట్టింది. పోటీపడి ప్రేమిస్తున్న లక్ష్మణ్ను ప్రేమించానంది. పెళ్ళి చేసుకుంది. అప్పట్నుంచి పోటీపట్ల, పోటీపరీక్షల పట్ల ఆసక్తి పోయింది. అనుకో కుండా వచ్చిన ఉద్యోగాన్ని సరిపెట్టుకుని అందర్నీ యింతవారిని చేశాడు.

అన్నయ్య మాటలు గుండెలోతుల్లో మళ్ళీ మళ్ళీ ప్రతిధ్వనిస్తున్నాయి. ఎంతసేపు నిద్ర పోయిందో. రాత్రయ్యింది. మగతగా మెల్లగా కళ్ళు తెరిచింది. అన్నయ్య అలాగే

చూస్తున్నాడు. చెల్లి కళ్ళుతెరవడంచూసి నవ్వాడు. చెల్లెలు మళ్ళీ ధైర్యం తెచ్చుకుంది.

"అన్నయ్యా... చెల్లెలు పెళ్ళయ్యేదాక పెళ్ళి చేసుకోనన్నావు. నా పెళ్ళయి పోయింది. మళ్ళీ చిన్నచెల్లెలు పెళ్ళి అన్నావు. దాని పెళ్ళీ అయిపోయింది. దానికీ యిద్దరు పిల్లలయ్యారు. నిన్ను అడగడానికి అందరికీ భయమే. అసలు నువ్వెందుకు పెళ్ళి చేసికోవడం లేదు అన్నయ్యా!"

"ప్రమీ! పెళ్ళే జీవితానికి పరమార్థం అనుకోను".

"ఈ చెల్లెల్ల పెళ్ళిళ్ళు, పురుళ్ళు, కట్నాలు, ఖర్చుల కోసం అని నీవు పెళ్ళి చేసికోవడం మానేశావు".

రాజ్యం తన ప్రేమను నిరాకరించి నందుకు అన్నయ్య పెళ్ళి చేసుకోలేదేమోనని చెల్లెలు ప్రమీల భావిస్తుంది. అదే మాట అన్నయ్యను అడుగుతుంది. అది కొంత నిజమే కాని అదే మొత్తం కారణం కాదని రమేష్ అన్నయ్య చెల్లెలు ప్రమీలకు వివరిస్తాడు. నిజానికి అతడు కుటుంబం కోసం, సమాజం కోసం తన జీవితాన్ని అంకితం చేసి పెళ్ళిని వాయిదా వేశాడు. తన త్యాగాన్ని తాను అలా చెప్పుకోవడానికి కూడా సిద్ధంగా లేని త్యాగపురుషుడు రమేష్ అన్నయ్య. ఆ విషయం చెల్లెలు ప్రమీల గమనిస్తుంది. అందుకే అన్నయ్య తమ తప్పు క్షమించమన్నట్టు ఇప్పుడు ఈ వయసులో పెళ్ళి చేసుకోమని కోరుతుంది.

"అన్నయ్యా! మా కోసం నీవు చాలా చేశావు. నా పెళ్ళి అయిన వెంటనే పెళ్ళి చేసుకుంటాను అని అన్నావు. కానీ, నా పెళ్ళి ఆ తరువాత చెల్లిపెళ్లి అయిపోయింది. కానీ నీవు పెళ్ళి చేసుకోవడానికి ఇష్టపడటం లేదు. ఇంక నీవు చేసిన త్యాగాలు చాలు, నీ త్యాగం, నీ భావాలు నిన్ను శిక్షిస్తున్నట్టుగా ఉన్నాయి"[4] అని ప్రమీల అంటే దానికి సమాధానంగా..

"ప్రమీ జీవితం అంటే ఏమిటి! బతుకంతా గడిచాక ఈ ప్రశ్న వేసుకొని ఏం లాభం? బతికినంతకాలం ఈ ప్రశ్నే ఎదురుకాదు. ఇదో విచిత్రం"....

"అన్నయ్యతో అంతగా వాదించడం యిదే మొదటిసారి. బహుశ చివరిసారి కూడా! అనుకుంది ప్రమీల. చూపుతిప్పుకుంది. కిటీకిలోంచి ఆకాశంలో చుక్కలు రాత్రిపూలలా మిలమిల మెరుస్తున్నాయి. "అన్నయా! నేను జీవితంలో అమ్మతనం సాధించాను. ఈ జీవితానికి యిది చాలు". తృప్తిగా కళ్ళు మూసుకుంది ప్రమీల. రమేష్ ఆత్మీయంగా తలపై చెయ్యితో నిమిరాడు."[5] అని కథ ముగుస్తుంది.

ఇలా అన్నా చెల్లెలు హాస్పటల్ ప్రశాంత వాతావరణం చివరి ఘడియలు, జీవిత చరమాంకాల్లో జీవితం పట్ల జీవితం అంటే ఏమిటి, ఏం సాధించాము, ఎలా జీవించాము అనే ప్రశ్నల తాత్వికత లోతుల్లో కథ కూడా ఎంతో పెద్ద కథను చిన్న కథగా మలిచారు.

2.3 బతుకుపయనం

'బతుకుపయనం' కథ హైదరాబాద్‌లోని కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన బిడిఎల్‌లో సైంటిస్ట్‌గా పని చేస్తున్న శివరాజం చంద్రమౌళికి ఫోన్ చేయడంతో ప్రారంభమవుతుంది. శివరాజం కూతురు కోసం సంబంధాలు వెతుకుతున్నారు. బంగుళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా పని చేస్తున్న పిల్లవాడి వివరాలు కొన్ని తెలుసుకొని చంద్రమౌళిని ఆ సంబంధాన్ని, తన కుటుంబాన్ని చూసి రమ్మని కోరతాడు.

"....పిల్లవాడు బెంగుళూర్లో సాఫ్టువేర్ యింజనీర్‌గా పని చేస్తున్నాడు. మ్యారేజీ బ్యూరోలోంచి బయోడాటా రాసు కొచ్చిన. పిల్లవానితోటి ఫోన్లో మాట్లాడిన. ఈ సంబంధం సెటిల్ అయ్యేట్టు కనపడు తున్నది. వాళ్ళకు కట్నం మీద కూడా పెద్ద పట్టింపులు లేవన్నరు. అమ్మాయికి స్టేట్స్ లో సాఫ్టువేర్ యింజనీర్‌గా పనిచేసే అర్హత లుంటే చాలు అని అన్నరు.

అతడు వితిన్ వన్నియర్‌ల స్టేట్స్‌కు పోయే అవకాశం ఉందట. మీ నేటివ్ అక్కడే గద. మీరొకసారి పోయి పిల్లవాని ఫ్యామిలీ బ్యాగ్రౌండ్ తెల్సుకుంటే మన దివ్య గురించి ప్రొసీడవుదాం". బీడియల్‌ల్లో సైంటిస్ట్‌గా పని చేస్తున్న శివరాజం ఫోన్లో అరగంట నుంచి చంద్రమౌళిని మళ్ళీ మళ్ళీ బతిమాలుతున్నాడు."[6]

లెక్చరర్ చంద్రమౌళి రామేశం అనే మరో స్నేహితునితో జగిత్యాలలో సంప్రదింపులు జరిపి వరుని వివరాలు రాబడతాడు. ఆ పిల్లవాని పేరు రవిప్రకాశ్. బెంగుళూర్‌లో సాఫ్టువేర్ ఇంజనీర్‌గా పని చేస్తున్నాడు. వాళ్ళది మగ్గం నేసే పద్మశాలిల కుటుంబం. అతని చెల్లెల్లు బీడీలు చేస్తుంటారు. తమ్ముడికి, చెల్లెల్లుకు పెళ్ళి చెయ్యాల్సిన బాధ్యత రవిప్రకాశ్‌దే. అందరి ఆశలు అతనిపైనే. జగిత్యాలలో రామేశంకు తెలిసిన, మరో స్నేహితుడు కోళ్ళ ఫారం నడిపించుకునే గంగాధర్ వాళ్ళ అన్నయ్య కొడుకే రవిప్రకాశ్.

రామేశం చంద్రమౌళిని వెంట తీసుకొని సైకిల్ మోటర్‌పై వాళ్ళ వూరు బయలుదేరతాడు. రవిప్రకాశ్‌కి పెళ్ళి చూపులు చూస్తున్నారా అని అడిగితే, ఇంకా అంతదాకా రాలేదు అని గంగాధర్ చెప్తాడు. అదేం అట్లా అని రామేశం అడుగుతాడు దానికి సమాధానంగా.

"ఏం చెప్పాలెసార్ వానికత? తల్లిదండ్రులు, తమ్ముడు, చెల్లెండ్లు అందరికి వాడొక్కడే పెద్ద దిక్కాయె. వాని సదువు కోసం పైసలు గావాల్నని బిడ్డలను ఏడో తరగతికే సదువు బందు పెట్టిచ్చి బీడీలు చెయ్యి పెట్టిన్రు. వాడు అమెరికావోయె లెవల్‌కు ఎదిగితే చెల్లెండ్లను కనీసం టీచర్లకన్నా యియ్యలె గద. ఏడో తరగతి పిలగాండ్లను ఈ కాలం టీచర్లు ఎవలు మెచ్చుతరు తానంత చదివిన పిల్ల గావాలంటారు. అందుకని కట్నం ఎక్కువ యిచ్చయినా

టీచర్లను చూడాలె అని వాని తపన. వాని బుద్ధి మంచిదేగాని పెండ్లయినంక యిద్దరి సంపాదన ఏడెనిమిదేండ్లు దాక ఇంటికే ఖర్చుపెట్టాలె అని అంటే ఈ కాలం ఆడ పిల్లలు ఎవలు వింటారు? పిల్లకన్నా ముందు ఆ పిల్ల తల్లిదండ్రులే మెచ్చుతలేరు. నేత శాలోనింటికి పిల్లనిచ్చుడే మహా ఎక్కువ అని ఏదో పిల్లగాడు బెంగుళూర్లోనో, అమెరికాలోనో ఉంటాడు. అల్లుడు, బిడ్డ మంచిగ సుఖంగా ఉంటారు అనుకుంటే ఈ గంపెడు సంసారం ఎల్లదీసుడా? అంటూ ఏ సంబంధం ఎట్లా ఎత్తిపోయిందో వివరించాడు గంగాధర్."[7]

అని గంగాధర్ చెప్తాడు అంటే ఒక పేద కుటుంబంలో ఉన్న ఆ అబ్బాయి ఆదర్శాలు ఇక్కడ మనకు కనిపిస్తాయి. చంద్రమౌళికి ఆశ్చర్యం వేస్తుంది. అంత పట్టుదలతో, ఆదర్శాలతో వున్న పిల్లవాడి పట్ల ముచ్చట వేస్తుంది. మరింత ఆసక్తి పెరుగుతుంది. తన కూతురు ఫోటో, బయోడేటా తీసుకొస్తే బాగుండేదని కూడా అనుకుంటాడు.

గంగాధర్ కోళ్ళఫారం నుండి బయల్దేరి అన్నా, వదినల ఇంటికి వస్తారు. తొవలో చాలా ఇళ్లు పాడుబడి వుంటాయి. వారంతా ఇల్లు వదిలేసి వలసపోయి ఎక్కడో స్థిరపడ్డారు. ఒక ఇంటివాళ్లు జగిత్యాలలో వ్యాపారంలో బాగా ఎదిగారు. ఆ ఇల్లు లక్ష్మీగల ఇళ్లు అని ఆ ఇంట్లో దీపం పెట్టడానికి ఎవరికైనా అమ్ముదామని అనుకుంటారు. పశువుల కొట్టానికి ఇస్తే రెండు లక్షల రూపాయలు వస్తాయి. కాని 25వేలకైనా సరే ఒక ఇంటివాళ్లు వుంటూ దీపం పెట్టుకునే వారికి మాత్రమే అమ్ముదామని అనుకుంటారు. అలా ఆ వూర్లో ఇల్లు కొనుక్కునే వారు లేక అది పాడుపడుతుంది. ఇలాంటి గ్రామీణ సమాజం శిథిలమవుతున్న తీరును చంద్రమౌళి, రామేశం గమనిస్తారు. అలా ఎందుకు జరుగుతుందో అడిగి తెలుసుకుంటారు.

ఇంటికి చేరగానే ఎవరో వచ్చారని పొరుగింట్లో వున్న చెల్లెల్లు ఇంటికి పరుగున వస్తారు. తల్లి వచ్చిన వారికి చాయ్ చేసిస్తుంది. కొడుకు గురించి అతని అభిప్రాయాల గురించి తల్లిదండ్రులను వాకబు చేస్తారు. వారు కూతుర్ల వైపు చూస్తారు. కూతుర్లు సంతోషంగా ఫీలవుతారు. దాంతో తల్లిదండ్రులు సరేనంటారు. అక్కడినుండే చంద్రమౌళి బెంగుళూరుకు రవిప్రకాశ్‌కు ఫోన్ చేసి అన్ని విషయాలు తెలుపుతాడు. సంబంధం ఖాయమవుతుంది. లీవు ఎక్కువ దొరకకపోవడం వల్ల పెళ్ళి తొందరతొందరగా ముగిస్తారు. తల్లిదండ్రులు పెళ్ళి కాగానే కొడుకు, కోడలు హానీమూన్ వెళ్ళడం అసంతృప్తిగా ఫీలవుతారు. జీవితంలో ప్రవేశిస్తున్న ఈ కొత్త పద్ధతుల గురించి రామేశం వారిని ఇలా సముదాయిస్తాడు.

"మనచిన్నప్పుడు పది పదిహేనేండ్లకే లగ్గాలైనై. పండుగు పండుగుకు అల్లుడు బిడ్డ అటు ఇటు తోల్కపోవుడు, తోల్కచ్చుడు ఉంటుండే. అట్లా సుట్టరికం, మనుషులు పరిచయం అవుదురు. పాతపడుదురు. ఇప్పుడు పెద్దపెరిగినంక పెండ్లిండ్లు గావట్టె.

గందుకని పిల్లా, పిల్లగానికి పరిచయాలు పెరగాలని గిట్ల కొద్దిరోజులు హానిమూన్‌కు అని పంపిస్తున్నరు. అంటే పెండ్లయినంక ప్రేమించుకొనుడు అన్నమాట. మీ బిడ్డ పెండ్లికి మేమందరం లేమా!"[8] అని సముదాయించాడు రామేశం.

రవిప్రకాశ్ అవకాశం రావడంతో అమెరికాలో సాఫ్టువేర్ ఇంజనీర్‌గా చేరి పని చేస్తుంటాడు. ఆ తరువాత వాళ్ళ చెల్లెల్లకు, తమ్ముడికి కూడా చక్కని సంబంధాలు చూసి పెళ్ళి చేస్తాడు. చెల్లెల్లకు మంచి సంబంధాలు వెతకాలని భారీ కట్నం ఇచ్చి టీచర్లకు ఇచ్చి పెళ్ళి చేస్తాడు. ఈ పెళ్ళిళ్లను తల్లిదండ్రులు పూర్తిగా సంతృప్తి పడే విధంగా నిదానంగా జరుపుతారు. ఆ సందర్భంగా తెలంగాణలో పెళ్ళిళ్లు ఎలా జరుగుతాయో, ఎన్ని కార్యక్రమాలు పెళ్ళికిముందు, పెళ్ళికి తర్వాత కూడా కొనసాగుతుంటాయో కళ్ళకు కడతాయి. రవిప్రకాశ్ తమ్ముడు లారీ ట్రాన్స్‌పోర్టులో సేటు అవుతాడు.

తర్వాత రవిప్రకాష్ తల్లిదండ్రులు కూడా అమెరికా వెళతారు. విమానంలో అమెరికా వెళుతుంటే మేఘాలమీదుగా విమానంలో ప్రయాణం వారికి దేవలోకం వెళుతున్నట్టుగా అనిపిస్తుంది. అమెరికాలో కొడుకు, కోడలు పెద్ద ఇల్లు, కారు అన్నీ కొనుక్కుంటారు. వారికి పుట్టిన కూతురు అమెరికా పౌరురాలిగా నమోదయిందని తెలిసి తల్లిదండ్రులు ఆశ్చర్యపోతారు. అది వారిఊహకు అందదు. ఒకరోజు అలాంటి సాఫ్ట్‌వేర్ ప్రొఫెషనల్స్ దంపతులు ఒక కొత్త సంస్థను తామే స్వయంగా ప్రారంభించాలని చర్చిస్తుంటారు. అందులో చంద్రమౌళి లెక్చరర్ కూతురు, అల్లుడు కూడా వుంటారు. సాఫ్ట్‌వేర్ కంపెనీ ప్రారంభించడం ద్వారా తమ బావలను కూడా అమెరికాకు పిలిపించుకోవచ్చని రవిప్రకాశ్ ఆలోచిస్తుంటాడు. తల్లిదండ్రులు కూడా తమ అల్లుళ్లను, కూతుర్లను అమెరికాలో ఏదో ఒక పనిమీద పిలిపిస్తే బాగుండని కోరుకుంటారు. ఇలా తల్లిదండ్రులు తమ పిల్లలు అందరు సమానంగా, మంచిగా బతకాలని కోరుకుంటారు. సంస్థను ఎలా ప్రారంభించాలో, అంత రిస్కు తీసుకోవడం అవసరమా అని చర్చ సాగుతోంది.

"అంతలో ఫోన్ మ్రోగింది. రిసీవర్ అందుకుంది దివ్య. అవతలినుండి చంద్రమౌళి. మాటల్లో దివ్య తమ ప్రతిపాదన చెప్పింది. అంకుల్‌ను సూచనలడిగింది. చంద్రమౌళి ఎంతో సంతోషపడిపోయాడు. అందరికి వినపడేట్లుగా స్పీకర్ ఫోన్ నొక్కింది దివ్య.

"మాకు వెనకటి కాలంలో టీచర్ ఉద్యోగం దొరకడమే గగనంగా వుండేది. మీ జనరేషన్లో కొందరైనా స్టేట్స్ పోగలిగారు. మిమ్మల్ని, మీ ఉత్సాహాన్ని చూస్తుంటే నాకు లాలాలజపతిరాయ్, గాంధీ, నెహ్రూ, అంబేద్కర్, ఎ.కె.రామానుజం, సర్వేపల్లి రాధాకృష్ణన్ గుర్తొస్తున్నారు. 150 ఏళ్ళ క్రితం నుండి వాళ్ళకు యితర దేశాలకు వెళ్ళే అవకాశాలు వచ్చాయి. అలాంటి అవకాశాలు యిప్పుడు మీకు వస్తున్నాయి. మీ జీవితం యిపుడే మొదలైంది. ఇక ఉన్నత శిఖరాలకు ఎదగడం మీ సంకల్ప బలాన్ని బట్టి, ఉత్సాహాన్ని

బట్టి వుంటుంది. బిల్‌గేట్స్‌కు ఎవరు చెప్పారు ఎదగాలని? సత్యం, ఇన్ఫోసిస్ రామలింగరాజు, నారాయణ మూర్తి గారలకెవరు చెప్పారు? గుమాస్తా జీవితాన్ని ప్రారంభించిన రిలయన్సు అంబానీకి ఎవరు చెప్పారు ఎదగాలని? అనాథగా పుట్టిపెరిగిన ఫోర్డ్‌కు ఎవరు చెప్పారు ఎదగాలని? అంతా సంకల్పబలం. పట్టుదల, నిరంతర కృషి. విశ్వవిజేత అలెగ్జాండర్ ఒక మాటన్నాడు. గెలవదలుచుకున్నవారికి ఈ ప్రపంచం చాలా చిన్నది అని. నేను ఇంతకన్నా కొత్తగా, అదనంగా చెప్పడానికేమీ లేదు. మీరు ఎంతగా ఎదిగితే అంతగా సేవచేసే అవకాశం ఉంటుంది. ఈ విషయం మాత్రం మర్చిపోవద్దు. బెస్టాఫ్ లక్"[9] అన్నాడు చంద్రమౌళి.

సాధించిన దాంతో సంతృప్తి చెంది ఆగిపోకూడదని సాధించిన దాన్ని స్థిరపరచుకొని అక్కడి నుండి మరిన్ని లక్ష్యాలు, ప్రణాళికలు వేసుకొని తాను ఎదుగుతూ తన తోటివారిని ఎదిగించడానికి సహకరించడానికి నిరంతరం ముందుకు సాగడమే 'బతుకుపయనం'లో జీవిత లక్ష్యంగా వుండాలని ఈ కథ సందేశం.

ఒక పేద పద్మశాలి కుటుంబంలో జన్మించిన ఒక అబ్బాయి పట్టుదలతో బతుకుపయనాన్ని సాగించి అమెరికా పౌరసత్వం పొందడం అనేది ఈ బతుకుపయనంలో సాగే కథ. మరియు కుటుంబంలో ఒక్కడు చదువుకుంటే మొత్తం కుటుంబం యొక్క జీవన స్థితిగతుల్ని మార్చేసిన తీరు ఈ కథలో వాస్తవికంగా చిత్రించారు. ఎందరో విద్యార్థులకు, యువకులకు తాము కూడా ఎదగవచ్చు అనే ఆత్మవిశ్వాసాన్ని, ధైర్యాన్ని కలిగిస్తుంది ఈ కథ.

2.4 ప్రశాంతం

'ప్రశాంతం' కథలో రాపోలు ఎల్లయ్య, అతని అల్లుడు లక్ష్మణ్ రెండు తరాల జీవితాలు ఎలా గడిచాయో చివరికి జీవితమంతా ఆధారపడిన ఉద్యోగం, ఉపాధి కోల్పోవడంతో దిక్కులేని బతుకులుగా, చితికిపోయిన జీవితాలను చిత్రించారు.

రాపోలు ఎల్లయ్య తొలుత బొంబాయి బట్టల మిల్లులో సాంచాలు నడిపేవాడు. కూతురు పెళ్ళి కోసం డబ్బులు కావాలని రాజీనామా చేస్తే ప్రావిడెంట్ ఫండ్ చేతికి వస్తుందని స్వచ్ఛందంగా పదవీ విరమణ చేస్తాడు. అంతవరకు తిండి, గుడ్డకు ఇబ్బంది లేకుండా వారి జీవితం సాగిపోతుంది. తరువాత కూతురును అల్లుడు లక్ష్మణ్‌కు ఇచ్చి పెళ్ళి చేస్తాడు. ఇంతలో ఎల్లయ్యకు ఏ పని లేకుండా జీవిక కోసం హోటల్ పెట్టిండు. అదే సరిగా నడవలేదు. ఇంతులో రకరరకాలైన ఉద్యోగాలు చేస్తాడు, ఎందులోనూ స్థిరత్వం లేకపోవడం వలన అల్లుడు, కూతురు రమ్మంటే ఎల్లయ్య గోదావరిఖని వెళ్తాడు. అక్కడ కూడా కూతురు కాపురం అంతగా ఉండదు. అప్పుడు ఎల్లయ్య మనసులో దూరంగా ఉంటే కూతురు ఎంతో గొప్పగా ఉందేమో అని అనుకునేవాన్ని ఇప్పుడు దగ్గరగా

చూస్తున్నాను ఇలా ఉందా అని అనుకుంటాడు. అల్లుడి ఉద్యోగం కూడా పోతుంది. ఇది చూసి ఎల్లయ్య తట్టుకోలేక మరల ఇంటి ముఖం పడ్తాడు.

"జగిత్యాల డివిజన్‌లోని కొడిమ్యాల మండలం దగ్గర పల్లెటూరు ఎల్లయ్యది. పచ్చని చెట్లు, అడవి, ఊల్లె ఉండుడు అలవాటైతే మల్ల ఏవూరికి పోబుద్ధికాదు. తెల్లారిలేసి వాల్లతోని వీల్లతోని ముచ్చటవెట్టి అంబటాల్లకు ఈతచెట్లల్లకు పోయి వాడకం కల్లుతాగుడు. ఇంటికచ్చి ఇట్ల ఎంతకాలమని కూసుండి తినుడు? చిల్లర పనులు చేసుకుంట పొట్ట కెల్లదీసిండు. కొడుకు పెండ్లి చేసిండు. వాల్లిచ్చిన కట్నం పెండ్లికర్చులకే సాల్లేదు.

మనుమలు, మనుమరాండ్ల పురుల్లు చేసిండు. వెయ్యి రెండువేల చొప్పున అప్పులు పెరగవట్టె. ఎల్లయ్యకు వయస్సు పెరుగుతున్నకొద్దీ వేరే బాధ్యతలు పెరుగుతున్నయి. మల్లా ఏదో ఒకపని చేయక తప్పలేదు. చేద్దా మంటే సొంత ఎవుసం లేదు. నాగలి లేదు. ఎడ్లు లేవు.

ఇంటిముంగన్నే ఇంత చాయె హోటల్ పెట్టిండు ఎల్లయ్య. అది కల్సిరాలేదు. ఉద్దెర లెక్కో అయినయి. పెట్టువడి లేకుంటైంది. ఇగ లాభంలేదని మల్ల భీవండికి పోవుడు సాతగాదని సిరిసిల్లలో పవర్‌లూం కార్మికుడిగా పనిలో చేరిండు.

సిరిసిల్ల భీవండి కన్ననయమే. అక్కడి తీర్గ పాయిఖానాకు లైను, పొట్టకు తినేకాడ లైను, పండుకునేకాడ లైను కట్టుడులేదు. మంచి చల్లనిగాలి వెలుతురు...పాణం హాయిగ అన్పించింది. కానీ సిరిసిల్లలో కరెంటు సరిగ్గా ఉండది. కరెంటు సరిగ్గా ఉంటే నేసే భీములు సరిగ్గా వుండయి. పని సరిగ్గా వుండది. పని సరిగ్గా ఉంటే కూలి సరిగ్గా ఉండది.

ఏదో నడుస్తాందిగదా...పదిరోజులకోసారి ఇంటికి పోయిరావచ్చు. మనుమలు, మనుమరాండ్లను కొడుకు కోడలు అందర్ని చూసుకోవచ్చు అనుకుని తృప్తి నింపుకున్నడు ఎల్లయ్య.

పని సరిగ్గా నడవకపోయినా పెద్దగ బాధనిపించలేదు. పనిలేన్నాడు బస్సెక్కి ఇంటి కచ్చిపడు. అక్కడి కష్టమంత మర్చిపోవు. ఇంటికాడ నికార్సయిన ఈత కల్లు దొరుకు. అది తాగితే కమ్మటి నిద్ర... ఇట్ల చేసీ చెయ్యక ఇంత పొట్టకు నడిపిస్తండు ఎల్లయ్య."[10]

ఒకరోజు ఎల్లయ్య పనిచేసే సిరిసిల్ల పవర్‌లూమ్ యజమాని ఆత్మహత్య చేసుకుంటాడు. దాంతో అతనికి పనిలేకుండా పోతుంది. కొంతమంది పవర్‌లూమ్ కార్మికులు కూడా పని దొరకక తిండికిలేక ఆత్మహత్యలు చేసుకుంటారు.

ఎల్లయ్య వియ్యంకుడు కూడా మట్టిపని చేసే వాడు, ఈ ప్రొక్లెయిన్స్ రావడంతో చేయటానికి పని లేకుండా పోయింది అని వాపోతాడు. ఇంతలో అల్లుడు లక్ష్మణ్ ఏ పని లేకుండా, ఊర్లో చెట్లకింద, చెరువులు దగ్గర కూర్చొని ఏవేవో ఆలోచించుకుంటూ

ఉంటాడు. భోజనం సమయానికి వాళ్ళ అబ్బాయి వచ్చి పిలిస్తే భోజనం చేసి వస్తాడు. మరల ఏవో ఊహల్లో ఉంటాడు.

"దసరాపండుగకు అల్లుడు, బిడ్డ, వియ్యంకులు, కొడుకు, కోడలు, మనుమలు, మనుమరాండ్లతో ఎల్లయ్య పాతఇల్లు నిండిపోయింది. ఎన్నాళ్ళకో ఆ ఇల్లు ఆనందంతో కళకళలాడింది. అది ఎన్నో రోజులు మిగలలేదు.

అల్లుడు లక్ష్మణ్ బాధపడ్తూ విషయం చెప్పిండు. అతన్ని కంపెనీలో డాక్టర్లు అన్‌ఫిట్ అన్నరని చెప్పిండు. స్వచ్ఛంద పదవీవిరమణ తీసుకో మన్నరట.

నన్నొక యంత్రంతీరు వాడుకొని వదిలేసుడేనా? నాకిచ్చిన జీతం ఎప్పటికప్పుడు ఖర్చుయిపాయె. కాళ్ల చేతులు కూలవడ్డంక ఎట్ల బతుకుడు? పిల్లలను ఎట్లా చదివించుడు. మల్ల ఏం పని చేసుడు. ఇప్పుడు కొత్తగా మల్ల ఏం పని నేర్సుకునుడు? లక్ష్మణ్ అనడంతో దసరాపండుగకు కళకళలాడిన ఆ ఇల్లు తెల్లారే చెన్నబోయింది.

కుక్కకున్న విశ్వాసం ఆ కంపెనీకి కార్మికుల మీద లేదు. గింత అన్యాయమా? ఎల్లయ్య కూతురు విమల తలబాదుకుంది. "మనుషులకు పనిలేకుంట చేసే యంత్రాలు వస్తే మనుషులు ఏంపని చేసుకొని బతకాలె బావా?" అంటూ ఎల్లయ్య వియ్యంకుడు వీరయ్య ఎల్లయ్యనే అందుకు కారకుడైనట్టు నిలేసిండు."[11]

ఒక సందర్భంలో ఎల్లయ్య అల్లుడు లక్ష్మణ్ ఏ పని లేకపోవడం వలన కట్టెలు కొట్టడానికి అడవికి వెళ్తాడు. కట్టెలు కొట్టినంతసేపు రాని ఫారెస్ట్ ఆఫీసర్ కట్టెలు సైకిల్‌పై తీసుకుపోతుండగా వచ్చి అడ్డగించి పైసలు ఇమ్మంటాడు. పైసలు లేవని ఆ సైకిల్ అక్కడే ఉంచి వెళ్ళిపోతాడు.

అలాగే ఏ పని లేకపోవడంచేత ఒక రోజు చేపల వేటకై వెళ్తే, ఆ పట్టిన చేపలు తెస్తుండగా దారిలో బెస్తవాళ్లు ఆ చేపలు తీసుకొని పోతారు. ఈ ప్రకృతి ఎంత అందమైనదో, ఈ పల్లె ఎంత ప్రశాంతమైనదో...కాని ఇందులో తనకేమి చెందదు. ఈ గాలి కూడా తన దవునోకాదో...ఈ చెట్లు చేమలు పక్షులు చేపలు పొలాలు చెరువులు ఏవీ తనవి కావు. ఈ పల్లెను ఎట్లా ప్రేమించాలె. ఈ పల్లెల ఎట్ల వుండాలె. ఇన్నాళ్ళు ఆ ఉద్యోగం తనది అనుకున్నడు. ఆ ఉద్యోగం పోయింది. ఉద్యోగ భద్రతకూడా పోయింది. తనకు జీవితంలో మిగిలిందేమిటి? ఈ పాత ఇల్లొకటేనా?

ఎల్లయ్యకు అల్లుని స్థితి చూసి ఏం చేయాలో తోచలేదు. తన కండ్ల ముందే ఎదిగిన కొందరి జీవితాలు...శిథిలమై విధ్వంసమవుతున్న సమాజం.... లక్ష్మణ్ భార్య విమలలో దుఃఖం. ఆమె ఏడుపులో ఒక నిర్వేదం.... ఇల్లంతా విధ్వంస చిహ్నాలకు బదులుగా విషాదం ప్రశాంతంగా చిక్కగా పరుచుకుంటున్నది."[12] అని కథ విషాదాంతమవుతుంది.

దేశంలో జరుగుతున్న ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ, విపరీతమైన యాంత్రీకరణ వల్ల ఉపాధి కోల్పోతూ శిథిలమవుతున్న లక్షలాది కుటుంబాలకు ప్రతీక 'ప్రశాంతం' కథలోని జీవితాలలోని విషాదం.

2.5 జైలు జీవితం

'జైలు జీవితం' జైలు జీవితాన్ని వర్ణిస్తుంది. జైల్లోకి ఎలా ఎందుకు పంపబడతారో, గ్రామాల్లో నిర్బంధాలు ఎలా చీకటి రాజ్యాన్ని తలపిస్తాయో, జైలు అంటే భయపడనవసరం లేదని జైలు గురించి భయపడే వారికి తెలుపుతుంది.

ఎలాంటి విపత్కర పరిస్థితుల్లోనైనా ఎదురొడ్డి పోరాడాలని తెలుపుతూ సాగే ఇతివృత్తం. తెలంగాణ ప్రాంతంలోని జైలు స్థితిగతులు, పరిస్థితులకు అద్దం పట్టే సారమే 'జైలుజీవితం'.

రవి అనే ఒక వ్యక్తి జైలుకెళ్ళి సంవత్సరం కావస్తుంది. ఆయన స్నేహితుడు రవిని చూడ్డానికి జైలుకెళ్తాడు. అక్కడ జైలు ముందు ఒక ఖైదీ భార్య అతని తల్లి అతన్ని కలవాలని ఎదురు చూస్తుంటారు. ములాఖత్‌కు ఇంకా అనుమతించలేదు. అక్కడ కలిసిన మిగతా వారితో తమ గోడు వెళ్ళ బోసుకుంటారు. తమ కొడుకును ఎలా చిత్రహింసలు పెట్టారో, కుటుంబాన్ని ఎలా నాశనం చేశారో, దొంగ కేసు పెట్టి ఎలా జైల్లో వేశారో చెప్తూ తిట్టిన తిట్టు తిట్టకుండా ఎవరెవరినో తిడ్తున్నది. "ఇటు ప్రక్క ఒక తల్లి ఏడుస్తున్నది. నా కొడుకు ఏం జేసిండని జైల్లో వెట్టింద్రు. వాళ్ళ సావుగాను, వాళ్ళ దినాలుగాను వాళ్ళను జెల్ది దుబ్బగడ్డకు వెట్ట. వాళ్ళ వంశం నిర్వంశంగాను. వాళ్ళింట్ల నరుప్పలుపుట్ట అని శాపనార్థాలు పెడుతోంది"[13] ఒక తల్లి.

ఈ విషయాలు అన్నీ గమనిస్తున్నాడు రవి స్నేహితుడు. జైల్లో జీవితాలను బయట ప్రపంచానికి సంబంధం లేకుండా దూరంగా ఉండాలి అని రవి మనసులో అనుకుంటాడు. ఆ పల్లెటూరి తల్లిని, భార్యని అనాథలు చేసి జైలుకి వెళితే, ఇక్కడ వీళ్ళ పరిస్థితి ఏమిటనే విషయం మనకు తెలుస్తుంది. అలాగే వాళ్ళ భర్త మీద అన్యాయంగా కేసు బనాయించి జైల్లో పెట్టారని వారు ఏడుస్తుంటారు. రవి స్నేహితుడు ఇవన్నీ చూసి తాను, ఎప్పుడూ రాని ప్రదేశానికి వచ్చానని జైలుకు వెళ్ళి పరామర్శించడమే పెద్దనేరంగా భావించుకొని ఆ స్నేహితుడు రవి దగ్గరకు వస్తాడు.

రవిని వాళ్ళ స్నేహితుడు చూడగానే బాగున్నావా అని పలుకరిస్తాడు. దానికి సమాధానంగా రవి ఓ బాగున్నాను, నా కసలు జైలు వదలి రాబుద్ధి కావడం లేదని సమాధానం వస్తుంది. దానికి ఆ స్నేహితుడు ఆశ్చర్యపోతాడు. అప్పుడు రవి ఇలాగని అంటాడు. నాకు జైల్లో ఎంతో బావుంది. నేను ఇక్కడ రెండు నవలలు, 10 కథలు

రచించాను. వందల పుస్తకాలు చదివాను. అదే నేను బయట ఉంటే ఇన్ని పనులు చేసే వాడిని కాదు అని చెప్తాడు. ఇక్కడ నోటు పుస్తకాలు, పెన్నులు అన్నీ ఇస్తారు. నాకు ఇక్కడే బావుంది అని అంటాడు.

జైల్లో ఉన్న మేము మీకు జైల్లో ఉన్నట్టు కనిపిస్తాము కానీ, మా వైపు నుంచి గాని మిమ్మల్ని చూస్తే మీరే జైల్లో ఉన్నట్టు కనిపిస్తున్నారు. అంటే బయట ప్రపంచంలో, ప్రశాంతత లేకుండా ఒక సరయినటువంటి క్రమశిక్షణ విధానం లేకుండా ఎవరి బ్రతుకు వారు ఏదోలా బతికేస్తున్నారు. కానీ, నాకు బయట ప్రపంచమే ఒక జైలులాగా కనిపిస్తుంది అని రవి అంటాడు.

గాంధీ, నెహ్రూ మొదలైన వారందరు జైలుకెళ్ళిన వారే. గొప్ప గొప్ప పుస్తకాలు జైల్లోనే రాయబడ్డాయి అని రవి చెప్తుంటే వాళ్ళ స్నేహితునికి ఆశ్చర్యం వేసింది, జైలంటే భయపడే రవేనా ఇలా మాట్లాడింది అని.

ఇక్కడ జైల్లో ఉన్న వాళ్ళకి సమయానికి భోజనం పెడతారు, బయట తినడానికి తిండిలేని వాళ్ళకు ఈ జైలులో కాస్తా చోటు దొరికితే బాగుండు అని రవి స్నేహితుడు అనుకుంటాడు. అంటే ఇక్కడ కనిపించని ఒక భౌతికవాద తత్వం కనిపిస్తున్నది. పేదవాళ్ళకు చేసుకోవటానికి పనుల్లేవు. తినడానికి తిండిలేదు. కానీ ఈ జైల్లో సమయానికి భోజనం పెడతారు. ఇంకా కావలిస్తే ఏదో పని చెబుతారు.

"ఒకసారి ఇద్దరు పోలీసులు వచ్చి కల్లు, గుడాలు, మాంసం కావాలని వండించుకుని తిన్నరు. తరువాత దీన్ని చెర పట్టాలనుకున్నరు. ఇది భయపడి బయటికి వచ్చి కొడుకుకు చెప్పి నేను ఇంట్లకు పోను అని ఏడ్చింది".

"ఏమీ చేయలేక ఎవరికీ చెప్పుకోలేక నేను, కొడుకు, కోడలు ఏడ్చి ఏడ్చి అక్కడే బయట ఉన్నం. ఒక పోలీసోడు 'కూర వడ్డిద్దువు రా' అని కోడలును ఇంట్లోకి రమ్మని పిలిసిండు. కొడుకు నేను వస్తా పా అని అంటే నువ్వెందుకురా అని ఆమెనే రమ్మని బలవంతం చేసిండు. కొడుకు అప్పుడు ఎదురు తిరిగిండు. దాంతోటి కొడుకును కొట్టి దీన్ని ఇంట్లకు గుంజుకుపోయిన్రు. ముసల్దాన ఎవరూ రాకుండా ఇంటి ముంగట కావలి ఉండు అని బెదిరించిన్రు. ఇట్ల ఎన్ని అవస్థలు పడ్డా కొడుకును జైలుకు పట్టిచ్చిన్రు" ఆ ముసలి తల్లి ఏడుసున్నది."అట్లా మర్లపడ్డ తరువాత కొడుకును అడ్డం రాకుండా చేయాలని పోలీస్ స్టేషన్లవేసి పదిరోజులు బాగా కొట్టి చిత్రహింసలు పెట్టి జైలుకు పంపించిన్రు. తర్వాత డ్యూటీ పేరిట వచ్చుకుంట ఎవరెవరో దీన్ని పాడు చేసిన్రు. రెండుసార్లు దిగతాగించినంక దీని పానం తెర్లయిపోయింది. ఒకసారి బాధ భరించలేక ఎదురు తిరిగితే ఎన్‌కౌంటర్ చేస్తా అని బెదిరించిన్రు.

"చచ్చిపోయినా మంచిగుండు కాని చచ్చిపోతే వీడు జైళ్ళకెళ్ళి బయటికి వచ్చుడెట్ల" అని గోడుగోడున ఆ తల్లి ఏడుస్తున్నది. కోడలుకూడా ఏడుస్తున్నది. ఆ తల్లి ఏవో పండ్లు అప్పాలు పేగులో మూట గట్టుకుని వచ్చినట్లున్నది. ఆ మూట వాళ్ళకు చూపిస్తున్నది. మనసంతా ఎలాగో అయిపోయింది. ఇది నా చుట్టూతా ఉన్న ప్రపంచమేనా? నా చుట్టూ ఉన్న పల్లెల్లో ఇన్ని ఘోరాలు జరుగుతున్నాయా? నేను మరో లోకంలోకి వచ్చినట్టు అనిపించింది."[14]

పేదల బతుకుల్లో తిండిలేక, పనిలేక వారు పడే కష్టాలు ఇందులో మనకు కనిపిస్తాయి. ఈ విశాల విశ్వం అంతా కూడా ఒక జైలులాంటిది అనేటటువంటి ఒక స్ఫురణ మనకు వస్తుంది. ఎందుకంటే అందరికీ భద్రత భోజనం, బయట ప్రపంచంలో లేకపోయినా సరే, జైల్లో అవన్నీ సమకూరుతున్నాయి. జైల్లో ఏ భయం ఉండదు అని, అందుకే ఈ విశ్వం అంతా ఒక జైలులాగా మారితే ఎంత బాగుండు అనిపిస్తున్నది. అని ముగుస్తుంది కథ. అలా జైలును చూసి భయపడే వాళ్ళు జైలును ఎలా ప్రేమిస్తారో, ఎందుకు ప్రేమిస్తారో కథలో చిత్రించారు.

2.6 ఇంటల్లుడు

ఇంటల్లుడు పెద్దకొడుకుతో సమానం. పెద్దకొడుకు తండ్రి తర్వాత తండ్రంత అని కథ ఒక సూత్రీకరణతో ప్రారంభమవుతుంది. చాలామంది అల్లుడి పట్ల వ్యతిరేకంగా ఆలోచిస్తారు. నిజానికి జీవితంలో అల్లుల్లు చేసే త్యాగాలు, కర్తవ్యాలు ఎన్నో వుంటాయి. అవి ఏమిటో రవీంద్ర పాత్ర ద్వారా చిత్రించారు.

మిట్టపెల్లి రవీంద్ర అనే ఒక కుర్రవాడు కష్టపడి చదువుకొని పైకొస్తాడు. ఆయన ఒక హైస్కూల్ అసిస్టెంటుగా ఉద్యోగం చేస్తుంటాడు. రవీంద్రకు పద్మావతి అనుకూలమైన భార్య లభిస్తుంది. పద్మావతి తల్లిదండ్రులకు ఆమె మొదటి సంతానం. రవీంద్రకు పెళ్ళి అయినపుడు వాళ్ళ అత్తగారి కుటుంబం చేనేత బట్టలు నేస్తూ బాగానే ఉండేది. ఆ తరువాత రవీంద్ర వాళ్ళ అత్తగారి కుటుంబం కాలక్రమేణ చేనేత బట్టలకి గిరాకి తగ్గిపోవడం చతికిలబడింది. కొంతకాలం రవీంద్ర వాళ్ళ మామయ్య ఛాయ్ హోటల్ పెట్టాడు. అదీ నడవకపోయేసరికి, ఏవేవో రోగాలతో ఆయన చనిపోయాడు.

ఇంటికి పెద్దల్లుడు రవీంద్ర కాబట్టి ఆ తరువాత ఆ కుటుంబం బాధ్యత అంతా రవీంద్ర మీద పడింది. రవీంద్ర హైస్కూల్ టీచర్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. ఆ జీతంతో ఎలాగోలా రెండు కుటుంబాల్ని నడిపించుకొస్తుంటాడు. పద్మావతి చెల్లెలకు సంబంధం వస్తుంది. అందుకుగాను రవీంద్రను సహాయం చేయమంటారు. ఈయనకు సహాయం చేయాలని ఉన్నాసరే అప్పటికే బాధ్యతలు, అప్పులు తడిసిమోపెడవుతాయి.

అయినాసరే తప్పని పరిస్థితిలో ఉంటాడు రవీంద్ర. వాళ్ళ చినబావమరిది శేఖర్‌ని

కూడా రవీంద్రే చదివిస్తాడు. టీచర్ ట్రైనింగ్ చేసి, వాళ్ళ క్లాస్‌మేట్ అమ్మాయితో పెళ్ళి చేసుకొని వెళ్ళిపోతాడు. తల్లిని, చెల్లిని శేఖర్ రమ్మనడు, వద్దనలేదు. అందువల్ల ఆ బాధ్యత అంతా పెద్దల్లుడుగా రవీంద్ర మీద పడింది.

రవీంద్ర కష్టపడుతూ తమ్మున్ని, చెల్లెల్ని చదివించాడు. ఆ చెల్లెలకు కూడా పెళ్ళి చేస్తాడు. ఇంతలోనే పద్మావతి చెల్లెలకు పెళ్ళి కుదరడం వలన పద్మావతి ఇంట్లో పెద్దవాళ్ళందరు ఆ బాధ్యతని తనను ఎత్తుకోమంటారు. అప్పుడు పద్మావతి మీరు ఇంతమంది ఉన్నారు కదా! మనిషి తలో కొంత డబ్బు సర్దితే బాగుంటుందని చెప్తుంది.

"రవీంద్ర ఎంతో కష్టపడుతూ తమ్ముణ్ణి, చెల్లెల్నీ చదివించాడు. రవీంద్ర చెల్లెలు నవ్య టీచరుగా పనిచేస్తుంది. గత యేడాదే రవీంద్ర చెల్లెలి పెళ్లి చేసాడు. ఆడబిడ్డ పెళ్ళి కాకుండా తన చెల్లెలు పెళ్ళి గురించి అడిగితే బాగుండదని పద్మావతి ఊర్కొంది. ఆ పెళ్లి అప్పుకు ఎత్తిన చిట్‌ఫండ్ వాయిదా కిస్తులు ఇంకా రెండేళ్లదాకా కట్టాల్సి ఉంది. పద్మావతికి ఆ విషయం తెలుసు. అందుకే ఎటూ చెప్పలేకపోతున్నది."[15]

అప్పుడు వాళ్ళ కుటుంబంలోని వారందరు కూడా తలో పిడికెడు ఏదోలా సాయం చేసి పద్మావతి చెల్లలకు ఎలాగోలా పెళ్ళి చేస్తారు. ఏదోకొంత అప్పు చేసి చెయ్యడం వలన, రవీంద్రకు బాధ పట్టుకుంటుంది.

ఇంతలో రవీంద్ర పెద్ద బావమరిది కూడా వాళ్ళ అబ్బాయిని రవీంద్ర వాళ్ళ ఇంటిదగ్గర ఉంచి చదివించమంటాడు. దానికి రవీంద్ర ఏమి అనాలో తోచదు. అందుకు వాళ్ళ బావమరిది నిందలు వేస్తాడు. నా తమ్ముడుకు, చెల్లెలకు, చదివించి పెళ్ళిళ్ళు చేశావు. నాకు ఏమి చేయలేదు. కనీసం నా కొడుక్కి చదివిస్తే బాగుంటుంది అని ఆయన అంటే కాదనలేక రవీంద్ర భార్య భర్తను ఒప్పించి ఆ అబ్బాయిని కూడా చదివిస్తారు.

అప్పుడు పెట్టిన చెయ్యి ఊరికే ఉండదని పద్మావతి తల్లి మురిసిపోతుంది.

పరిశ్రమలు పెరిగి చేతివృత్తులు, కులవృత్తులు మూల పడిపోయాయని, రైతులు కూడా ట్రాక్టర్లను, ప్రొక్లెయినర్‌లను కిరాయికి తీసుకొని వ్యవసాయం చేయడం వలన కూలీలకు పని దొరకకుండా పోతుంది అని బట్టల మిల్లులు, చెప్పుల కంపెనీలు రావడం వలన పల్లెటూళ్ళలో పాతకాలపు మనుషులు ఏ పని చేసుకొని బతకాలి అని ఆవేదన చెందే కాలంలో కాస్త జరుగుబాటు వున్న కుటుంబాలు ఎలా సహకరించాలో ఈ కథ ద్వారా చిత్రించారు.

చేతివృత్తులు పోవడం వలన చదువుకోలేనటువంటి పల్లెటూరి వాళ్లకి పనులు దొరకడం లేదని ఇవన్నీ గుర్తు చేసుకొని అందరూ కూడా నిస్సహాయంగా మిగిలిపోయే దుస్థితి. అయినప్పటికీ ఈ కథను సుఖాంతంగా ముగిస్తారు. 'ప్రశాంతం' కథలో ఆదుకునే

వారు ఎవరూ లేకపోతే జీవితాలు ఎలా విషాదంత మవుతాయో చెపుతూ కాస్త సహకరించే వాళ్లుంటే వాళ్లు కూడా ఎలా ఎదుగుతారో సూచిస్తూ ఎదిగిన వారి కర్తవ్యాలేమిటో 'ఇంటల్లుడు' కథలో వివరిస్తారు రచయిత.

2.7 జీవనయానం

'జీవనయానం' ఒక పెద్ద కథ లేదా నవలిక అని చెప్పవచ్చు. కథ కన్నా నవలిక అనడమే సరైనది. ఎందుకంటే అందులో వున్న పాత్రలు, సంఘటనలు, సన్నివేశాలు, మలుపులు, భావజాల చర్చలు, ప్రేమలు, పెళ్ళిళ్లు మొదలైనవి కథ నిర్మాణాన్ని అధిగమించాయి. ఇవన్నీ కలిసి ఒక నవలకు వుండే లక్షణాలను సంతరించుకున్నాయి. నిజానికి రచయితే ఒక చోట చెప్పినట్టు అచ్చు వేసే వారుంటే, రాయగలిగే ఓపిక వుంటే పెద్ద నవల కావాల్సిన జీవన చిత్రణ 'జీవనయానం'లో కన్పిస్తుంది. సామాజిక, ఆర్థిక, రాజకీయాల పరిణామాల్ని చర్చిస్తూ కథ ప్రారంభమవుతుంది.

"ప్రఖ్యాత ఫ్రెంచి సామాజిక అర్థ శాస్త్రవేత్త ప్రసంగం వినాలని విక్రాంత్ పట్టుపట్టి ఎంతో మేలు చేశాడు. అమర్త్య సేన్ సంక్షేమ అర్థశాస్త్రం కన్నా క్యాపిటల్ - సోషల్ ఎకానమీ (పెట్టుబడి - సామాజిక అర్థశాస్త్రం) ఎంతో సమగ్రంగా ఉంద నిపిస్తోంది. ఇది సోషలిస్టు దృక్పథానికి దగ్గరగా ఉందనిపిస్తోంది." అంది ఉస్మానియా మెడికల్ కాలేజీలో మెడిసిన్ చదువుతున్న రాధ అరవింద్‌కేసి చూస్తూ.

అరవింద్ ఆరాధనగా రాధకేసి చూస్తూ నవ్వాడు. రాధను కల్సుకోవడానికి ఇదొక మంచి ప్రదేశం అని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్ బయల్దేరదీసింది అరవిందే. నీ వెంట నేనూ వస్తా అని లత వెంటపడితే ఎలాగోలా తప్పించుకున్నాడు అరవింద్. ఆమె తనను లైక్ చేస్తోందని తెల్సు, కాని అరవింద్ రాధను లైక్‌చేస్తాడు."[16]

తనతో ఉస్మానియా-మెడికల్ కాలేజ్‌లో మెడిసిన్ చదువుతున్న రాధను అరవింద్ ప్రేమిస్తుంటాడు. అరవింద్‌ను లత ప్రేమిస్తుంది. లతను అరవింద్ నిర్లక్ష్యం చేస్తుంటాడు. లత బాధపడుతుంటుంది.

అరవింద్ వాళ్ళది పేద కుటుంబం. తల్లిదండ్రులు చంద్రయ్య, దేవక్కలు చేనేత బట్టలు నేస్తుంటారు. వారు తమ బంధువైన నారాయణ సేటు వద్ద అప్పు తీసుకొని అరవింద్‌ను చదివిస్తుంటారు. అరవింద్‌కు దగ్గర బంధువైన విక్రాంత్ పీజీ చేస్తుంటాడు. విక్రాంత్ తల్లి, చెల్లెలు బీడీలు చేసి విక్రాంత్‌ను చదివిస్తుంటారు. అరవింద్, విక్రాంత్ మంచి స్నేహితులు. పదో తరగతి చదువుతున్నప్పుడు విక్రాంత్ చెల్లెలు సావిత్రిని అరవింద్‌కిచ్చి పెళ్ళి చేయాలని ఇరు పక్షాలు భావిస్తుంటారు. కానీ ఎమ్.సెట్‌లో డాక్టర్ కోర్సులో అరవింద్‌కు సీటు రావడంతో అందరూ ఆశ వదులుకుంటారు. అరవింద్

సావిత్రిని పెళ్ళి చేసుకోవాల్సి వుండె అనే మాటను కూడా మర్చిపోతాడు. తన కన్నా సంపన్న కుటుంబంలో పుట్టిన రాధను పెళ్ళి చేసుకోవాలని ప్రేమిస్తుంటాడు.

లత దళిత కుటుంబంలో పుట్టి కష్టపడి చదువుకొని డాక్టర్ సీటు సంపాదించుకొని వీరికి క్లాస్‌మేటు అవుతుంది. లత తల్లి మున్సిపల్ పారిశుధ్య కార్మికురాలిగా ఉద్యోగం చేస్తుంది. లత అన్న ఒక స్కూల్లో అటెండర్‌గా పనిచేస్తుంటాడు. తమ తల్లి మున్సిపల్ వర్కర్ అని చెప్పుకోవడానికి సిగ్గుపడకపోగా గర్విస్తుంది లత. ఆమె సామాజిక నేపథ్యం వల్ల అరవింద్ ఆమెని నిర్లక్ష్యం చేస్తుంటాడు. విక్రాంత్ ఇవన్నీ గమనిస్తుంటాడు.

నారాయణ సేటుకు నిర్మల అనే కూతురు వుంటుంది. ఆమెకు పెళ్ళి చేయాలనుకొని అరవింద్ డాక్టర్ కోర్సు చదువుతున్నాడని అతనికి ఇద్దామని అనుకుంటాడు. అరవింద్ తల్లిదండ్రులను కలిసి విషయం చెప్తాడు. వారు ఎంతో సంతోషిస్తారు. రాధను ప్రేమిస్తున్న అరవింద్ ఆ సంబంధం వద్దని నిరాకరిస్తాడు. తాను ఎమ్.సెట్ చదవడానికి అప్పు అడగడం కోసం వెళితే పెద్ద కోర్కెలు వద్దని డిగ్రీ చేసి టీచర్‌గా వెళితే మంచిదని సూచిస్తాడు. అప్పుడు పెట్టుబడి పెట్టి చదివించి తన కూతురునిద్దామని ఎందుకు అనుకోలేదు అని తల్లిదండ్రులను ప్రశ్నిస్తాడు. తల్లి అందుకు జవాబుగా పండిన దానికి ధర కడతారు. కాని కష్టపడి చదివించాలని అందుకు పెట్టుబడి పెట్టాలని ఎందుకు అనుకుంటారని అంటుంది. సామాజిక అర్థశాస్త్రం ఎంత సుళువుగా తల్లి చెప్పిందో విని అరవింద్ ఆశ్చర్యపోతాడు. సామాజిక అర్థశాస్త్రం తెలుసుకోవడానికి పెద్దపెద్ద శాస్త్రవేత్తలు చెప్పిందే కాదని జీవితం కూడా ఆ పాఠాలు నేర్పుతుందని అరవింద్ గుర్తిస్తాడు. ఇలా జీవితంలో సామాజిక, రాజకీయ, ఆర్థిక శాస్త్రాలు వాటి సూత్రాలు అడుగడుగునా ఎలా పని చేస్తున్నాయో గుర్తిస్తాడు. విక్రాంత్ అంతకన్నా ఒక మెట్టు ముందుంటాడు.

అరవింద్ రాధను ప్రేమించానని, నిర్మలను పెళ్ళి చేసుకోలేనని అంటాడు. తమ్ముడు ఆనంద్‌కు నిర్మలనిచ్చి పెళ్ళి చేసి తన పెట్టుబడితో నారాయణసేటు తమ్ముడిని పెద్ద సేటును చేయవచ్చు కదా అని అడగమని తల్లిదండ్రులకు చెప్తాడు. అలా చేయరు అని తల్లి చెప్తుంది. అయినా అడగమంటాడు. దాంతో నారాయణసేటు డాక్టరు కోర్సు చదవగానే మీకు ఎక్కడలేని గర్వాలు పెరిగినయి అని చిన్నంతరం, పెద్దంతరం చూడనక్కర్లేదా అని తిడతాడు. ఇలా కథంతా డబ్బు, సామాజిక హోదా అడుగడుగునా నిర్వహించే తీరు ఏమిటో తెలియజేస్తుంది.

రాధ తండ్రి ప్రభుత్వ ఉద్యోగంలో మంచి హోదాలో వుంటాడు. కమర్షియల్ టాక్స్ ఆఫీసరుగా పని చేస్తుంటారు. తన హోదానను సరించి కూతురుకు మంచి సంబంధం వెతుకుతాడు. తనకు అమెరికాలో వి.ఎల్.కాంట్‌తో పెళ్ళి సెటిలయిందని సంతోషంగా అరవింద్‌తో చెపుతుంది. అరవింద్ బాధపడిపోతాడు. రాధ కోసం లతను, నారాయణ

సేటు కూతురు నిర్మలను కూడా వదిలేసుకున్నానని రాధ ఇలా చేసిందని చాలా బాధపడిపోతాడు. రాధ అదేమీ గమనించదు. తన సంతోషంలో తానుంటుంది.

లత అరవింద్ తనను నిర్లక్ష్యం చేస్తున్నాడని గమనించి తన పేదరికం, సాంఘిక స్థితి రీత్యా మంచి సంస్కారం రీత్యా తనకు విక్రాంత్ చక్కని మ్యాచ్ అని భావిస్తుంది. డాక్టరు కాకపోయినా విక్రాంత్‌ను ఇష్టపడుతుంది. ఆ మాటే విక్రాంత్‌తో చెప్తుంది. విక్రాంత్‌తో పాటు వాళ్ళ వూరుకొచ్చి వాళ్ళ తల్లి, చెల్లెల్ని చూస్తుంది. వారితో కలిసిపోతుంది. విక్రాంత్ తల్లి కూడా లతను సొంత కూతురిలా ఇష్టపడుతుంది.

అరవింద్, విక్రాంత్, లత మిత్రులు కలిసి గోదావరి స్నానానికి ధర్మపురి వెళతారు. తన అంచనాలు అన్నీ తారుమారైనందుకు అరవింద్ గోదావరిలో లోతుకు వెళ్ళి ఆత్మహత్య చేసుకొనే ప్రయత్నం చేస్తాడు. ఎలాగోలా అతన్ని బతికిస్తారు.

నారాయణ సేటు కొడుకు శ్రీనివాస్ రాజకీయాల్లో తిరుగుతూ వ్యాపారం నిర్లక్ష్యం చేస్తాడు. తండ్రి సంపాదించినదంతా ఊడ్చుకుపోతుంది. తండ్రి అకస్మాత్తుగా మరణిస్తాడు. నిర్మల భర్తను కోల్పోయి ఇల్లు చేరి అనాథగా మిగిలిపోతుంది.

రాధ అమెరికా వెళ్ళిపోతుంది. అరవింద్ కోర్సు పూర్తి చేసి హాస్పటల్ ప్రారంభిస్తాడు. కొత్త జీవితం ప్రారంభమవుతుంది. హాస్పటల్‌లో లేడీ డాక్టర్‌గా నిజామాబాద్‌కు చెందిన అరుణ చేరుతుంది. అరవింద్, అరుణల మధ్య సాన్నిహిత్యం పెరుగుతుంది. అరవింద్ తల్లిదండ్రులు అరుణను కోడలుగా చేసుకుంటే బాగుంటుందని ఆశ పడుతుంటారు. అరుణ బ్రాహ్మణ కులానికి చెందినది. తండ్రి ఆ ప్రతిపాదనను వ్యతిరేకిస్తాడు. అక్కడ ఉద్యోగం మానేసి ఇంటికి రమ్మని పిలుస్తాడు. అరుణకు ఏం చేయాలో తోచదు.

రాధ, భర్త చనిపోవడంతో మరల ఇండియాకు వస్తుంది. ఒకరోజు లత రాధ వాళ్ళ ఇంటికి వెళుతుంది. ఇప్పటివరకు అరవింద్‌కు పెళ్ళి కాలేదు కాబట్టి వారిద్దరిని కలపాలని ప్రయత్నిస్తుంది. కానీ లత భర్త విక్రాంత్ లతతో ఇలాగంటాడు. అరుణ, అరవింద్ ఇప్పుడిప్పుడే దగ్గరవుతున్నారు కాబట్టి మరల కొత్తగా రాధను అరవింద్ జీవితంలోకి తీసుకొచ్చి గతం గుర్తు చేయవద్దని చెప్తాడు.

రాధ భర్త చనిపోయి ఇండియాకు చేరుతుంది. సావిత్రిని అరవింద్ తమ్ముడు ఆనంద్‌కిచ్చి పెళ్ళి చేస్తారు. అతడు మెడికల్ షాపు నడిపించుకుంటాడు. నిర్మల భర్త లెక్చరర్ ఎందుకో ఆత్మహత్య చేసుకుంటాడు. అతడు బాగా సున్నిత హృదయుడు. అలా నిర్మల ఇంటికి చేరుతుంది. ఏదో కడుపునొప్పితో నిర్మల హాస్పటల్‌కు వస్తుంది. వాతావరణ మార్పుకోసం రాధను హైదరాబాద్ నుండి తమ దగ్గరకు రమ్మని లత ఆహ్వానిస్తుంది. అలా రాధ, అరవింద్‌లు తిరిగి దగ్గరవుతారని భావిస్తుంది. అరవింద్‌కు రాధను చేసుకోవాలని

వున్నా తనను వదిలేసి వెళ్ళినందుకు బాధగా వుంది. నిర్మలను చూస్తే జాలి వేస్తుంది. తన దెబ్బతిన్న అహంకారంతో నిర్మలకు అన్యాయం చేశానేమోనని బాధపడుతుంటాడు. అరుణ తనను అరవింద్ పెళ్ళి చేసుకుంటాడేమోనని ఎదురు చూస్తుంది. ఈ ముగ్గురి మధ్య ఎవరిని పెళ్ళి చేసుకోవాలో తేల్చుకోలేక రోజుల తరబడి సతమతమవుతుంటాడు అరవింద్. మహిళలకు కేటాయించిన రిజర్వేషన్లలో అరవింద్ తల్లి దేవక్క మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఎన్నికవుతుంది. అరుణ తండ్రి ఎన్నికల్లో ఓడిపోయి దివాళా తీస్తాడు.

అరవింద్ అరుణల పెళ్ళి వేడుక ఘనంగా జరుగుతుంది. ఎవరూ ఊహించని విధంగా రాధకు ఎన్నికల్లో ఎమ్.ఎల్.ఏ. టిక్కెట్ వస్తుంది. రాధ తండ్రి తన పరపతితో టిక్కెట్ ఇప్పిస్తాడు. రాధ అందరి సహకారంతో నాలుగువేల ఓట్ల మెజార్టీతో ఎమ్‌ఎల్‌ఏగా గెలుస్తుంది. ఎమ్మెల్లేగా గెలిచిన రాధ జీవితాన్ని కూడా గెలుచుకుంటుంది. క్లాసుమేటూ, డైవోర్సీ అయిన డాక్టర్ రాజేశ్వర్‌తో రాధ పెళ్ళి అరవింద్ పెళ్ళికన్నా ఘనంగా జరుగుతుంది.

నిర్మలా! నీ పెళ్ళెపుడో! నవ్వుతూ అడుగుతుంది డాక్టర్ లత. నాకు రాధక్కలా నాన్న లేడు గదా! దారి చూపడానికి అని నవ్వుతుంది నిర్మల. ఆ నవ్వులో విషాదం. నాన్న నన్ను ఆనంద్ బావకిచ్చినా నా బతుకిలా అయ్యేది కాదని వాపోతుంది నిర్మల. నిర్మలా! గతం ఎపుడూ తిరిగిరాదు. గతాన్ని తలుచుకొని ఏడ్చి లాభంలేదు. గతాన్ని ద్వేషించి లాభం లేదు. ప్రస్తుతం ఏం చేయాలో గతం తాలూకు అనుభవాల్తో వర్తమానంలో నిలబడి వాస్తవికంగా ఆలోచించి గెలుచుకోవడమే జీవితం. ఇంకొన్నాళ్ళుపోతే నీకూతురే పెళ్ళికెదిగేట్టుంది. ఏం సాధించినా యింకో రెండుమూడేళ్ళలోనే సాధించుకోవాలి అని సముదాయిస్తుంది లత. నిర్మలక్కది తల్లి మనస్సు. అంటూ అభినందించింది అరుణ.[17]

ఇలా కథాంతంలో అందరి బతుకులు జీవితం గెలుచుకొని సుఖాంతం అయినప్పటికీ నిర్మల బతుకు విషాదంతంగానే కనపడుతుంది. మొదట్లో ఎదిగిన నిర్మల, నారాయణసేటు కుటుంబం చితికిపోవడం, కష్టపడి ఎదిగిన కుటుంబాల్లోంచి అరవింద్, విక్రాంత్ కుటుంబాలు ఎదగడంతో పాటు అందివచ్చిన అవకాశాలతో తల్లి దేవక్క మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఎన్నికకావడం, అరుణ తండ్రి దయాకర్‌రావు ఓడిపోవడం వంటి విషాదాలు, పరిణామాలు ఈ నవలలో విశ్లేషించారు. ఆ పరిణామాలకు గల కారణాలను కూడా ఈ నవలలో పాత్రల సంభాషణలో చదువరులకు అర్థమయ్యేట్టుగా చిత్రించారు. ఉదాహరణకు..

ఈ సమాజంలో పెళ్ళిళ్ళు "రెండు హోదాల మధ్య, రెండు ఉద్యోగాల మధ్య, రెండు వ్యాపారాల మధ్య, పెళ్ళిళ్ళవుతున్నాయే తప్ప, అవి రెండు హృదయాల మధ్య కాదు, కాదంటే కొందరు కాస్తపెద్ద హోదాతో పెళ్ళి చేస్తారు. అటువైపు నుండి హోదాను, ఉద్యోగాన్ని బట్టి కట్నం లాగుతారు"[18] అని చెప్తాడు విక్రాంత్. లత, రాధ, ఫెమినిజం గురించి కొత్త కోణంలో మాట్లాడతారు.

ఇలా కథ అంతా జరుగుతుండగా లత దగ్గర రాధ ఉంటూ, హాస్పటల్‌లో డాక్టర్‌గా చేరుతుంది. ఆ తరువాత కొద్దిరోజులు అయిన తరువాత కరీంనగర్‌లో సొంతంగా హాస్పటల్ నిర్మించుకుంటుంది రాధ. అందులో నిర్మల కూడా చేరుతుంది. ఆ తరువాత అరవింద్ తమ్ముడు రాజకీయాల్లో రాణిస్తాడు, విక్రాంత్ వాళ్ళ అమ్మ సక్కుభాయి కూడా మున్సిపల్ వైస్ ఛైర్మన్‌గా గెలుస్తుంది. అరుణ వాళ్ళ నాన్న ఎన్నికల్లో ఓడిపోతాడు. రాధ ఎన్నికల్లో ఎమ్.ఎల్.ఏ.గా గెలుస్తుంది. చేనేత కార్మికులుగా బట్టలు నేసేటువంటి అరవింద్ కుటుంబం యొక్క జీవన విధానం మొత్తం మారిపోతుంది.

విక్రాంత్, అరవింద్, వాళ్ళ స్వార్థాలు, వారు చూసుకొని, ఎక్కడో సిటీలో సెటిల్ అయిపోయినట్లయితే ఈ పేరు ప్రఖ్యాతలు ఇవన్నీ రావని. ఇంత కుటుంబాన్ని ఎక్కడో గెంజి వాసనలోనే ఉండేవారని వాళ్ళు చర్చించుకుంటారు. ఈ విధంగా జరిగిన కుటుంబ పరిణామాలు సామాజిక స్థితిగతులు, అవన్నీ వాటి యొక్క భూమిక మీదకి వచ్చి తరువాతి తరానికి ఒక మార్గదర్శకత్వం వహించేటట్లుగా కనిపిస్తుంది ఈ 'జీవనయానం' కథ.

2.8 బతుకుపయనం కథల్లో వస్తు వైవిధ్యం

బతుకుపయనం కథల్లో సామాజిక పరిణామాల్లో అనేక వైవిధ్యాలను, వైరుధ్యాలను, వస్తు వైవిధ్యంగా చిత్రించిన తీరు కనపడుతుంది. ఒక్కొక్క కథ, ఒక్కొక్క సామాజిక వర్గాల, శ్రేణుల, కులాల జీవిత పరిణామాలను, సంస్కృతిని తెలుపుతుంది. ప్రపంచంలో ఆదర్శంగా జీవించే జీవితాలు ఎలా వుంటాయో నమూనా పాత్రలు చిత్రించారు. అలా జీవించడానికి సమాజంలో సమకాలికులతో ఎదుర్కొంటున్న సంఘర్షణను అనేక కోణాల్లో తన కథల్లో నిక్షిప్తం చేశారు, విశ్లేషించారు. వృద్ధులను ఓల్డేజ్ హోంకు పంపించే సంస్కృతి వర్తమానంలో వృద్ధుల ప్రాధాన్యత ఏమిటో గుర్తించిన పాత్రల ద్వారా వృద్ధులను అపారమైన గౌరవంతో చిత్రించి వారిపట్ల వినమ్రతగా ఎలా వుండాలో ఆదర్శవంతంగా 'నానమ్మ' కథతో మనముందుంచారు.

'నానమ్మ' కథలో ఉమ్మడి కుటుంబాలు పోయి వ్యక్తి కుటుంబాలు వచ్చాక వృద్ధులు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్న సందర్భంలో వృద్ధుల అవసరమేమిటో, వారిచ్చే దానమేమిటో, సమాజానికి, కుటుంబానికి వారు ఎంత అవసరమో, యువతరాల వ్యక్తిత్వాలను వారు ఎలా తీర్చిదిద్దుతారో చిత్రించారు. 'రాత్రిపూలు' కథలో అన్నా చెల్లెల్ల అనుబంధం, కుటుంబం కోసం, సమాజం కోసం అన్న చేసే త్యాగాలు అక్షరీకరించారు.

'బతుకుపయనం' కథలో కులవృత్తుల నుండి కష్టపడి కొందరు చదువుకొని ఎదిగే క్రమంలో గ్లోబలైజేషన్‌లో అందివచ్చిన అవకాశాలను అందుకొని బెంగుళూరు నుండి అమెరికా దాకా సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా స్థిరపడుతున్న జీవితాలను విశ్లేషించారు.

'ప్రశాంతం' కథలో ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ వల్ల ఉపాధి కోల్పోయిన జౌళి

మిల్లు కార్మికులు, సింగరేణి కార్మికులు పేదరికంలోకి నెట్టివేయబడి వారి జీవితాలు అలాంటి సమాజం మొత్తం ఒక విధ్వంసానికి ఎలా గురవుతున్నదో దాని బాధితులుగా స్త్రీలు ఆ భారాన్ని ఎలా మోస్తున్నారో కళ్ళు చెమర్చేలా మనముందుంచారు.

'జైలు జీవితం'లో జీవితం జైలు కన్నా కష్టంగా వుందని జైలే ఎంతో సౌకర్యంగా వుందని, ప్రపంచం అంతా జైలులాగా మారితే ఎంతో బావుటుందని గ్రామాల్లో ఉద్యమించే కుటుంబాలపై అణచివేత, అత్యాచారాలు, నిర్బంధాలు ఎలా కొనసాగుతున్నాయో విశ్లేషించారు.

'ఇంటల్లుడు'లో సామాన్య వ్యవహారంలో అల్లుడు అంటే పీడించే వాడని వున్న భావాన్ని పటాపంచలు చేస్తూ అలాంటి వాళ్ళు చాలా తక్కువని నిజానికి ఇంటి అల్లుల్లు పెద్ద కొడుకుతో సమానమని అన్ని బాధ్యతల్లో అల్లుడు, కూతురు ఎలా వ్యవహరిస్తారో జీవితమంత వాస్తవికంగా చిత్రించారు.

'జీవనయానం'లో బీడీలు చేస్తూ, చిన్నచిన్న వృత్తులు చేస్తూ బతికే కుటుంబాల్లోంచి లెక్చరర్లు, డాక్టర్లు, మున్సిపల్ చైర్‌పర్సన్‌లు, వ్యాపార వేత్తలు ఎలా ఎదుగుతూ వచ్చారో, సమాజం కోసం, కుటుంబం కోసం వారు ఎలా సహకరించారో కుటుంబ వ్యవస్థలో, సమాజంలో ఫెమినిజం వల్ల కలిగిన ప్రయోజనాలు తమ చుట్టూతా సోషలిస్టు సమాజాన్ని నిర్మించుకునే ప్రయత్నం ఎలా సాగిందో చిత్రించారు.

'స్మృతి' కథల సంపుటికి చక్కని ముందుమాట రాసిన ప్రఖ్యాత రచయిత డా॥ కేతు విశ్వనాథరెడ్డిగారు ఈ కథల సంపుటిలో "సిద్ధాంతాలేవీ మానవత్వానికి మించినవి కావు" అనే శీర్షికతో 'మనభూమి' మాసపత్రిక ఆగస్టు-2005లో బి.ఎస్.రాములు గారిని చేసిన ఇంటర్వ్యూ ప్రచురించారు. అందులో విశ్వనాథరెడ్డి గారు బి.ఎస్.రాములు గారిని తాను పుట్టి పెరిగిన పద్మశాలీల జీవితాలను, సమస్యలను, సంస్కృతిని పూర్తిగా పట్టించుకోలేదని కొందరు అంటున్నారు. మీరేమంటారని సూటిగా ప్రశ్నించారు. బహుశా ఇలాంటి ప్రశ్నల ఒత్తిడి వల్లే బతుకు పయనంలోని కథల్లో పద్మశాలీల జీవితాన్ని చిత్రించారు. అలా చేనేత, పద్మశాలి కులాల జీవిత పరిణామాలను ఒక క్రమ పద్ధతిలో తెలిపే విధంగా 'బతుకు పయనం' కథల సంపుటి వెలువరించారు.[19]

ఇలా ఇందులోని ఏడు కథలు పలు వైవిధ్యపూరితమైన జీవితాలను, కోణాలను చిత్రించాయి. 'నానమ్మ' కథలో మూడు తరాల అనుబంధాన్ని చిత్రిస్తే 'రాత్రిపూలు', 'ఇంటల్లుడు' కథల్లో వర్తమానంలో త్యాగం చేస్తున్న త్యాగపురుషులను చిత్రించారు. 'ప్రశాంతం' కథలో అభివృద్ధి నుండి అధఃపాతానికి నెట్టివేయబడుతున్న లక్షలాది కుటుంబాల పరిణామాలు ఎలా వున్నాయో చిత్రించారు.

రష్యాలో సోషలిజం పడిపోయాక తమ చుట్టూ సమాజంలో సోషలిస్టు మానవీయ సంబంధాలను నెలకొల్పుకొనే ఆదర్శ జీవులను సమాజానికి ఆదర్శంగా 'బతుకుపయనం', 'జీవనయానం' కథల్లో చిత్రించారు. ఈ రెండు కథల్లో గెలువు, గెలిపించు అనే సూత్రంతో తాము ఎదుగుతూ ఇతరులకు సహకరించారు. 'బతుకుపయనం'లో సామాన్య నిరుపేదల నుండి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా, మున్సిపల్ చైర్‌పర్సన్‌లుగా ఎదిగిన క్రమాలను చిత్రిస్తే 'జీవనయానం'లో డాక్టర్లుగా, శాసనసభ్యులుగా ఎదిగే క్రమాన్ని చిత్రించారు. ఇలా ప్రతి కథ వైవిధ్య పూరితమైన జీవితాలను చిత్రించింది.

అన్ని కథల్లో ఒక ఏక సూత్రత కూడా వుంది. సామాజిక పరిణామాలే వీటిలోని ఏకసూత్రత. అన్ని కథలు కలిసి ఒక బృహత్తర నవలగా కూడా అనిపిస్తూ వుంటుంది. వైవిధ్యపూరితమైన వృత్తులు, కోణాలు ఈ కథల్లో చిత్రించారు.

పాదసూచికలు

1. 'బతుకుపయనం' కథలు - నానమ్మ; పుట : 12
2. పైదే పుట : 12
3. పైదే పుట : 13
4. 'బతుకుపయనం' కథలు - రాత్రిపూలు; పుట : 17
5. పైదే పుట : 17, 18
6. బతుకుపయనం ; పుట : 20
7. పైదే పుట : 22
8. పైదే పుట : 29
9. పైదే పుట : 36, 37
10. 'బతుకుపయనం' కథలు - ప్రశాంతం; పుట : 39
11. పైదే పుట : 42, 43
12. పైదే పుట : 45
13. బతుకుపయనం కథలు - జైలుజీవితం; పుట : 47
14. పైదే పుట : 48
15. బతుకుపయనం కథలు - ఇంటల్లుడు; పుట : 58
16. 'బతుకుపయనం' కథలు - జీవనయానం; పుట : 63
17. పైదే పుట : 115, 116
18. పైదే పుట : 75
19. పైదే పుట : 121, 122

బతుకు పయనం కథలు

చేనేత వృత్తి వారి జీవన చిత్రణ

చేనేత వృత్తి ప్రాచీనమైన వృత్తుల్లో ఒకటి. బుద్ధునికన్నా పూర్వకాలం నుండి చేనేత బట్టలు నేయబడుతున్నాయి. పత్తినుండి దారం వడికి పడుగు పేకలుగా, నిలువు, అడ్డం పోగులుగా బట్టను నేసే వారు. మొదట ఆకులతో, నారలతో నిలువు, అడ్డం అల్లిక ద్వారా తట్టలు, బుట్టలు, నార బట్టలు నేసే వారు. వనవాసం చేసినప్పుడు శ్రీరాముడు, సీత, లక్ష్మణుడు నార బట్టలు కట్టారని రామాయణంలో కనిపిస్తుంది. నారను ఇంగ్లీషులో ఫైబర్ అని పిలుస్తారు. ఇప్పుడు ఫైబర్‌తో రకరకాల వస్తువులు, బట్టలు తయారు చేస్తున్నారు. మేదరి వాళ్లు వెదురు బొంగు నారతో అనేక ఉత్పత్తులను తయారు చేస్తుంటారు. తడకలు, చేటలు, గంపలు, ఎడ్లబండిలోని పొడకలు, పరదాలు, నగిషీ వస్తువులు తయారు చేస్తున్నారు.

3.1 కుల వృత్తుల పరిణామం - సామాజిక నేపథ్యం

ఆదిమానవుల కాలంలో ఆకులు, చెట్ల బెరడులు, నారలు వస్త్రాలుగా ధరించే వారు. చాలాకాలం దాకా మానవులు అర్ధనగ్నంగానే తిరిగే వాళ్లు. వేటతో దొరికే జంతువుల చర్మాలను చదును చేసుకొని వస్త్రాలుగా మొలకు చుట్టుకునే వాళ్ళు. మంచుతో కప్పబడిన ధృవ ప్రాంతాల్లో ఎస్కిమోలు తోలుతో సంచుల్లాగా తయారు చేసుకొని అందరూ ఆ సంచిలాంటిదానిలోనే పడుకునే వాళ్ళు. శివుడికి వస్త్రం చర్మమే. నల్లజింక చర్మం చాలా విలువైనది, పవిత్రమైనదని దాన్ని సంస్కృతంలో 'కృష్ణాజినం' అని గొప్పగా భావించే వాళ్ళు. మునులు, ఋషులు, బ్రాహ్మణులు నల్లజింక చర్మానికి ప్రాధాన్యత ఇచ్చే వాళ్లు. అలా మలిదశలో తోలుబట్టలు వాడే వారు. తోలుబట్టల ద్వారా ఈగలు, దోమల బారినుండి, చలిబారి నుండి రక్షణ పొందే వారు. కాని అవి బిగుసుకుపోయి నడవడానికి కూర్చోవడానికి కాస్త ఇబ్బందిగా వుండేది. తోలును తరువాత ఆయుధాల్లో భాగంగా మార్చుకొని శరీరం నిండా అమ్ములపొదికి, మంచినీళ్ళు తీసుకురావడానికి రకరకాల రూపాల్లో సంచులుగా, కుండలుగా, కవచాలుగా మలుచుకున్నారు.

క్రీ.పూ. సుమారు రెండువేల ఏళ్ళ క్రితం పత్తి నూలు బట్టలు వాడకం మొదలైనట్టుగా చైనా, ఇండియా చరిత్రలో అక్కడక్కడ కనపడుతుంది. చైనాలో నూలు బట్టలను తొలుత

తయారు చేయడం నేర్చుకున్నారని కొందరు చరిత్రకారులు భావించారు. భారతదేశంలో కూడా వేల యేళ్ళ నుండి నూలు బట్టలను తయారు చేయడం, వాడడం జరుగుతున్నది. అలెగ్జాండర్ గ్రీకు దేశం నుండి భారతదేశంపైకి దండయాత్రగా బయల్దేరి రావడానికి దేశంలో తయారవుతున్న నాణ్యమైన సరుకులు, బట్టలు ప్రధాన కారణమని చరిత్రకారులు నిర్ధారించారు. గ్రీకు రాజులు రాజ్యవంశీకులు తోలుబట్టలు వదిలి నూలు బట్టలు ధరించడం గొప్ప సంస్కృతిగా స్వీకరించారు. గ్లాడియేటర్ అనే అలెగ్జాండర్ కాలం నాటి సినిమా కథలో ఆనాడు భారతదేశంలోని నూలు బట్టలే వాడారని ఆ ప్రకారం హైదరాబాద్‌లో నూలు బట్టలు కుట్టించి అమెరికాలోని హాలివుడ్‌లో తీసిన గ్లాడియేటర్ సినిమాలో ఉపయోగించారంటే భారతదేశం క్రీస్తుపూర్వం నుండి చేనేత బట్టలకు, పట్టుబట్టలకు ప్రసిద్ధి అని స్పష్టం.

భారతదేశంలోని స్వయంపోషక గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పేరిట కొనసాగిన 2000 సంవత్సరాలకు పూర్వం నుండి ఒక సామాజిక స్వయం సంపూర్ణ వ్యవస్థ కొనసాగుతూ వచ్చింది. దాన్ని ఒక రూపంలోకి సామాజిక వ్యవస్థగా మార్చడానికి కృషి జరిగింది. ఆ కృషి బుద్ధుని కాలం నాటికి క్రమంగా స్థిరపడుతూ వచ్చింది. అయినప్పటికీ ఆదివాసీ గణతెగల సమాజం, వ్యవసాయిక సమాజం సమాంతరంగా కొనసాగింది.

ఒకవైపు రాజ్యాలు, రాజధానులు, నగరాలు విస్తరిస్తుండగా గ్రామీణ వ్యవసాయిక స్వయంపోషక ఆర్థిక వ్యవస్థ, ఆదివాసీ గిరిజనుల గణతెగల వ్యవస్థ మరోవైపు సమాంతరంగా కొనసాగుతూ వచ్చాయి. నేటికీ అవి అలాగే అక్కడక్కడ కొనసాగుతూనే వున్నాయి. గణతెగల వ్యవస్థలో అన్ని వృత్తులు, ఆ తెగే స్వయంగా చేసుకునేది. క్రమంగా గ్రామీణ వ్యవస్థలో కొందరు నిపుణులు ఎదిగారు. కాలక్రమంలో కులాలు ఏర్పడ్డ తరువాత పద్మశాలీలు, దేవాంగులు వంటి అనేక కులాలు చేనేత బట్టలు నేయడం తమ కులవృత్తిగా, సాంప్రదాయక వృత్తిగా స్వీకరించి స్థిరపడ్డారు. అయితే మాలలు, మాదిగలు కూడా గణతెగల సమాజం లాగా ఊరి పరిసరాల్లో వున్నప్పటికీ స్వయం సంపూర్ణంగా, స్వతంత్రంగా వారి గూడాలు, వస్తుత్పత్తిని తామే తయారు చేసుకునే వారు. అలా ఎదిగిన వారి నుండి వారిలో నేత కాని అనే దళిత కులం ఇప్పటికీ కొనసాగుతున్నది.

గొల్లలు, యాదవులు ఉన్నితో వస్త్రాలు నేసే వారు. అవి ఎంతో మన్నికగా వుంటూ చలి నుండి, వాన నుండి రక్షించేవి. అయితే ఉన్నిలోని వెంట్రుకలు ఎప్పుడు గుచ్చినట్టుగా వుండడం వల్ల పత్తి నేత బట్టలకు మానవ సమాజం మారుతూ వచ్చింది. ఇలా తోలు, ఉన్ని, ఆకు అలము, నార, బట్టల నుండి పత్తి, నూలు బట్టలకు, పట్టు నూలు బట్టలకు సమాజం పరిణామం చెందుతూ వచ్చింది. శివుడి బట్టలు తోలు బట్టలు కాబట్టి ఆయన ఆదిమ సమాజానికి సంబంధించిన వ్యక్తి అని భావిస్తుంటారు. తొలుత వేదకాలంలో

జంధ్యంగా వుండే ఆభరణాన్ని తోలుతో తయారు చేసి ధరించే వాళ్ళు. తోలు వస్త్రాలను వదిలేసి నూలు బట్టలకు మారే క్రమంలో దాని గౌరవ చిహ్నంగా, సంస్కృతి చిహ్నంగా తోలును జంధ్యంగా సన్నగా ధరించడం మొదలైంది.

ఆ తరువాత నూలు ప్రాధాన్యత పెరిగి తొమ్మిది నూలు పోగులతో జంధ్యం స్వయంగా తయారు చేసుకొని ధరించే వారు. అలా కాలక్రమంలో నూలు ధారాలకు, నూలు బట్టలకు, నూలుకు ప్రాధాన్యత పెరుగుతూ వచ్చింది. ఇప్పటికీ పెళ్ళిళ్లల్లో కళ్యాణ మండపాల్లో నూలు దారంతో పోలుదారం నలుచదరంగా పోసి పూజ చేసి దాన్ని పెళ్లి పందిరికి కడతారు. బ్రాహ్మణులు వడకలగ్గం పేరుతో జంధ్యం వేసుకోవడాన్ని ఒక పెళ్ళి అంత పండుగగా జరుపుతారు. బ్రాహ్మణులతో పాటు పద్మశాలీలు, విశ్వబ్రాహ్మణులు, వైశ్యులు కూడా శతాబ్దాలుగా నూలు జంధ్యాన్ని శరీరంలో ధరిస్తూ వస్తున్నారు. జంధ్యాల పూర్ణిమ అని కొత్త జంధ్యం ధరించడానికి ఒక రోజును నిర్ణయించారు. దాన్ని ఇప్పుడు జంధ్యాల పూర్ణిమ అని కాకుండా రాఖీ పూర్ణిమ అని పిలుస్తుంటారు.

ఉన్ని, తోలు, నూలు బట్టల వాడకం మధ్య వాటిని నిపుణుల మధ్య, ధరించే ప్రజల మధ్య నేడు ఫ్యాషన్ల గురించి జరుగుతున్నట్టు చర్చలు, సంఘర్షణలు జరిగేవి. ఉన్ని బట్టలు గొప్పవని కొందరు, లేదు తోలు బట్టలు గొప్పవని కొందరు, నూలు, పట్టుబట్టలు గొప్పవని మరికొందరు వాదించుకుంటూ వుండేవారు. బౌద్ధ విశ్వవిద్యాలయాల్లో తక్షశిల, నలంద, విక్రమశిల వంటి విశ్వవిద్యాలయాల్లో నూలుబట్టలు, పట్టుబట్టలు కాషాయరంగులో ఆచార్యులు, విద్యార్థులు ఉపయోగిస్తుండే వాళ్ళు. నల్లజింక చర్మం నుండి, నూలు బట్టల నుండి బ్రాహ్మణులు పూజల్లో పట్టుబట్టలకు ప్రాధాన్యత ఇవ్వడం ప్రారంభించారు. తోలుబట్టలకు, నూలు బట్టలకు మధ్య జరిగిన సంఘర్షణ పరిణామాలను బి.ఎస్.రాములు 'నాగశాల' కథలో చిత్రించారు. ఈ కథ క్రీ.శ.2వ శతాబ్దం నుండి 5వ శతాబ్దం కాలానికి సంబంధించిన చరిత్ర, సంస్కృతి పరిణామాలను చిత్రించింది.

"మా అమ్మ చెప్పేది మా నాన్న గొప్ప కళాకారుడట. చర్మాలను చదును చేయడంలో పసర్లతో డిజైన్లు చేయడంలో దిట్టనట. మా తండ్రి వజ్రాలు, బంగారం పొదిగి తయారు చేసి చర్మవస్త్రాల కోసం రాజులు, రాణులు వణిక్ ప్రముఖులు పోటీ పడేవారు. తమకు చేసి యిచ్చిన నమూనా మరెవరికి చేయకూడదని చెప్పి ఎంతో డబ్బు యిచ్చేవారు. మా తాత ముత్తాత ఇంకా గొప్ప కళాకారుడు. అజంతా, ఎల్లోరా గుహల్లో వేసిన రంగులు, అలంకరణలు కళాకృతులు కొన్ని మా ముత్తాత చర్మం మీద నమూనాలు వేసి యిస్తే వేసినవేనట. అందుకే మా ముత్తాత తాను చనిపోయినపుడు ఆ గుహల దగ్గరనే సమాధి చేయాలన్నాడట. యిప్పటికీ ఆ సమాధి ఉంది అంది ఇలూచి. తల్లి కూడా అదే సమర్థించింది.

"అక్కడికి నడిచిపోతే ఒక రోజు కూడా ఉండదు దూరం" అంది ఇలూచి తల్లి. నాగశాలతో పాటు ఇలనాగకు ఆ సుందర గుహలు చూడాలనే ఉత్సుకత పెరిగిపోయింది.

"మా నాన్న కూడా మా ముత్తాత వద్ద శిక్షణ తీసుకున్నారని చెప్పేవాడు. అజంతా, ఎల్లోరా గుహల్లో కొన్నిటికి మా ముత్తాత బట్టపై నమూనా వేసి యిస్తే చెక్కారట"[1] అన్నాడు నాగశాల... నాగశాల కథ శతాబ్దాల క్రితం వృత్తులు స్థిరపడుతూ కులాలుగా రూపొందుతున్న క్రమాన్ని చిత్రించింది. ఆదివాసులు అడవుల్లో మారుమూలల్లో జీవిస్తున్న క్రమం, పట్టణాలు, నగరాల్లో జీవించే ప్రజల వృత్తులు, వాటి అభివృద్ధి మధ్య పెరుగుతున్న అంతరం ఈ కథలో చిత్రించారు. తోలుబట్టలు తొలినాటివైతే ఆ తరువాత నూలు బట్టలు జీవితంలో భాగమయ్యాయి. తోలు బట్టలకు నూలు బట్టలకు మధ్య ఆయా సమాజాల్లో ఏది గొప్ప అనే చర్చ సాగుతుంది. ఇది చరిత్రలో, సాహిత్యంలో ఒక మర్చిపోయిన అంశాన్ని బలంగా గుర్తు చేస్తుంది. ఈ విషయంపై చర్చ చివరకు ప్రేయసీ ప్రియుల మధ్య అంతరాలను ఎలా సృష్టిస్తుందో కథలో చక్కగా చిత్రించారు.

ఎంతో దగ్గరవుతారనుకున్న ఇలూచి నాగశాల వాదాలతో విడిపోవడం తల్లికి బాధనిపించింది. "మీ తోలు బట్టలు పాత సంస్కృతి, వత్తితో నేసిన నూలు బట్టలు వెచ్చగా ఉండటంతో పాటు ఎంత చెమటైనా పీల్చుకుని గాలి ఆడుతూ హాయినిస్తాయి" అన్నాడు నాగశాల.

"నూలు బట్టలు వానకు తడుస్తాయి. బట్టసంచిలో నీళ్లు ఆగవు. తొందరగా చిరుగుతుంది. చెదలు పడుతుంది. తోలు వానకు తడువనీయదు. తోలు దుప్పటి కప్పుకుంటే దోమలు కుట్టలేవు. తోలు సంచిలో నీళ్లు పట్టుకోవచ్చు. ఎక్కువ కాలం ఆగుతాయి. వేటాడటం చేతగాని వాళ్లు, చర్మాలు చదును చేయడం రాని వాళ్లు నూలు బట్టలు మంచివి అంటారు. అసలు నిన్ను కాదు ఈ బౌద్ధులను, జైనులను అనాలి. అహింస అంటారు మా చర్మవస్త్రాలకు విలువ, గౌరవం లేకుండా చేశారు. వాళ్ళు నేసే పట్టుబట్టలు పట్టు పురుగుల హింస కాదా....!" అంది ఇలూచి.

ఇలానాగకు ఇలూచి చెప్పిందే సరైనది అని సమర్థిస్తాడు. నాగశాల వాళ్ళిద్దరూ ఒకటి కావటంతో రెచ్చిపోతాడు. బౌద్ధాన్ని తప్పుపట్టడంతో కోపం తారాస్థాయికి చేరుతుంది. పత్తిబట్టలు నాగరికతకు చిహ్నం, రాజులు, రాణులు, వణిక్ ప్రముఖులు, బ్రాహ్మణులు, భిక్షులు, శ్రమణులు పత్తిబట్టలు వాడతారు అంటూ ఆమెను కించపరుస్తాడు నాగశాల. మీ బౌద్ధ గ్రంథాలను కాపాడుతున్నది మా తోలు బట్టలే! చర్మం కన్నా బట్ట శ్రేష్టమైనదని నిరూపిస్తే మేం ఈ వృత్తిని, కళల్నే వదిలేస్తాం అని ఇలూచి సవాలు చేస్తుంది. మా వెంట దేశాటనకు రా! ఏ రాజ్యంలోనైనా నిరూపిస్తా అంటాడు నాగశాల. ఇలూచి సరే అంటుంది. తల్లి కన్నీరుతో వీడ్కోలు పలుకుతుంది. ఇలూచి గుర్రంపై ఇలానాగ వెనక కూర్చోవడంతో

నాగశాల జీవితంలో మొదటిసారిగా ఓడిపోయినట్టుగా డీలాపడిపోతాడు."[2]

ఇలా బౌద్ధం, జైనం విస్తరణతో తోలు బట్టలకు బదులు పత్తి నూలు బట్టలు వేగంగా ప్రజల్లో ఆదరణ పొందాయని చెప్పవచ్చు. వేట సమాజం నుండి వ్యవసాయిక స్థిర సమాజానికి మారే క్రమంలో మానవ సమాజం పంటలపై ఆధారపడడం పెరిగింది. పత్తిని ఒక పంటగా పండించారు. నూలు బట్టలు అలా గ్రామీణ వ్యవసాయ సమాజంలో సంస్కృతిగా మారుతూ వచ్చాయి.

బట్టల మిల్లులు రాకపూర్వం భారతదేశంలో శతాబ్దాల తరబడి ప్రతి ఇంట్లో ప్రత్తి పండించడం, పత్తి నుండి గింజలు వేరు చేసి ఏకులు తయారు చేసుకొని నూలు వడికే వాళ్ళు. ఆ నూలును బట్టలు నేసే వారికి ఇచ్చి తమకు కావలసిన బట్టలు నేసివ్వాలని కోరే వారు. అందుకు ఏడాదికి ఇంత ధాన్యం, నగదు అని మారకం ఉండేది.

పారిశ్రామికీకరణ ప్రపంచంలో నూలు వడికే యంత్రంతో మొదలైంది. దాన్ని జెన్నీ నూలు వడికే యంత్రం అని పిలిచారు. జెన్నీ నూలు వడుకు యంత్రం వచ్చాక నూలు బట్టల మిల్లులు వచ్చాయి. తొలుత ఇంగ్లాండులోని మాంచెస్టర్‌లో బట్టల మిల్లులు ప్రారంభించారు. వాటిని ఆంగ్లేయ వలస సామ్రాజ్య నేతలు తమ వలస రాజ్యాలకు అమ్మకానికి తరలించారు. అవి బాగా ధర వుండేవి. స్వయంగా నూలు తయారు చేసుకొని నేసుకునే బట్టలు చవకగా వుండేవి. చలికాలంలో వెచ్చగాను, ఎండాకాలంలో చల్లగాను వుండేవి. మిల్లుపై వడికిన బట్టలు ఇలా వుండేవి కాదు. అందువల్ల మిల్లు నూలును, మిల్లు బట్టలను ప్రజలు ఇష్టపడలేదు. దాంతో ఆంగ్లేయ ప్రభుత్వం భారతదేశంలోని చేతివృత్తులను, చేనేత వృత్తిని దెబ్బతీయడానికి కంకణం కట్టుకుంది. ఎన్నో చట్టాలను తయారు చేసింది. ఎంతో మంది చేనేత వృత్తి నిపుణుల చేతులు నరికి వేసింది. పత్తిపై, చేనేత, నూలు బట్టలపై ఎన్నో రెట్లు పన్నులు వేసింది. తమ స్వార్థం కోసం, అమ్మకాలకోసం, పరిశ్రమల కోసం చేనేతను తద్వారా ఆ వృత్తిపై ఆధారపడిన చేనేత వృత్తి కులాలను ఆంగ్లేయులు పూర్తిగా దెబ్బతీశారు. శతాబ్దాలుగా విశ్వకర్మలు, పద్మశాలీలు భారతీయ సమాజంలో మహోన్నత గౌరవాన్ని పొందుతూ వచ్చారు. ఆంగ్లేయుల ఈ అణచివేతతో క్రమంగా పేదరికంలో నెట్టివేయబడ్డారు. నగరాల నుండి పొట్టచేతపట్టుకొని వ్యవసాయ కూలీలుగా పల్లెటూర్లకు వలసలు సాగించారు. వ్యవసాయంపై చేతివృత్తుల వారి వత్తిడి పెరిగి అంతదాకా వ్యవసాయ కూలీలుగా పనిచేసే దళితుల కూలీలు ఇంకా పడిపోయాయి. వెట్టిచాకిరీ ఇంకా పెరిగింది. అంబేద్కర్ ఈ విషయాలను కూలంకషంగా అధ్యయనం చేసి ఇలా విశ్లేషించారు.

"ప్రపంచ మార్కెట్‌లో భారతదేశపు ఉత్పత్తులకు డిమాండ్ పెరుగుతుందని తలంచి కలకత్తాకు 15 కి.మీ. దూరంలో క్రీ.శ. 1818 సం॥లో మొట్టమొదటిసారిగా బట్టల

మిల్లును స్థాపించారు. మిల్లుకు అవసరమైన నూలును తయారు చేసే నూలు మిల్లులు భారతదేశంలో లేనందువల్ల యూరప్, జపాన్‌ల నుండి నూలు దిగుమతి చేసుకోవాలని 1817 సం॥ నుండి నూలు దిగుమతి చేసుకోవడం ప్రారంభించారు. అంతేకాకుండా భారతదేశంలో ఉత్పత్తి అయిన పత్తిని బ్రిటన్‌కు ఎగుమతి చేయడం అక్కడి నుండి నూలును, వస్త్రాలను దిగుమతి చేసుకోవడం ప్రారంభమైంది. అంబేద్కర్ భారతదేశంలోని చేతివృత్తి పరిశ్రమలను ఆంగ్లేయులు ఎలా ఒక పథకం ప్రకారం దెబ్బతీశారో వివరంగా రాసి సైమన్ కమిషన్‌కు అందజేశారు. బ్రిటన్ నుండి దిగుమతి చేసుకున్న ఉత్పత్తులకు సబ్సిడీ ఇచ్చి భారతదేశంలో ఉత్పత్తి అయ్యే సరుకులపై 200 శాతం పన్ను వేశారు. ఇలా వృత్తి నిపుణుల నడ్డి విరిచివేశారు. యూరప్ పారిశ్రామిక అభివృద్ధి కోసం భారతదేశాన్ని అన్ని విధాలుగా అణిచివేశారు. రాజకీయ అధికారాన్ని అందుకు విస్తృతంగా ఉపయోగించారు. వృత్తులు కోల్పోయి చేతివృత్తిదారులు వ్యవసాయంలోకి మళ్ళారు. దాంతో 1850 నుండి వ్యవసాయంపై మనుషుల వత్తిడి మునుపెన్నడూ లేనంతగా పెరిగింది. తద్వారా వ్యవసాయ కూలీల కూలీలు కూడా పడిపోయాయి. ఇలా భారతదేశ అభివృద్ధి సర్వనాశనం కావడానికి బ్రిటీష్ వాళ్ళే ప్రధాన కారణమని డా॥ బి.ఆర్.అంబేద్కర్ సోదాహరణంగా నిర్ధారించారు."[3]

గాంధీజీ ఇది గమనించి స్వాతంత్ర్యోద్యమంలోకి ప్రజలను ఆకర్షించడానికి చరఖాను జాతీయ చిహ్నంగా మార్చారు. చరఖాతో నూలు వడకడం, వడికిన నూలుతో బట్టలు నేయడం, ఆ బట్టలనే ధరించడం అనే కార్యక్రమాన్ని జాతీయోద్యమంలో బలంగా ముందుకు తీసుకొచ్చారు. అలా బట్టల మిల్లులు వచ్చిన తరువాత నూలు వడికి నేసే బట్టలను ఖాదీ బట్టలని పిలవడం ప్రారంభించారు. మిల్లుల్లో తయారైన నూలుతో చేనేత బట్టలు నేస్తే వాటిని చేనేత బట్టలు అని పిలిచారు. అనగా ప్రస్తుతం హ్యాండ్‌లూమ్ కాటన్ బట్టలు, చేనేత బట్టలు అని పిలిచే బట్టలు చేతితో వడికిన నూలుతో నేసినవి కావు. అవి మిల్లులో తయారైన నూలుతో చేత్తో నేసే చేనేతలు.

3.2. ప్రపంచ కార్మిక చరిత్ర నిర్మించిన మిల్లు కార్మికులు :

"చికాగోలో కన్నా ముందు 1872లోనే భారతదేశంలోని మొట్టమొదటి పారిశ్రామిక జౌళి మిల్లు సమ్మెలను మహాత్మా జ్యోతిబా ఫూలే, మేఖన్‌జీ నారాయణలోఖండే నాయకత్వంలో సత్యశోధక సమాజ ఉద్యమం ద్వారా (బాలగంగాధర్ తిలక్ నాయకుడుగా ఎదగకముందే) విజయవంతం చేసింది తెలంగాణ చేనేత కార్మిక శ్రేణులే. నిజాం నేతపని వారి వలసలను గమనించి వారికి స్థానికంగా ఉపాధి అవకాశాల కోసం అజంజాహీ మిల్లు వంటి పరిశ్రమలను స్థాపించాడు. ప్రపంచంలో వస్తున్న అభివృద్ధిని వెంటవెంటనే తన దేశంలో అందించే కృషిని నిజాం నిరంతరం కొనసాగించినాడు."[4] నిజాం రాజ్యంలో మొదటి నూలు (స్పిన్నింగ్) మిల్లును 1973లో ప్రారంభించారు.. వరంగల్‌లో అజాంజాహి

మిల్స్‌ను 1931లో నెలకొల్పారు. ఆదిలాబాద్ జిల్లా సిరిపూర్ కాగజ్‌నగర్‌లో సర్‌సిల్క్ బట్టలమిల్లు వెలసింది.

చేనేత వృత్తి కులాల వారు తమ వృత్తి రక్షణ కోసం, జీవితాల బాగుకోసం 1921 నుండే కులసంఘాలను, చేనేత వృత్తి సంఘాలను ఏర్పర్చుకున్నారు. అవి ఇప్పటికీ కొనసాగుతున్నాయి. చేనేత కులాల సహకార సంఘాలు, కుల సంఘాలు దేశంలోని ఇతర కులసంఘాలకు స్ఫూర్తినిచ్చాయి. ఆదర్శమయ్యాయి. ప్రభుత్వాలను సబ్సిడీపై నూలు ఇవ్వాలని చేనేత వృత్తికారులు కోరుతూ వచ్చారు. నిజాం రాజు చేనేత వృత్తివారికోసం సబ్సిడీపై నూలును అందజేశారు. చేనేత మగ్గాన్ని ఆధునీకరించి సట్టర్ (షట్టర్) మగ్గాన్ని మరమగ్గం వలెనే రూపొందించారు. దాంతో బట్టనేత వేగం పెరగడమే కాకుండా పింజరతో అనేక రకాల డిజైన్లు రూపొందించడం సాధ్యపడింది. ఆయా కులవృత్తుల వాళ్ళు పారిశ్రామిక విప్లవం బారి నుండి కోలుకోవడానికి వృత్తుల రక్షణ కోసం చేసిన ఉద్యమాలు భారతదేశ చరిత్రలో జాతీయోద్యమం కన్నా తక్కువేమీ కావు. ఒక దశలో జాతీయోద్యమం కన్నా ఎన్నో రెట్లు సాగాయి.

బొంబాయిలో బట్టల మిల్లు కార్మికులు ఆరోగ్యం సరిపడక మిల్లుపని దొరకక బీడీల చుట్టే పని నేర్చుకున్నారు. బట్టల మిల్లుకార్మికులతో సమానంగా కూలీ గిట్టుబాటు కావాలని సమ్మెలు చేశారు. దాంతో బీడీ కంపెనీ యజమానులు బాంబే, సూరత్‌ల నుండి బీడీ కంపెనీలను భీవండి, జాల్నా మీదుగా నిజామాబాద్, నిర్మల్, మెట్‌పల్లి, కోరుట్ల, జగిత్యాల ప్రాంతాలకు తరలించారు. మగవారి బీడీ పరిశ్రమ ఆడవాళ్ళకు అనువుగా వుండడంతో ఆడవాళ్ళు బీడీలు నేర్చుకొన్నారు. కాలక్రమంలో బీడీ పరిశ్రమలో 90 శాతం మహిళలే కార్మికులుగా పని చేస్తున్నారు. రాష్ట్రంలో ఏడులక్షలకు పైగా బీడీ కార్మికులు పని చేస్తున్నారు. చేనేత వృత్తి, చేతివృత్తులు కోల్పోయిన కులాల మహిళలు ఈ పరిశ్రమలో ఎక్కువ మంది వున్నారు. ఇతర కులాల వాళ్ళు కూడా క్రమంగా చేరుతూ వచ్చారు. ముస్లిం మహిళలు కూడా బీడీ పరిశ్రమలో ఉపాధి పొందారు. ఇలా కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, వరంగల్, మెదక్, కర్నూలు జిల్లాల్లో బీడీ పరిశ్రమ మహిళల ప్రధాన ఉపాధిగా మారుతూ వచ్చింది. బీడీ పరిశ్రమ చేనేత వృత్తి, చేతివృత్తులు కోల్పోయిన కులాల వారికి ప్రధాన ఆధారంగా కొనసాగుతూ వచ్చింది. ఈ పరిశ్రమ లేకపోయి వుంటే వేలాది మంది ఆత్మహత్యలు చేసుకోవడమో, ఆకలి చావులకు గురికావడమో జరిగి వుండేది. బి.ఎస్.రాములు వంటి మేధావులతో పాటు ఎందరో ప్రజాప్రతినిధులు, డిప్యూటీ కలెక్టర్, డిగ్రీకాలేజి ప్రిన్సిపాల్, హైస్కూల్ హెడ్మాస్టర్ వంటి ఉద్యోగాలకు ఎదగడానికి బీడీ పరిశ్రమ ఆధారంగా నిలిచింది.

స్వాతంత్ర్యానంతరం చేనేత తిరిగి పుంజుకొని పద్మశాలీలు, చేనేత కులాలు తిరిగి

బాగుపడతారని ఆయా కులసంఘాలు భావించాయి. కానీ అందుకు విరుద్ధంగా ప్రభుత్వాలు బట్టల మిల్లులకు అనుకూలంగా చట్టాలను, పన్నుల వ్యవస్థను రూపొందించారు. బిర్లాలు వంటి బడా పారిశ్రామికవేత్తలు స్వాతంత్ర్యానికి పూర్వం నుండి నడిపిస్తున్న బట్టల మిల్లులకే మేలు చేకూర్చారు. జౌళి విధానం కేంద్ర ప్రభుత్వ అధీనంలో వుంటూ వచ్చింది. బట్టల మిల్లులతో పోటీ పడ్డం సాధ్యం కాదని, చేనేత వృత్తిపై ఆధారపడే వాళ్ళు వ్యవసాయం మీద ఆధారపడే వాళ్ళ తర్వాత వీరే హెచ్చు. అందువల్ల వారి వృత్తి రక్షణ కోసం, ఉపాధి కోసం కొన్ని రకాలను మిల్లుల్లో నేయకూడదని చేనేతకే ప్రత్యేకించాలని ఉద్యమించారు. దాంతో ప్రభుత్వం తొలుత 22 రకాల బట్టలు చేనేతకు కేటాయించింది. అయినప్పటికీ పవర్‌లూమ్స్ ద్వారా ఉత్పత్తి చేసి చేనేత కార్మికుల పొట్టలు కొట్టడం జరిగింది. ఆ తరువాత వీటిని 11 రకాలకు కుదించారు.

“నైజాం రాజ్యంలో ఎన్నో ఉద్యమాలు సాగాయి. వాటన్నిటిలో రైతాంగం, చేనేత కార్మికులు, చేతివృత్తి కార్మికులు పాల్గొన్నారు. “జాతీయోద్యమం, ఆంధ్రమహాసభ, కులసంఘాలు, కమ్యూనిస్టుల పోరాటం, బొంబాయి వలసలు, బీడీల పరిశ్రమ, ఆర్యసమాజ ఉద్యమం, సోషలిస్టుల ఉద్యమం, రజాకార్లు, ముల్కి ఉద్యమం, జై తెలంగాణా ఉద్యమం, నక్సలైటు ఉద్యమం, హిందువాద ఆర్‌ఎస్‌ఎస్ ఉద్యమం, ఎమర్జెన్సీ చీకటి, విద్యార్థుల ఉద్యమం, హాస్టల్ విద్యార్థుల పోరాటాలు, విప్లవ విద్యార్థి యువజన సంఘాలు, అంబేద్కర్ సంఘాలు, రోడ్లు, కరెంటు, ఫోన్లు, రిజర్వేషన్లు చదువుకున్న కొత్త తరాలు, స్త్రీ విద్య, శ్రీరాంసాగర్ ప్రాజెక్టు, ప్రభుత్వ ఉద్యోగ వ్యవస్థ, సింగరేణి బొగ్గు పరిశ్రమల, ఆర్.టి.సి., కాంట్రాక్టర్ల వ్యవస్థ, జాతర్లు మూఢ విశ్వాసాలు, ఇంగ్లీషు మీడియం, ప్రైవేటు స్కూళ్ళు, నిరక్షరాస్యత, ప్రజల అమాయకత్వం గురించి సమాజ ప్రతిఫలనంగా తెలంగాణలో ఎంతో సాహిత్యం వచ్చింది.”[5] బి.ఎస్.రాములు గారి కథల్లో ఇవన్నీ ప్రత్యక్షంగా, పరోక్షంగా కనపడుతుంటాయి.

ప్రభుత్వ విధానాలకు ఎదురీదుతు చేనేత కార్మికులు చీరాల, వెంకటగిరి, గద్వాల, పోచంపల్లి, మంగళగిరి, ధర్మవరం ప్రాంతాల్లో ఎక్కడికక్కడ చేనేత నిపుణులు కొత్త డిజైన్లను తయారు చేశారు. తమకు పోటీలేని విధంగా చీరలను, ఇతర డిజైన్లను రూపొందించారు. అలా నిలదొక్కుకొని వస్తున్నప్పటికీ ఎంతో నైపుణ్యం కనబరిచినప్పటికీ బట్టలు నేసే వారికి అందే కూలీ తక్కువ. మధ్య దళారులు కోట్లు సంపాదించారు. చేనేత సహకార సంఘాలు వెలిసి చేనేత కార్మికులకు ఉపాధి కల్పించాయి. కాలక్రమంలో వీటికి ప్రైవేటుగా బట్టలు నేయించే చేనేత వ్యాపారవేత్తలు, యజమానులు, ధనీలు నాయకత్వంలోకి వచ్చి సహకార సంఘాలను దెబ్బతీశారు. తాము ప్రైవేటుగా ఉత్పత్తి చేసిన బట్టలను సహకార సంఘాల నుండి ఉత్పత్తి చేసినట్టు రికార్డులు సృష్టించి అమ్మారు. కొందరు ప్రభుత్వం

ఇచ్చే రిబేటు కోసం కాగితాల మీదనే సహకార సంఘాలను సృష్టించి నిధులను కైంకర్యం చేశారు. సహకార సంఘాలకు వచ్చే సబ్సిడీ నూలును దారిమళ్లించి బ్లాక్‌మార్కెట్‌లో అమ్ముకొని వ్యాపారులు సంపన్నులయ్యారు.

ఈ విషయాలన్నిటిని బి.ఎస్.రాములు 'మమతలు-మానవ సంబంధాలు', 'బతుకుపయనం' కథా సంపుటాల్లో కథల రూపంలో చరిత్ర, సామాజిక పరిణామాలను కళ్ళకు కట్టినట్టుగా మనముందుంచారు. పద్మశాలిలను ముంచి పైకి వచ్చిన వ్యక్తిగా 'జీవనయానం' కథలోని నారాయణసేటును చిత్రించారు. చేనేత కార్మికులను, చేనేత వ్యాపారంలో గల వాళ్ళు, సహకార సంఘాల వాళ్ళు ఎలా ముంచారో, ఎలా దోపిడీ చేశారో ప్రఖ్యాత దర్శకుడు శ్యాంబెనగల్, ఆప్కో తరపున తీసిన సుస్మాన్ సినిమాలో దృశ్య కావ్యంగా మలిచారు. ఈ సినిమాలో షబనా ఆజ్మీ, నసీరుద్దీన్ షా నటించారు. ఫ్రాన్సులో జరిగిన ఫిలిం ఫెస్టివల్‌లో ఈ సినిమాకి అవార్డులు అందుకున్నారు. నసీరుద్దీన్ షా పోచంపల్లిలో సినిమా కోసం నేర్చుకుని స్వయంగా నేసిన బట్టతో కుట్టుకున్న డ్రస్సు వేసుకొని ఆ పురస్కారాన్ని అందుకున్నారు. వ్యవసాయం తరువాత అత్యధిక జనాభా ఆధారపడి వున్న చేనేత వృత్తిపై వచ్చిన మొదటి సినిమా ఇది. ఇలా చేనేత వృత్తివారిపై దశాబ్దాలుగా ఫోకస్ లేకుండా పోయింది.

3.3. సైన్సుకు, సామాజిక న్యాయానికి సంబంధం

సైన్సు, టెక్నాలజీ అభివృద్ధి మనిషికి ఉపాధి కల్పించాలి. మనిషిని పని నుండి తొలగించకూడదు. బట్టలమిల్లులు వచ్చి కోట్లాది మందిని ఉపాధి లేకుండా చేశాయి. "సైన్సు, అభివృద్ధి, సామాజిక న్యాయాన్ని సూచించదు. సైన్సు, అభివృద్ధి అసమానతల్ని సృష్టిస్తుంది. సామాజికంగా ఎందరికి అందిందో అనేదే సైన్సు అభివృద్ధి ద్వారా సామాజిక న్యాయం అందిన తీరును తెలుపుతుంది. సైన్సు కనుక్కోబడుతుంది. క్రమంగా విస్తరించబడుతుంది. అది అందరికీ అందడమే సామాజిక న్యాయం. కొందరికే అందిన సైన్సు, అభివృద్ధి అందిన వారి చేతిలో ఆయుధంగా, సాధనంగా మారుతుంది. సమాజంపై ఆధిపత్యం నెరపడానికి తోడ్పడుతుంది. ఉదా॥కు, పూర్వం గుర్రాలు, మందుగుండు ఎవరికి ఎక్కువ అందుబాటులో ఉండేవో వారు రాజ్యాలను జయించారు. నేడు అమెరికా ఆయుధ సంపత్తిని, అణుబాంబులను తయారుచేస్తూ ఆయుధ బలంతో ప్రపంచంపై ఆధిపత్యం చలాయిస్తున్నది. ప్రజలందరికీ పంపిణీ కాని సైన్సు, అభివృద్ధి స్వేచ్ఛా సమానత్వానికి వ్యతిరేకమైనది. బస్సు, రైలు, సైకిల్ సైన్సు సాధించిన అభివృద్ధి. అవి అందరికీ అందుబాటులోకి రావడం సామాజిక న్యాయం. విద్యుత్తు మొదలైనవి కనుక్కోవడం సైన్సు అభివృద్ధి. అది అందరి జీవితాల్లో వెలుగును నింపడం సామాజిక సామాజిక న్యాయం."[6]

సాహిత్య రంగంలో 1940ల్లో నిజామాబాద్ జిల్లాకు చెందిన లోకమలహరి కొన్ని కథలు, నవలలు రాశారు. లోకమలహరి వేదాలను తెలుగులోకి అనువాదం చేశారు. 1967లో సుప్రసిద్ధ సాహితీవేత్త పోరంకి దక్షిణామూర్తి 'ముత్యాలసరాలు' పేరుతో చేనేత కార్మికుల జీవితాలపై తెలంగాణ భాషలో నవల రాశారు. అది ఆంధ్రప్రభ వార పత్రికలో సీరియల్‌గా వెలువడి పుస్తకరూపంలో వచ్చింది. స్వాతంత్ర్యానంతర తొలితరం కథకులు 'బతుకుపయనం' కథల సంపుటి సంపాదకులు గూడూరి సీతారాంగారు పద్మశాలి కులంలో పుట్టి 1953-70 మధ్య 80 కథలు, కొన్ని నవలలు రాశారు. వాటిలో కొన్ని చేనేత కార్మికులకు సంబంధించినవి.

1960లో మంగళగిరికి చెందిన అందె నారాయణస్వామి రాసిన చేనేత కథలు పత్రికలోంచి సేకరించి 2008లో పుస్తకంగా వెలువరించారు. కాలువ మల్లయ్య చేనేత కులాలపై అనేక కథలు రాశారు. నిరీక్షణ, ఎదురు చూపు, వారసత్వం, మమతలు మరుగై వంటి కథలతో పాటు బి.ఎస్.రాములు, లెక్చరర్ బొద్దుల లక్ష్మయ్య మిత్రుల చేనేత జీవితాలను కథా వస్తువుగా తీసుకొని చతుర మాసపత్రికలో 'గువ్వల చెన్నా' నవలను 2004లో ప్రచురించారు. జూకంటి జగన్నాథం 1982లో వలస కథ రాయడంతో పాటు 1995 తరువాత 'వైపని' రాశారు. రామా చంద్రమౌళి కూడా చేనేత కథలు రాసినట్లుగా తెలుస్తున్నది. అయితా చంద్రయ్య చేనేత కార్మికుల జీవితాలపై 'చిలకపచ్చచీర' కథా సంపుటిని 1997లో వెలువరించారు. 2000లో పుస్తక రూపంలో ప్రచురించిన బి.ఎస్.రాములు 'మమతలు-మానవ సంబంధాలు' కథల సంపుటిలో చేనేత కార్మికుల జీవితాలను చిత్రించారు.

'మమతలు-మానవ సంబంధాలు' కథా సంపుటిలో బి.ఎస్.రాములు చేనేత కులాల జీవితాలు, పరిణామాల గురించి 'పాతచీర', 'పరుసలు', 'వరలక్ష్మి', 'ప్రేమధార', 'పంజరం', 'మమతలు', 'వారసత్వం' కథల్లో చిత్రించారు. 'బతుకుపయనం' కథల సంపుటి దాని తరువాయి భాగం.

"ఈ పాత సామానంతా ఎందుకు? దేనికి పనికొస్తుంది. జోకి (తూచి) పాత సామానువాళ్ళకు అమ్మేయండి అన అంటుంది రాజేశ్వరమ్మ రెండో కోడలు....

పాత సామాను పడేసిన అటకకేసి ఒకసారి చూస్తాడు లింగయ్య. పొగబారి నల్లగా కరుజెక్కిన అటకలో ఏం ఉన్నదీ కానరాలేదు. కాని ఏమేం ఉన్నాయో తెలుసు. పాతరాట్నం, బట్టలు నేసిన దోనుగు, నూలు చుట్టిన పంటెలు, నూలు సరిచేసే ఈతనార కుంచె, కందిళ్ళు, పాత సందుగలు, పాతబట్టలు, విరిగిన మంచాలు, పాతనవారు, సైకిల్ సామాను, నేత కండెలు, నాడెలు, పాత మగ్గం, పాత వాసాలు, విరిగిన కట్టె కుర్చీలు... అవన్నీ గుర్తుకు రాగానే లింగయ్య మనస్సు 40 ఏళ్ళు వెనక్కి పోతుంది. బట్టలు నేసిన బతుకు,

నూలు రంగులు అద్దిన కాలం, పిల్లల పెంపకంలో విరిగిన పాత మంచాలు, తన పెళ్ళి మంచం, కుసులు విరిగి కొద్దీ చెక్కిస్తూ పోతే చిన్నమంచంగా మారి చిన్నపిల్లల మంచంగా సేవచేసి మూల పడుతుంది."[7]

చేనేత కులంలో పుట్టిన కాంత్, వ్యవసాయ కులంలో పుట్టిన సరవ్వ ఇద్దరూ పుట్టకముందే తల్లుల ద్వారా పెళ్ళి సంబంధాలు ఖాయం చేసుకున్నారు. పుట్టి, పెరిగిన తరువాత కవలలులాగా కలిసి తిరిగారు. కాలక్రమంలో సరవ్వ లెక్చరర్‌గా ఎదిగిపోయింది. ఉన్న వృత్తి కోల్పోయి కాంత్ జీవితంలో వెనకబడిపోయారు. 'మమతలు' ఒకే సమయంలో పుట్టినప్పటికీ కులాలు వేరుకావడంతో వృత్తులు కోల్పోవడంతో వారి జీవితాలు ఎలా పరిణమించాయో విశ్లేంచింది. చిన్ననాటి స్నేహితులు, ప్రేమికులు ఎలా దూరమయ్యారో చిత్రించారు.

సరూ.. నువ్వు చాలా మాటలు నేర్చావు. నువ్వు మరిచిపోవాలనే నిర్ణయించు కున్నావని స్పష్టంగా చెప్పకుండా యీ డొంక తిరుగుడెందుకు? అని సరవ్వ ప్రశ్నిస్తుంది. కాంత్, అప్పుడు లేచిపోదామంటే నువ్వు ధైర్యం చేయలేదు. అమ్మా, చెల్లీ, యింకా ఏదేదో అన్నావు. ఇప్పుడు ఎంతెంత అభాండాలు వేస్తున్నావు. నువ్విలా అంటుంటే నా హృదయంలో ఎంత బాధకలుగుతున్నదో నీకు తెలుసా? నేనిపుడు సంసారం చేస్తున్న స్త్రీని.... అని నిలదీస్తుంది. కాంతయ్య మరో కోణంలో ఆలోచిస్తూ చర్చిస్తాడు.

"సరూ! పారిశ్రామికీకరణ మీకు ఆధునిక అభివృద్ధిని, నాగరికతను యిచ్చింది. కాని మా వాళ్ళకు ఉన్న కులవృత్తులు పోగొట్టింది. జీవితాలు కాలే కడుపులతో కొడిగట్టిపోయినై. అంబేద్కర్ ఎందరికో వెలుగు చూపినా గాంధీ పంథాయే రహదారి అయింది. కాని ఈ యిద్దరికి గురువైన జ్యోతిబా ఫూలే వేసిన బీసీల దారి అక్కడే ఆగిపోయింది."[8]

'జీవనయానం' కథలో ప్రేమ, పెళ్ళి, కుటుంబ వ్యవస్థ, సామాజిక సంబంధాలు, సంస్కృతి, ఇవన్నీ రాజకీయాలే అని, ప్రతి వ్యక్తిగత విషయం కూడా రాజకీయమైనదే, సామాజికమైనదే అని ప్రతిపాదిస్తారు. వీటితోపాటు ఉద్యమాల, పార్టీల, భావజాలాల, సంస్కృతుల పవర్ సెంటర్స్ అన్నీ సోషల్ క్యాపిటల్ సంచయాలే. ఇవన్నీ సోషల్ ఎకనమిక్స్ తాలూకు సోషల్ క్యాపిటల్ రూపాలు. ప్రేమ, పెళ్ళి, కుటుంబం మొ॥ రూపాల్లో పైసా పెట్టుబడి లేకుండా పురుషాధిపత్యం చెలాయించడం పితృస్వామిక సమాజ విలువల వల్ల సాధ్యపడుతున్నదని కథ ప్రారంభంలోనే ఒక లోతైన చర్చను, సిద్ధాంతాన్ని ప్రవేశ పెట్టి జీవితంలో అవి ఎలా కొనసాగుతున్నాయో పాత్రల ద్వారా, చర్చల ద్వారా, సన్నివేశాల ద్వారా, సంఘటనల ద్వారా చిత్రించారు.

"నేడు ప్రేమ అని చాలామంది ఫీలయ్యేదాన్లో ఫ్యూడల్ పెట్టుబడిదారీ దోపిడీ వర్గాల,

పురుషాధిపత్యవాదుల దృక్పథమే ఉంది. రెండు హోదాల మధ్య, రెండు ఉద్యోగాల మధ్య, రెండు వ్యాపారాల మధ్య పెళ్ళిళ్ళవుతున్నాయే తప్ప అవి రెండు హృదయాల మధ్య కాదు. తల్లిదండ్రులు చూసే సంబంధాలు కూడా యివే. కాదంటే కట్నంతో కొందరు కాస్త పెద్ద హోదాతో పెళ్ళి చేస్తారు. అటువైపునుండి హోదాను, ఉద్యోగాన్ని బట్టి కట్నం లాగుతారు."

మిల్లు నూనె ప్రవేశంతో గానుక వ్యాపారంతో రాజాలా బతికిన కుటుంబాలు కొత్త వృత్తులు వెతుక్కోవాల్సి వస్తుంది. వారికి బట్టలు నేయడం అనేది ఎపుడో మానేసిన కులవృత్తి. ఏ వ్యాపారమూ, వ్యవహారమూ తోచక, చెప్పేవారు లేక పదిమంది దాకా బొంబాయి బట్టల మిల్లుల్లో కార్మికులుగా చేరతారు. ఆ కాలంలో టీచర్లకన్నా, ఎన్జీవోల కన్నా బట్టల మిల్లు కార్మికులకే గిట్టుబాటు ఎక్కువ.

కాని కాలం ఒక్క తీరుగా ఉండదు. బొంబాయి బట్టల మిల్లుల్లో రాజీనామా చేస్తే ప్రావిడెంటు ఫండు చేతికొస్తుందని, దాంతో పొలం కొనుక్కోవచ్చని పెద్దనాన్నలు రాజీనామా చేస్తారు. కాస్త పొలాలు కొంటారు. ఇంటివద్ద ఏ గొడ్డూ గడ్డీ గాదం లేని ఒకాయన రాజీనామా చేస్తే వచ్చిన ప్రావిడెంటు ఫండూ, మిగుల్చుకున్న పైసలు కలిపి భీవండిలోనే రెండు పవర్‌లూంలు పెడతాడు. ఇపుడు యాభయి పవర్‌లూంల యజమాని అవుతాడు. చాలామందికి ఈ దూరదృష్టి లేదు. ఎంతకూ వ్యవసాయం మీద ఆశ. ఉన్న ఊరు మీద మమకారం, ముఖ్యంగా మిల్లు కార్మికులుగా కోల్పోయిన స్వేచ్ఛ వ్యవసాయప్పనుల్లో అంతా తమ యిష్టం. యిలా ఆలోచించి ఇల్లు చేరినా ఆ తర్వాత ఇంట్లో వెళ్ళక నగదు చూసిన కన్ను భీవండి వెళ్లక తప్పలేదు. భీవండిలో కూలీ తప్ప ఏ కార్మిక చట్టాలూ, రక్షణలూ ఉండవు."[9]

'వరుసలు' కథలో చేనేత వదిలి నూనె గానుగలు నడిపి నూనె మిల్లులు రావడంతో అది కూడా వదిలేసి బొంబాయి భీవండి వెళ్ళి నేత కార్మికులుగా మారి చివరికి బావుకున్నదేమీ లేదు అని చిత్రిస్తుంది. కష్టపడి చదువుకున్న రచయిత చిన్న ప్రభుత్వ ఉద్యోగం సంపాదించుకుంటే పాత వరుసల్లో ఒక పెళ్ళికి వెళ్ళిన సందర్భంగా 40 ఏళ్ళలో జరిగిన పరిణామాలను మేనమరదలు విషాదంగా విశ్లేషిస్తుంది. "ఏమైనా బావా! నాయిన అవ్వా ఒక్కరేమిటి మా యి పల్లెలో వ్యవసాయాన్ని నమ్ముకొని బతికినవాళ్ళున్నారు గానీ బాగుపడ్డవారు లేరు. వ్యవసాయాన్ని నమ్ముకుంటే తిండికి కొరత లేదు. కాని జంతువులు కూడా ఏదో తిని బతుకుతాయి. మా మీద వేసే పన్నుల్తో అడ్డగోలు జీతాలు దొబ్బి మీరు సుఖాలనుభవిస్తున్నారు. మేమేమో వెనకబడి పోతున్నాం. ప్రభుత్వం మీ సౌఖ్యాల కోసమే పుట్టినట్టుంది. మా కోసమని పుట్టిన ప్రభుత్వం మీ సుఖాలు, సౌకర్యాలకి పరిమితమైపోయింది. అందుకే నువ్విట్లా ఎర్రగా, బుర్రగా నునుపు తేలినావు. నీ పిల్లలు బాగా చదువుకొని ఎదుగుతున్నారు."[10] అని సరవ్వ అంటుంది.

వరంగల్ అజంజాహి మిల్స్, ఆదిలాబాద్ జిల్లాలోని బట్టల మిల్లు మూతబడి తొమ్మిది వేల చేనేత కార్మిక కుటుంబాలు వీధిన పడ్డాయి. చెట్టుకొకరు, పుట్టకొకరు అయ్యారు. పెళ్ళిళ్ళు చేయలేకపోవడంతో ఎవరి దారి వారు చూసుకున్నారు. అలా వేశ్యలుగా మారిన వారు ఎందరో... వారి హృదయవిదారక జీవిత పరిణామాలే 'ప్రేమధార'.

'వారసత్వం' కథలో 70యేళ్ళ తెలంగాణ సామాజిక పరిణామాలను చేనేత కులాల జీవితాల నేపథ్యంలో చిత్రించారు. "బొంబాయి బట్లల మిల్లులో పని చేసి వచ్చి ఇంత భూమి కొనుక్కొని అటు చేనేత మగ్గం, ఇటు వ్యవసాయం అని మొదలెట్టడంతో తుక్కారావుకూ, గంగరాజం తండ్రి లింగయ్యకూ మధ్య తగాదా మొదలైంది. అటు చేనేత, ఇటు వ్యవసాయం, మరో కొడుకు బొంబాయి మిల్లు సంపాదన చూసి తుక్కారావు ఓర్వలేకపోయాడు.. గంగరాజం చిన్నాన్న చిన్నలింగం బొంబాయి ట్రేడ్ యూనియన్ చైతన్యంతో బాగా చురుకుగా ఉండేవాడు... గంగరాజం ఊళ్ళన్నీ తిరిగి దొరలకు వ్యతిరేకంగా ప్రచారం చేశాడు."[11]

1945 నుండి జగిత్యాల్లో, కోరుట్లలో చేనేత సహకార సంఘం నిర్మాణం కోసం ఎక్కలదేవి లక్ష్మణతో, దాసరి ఎతిరాజంతో కల్సి హకీం నారాయణ దాసు నిజాం రాజవైద్యుడిని కల్సి నిజాంను కలిశారు. అలా చేనేత సహకార్ర సంఘాలు స్థాపించి పెట్టి నిర్మూలనకు, సబ్సిడీ నూలుకు, ఖాదీ ఉద్యమానికి కృషి చేశారు. దాని ఫలితంగానే 1952లో గంగుల భూమయ్య ఎమ్మెల్లేగా గెలవడం, గంగుల భూమయ్య ఎమ్మెలేగా గెలిచినపుడు తానే గెల్చినంత సంతోషపడిపోయాడు గంగరాజం.

"ప్రభుత్వం వెనకా ముందు చూడకుండా బయటి దేశాలకు పత్తి, నూలు ఎగుమతికి అనుమతి ఇచ్చింది. దాంతో ఇక్కడ దొరకక ధరలు రెట్టింపైనై. అట్ల జరగకపోతే ఈ యజమానులు ఆత్మహత్యలు చేసికోకపోదురు అన్నారు కొందరు. అవన్నీ విన్నంక నిజమే అనుకున్నడు ఎల్లయ్య ఇంకోచోట పని వెతికిండు ఎల్లయ్య. సిరిసిల్లలో ఎవరి దగ్గరైనా ఇదే స్థితి అని 'ప్రశాంతం' కథలో ఎల్లయ్య యొక్క స్థితిని గురించి చెప్పారు.

వెనకటకి బట్ట మిల్లు కార్మికరంగం దాని స్థానం బలంగా ఉన్నంతకాలం కూలీ బాగా గిట్టుబాటై ఆ కార్మికుల్లోంచే చిన్న పెట్టుబడిదారులు పుట్టి యిపుడు షోలాపూర్, భీవండి బట్టల మిల్లుల యజమానులయ్యారు. ఇపుడా అవకాశం లేదు."[12]

చేనేత వృత్తి క్రమంగా గిట్టుబాటు కాకుండా పోతున్నది. కాలాన్ని అనుసరించి పవర్ లూమ్స్ పెరుగుతున్నాయి. చేనేత కార్మికులు పవర్‌లూమ్ కార్మికులుగా మారుతూ 12 గంటలు పని చేస్తూ అనారోగ్యాల పాలవుతున్నారు. కూలీ గిట్టుబాటు కావడం లేదు. ఆకలి చావులకు, ఆత్మహత్యలకు గురవుతున్నారు. వీటన్నిటికీ ప్రభుత్వ విధానాలే ప్రధాన కారణం.

3.4 ప్రపంచీకరణ పరిణామాలు

ప్రపంచీకరణ పరిణామాలు భారతదేశంలోని 70 కోట్ల ప్రజానీకాన్ని, వారి వృత్తులను, ఉపాధిని అతలాకుతలం చేశాయి. పారిశ్రామిక ఉత్పత్తులు, నూతన ఆర్థిక విధానాలు, ప్రైవేటీకరణ పేదల జీవితాలను బలికోరాయి. జార్జి ఫెర్నాండెజ్ ఇలాంటి దుస్థితి రానున్నదని నూలు, పత్తి, జౌళి విధానం చేనేత వృత్తికారుల జీవితాలను పేదరికంలోకి, వినాశనంలోకి నెట్టివేస్తాయని పార్లమెంటులో ఎప్పుడో హెచ్చరించారు. దాని పరిణామాలు 1985 నుండి స్పష్టం కావడం మొదలైంది.

3.5 చేనేత కార్మికుల వలసలు

చేనేత కార్మికులు వున్నవూరు వదిలి, భార్య, పిల్లల్ని వదిలి, సాంప్రదాయక వృత్తి వదిలి, రకరకాల వృత్తుల్లోకి, ఇతర ప్రాంతాల్లోకి వలస వెళ్ళారు. 1978 నుండి ఉత్తర తెలంగాణ ప్రాంతం నుండి అరబ్బు దేశాలకు వేలాది మంది కూలీలుగా వలస పోయారు. నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, ఆదిలాబాద్ జిల్లాల్లో చాలా ప్రాంతాల్లో బీడీ పరిశ్రమతో మహిళలు కొంత వేన్నీళ్ళకు చన్నీళ్ళుగా సంపాదించడం వల్ల ఆత్మహత్యలు, ఆకలి చావులు తక్కువ. కానీ చీరాల, ప్రకాశం జిల్లాలో పత్తి రైతులు, చేనేత కార్మికులు 1985 నుండి ఆకలి చావులకు, ఆత్మహత్యలకు గురవుతున్నారు.

3.6. చేనేత వ్యతిరేక ప్రభుత్వ విధానాలు

పత్తి, జౌళి విధానం రైతులకు, చేనేత కార్మికులకు అనుకూలంగా కాకుండా పారిశ్రామిక వేత్తలకు, ఇతర దేశాల వారికి అనుకూలంగా విధాన నిర్ణయం చేయడం వల్ల వచ్చిన పరిణామాలివి. చేనేతను, నూలు బట్టలను ప్రోత్సహించే ప్రభుత్వ విధానం కొనసాగి వుంటే పత్తిరైతుల ఆత్మహత్యలుగాని, చేనేత కార్మికుల ఆకలి చావులు, ఆత్మహత్యలుగాని ఇలా వుండేవి కావు. కేంద్ర ప్రభుత్వం కోట్లాది ప్రజల జీవితాలను బలిపెట్టింది. కొందరు పారిశ్రామికవేత్తలు ఎదుగుతూ వచ్చారు.

3.7. సోవియట్ యూనియన్ పతనం-పరిణామాలు

ఈ నేపథ్యంలో సోవియట్ యూనియన్‌లో పెరిస్త్రాయికా, గ్లాస్‌నాస్త్ ఉద్యమాలు ఒకవైపు, డంకెల్ ప్రతిపాదనలు, గాట్ ఒప్పందాలు మరొకవైపు సాగుతూ వచ్చాయి. సోవియట్ రష్యా సోషలిస్టు దేశం నుండి తన విధానాన్ని మార్చుకొని ప్రజాస్వామ్య దేశంగా మారింది. 13 దేశాలుగా విడిపోయింది. అమెరికా ఆధిపత్యం పెరిగింది. ఐక్యరాజ్యసమితి క్రమంగా తన ప్రభావాన్ని కోల్పోతూ వచ్చింది. ఏకధృవ ప్రపంచం పేరిట అమెరికా ప్రపంచ అగ్రరాజ్యంగా ఇతర దేశాలపై ఆధిపత్యం మునుపెన్నడూ లేనంతగా పెంచుకుంది. ప్రపంచ బ్యాంకు, ప్రపంచ వాణిజ్య సంస్థ, ఐక్యరాజ్యసమితి

తదితర సంస్థల రూపాలలో, డాలర్‌తో ఇతర దేశాల మారకపు విలువల నిర్ణయంలో, తన ఆయుధాల ఉత్పత్తిని ఇతర దేశాలు కొనేటట్టు చేయడంలో అమెరికా సామ, దాన, భేద దండోపాయాలన్నిటినీ ప్రయోగించింది. ఆయా దేశాలు తమ ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలకు పారిశ్రామిక, వ్యవసాయ ఉత్పత్తులకు ఇవ్వాల్సిన ప్రాధాన్యతను పక్కనపెట్టి అమెరికా కనుసన్నలలో అమెరికా, యూరప్ ప్రయోజనాలకనువుగా ప్రణాళికలను, బడ్జెట్లను రూపొందిస్తూ వచ్చాయి.

భారతదేశం ఇలా పేద ప్రజల అభివృద్ధి ప్రణాళికలకు ప్రాధాన్యత ఇవ్వకుండా అమెరికా, యూరప్ దేశాల సరుకులను, సేవలను కొనుక్కునే కొనుగోలు శక్తిగల మధ్యతరగతి సంపన్న వర్గాలకనువుగా ప్రాధాన్యత ఇస్తూ వచ్చింది. తద్వారా లక్షల కోట్లకు దేశ సంపద పెరిగినప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదాయం, బడ్జెట్లు పరపతి సౌకర్యం పెరిగినప్పటికీ ప్రజల జీవన ప్రమాణాలు వేగంగా పెరగకపోగా మూడింట రెండు వంతుల ప్రజలు రోజురోజుకు పేదరికంలోకి నెట్టబడుతున్నారు. ఉపాధి కోల్పోతున్నారు.

3.8. కుటుంబ నియంత్రణ

1975 ఎమర్జెన్సీలో కుటుంబ నియంత్రణను నిర్బంధంగా, బలంగా ప్రచారం చేశారు. ఇద్దరు లేక ముగ్గురు చాలన్నారు. అప్పుడు అందరికీ ఉపాధి లభిస్తుంది, చక్కగా చదివించుకొని పిల్లలను ఉన్నతంగా ఎదిగించవచ్చు అన్నారు. ఆ తరువాత మేం ఇద్దరం మాకిద్దరు, మేం ఇద్దరం మాకొక్కరు అని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రచారం చేశాయి. ఒకే ఒక కూతురు కని కుటుంబ నియంత్రణ చేసుకుంటే ఆడపిల్ల పేరిట ప్రభుత్వం ఆర్థిక సహాయం చేసి డిపాజిట్ చేస్తుందని పథకాలు ముందుకు తెచ్చాయి. ప్రజలు అలా కూడా ఆలోచించి ఒక్కరినో, ఇద్దరినో కని కుటుంబ నియంత్రణ చేసుకున్నారు. కానీ వారి పిల్లలకు ఆధునిక అభివృద్ధిలో వాటా అందలేదు. వారు ఎదిగే క్రమంలో ప్రభుత్వ ఉచిత విద్య, ఉచిత వైద్యం, ఉచిత సౌకర్యాలు క్రమక్రమంగా ప్రభుత్వాలు తగ్గిస్తూ వచ్చాయి. ప్రైవేటు విద్యను, వైద్యాన్ని ప్రోత్సహిస్తూ వచ్చాయి.

3.9. మిగులు జనాభా సిద్ధాంతం

అలా పేద తల్లిదండ్రులు, తమ పిల్లలు ఎదిగి తమను వృద్ధాప్యంలో చక్కగా పెంచిపోషిస్తారని ఆశ పడ్డారు. ఇద్దరు కష్టపడి సంపాదించి పిల్లల కోసమే జీవితాల్ని అంకితం చేసినా పిల్లలు మధ్య తరగతిగా ఎదగలేక పోయారు. ప్రభుత్వం ఉచిత విద్య, ఉచిత వైద్యం, ఉచిత గృహ వసతి తదితరాలన్నిటినీ ముఖ్యంగా సామాజిక బాధ్యతను వదిలివేయడంతో ఈ పరిణామం సంభవించింది. తమ పిల్లలు ఎదుగుతారని ఆశపడ్డ తల్లిదండ్రులను, అలాంటి జనాభాను ఎదిగించకపోగా కొందరు ప్రజావ్యతిరేక అర్థశాస్త్రవేత్తలు, సామాజిక శాస్త్రవేత్తలు వారిని మిగులు జనాభా అని సిద్ధాంతీకరించారు.

మానవ వనరులు విలువైనవి. ఎంత పనిచేస్తే అంత సంపద ఉత్పన్నం అవుతుంది. పనిచేసే చేతులకు పనికల్పించలేకపోగా వారిని మిగులు జనాభా అని పిలవడం సమాజానికి అక్కర్లేదనే స్థాయికి మాట్లాడ్డం, పారిశ్రామిక ఉత్పత్తులను కొనే కొనుగోలుదారులుగా మార్కెట్ వినియోగదారులుగా ఉండగలిగే వారు మాత్రమే ప్రజలని, మిగతా వారు దేశానికి అక్కర్లేని మిగులు జనాభా అని వారి వర్గీకరణ. ఇలాంటి సూత్రీకరణలు దేశద్రోహం కన్నా హీనమైనవి.

3.10. విధ్వంస మూలకారణాలు

అలాంటి వారి చేతుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రణాళికలు, బడ్జెట్‌లు ఉండడం వల్ల ప్రజలు పేదరికంలో కూరుకుపోతున్నారు. జీవితాలు విధ్వంసం అవుతున్నాయి. బి.ఎస్.రాములు గారు ఈ నేపథ్యాన్ని తీసుకొని జీవితంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్ణయాలు, విధానాలు, వేస్తున్న ప్రభావాల వల్ల ఎలా శిథిల మవుతున్నాయో 2000లో ప్రచురించిన 'మమతలు-మానవ సంబంధాలు', 2003లో ఆసియా సోషల్ ఫోరమ్, హైదరాబాద్ మహాసభల్లో ఆవిష్కరించిన 'వేపచెట్టు', 2005లో కొక్కుల భాస్కర్, గూడూరి సీతారం సంపాదకత్వంలో వెలువరించిన 'బతుకుపయనం' కథా సంపుటాల్లో చిత్రించారు.

ఆధునిక సామాజిక తత్వవేత్తగా తెలంగాణ ప్రజల జీవన విధానాన్ని సామాజికాంశాలను వీరి రచనల ద్వారా అందిస్తున్నారు. తెలంగాణ సామాజిక పరిస్థితులను కథల నిండా నిక్షిప్తం చేస్తున్నారు. ఇంకా లోతుగా వెళ్తే తెలంగాణలో ఉండేటటువంటి చేనేత కార్మికులు, బీడీ కార్మికుల యొక్క జీవన విధానం వారి యొక్క స్థితిగతులు బి.ఎస్.కథల నిండా ఉంటాయి. బి.ఎస్.రాములు చేనేత కులవృత్తి నుండి వచ్చిన రచయిత కాబట్టి వారి యొక్క జీవన చిత్రణను కళ్ళకు కట్టినట్లుగా చూపారు.

3.11 నేతన్నల వెతలు

దేశానికి రైతు వెన్నుముక ఎలాగో, అలాగే నేతన్న కూడా రైతన్న భోజనం పెడితే, నేతన్న బట్టను ఇస్తున్నాడు. కూడు, గుడ్డ అనేవి సగటు మానవునికి కనీస అవసరాలు. కాబట్టి వీరు లేనిదే మానవ మనుగడ లేదు. కాని నేటి వ్యవస్థలో కూడు, గుడ్డ పెట్టే వారికే అవి లేకుండా పోతున్నాయి.

చేనేత అంటే చేతితో నూలును తీసి నేత నెయ్యడం. ఈ వృత్తిని మానవుడు, ఆకులు, చెట్టు బెరడులు కట్టే దశ నుండి బయటికి వచ్చిన నాటి నుండి వున్నది. కొన్ని శతాబ్దాలుగా ఉన్నటువంటి ఈ వృత్తి ఇప్పటి ఆధునిక కాలంలో చేదు అనుభవాలను చవిచూస్తుంది. ఈ వృత్తిలో బ్రతికేవారు ఆ వృత్తిని వదులుకోలేక ఇంకొక వృత్తిలోకి వెళ్ళలేక వారియొక్క జీవన గమనంలో ఎన్నో ఆటుపోట్లును చవి చూడవలసి వస్తుంది.

ప్రస్తుత పరిస్థితులలో చేనేత వారి యొక్క దుర్భరమైన దారిద్ర్య అవస్థలు ఎన్నో రకాలుగా వున్నాయి. మిల్లులు, యంత్రాలు వచ్చాక చేనేత వారి యొక్క నేతకు ఆదరణ కరువైంది. వారికి చేసుకోవడానికి పనులు లేక, చేనేత వృత్తులను వదలలేక కుటుంబాలు వీధిన పడిపోవడం ఇప్పుడు మనం చూస్తున్నదే. ఇంట్లో ఉండే యజమాని వేరే పని చేసుకోలేకపోవడం వలన ఏదీ తోచక అలా తిరుగుతూ తాగుడుకు బానిస అయిపోతున్న వైనం కూడా మనం చూస్తున్నాం. ఇదే కులవృత్తి నుండి వచ్చిన వారు మన రచయిత కాబట్టి ప్రతీ విషయాన్ని కళ్లకు కట్టినట్లుగా చిత్రీకరించారు.

3.12. చేనేత వృత్తివారి వలసలు

"యంత్రాలతో ఉత్పత్తి వల్ల భారతదేశంలోని కులవృత్తులు, కుటీర పరిశ్రమలు దెబ్బతిన్నాయి. చేనేత వృత్తివారు బట్టల మిల్లులో కార్మికులుగా పని చేయడానికి పొట్ట చేత పట్టుకొని వలస వెళ్ళారు."[13] అలా బొంబాయిలాంటి నగరాలకు చేనేత కార్మికులు పనులు లేక వలస వెళ్ళారు. కాని అక్కడ కుటుంబంతో సహా జీవించడానికి తగిన జీతాలు, కూలీలు సరిగా ఉండేవి. కావు.

అలాంటి సమయంలో కూడా ధైర్యాన్ని విడిచి పెట్టకుండా ఎన్నో ఉద్యమాలు చేస్తూ చేనేత కార్మికులు భద్రతను, సౌకర్యాలను సాధించుకున్నారు. "వరంగల్, హైదరాబాద్‌లో ప్రభుత్వం తరపున బట్టల మిల్లును నెలకొల్పారు. ఆదిలాబాద్ జిల్లా సిర్పూర్‌లో బట్టల మిల్లును ఏర్పాటు చేయించారు. తద్వారా వేలాది మందికి ఉపాధి కలిగింది. వ్యవసాయం తరువాత అతి ఎక్కువ మందికి ఉపాధి కల్పించిన చేనేత వృత్తిలో లక్షలాది మందికి పని కల్పించ లేకపోయారు. అందువల్ల బొంబాయి, సూరత్ నగరాలకు వలసలు పోతూనే ఉండేవారు."[14]

చేనేత కార్మికులకు చేతి పనిముట్లను వినియోగించలేక, మిల్లు బట్టలతో పోటీపడలేక పాత సామానుల వాడికి అమ్మివేసిన సంఘటనలను కూడా చిత్రీకరించారు. అంటే పరిస్థితి యొక్క తీవ్రత కనిపిస్తుంది. చేనేత పనిముట్లపై ఎంత ప్రేమ ఉన్నా సరే తప్పని పరిస్థితిలో అలా చేయవలసి వచ్చేది.

3.13. నేతన్నల ఆత్మహత్యలు :

రైతన్న పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంటే నేతన్నలు ఉరివేసుకుంటు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. అప్పులు ఎక్కువై, వడ్డీలు కట్టలేక ఏం చేయాలో తోచక అప్పులు ఇచ్చే వారు బాకీలు కట్టమని హెచ్చరిస్తుంటే ఇవేవి నేతన్నలు చేయలేక ఆత్మహత్యే శరణ్యం అవుతుంది అని రచయిత చెప్పారు. ఇక్కడ ఉండే నూలు బట్టకు గిట్టుబాటు ధర ప్రభుత్వం కల్పించలేకపోతోంది.

'బతుకుపయనం' కథల సంపుటిలో ఏడు కథలున్నాయి. చివరి కథ 'జీవనయానం' నిజానికి చిన్న నవల. 'నానమ్మ', 'బతుకుపయనం', 'ప్రశాంతం', 'ఇంటల్లుడు', 'జీవనయానం' కథల్లో చేనేత వృత్తి కులవృత్తిగా పద్మశాలీల జీవితం, సంస్కృతి చిత్రించారు.

స్వాతంత్ర్యానంతరం చేనేత కులాలు కులవృత్తి గిట్టుబాటు కాకపోవడం వల్ల ఆధునిక అభివృద్ధిలో, ఆధునిక విద్యతో నూతన అవకాశాలను అందుకోవాలని ఆశించడంతో అందుకున్న అవకాశాలు చిత్రించారు.

అలాగే బొంబాయి బట్టల మిల్లులో కార్మికులుగా పనిచేయడంతో సింగరేణి కార్మికులుగా పనిచేసే క్రమంలో కంపల్సరీ రిటైర్‌మెంట్ వల్ల కోల్పోయిన ఉపాధి అవకాశాలు, ఇతర చిన్నచిన్న వృత్తుల్లో చేరి పేదరికంలోకి జారిపోవడం కుటుంబాలు, జీవితాలు గ్లోబలైజేషన్ వెల్లువలో శిథిలమవుతూ విధ్వంసం కావడం ఈ కథల్లో చిత్రించారు.

సమాజంలో కొన్ని అవకాశాలు అందుకొని ఎదుగుతున్న వాళ్ళు ఇతరులకి ఎలా సహాయం చేయాలో మార్గదర్శకంగా ఎలా వుండాలో, ఆదర్శవంతమైన జీవితం ఎలా వుండాలో 'నానమ్మ', 'బతుకుపయనం', 'ఇంటల్లుడు', 'జీవనయానం' కథల్లో చిత్రించారు.

పాదసూచికలు

1. 'వేపచెట్టు' కథల సంపుటి – బి.ఎస్.రాములు ; పుట : 46, 47
2. పైదే ; పుట 47
3. అంబేడ్కర్ రచనలు 12వ సంపుటి
4. తెలంగాణా తల్లి ఎరుక – బి.ఎస్.రాములు ; పుట : 16
5. ఆధునిక కథా సరిత్సాగరం, కరీంనగర్ జిల్లా కథలు–మొదటి సంపుటి – సం.వనమాల చంద్రశేఖర్; పుట : VIII
6. సామాజిక న్యాయం అంటే ఏమిటి – బి.ఎస్.రాములు ; పుట : 46
7. మమతలు–మానవ సంబంధాలు – బి.ఎస్.రాములు; పుట : 2
8. పైదే పుట : 10
9. పైదే పుట : 10
10. పైదే పుట : 15
11. పైదే పుట : 127
12. బతకుపయనం కథలు–ప్రశాంతం; పుట : 40
13. బి.ఎస్.రాములు కథలు–ఒక పరిశీలన – కర్రె సదాశివ్; పుట : 117
14. బతుకుపోరు నవల – సామాజికత – ఎం.ఫిల్ సిద్ధాంత గ్రంథం – పల్లా మాలతి చంద్ర; పుట : 80

నాలుగో అధ్యాయం

బతుకుపయనం కథలు
సామాజిక స్పృహ

సాహిత్యం సమాజాన్ని చిత్రించడంతో పాటు ఒక సందేశాన్నివ్వాలి. అది చదువరులు స్వయంగా గ్రహించగలిగేదిగా ఉండాలి. సాహిత్యం ఉత్తమ ఆదర్శాలను సమాజానికందించాలి. 'బతుకుపయనం'లో ప్రజల కష్టసుఖాల్లోను పీడితులకు నైతిక మద్దతు అందించాలి. సాహిత్యం, కళలు, ప్రజల వ్యక్తిత్వాల్ని, సంస్కృతిని తీర్చదిద్దగలిగి ఉండాలి. అప్పుడు 'సహితస్యభావం సాహిత్యం' అనే ఆర్యోక్తి నిజమవుతుంది.

సాహిత్యం ఎప్పుడూ సమకాలీన సమాజాన్ని ప్రతిబింబించాలి. సాహిత్య రచనలు కూడా మానవ సమాజాన్ని అందులోని లోపాల్ని ఎత్తి చూపి, మానవ ప్రగతికి బాటలు వేయాలి. అటువంటి సాహితీ వ్యవసాయం చేసిన రచయితలలో బి.ఎస్.రాములు సుప్రసిద్ధులు.

బి.ఎస్.రాములు సామాజిక స్పృహ కలిగిన రచయిత. ప్రతి కథలో సామాజిక స్పృహ నిండుకుండలా కనిపిస్తుంది. స్వేచ్ఛా, సమానత్వం, ప్రజాస్వామిక సమాన అవకాశాలు, ప్రేమ, కరుణ, సోదరత్వం, సామాజిక న్యాయం, సామాజిక మార్పు కోసం సామాజిక స్పృహతో కథలు, నవలలు, వ్యాసాలు రచిస్తుంటారు.

కథల్లో పాత్రల రూపకల్పనలో, సన్నివేశ చిత్రణలో, సంఘటన కల్పనలో స్వభావ చిత్రణలో రచయిత సామాజిక స్పృహ అడుగడుగునా కనపడుతుంది. సామాజిక తత్వవేత్తగా పరిణతి చెందిన బి.ఎస్.రాములు కథల్లో సామాజిక తత్వమే కాకుండా జీవన తత్వం, జీవితానికి మార్గదర్శకత్వం, సమాజం ఎలా వున్నదో చిత్రించడంతో పాటు ఎలా వుంటే బాగుంటుందో కూడా కథలో చిత్రిస్తారు.

"సోవియట్ రష్యాలో సోషలిజం కుప్పకూలిపోయాక సమ సమాజం అనే భావజాలానికి ప్రపంచ కేంద్రం లేకుండా పోయింది. తూర్పు యూరప్ పరిణామాలు సమసమాజ భావాన్ని బలహీన పరిచాయి... ఆధునిక అభివృద్ధి, అధికార వికేంద్రీకరణ, అసమానతలు పెరుగుతున్న కొద్దీ అసహనం, అసంతృప్తి పెల్లుబుకుతున్నది. అభివృద్ధిని, అధికారాన్ని, అందుకున్న వారికి అందుకోదలుచుకున్న వారికి మధ్య నిరంతరం అగాధం, సంఘర్షణ పెరుగుతున్నది. అది సామాజిక మార్పుల్ని అభిలషించే దిశగా మారితే విప్లవం. అది వ్యక్తి ప్రయోజనానికనువుగా కుదించబడితే స్వార్థం, బంధుప్రీతి, అరాచకం, విలువల

పతనం రాజ్యమేలుతాయి. అలా వ్యవస్థ మార్పుపై ఎక్కుపెట్టాల్సిన చైతన్యాన్ని కాలరాస్తున్నారు."[1]

సోషలిస్టు వ్యవస్థ అంతరించాక ఉమ్మడి కుటుంబం విచ్ఛిన్నం అయ్యాక సోషలిస్టు కుటుంబ సంబంధాలను ఎలా వుండాలో తన కథల్లో చిత్రించారు. ప్రజాస్వామికంగా ఉమ్మడి కుటుంబంగా కొనసాగే సోషలిస్టు కుటుంబాన్ని 'రాత్రిపూలు', 'బతుకుపయనం', 'జీవనయానం', 'ఇంటల్లుడు' కథల్లో చిత్రించారు. వ్యక్తిని కేంద్రంగా భావించే ఫెమినిస్టులకు భిన్నంగా ఆదర్శ ప్రాయంగా కుటుంబాన్ని సోషలిస్టు కుటుంబంగా మార్చుకోగలిగే తీరును నిజమైన సోషలిస్టు పాత్రలను ఈ కథల్లో చిత్రించి ఒక ఆదర్శ కుటుంబాన్ని అన్నగా, కొడుకుగా, కూతురుగా, కోడలుగా, అల్లుడుగా, వివిధ పాత్రల్లో, కర్తవ్యాల్లో ఎలా ఆదర్శంగా ఉండాలో, ఉన్నారో, ఉన్న వ్యవస్థ పరిమితుల్లో ఎలా సోషలిస్టు కుటుంబాన్ని నిర్మించుకోవచ్చో చూపారు. ఫెమినిస్టులు తమ కథల ద్వారా, నవలల ద్వారా కుటుంబ వ్యవస్థపై లేవనెత్తిన ప్రశ్నలకు పరిష్కారాలు బి.ఎస్.రాములు గారి కథల్లో దొరుకుతాయి. శ్రామిక కులాల్లో పుట్టి పెరిగి కులవృత్తుల నుండి విద్య వైద్య, వ్యాపార, సాఫ్టువేర్ రంగాల ద్వారా మధ్యతరగతిగా ఎదుగుతున్న కొత్త తరాన్ని సాహిత్య గౌరవంతో తెలుగు పాఠకులకు పరిచయం చేశారు.[2]

4.1 ఫెమినిజం-కుటుంబ వ్యవస్థ

ఫెమినిజం వచ్చాక ప్రేమ, పెళ్ళి, కుటుంబం నిర్వచనాలు మారిపోయాయని, అందుకు అనుకూలంగా మారాలని 'ఇంటల్లుడు', 'బతుకుపయనం', 'జీవనయానం' కథల్లో ఫెమినిజం జీవితంలో తెచ్చిన మంచిని వివరిస్తాయి. తాను ప్రేమించిన రాధ మరొకరిని పెళ్ళి చేసుకోబోయే విషయమే ప్రపంచం మునిగిపోయే సమస్యగా కనపడుతుంది కాని, తాను నిరాకరించిన సావిత్రి, లత కూడా తన లాగే బాధ పడ్డారని గ్రహించలేకపోతాడు.

ఈ కథల సంపుటిలో మరో అంతఃస్రవంతి కొనసాగుతుంది. అది సామాజిక అర్థశాస్త్ర విశ్లేషణ. మార్క్సిస్టులు రాజకీయ అర్థశాస్త్రంతో సామాజిక విశ్లేషణ చేస్తారు. అంబేద్కర్ సామాజిక అర్థశాస్త్రంతో సామాజిక విశ్లేషణ చేస్తారు. కులాన్ని ఒక ప్రధాన వైరుధ్యంగా గుర్తించని వారు రాజకీయ అర్థశాస్త్ర రీత్యా కాకుండా సామాజిక అర్థశాస్త్ర రీత్యా సమాజాన్ని విశ్లేషిస్తారు. బి.ఎస్.రాములు గారు ఇలా ఈ కథలలో సామాజిక అర్థశాస్త్రాన్ని నిక్షిప్తం చేశారు. అది ఈ లఘు సిద్ధాంత వ్యాసంలో విశ్లేషించడం దీని పరిధికి మించిన పని. అందువల్ల వాటి విశ్లేషణలోకి వెళ్ళడం లేదు.

వృద్ధుల పట్ల అనుబంధాలు తగ్గిపోతున్న ఈ కాలంలో 'నానమ్మ' కథ మరో కోణాన్ని ముందుకు తెస్తూ ఆత్మీయ అనుబంధాల్ని గుర్తు చేస్తుంది. రాత్రిపూసిన పూలు వెలుగు

రేకలు విచ్చుకునే సరికి ఎలా అదృశ్యమవుతాయో ఎందుకు అదృశ్యమవుతాయో ఒక దార్శనికతను 'రాత్రిపూలు' కథలో చూడవచ్చు.

ఎదగదలచుకున్న వారికి ఈ ప్రపంచం చాలా చిన్నది అని, ఒక స్థాయి ఎదుగుదలతో సంతృప్తిని చెంది ఊర్కోవడం సరైనది కాదని ఎదుగుదల కోసం నిరంతరం కొత్త ప్రణాళికలతో ముందుకు సాగుతునే ఉండాలని 'బతుకుపయనం' కథ యువతరానికి ఒక ఉత్తేజాన్ని, సందేశాన్ని అందిస్తుంది. సామాజిక అసమానతల్లో కాస్త ఎదిగిన వారు చేయూతనిస్తే వాళ్లు ఎదిగే తీరును 'ఇంటల్లుడు', 'జీవనయానం' కథలు తెలుపుతాయి.

గ్లోబలైజేషన్, ఆటోమైజేషన్ వల్ల, ప్రైవేటీకరణ వల్ల ప్రజలు ఉపాధి ఎలా కోల్పోతున్నారో, జీవితంలో నిలదొక్కుకోవడం ఎలా కష్టమౌతున్నదో 'ప్రశాంతం' కథలో చూడవచ్చు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ఉద్యమిస్తున్నప్పుడు నిర్బంధాలు ఎలా వెన్నాడుతున్నాయో పోలీసు నిర్బంధం ప్రజల జీవితాల్లోకి చొచ్చుకొని వచ్చి కుటుంబ సభ్యుల ముందే ఎలా మానభంగాలు చేస్తున్నారో దాన్ని అడ్డగిస్తున్న వారిని తప్పుడు కేసులు పెట్టి ఎలా జైళ్లకు పంపిస్తున్నారో అయినప్పటికీ అన్ని కష్టాల్లోనూ బాధిత స్త్రీలు ఎంత ఆత్మవిశ్వాసంతో జీవిస్తూ ప్రభుత్వ నిర్బంధాలను ఎలా ఎదుర్కొంటున్నారో అలా జీవించడానికి ఎంత ఆత్మవిశ్వాసం అవసరమో 'జైలు జీవితం'లో అపూర్వంగా చిత్రించారు.[3]

4.2. సామాజిక స్పృహ – స్వభావ చిత్రణ

'నానమ్మ' కథలో సుగుణ బాల్యం నుండి నానమ్మతో అనుబంధాలు, ఆప్యాయతలు, జ్ఞాపకాలు ఆమె స్వభావాన్ని నానమ్మ తీర్చిదిద్దిన క్రమం ఈ కథ ప్రారంభం కనపడుతుంది. "నానమ్మ నిజంగా పోయిందా... నాకు లేదు... నాలో సగం నానమ్మ. మిగతా సగం అమ్మ. అమ్మ నానమ్మ కలిపితే నేను .... వాళ్ళిద్దరు కాకుండా నాలో నాదంటూ వ్యక్తిత్వం వేరే ఉందా... ఏమో... ఆ విషయం తెలిసిన వాళ్ళు చెప్పాలి.

నాపై నాన్న ముద్రా, తాత ముద్రా తక్కువ. నాపై అమ్మ కన్న నానమ్మ ముద్ర ఎక్కువ. నా పెంపకం అలా జరిగింది. నన్ను నా స్నేహితురాళ్ళు అచ్చం నానమ్మల్లా మాట్లాడుతావేమే అని వెక్కిరించే వాళ్ళు. నాకా మాట కోపం తెప్పించే బదులు ఎంత సంతోషాన్నిచ్చేదో, నానమ్మలా ఎంతో పెద్దదయి పోయినట్టు... ఎంతో తెల్సిపోయినట్టు...."[4]

రమేష్ సమాజం కోసం, కుటుంబం కోసం జీవితాన్ని ధారపోసి, ప్రేమ విఫలమైనప్పటికి, నాయకత్వం, ఇతరలు ఎగరేసుకుపోయినప్పటికి, ఎవరుకువారు సుఖంగా బ్రతుకుతున్నప్పటికి, తాను ఎన్నుకున్న మార్గంలో, నడుస్తున్న పాత్రగా చిత్రించారు. "ప్రమి నా భావాలే నన్ను బతికిస్తున్నాయి. నీవు సమాజం కోసం చేస్తున్నావని

అంటున్నదంతా నిజానికి నా కోసమే. అదే నా ఆనందం. నా భావాలు వదులుకోమనడం నన్ను చనిపోవాలని కోరడం తప్ప వేరు కాదు."[5] ఇలా రమేష్ లాంటి వాళ్ళ త్యాగాలు, భావాలు, రాత్రిపూలుగా వర్ణించారు రచయిత.

బతుకుపయనం కథలో ఒక చిన్నపాటి సమాజం, పాత్రల స్వభావాల రూపంలో కనబడుతుంది. పెళ్ళి సంబంధాల కోసం తల్లిదండ్రుల వెతుకులాట ఎలా ఉంటుందో శివరాజం, చంద్రమౌళి పాత్ర ద్వారా చిత్రించారు. పెళ్ళిసంబంధాల సందర్భంగా బంధుమిత్రులు సహకరించే స్వభావాల్ని రామేషం, గంగాధర్, పాత్రలలో చూపించారు. చెల్లెలు అన్న చదువుకోవడం కోసం, బీడీలు చేసి కష్టపడే స్వభావాలు, చెల్లెల్ల కోసం అన్న ఉద్యోగం వచ్చాక వారి భవిష్యత్తు గురించి ఆలోచించి మంచి సంబంధాలు చూసి పెళ్ళి చేయడం అనే స్వభావాలు, ఒక ఆదర్శ కుటుంబాన్ని తెలియజేస్తాయి. కష్టాల్లో, సుఖాల్లో ఎవరికి వారు విడిపోకుండా కలిసికట్టుగా ఉండి పరస్పరం ఎదిగే పాత్రలను కుటుంబాన్ని రచయిత చిత్రించడంతో, ఒక ప్రత్యేక దృష్టిని పెట్టినట్టు కనిపిస్తుంది.

ఎదగడం ఎప్పటికీ ఆగిపోకూడదని, నిరంతరం ఎదగడానికి ప్రయత్నించడం మానవ స్వభావంగా ఉండాలని, రవి ప్రకాష్, అమరేందర్, దివ్య, పార్థసారధి విశ్వంధర్, పాత్రల ద్వారా చిత్రించారు.

"మాకు వెనకటి కాలంలో టీచర్ ఉద్యోగం దొరకడమే గగనంగా వుండేది. మీ జనరేషన్లో కొందరైనా స్టేట్స్ పోగలిగారు. మిమ్మల్ని, మీ ఉత్సాహాన్ని చూస్తుంటే నాకు లాలాలజపతిరాయ్, గాంధీ, నెహ్రూ, అంబేద్కర్, ఎ.కె.రామానుజం, సర్వేపల్లి రాధాకృష్ణన్ గుర్తొస్తున్నారు. 150 ఏళ్ళ క్రితం నుండి వాళ్ళకు యితర దేశాలకు వెళ్ళే అవకాశాలు వచ్చాయి. అలాంటి అవకాశాలు యిప్పుడు మీకు వస్తున్నాయి. మీ జీవితం యిపుడే మొదలైంది. ఇక ఉన్నత శిఖరాలకు ఎదగడం మీ సంకల్ప బలాన్ని బట్టి, ఉత్సాహాన్ని బట్టి వుంటుంది."[6]

'ప్రశాంతం' కథలో లక్ష్మణ్, సింగరేణిలో ఉపాధి కోల్పోయాక, మారిపోయిన, స్వభావం, వ్యక్తిత్వం హృదయాన్ని కలిచివేస్తుంది. లక్ష్మణ్ భార్య విమల ఎన్నో కష్టాలు భరిస్తూ మౌనంగా రోధిస్తుంది. దారిద్ర్యం, నిరుద్యోగం, మనుషుల స్వభావాలను, జీవితాలను ఎలా విధ్వంసం చేశామో ఈ కథలో చిత్రించారు.

"ఎల్లయ్యకు అల్లుని స్థితి చూసి ఏం చేయాలో తోచలేదు. తన కండ్ల ముందే ఎదిగిన కొందరి జీవితాలు...శిథిలమై విధ్వంసమవుతున్న సమాజం. బైరాగితత్వాలు సమాజ విధ్వంసాన్ని ప్రశాంతంగా భరించే శక్తి నిస్తున్నాయి.

ఆ తత్వాలు ఎందుకు పెట్టినయో ఎల్లయ్యకు ఇప్పుడు అర్థమైంది. విమలకు

అర్థంకాలేదు. తండ్రిని, భర్తనుచూసి ఎవరూ చూడకుండా కన్నీరుకారుస్తోంది.

ఆమె దు:ఖంలో కోపంలేదు...ప్రశాంతంగా ఏడుస్తోంది.

ఆ ప్రశాంతంలో ఒక నిరాశ. ఒక నిర్వేదం.

అది ఒక సమాధి దశ.

రేపటి సమాజం కూడా ఇంతేలే అని ఆశలన్ని సమాధి అవుతున్న దశ.

తండ్రి ఎల్లయ్య బైరాగితత్వం రాగం తీస్తున్నడు.

ఇల్లంతా విధ్వంస చిహ్నాలకు బదులుగా విషాదం ప్రశాంతంగా చిక్కగా పరుచుకుంటున్నది."[7]

'జైలుజీవితం'లో జైలు గురించి భయపడే స్వభావం నుంచి జైలును ప్రేమించే దశకు మారిన క్రమాన్ని చిత్రించారు. గ్రామీణ జీవితం, పోలీసుల నిర్బంధం వలన ఎలా విధ్వంసం అవుతున్నదో, ఎలా అత్యాచారాలకు గురవుతున్నదో మహిళలను, పిల్లలను, భర్త, తల్లిదండ్రులు, అత్తమామలు ఇంట్లో ఉండగానే వారిపట్ల నీచంగా ప్రవర్తించడం ఈ కథలో చిత్రించారు.

పల్లె పేదల జీవితాలు ఎంత దుర్భరం అవుతున్నాయో, జైలే ఎన్నోరెట్లు బాగుంటుందో ఇలా పేర్కొన్నారు.

"వాళ్ళ మాటలు వింటుంటే అందరికీ భద్రత, మూడు పూటలా భోజనం మనిషి వికాసానికి తోడ్పడే విధంగా ప్రపంచమంతా జైలుగా మారితే ఎంత బాగుండు అనిపిస్తున్నది."[8]

'ఇంటల్లుడు' కథలో సాధారణంగా అల్లుళ్ళ గురించి వినే కథలో చూసే స్వభావానికి భిన్నమైన మానవీయ ప్రవర్తనను చిత్రించారు. ఒక్క మాటలో చెప్పాలంటే

"ఇంటల్లుడు పెద్దకొడుకుతో సమానం. పెద్దకొడుకు తండ్రి తర్వాత తండ్రంత. నువ్వు పూనుకోకపోతే ఈ పెండ్లెట్లయితది"[9]

ఇలా చెల్లెల్లకు, బావమరుదులకు, మరదలకు, టీచర్‌గా ఎదిగిన ఒకే ఒక్కడు, ఆధారమైనప్పుడు అందించాల్సిన సహకారం, ఉదాత్త పాత్ర చిత్రీకరణ రవీంద్ర.

4.3. తెలంగాణ సంస్కృతి

'నానమ్మ' కథలో నానమ్మ సంవత్సరీకంకు రావాలని అన్నయ్య ఉత్తరం రాయడంతో కథ మొదలవుతుంది. చనిపోయిన వారికి దశ, దిన కర్మలు, మాసికాలు, సంవత్సరీకాలు చేస్తుంటారు. కూతురు పెళ్ళికోసం సంవత్సరీకాన్ని, కాస్త ముందుగా జరిపే సంస్కృతి

ఇందులో కనపడుతుంది. పెళ్ళి ముహూర్తాలు, ఉగాది తర్వాతే ఉన్నాయని, ఇప్పుడు వచ్చే ముహూర్తాలు వదులుకుంటే కష్టం అని ఇలా చేస్తారు. తాత సమాధి పక్కన నానమ్మ సమాధి కట్టాలనే ఆ పాత్ర సంస్కృతి కనబడుతుంది.

తండ్రి పోగానే తల్లి బతుకు విచ్ఛిన్నమయి కుటుంబం రద్దయి నెలకు ఒక కొడుకు ఇంటతిరిగే సంస్కృతి కనబడుతుంది. దీనిపై "నాన్నపోంగనే అమ్మ బతుకు ఎట్లయిపోయింది. ఒక నెల ఆ అన్నయింట్ల, ఒక నెల ఈ అన్నయింట్ల. ఓ నెల తమ్ముని యింట్ల. ఇదేం తిరుగుడు నెలకోసారి. వాళ్ల ఉద్యోగాలు యిట్లా నెలకో చోటికి బదిలీ చేస్తే వాళ్లకు ఎట్లా ఉంటుంది.

"బిడ్డ యింటికాడ ఉంటే లోకం ఏమనుకుంటదే... వద్దు" అని అంటది.

ఈసారి అమ్మను తప్పక ఇంటికి తీసుకురావాలె. నానమ్మకు సొంత కూతురిలా ఏళ్ళ తరబడి సేవలు చేసిన అమ్మకు యిప్పుడు విశ్రాంతి కావాలె. వాళ్ళ ఉద్యోగాలు ఇట్లా నెలకోచోటికి బదిలీ చేస్తే వారికి ఎట్లా వుంటుందని ప్రశ్నిస్తుంది సుగుణ. అమ్మమ్మ, నానమ్మ, తాత వంటి పెద్ద మనుషులు ఉండే ఆ సంస్కృతి, వేరుగా ఉంటుంది అని ఈ కథ తెలుపుతుంది.[10]

ఎనకట పెళ్ళిళ్ళు చిన్నప్పుడు జరగేవని శోభనం అనే పండుగను ప్రత్యేకంగా చేసే వాళ్ళు. దాన్ని కాళ్ళగోళ్ళు అని పిలిచే వాళ్ళు.

శాలోల్ల ఇండ్లలో చేనేత వృత్తి, సంస్కృతి కనబడుతుంది. "శాలోల్ల ఇండ్లలో పుల్లని గంజివాసన, తడిపిన నూలు వాసన ఎంతో కమ్మగా ఉండేవి. ఆ నూలు, ఆ రంగులు, గంజి, అన్నీ కలిసి అదో రకం కమ్మని వాసన వచ్చేది. ఆ వాసన రాని ఇల్లు శాలోల్లది అంటే నమ్మబుద్ధి అయ్యేది కాదు."[11]

చేనేత వృత్తి కులాల్లో స్త్రీలు, నేత పనులు, ఇంటి పనులు ఇలా ప్రధాన పాత్ర నిర్వహిస్తుంటారు. అది పద్మశాలీలు జీవన విధానం సంస్కృతి. అందుకే నానమ్మ ఇలా అంటుంది.

"ఈ సంసారం ఒక్క తీరు చేస్తే పురి కట్టిందానే! మనకు పొలాలు లేకపాయె, పెరండ్లు లేకపోయె. ఇత్తులు ఏది కొన్నా ధరలు అగ్గిమండె. కూలికి పోయి ఇత్తులు తెస్తుంటి. మక్క గట్క అందరు తింటె నాకు అది గూడ దొరకక పోవు. గంజిల ఉప్పురవ్వ ఏసుకుని తాగి పంటే ఆకలికి రాత్రికి పేగులు కడుపు నొప్పితోటి వడి తిరుగుతుండె."

"బట్టనేత అంటే ఆడిసేత లేనిది అసలే కాదే. ఇంట్ల ఆడిది పోతే కుల కశిపి పోయినట్టేనే. ఆ యిల్లు యిల్లు గాదు. గాడిదలు పొర్లినట్టుంటది. పోరగాన్లు దుబ్బల పొర్లినట్టుంటరు."[12]

బస్సు దిగిన తరువాత ఇంటికి వచ్చే అతిథులకు ఎదురుగా వెళ్ళి వారి సూట్‌కేసును తీసుకొని పలకరిస్తూ ఇంటికి తీసుకురావడం ఒక సాంప్రదాయం. అలా ఎదురొచ్చిన మేనకోడలు సుజాత గురించి "సుగుణక్కా" అంటూ మేనకోడలు సుజాత పరుగున ఎదురొచ్చింది చూడలేదు. దాని మొహంలో పెళ్ళికళ. దాని మొహంలో నానమ్మే కనపడింది. మళ్ళీ పుట్టిన నానమ్మ నాదేవత. ఎనిమిదినెల్లలోనే ఎంత ఎదిగింది. దేవకన్య వోలెఎదురొచ్చింది. దీని పెండ్లికోసం పెండ్లి నగలేమి చేయించుకొని రాకపోతినని మనస్సు విలవిలలాడింది.[13] అంటే పెళ్ళి సందర్భంగా మేనత్తలు, మేనమామలు ఆడపిల్లలకు అంతో ఇంతో సహకరించే సంస్కృతి వుంది.

'రాత్రిపూలు' కథలో సమాజం కోసం, కుటుంబం కోసం, భావాల కోసం జీవితాలను త్యాగం చేసే సంస్కృతి చిత్రణ కనపడుతుంది. తల్లిగా, చెల్లిగా, ఇల్లాలుగా జీవించే మహిళల సంస్కృతి కూడా చిత్రించారు. అన్నా చెల్లెల అనురాగానికి, ఆత్మీయతకు, వారి మధ్య ఉండే సంస్కారం, సంస్కృతికి నిదర్శనం. "ఈ చెల్లెల్లు పెళ్లిల్లు, పురుళ్లు, కట్నాలు ఖర్చుల కోసం నీవు పెళ్ళి చేసుకోవడం మానేశావు అంటుంది" ప్రమీల. అన్నగా ఇంటికి పెద్దవాడిగా అతడు చేసిన త్యాగాలకు ఈ మాట సంస్కారంగా తెలియజేశారు.

'బతుకు పయనం'లో సంస్కృతి చిత్రణ విస్తారంగా ఉంది. పెళ్ళి సంస్కృతి చక్కగా, వివరంగా చిత్రించారు. సంస్కృతిలో, జీవితంలో, ఆలోచనలో వస్తున్న మార్పులను పాఠకుల ముందు ఉంచుతుంది. పెళ్ళి సంబంధాలు వెతుకులాడే సంస్కృతి కాలానుగుణంగా మారుతూ వస్తుంది.

"మ్యారేజీ బ్యూరోలోంచి బయోడాటా రాసు కొచ్చిన. పిల్లవానితోటి ఫోన్లో మాట్లాడిన. ఈ సంబంధం సెటిల్ అయ్యేట్టు కనపడు తున్నది. వాళ్ళకు కట్నం మీద కూడా పెద్ద పట్టింపులు లేవన్నరు. అమ్మాయికి స్టేట్స్ లో సాఫ్టువేర్ యింజనీర్‌గా పనిచేసే అర్హత లుంటే చాలు అని అన్నరు."[14]

మొదటి తరం విద్యావంతుల ఇళ్లల్లో పని సంస్కృతి ఎలా వుంటుందో ఇలా గమనించవచ్చు.

"ఆ పిల్లవాని తండ్రి లస్మయ్య కటకం లింగయ్య దగ్గర కూలికి బట్టలు నేస్తడట. ఒక తమ్ముడు, యిద్దరు చెల్లెండ్లున్నరట. మొత్తం ఫ్యామిలీల చదువుకొని ఎదిగింది ఆ పిల్లవాడొక్కడే. చెల్లెండ్లు బీడీలు చేస్తున్నరు. తమ్ముడు డిగ్రీ ఫెలయిండు"[15]

అభివృద్ధితో పాటు సంస్కృతి మర్యాదలా కనపడుతుంది.

"ఈతకల్లు తెప్పియ్యనా బావా? సార్ పట్నం నుంచి వచ్చిండు. ఈ పల్లె స్పెషాలిటీ రుచి చూడాలె గద" అన్నాడు గంగాధర్.

"ఈసారు ఏదీ తాగడు. నేనియ్యాల్ల ముట్ట. ఒక్కపొద్దు" అన్నాడు రామేశం."[16]

పెళ్ళి కావలసిన చెల్లెల్లున్న పిల్లవాడికి పిల్లనివ్వడానికి వెనకాడే తీరును ఇలా చిత్రించారు.

"పెండ్లయినంక యిద్దరి సంపాదన ఏడెనిమిదేండ్ల దాక ఇంటికే ఖర్చు పెట్టాలె అని అంటే ఈకాలం ఆడిపిల్లలు ఎవలు వింటరు? పిల్లకన్నా ముందు ఆపిల్ల తల్లిదండ్రులే మెచ్చుతలేరు. నేతశాలోనింటికి పిల్లనిచ్చుడే మహా ఎక్కువ అని ఏదో పిల్లగాడు బెంగుళూర్లోనో, అమెరికాలోనో ఉంటడు. అల్లుడు బిడ్డ మంచిగ సుఖంగ ఉంటరు అనుకుంటే ఈ గంపెడు సంసారం ఎల్లదీసుడా?" అంటూ ఏ సంబంధం ఎట్లా ఎత్తి పోయిందో వివరించాడు గంగాధర్."[17]

పని సంస్కృతి పట్ల గౌరవం కూడా ఈ కథలో చూడవచ్చు.

"వాడు మా అంటండు. అసలు మగ్గం నేసుడు బందు పెట్టుమనిగూడ అంటండు. కని మా అన్న యింటలేడు. ఇన్నిరోజులు కూడు పెట్టిన ఈమగ్గం నేను బందుపెట్ట అన్నడు. పోనీ సొంతంమగ్గం పెట్టుకో అంటే నూలు కొనుక్కచ్చుడు, బట్టలు మల్ల సేట్లకు అమ్ముడు - ఇదంత దంద ఎవలు పెట్టుకుంటరు. నేను కూలికే నేస్త- స్వంతమగ్గం వద్దు అని అన్నడు మా అన్న".[18]

పెళ్ళి సంబంధాల్లో క్వాలిఫికేషన్ కట్నం, ఫ్యామిలీ బ్యాక్‌గ్రౌండ్ ప్రధానంగా చూసే సంస్కృతి.

"పల్లెటూర్లల్ల ఎవలుంటున్రు సార్. అదిగాక వాల్లు ఏమని శరతు పెట్టిన్రంటే - ఆ యిల్లు విప్పద్దు. అల్లనే వుండాలె. ఆ యింట్ల దీపం పెట్టాలె. ఇంటి ముంగట అలుకు చల్లి యింట్ల దీపం పెట్టుటానికే అది అమ్ముతనంటున్నరు - పైసల్లేక కాదు. యిల్లు యిప్పి కట్టె కోయించి అమ్ముతే 50 వేల కట్టె ఎల్తది. పైసల కోసం కాదు అమ్ముతున్నది. మేం ఈ యింట్ల పుట్టి పెరిగినం. అచ్చి వచ్చిన లక్ష్మిగల యిల్లది. రెండులక్షలు పెట్టినా ఈకాలంలో యింత యిల్లు కాదు అని అంటరు. అందుకే ఒకలు ఎడ్లకొట్టంకోసమని 35 వేలకు అడిగినా యియ్యలేదు"[19] అన్నాడు గంగాధర్.

చేనేత సంస్కృతిని ఇలా వర్ణించారు.

"ఇల్లంతా ఫ్యాక్టరీలా వుంది. కుండలో గంజివాసన. గోడకు ఆన్చిన ల్యాకబద్దలు, సరిచేసే ఎరుకలి కుంచె, ఎత్తిన మంచం మీద ఆరేసిన చీరె, మగ్గం గుంట. అటు యిటు పాతిన గుంజలు, నేసిన బట్ట చుట్టిన దోనుగు. ముందుకు చాపి బిగకట్టిన సరిచేసే పడుగు. మగ్గం గుంట పక్కన నాడెలు. భూమికి మూరెడెత్తున ఊచల కిటికీ. అందులోంచి రివ్వున వస్తున్న గాలి. ఆ కిటికిలోంచి నేస్తున్న బట్టపై మెరుస్తున్న వెలుగు..."[20]

ఇంటికి వచ్చిన వారికి టీ ఇచ్చే సంస్కృతి పెరిగింది పిల్లవాడు పేదవాడైనప్పటికీ చదువుకుని ఎదిగిన సాఫ్టువేర్ ఇంజనీరుకు పెద్ద ఫ్యాక్టరీలో ఉద్యోగం చేస్తున్న కూతురునిచ్చేటప్పుడు తమకు తాము తగ్గించుకునే మాట్లాడే సంస్కృతి ఎలా వుంటుందో ఇలా వర్ణించారు.

"లచ్చుంబాయి అందరికి చాయె ఇచ్చింది. తమ యింటికి ఎవరో వచ్చిర్రని తెల్సి యిద్దరు కూతుళ్ళు పరుగు వంటి నడకతో వచ్చారు."

సంబంధం స్థాయికి వాళ్ళు మెచ్చేట్టు మాట్లడ్డం ఒక కళ అని చంద్రమౌళికి తెల్సు. "వాళ్ళు కూడా బాగ ఉన్నోల్లు ఏంకాదు. వాల్ల తండ్రి కూడా బట్టలు నేసినోడే. వాల్లు పెద్దోల్లు కాదు. మీరు చిన్నోల్లు కాదు. వాల్లేమో యిరవై అయిదేండ్ల కింద సదువుకొని పైకి వచ్చిర్రు. మీవోడు యిప్పుడు పైకి వచ్చిండు. వాల్లు గూడా ఎనుకట మీతీర్గనే బతికిర్రు. వాల్లే అని ఏంది? మనందరం గంతే"[21] అన్నాడు చంద్రమౌళి.

పెళ్ళి గురించి పెట్టి పోతల గురించి చర్చించే సంస్కృతి చెప్పారు. కొడుకు పెళ్ళికి వచ్చే ఆదాయంతో చెల్లి పెళ్ళిని చేయాలనే సంస్కృతిని చూడవచ్చు.

"మరి పెట్టుపోతలు ఏమనుకుంటుర్రె" అని ఆరాతీశాడు రామేశం.

ఈ విషయం లస్మయ్యకు మాట్లాడరాదని లచ్చుంబాయి చెప్పుకొచ్చింది.

"పెద్ద బిడ్డకు సంబంధాలు చూస్తున్నం. ఒకటి దొరింపు అయ్యేటట్టున్నది. సర్కార్ ఉద్యోగం రాలేదు. అయిదారు నెల్లల్ల వస్తదంటర్రు. నాలుగు కావాలంటుర్రు. చిల్లర కర్సులు, పైకర్సులు ఒకటి దాటుతై. పెద్దోని పెండ్లితోని పెద్ద బిడ్డ పెండ్లి కర్సు ఎల్లిపోవాలనే కొడుక్కు ముందుగాల సంబంధాలు చూస్తున్నం" అన్నది లచ్చుంబాయి. పిలగానోల్లు అడిగిందానికన్నా ఒకటి ఎక్కువనే చెప్పిన అని లచ్చుంబాయి లోలోన సంతోషపడింది.

అంటే సుమారు అయిదు అనుకున్నాడు చంద్రమౌళి మనస్సులో. చంద్రమౌళికి సంతోషం వేసింది. శివరాజం దివ్యకు ఎనిమిది పది నగదు యిచ్చుటానికి యాడాది నుంచి రడీగ ఉన్నడు. ఇంత తక్కువైతే యింతమంచి పిల్లగానికి తన బిడ్డనే యివ్వచ్చు. ప్రవీణ బి.టెక్ ఫైనల్ చదువుతనే వుండె. దివ్య కన్నా ఎంత ముద్దుగుంటది – అని మనస్సులో కొట్టుకుంది. తన కూతురు ఫోటో కూడా వెంట తీసుకొస్తే ఎంత బాగుండేది అనుకున్నాడు చంద్రమౌళి."[22]

బెంగుళూరు నుంచి లీవు దొరకక పెళ్ళికి అయిదురోజులు ముందు మాత్రమే రావడం పెళ్లివేగంగా జరగడం, పెళ్ళయిన మూడు రోజులకే హనీమూన్ వెళ్ళిపోవడం మారుతున్న సంస్కృతిని చిత్రించారు. అలా కొత్త సంస్కృతి ఎలా వచ్చిందో వివరణ

కూడా పాత సంస్కృతిలో పోల్చి చెప్పడం చూడవచ్చు.

"మనచిన్నప్పుడు పది పదిహేనేండ్లకే లగ్గాలైనై. పండుగు పండుగుకు అల్లుడు బిడ్డ అటు ఇటు తోల్కపోవుడు, తోల్కచ్చుడు ఉంటుండే. అట్లా సుట్టరికం, మనుషులు పరిచ్చయం అవుదురు. పాతపడుదురు. ఇప్పుడు పెద్దపెరిగినంక పెండ్లిండ్లు గావట్టె. గందుకని పిల్లా, పిల్లగానికి పరిచయాలు పెరగాలని గిట్ల కొద్దిరోజులు హానిమూన్‌కు అని పంపిస్తున్నరు. అంటే పెండ్లయినంక ప్రేమించుకొనుడు అన్నమాట. మీ బిడ్డ పెండ్లికి మేమందరం లేమా!"[23] అని సముదాయిస్తాడు రామేశం.

తెలంగాణలో పద్మశాలీలతో పాటు బీసీ కులాల వారి పెళ్లి సంస్కృతి చక్కగా, వివరంగా ఇలా చిత్రించారు.

"పెండ్లికి ఐదు రోజుల ముందు పోచమ్మకు చేసి చుట్టాలందరికి మేక పోతును కోసి బోజనాలు పెట్టాడు. లస్మయ్య, గంగాధర్ మామయ్యలే సొంతంగా వంటలు చేయడం దివ్యకు వింతగా అనిపించింది. పెళ్లి కూతురు విజయకు ప్రత్యేకంగా పెండ్లి చీరను లస్మయ్య తానే నేశాడు. గంగాధర్ రెండు రోజుల ముందు విజయకు పెళ్లికూతురును చేయడం అనే ఫంక్షన్ చేశాడు. తోడు పెళ్లికూతురుగా తొమ్మిదవ తరగతి చదువుతున్న తన కూతుర్ని పంపాడు గంగాధర్. కుండలను సున్నంతో, ముగ్గులతో అలంకరించి ఐరేండ్ల పూజ చేశారు. ఏడు గాడిపొయ్యిలు తీశారు. వెనుకట ఎడ్లబండ్లమీద వచ్చేవాళ్లకోసం దుమ్ము ధూళి ఉంటుందని స్నానాలకు, వంటలకు గాడిపోయిలు పెట్టి అడివి నుంచి కట్టెలు కొట్టుకొచ్చి అట్లనే పొయ్యిలో పెట్టేవాళ్లు. కుండల్లో ధాన్యం దాచుకునేవారు. అవి పోయినా ఆ ఆచారాలు అలాగే కొనసాగుతున్న వైనాన్ని చిత్రిస్తారు. 'అందుగు' కొమ్మను చప్పుడుతో ఎదుర్కొచ్చి ఇంటిముందు పాతిపెట్టి మట్టితో గద్దె కడతారు. ముత్తయిదువలు బావికి పూజచేసి కొత్త బిందెల్లో నీళ్లు తెస్తారు. కొత్త కుండలతో కూరాళ్లు పడతారు. కూరాళ్లు పట్టడం ఆడవాళ్ళ దృష్టిలో చాలా ముఖ్యమైన కార్యక్రమం. ముత్తయిదువలు పసుపు యిసురు రాయితో విసురుతారు.

వాకిట్లో మామిడి, అల్ల నేరేడు లేదా కొబ్బరి ఆకులతో పెండ్లి పందిరి వేస్తారు. రంగు కాగితాలు, డిజైన్లతో పెండ్లి పందిరిని అలంకరిస్తారు. బాసింగాలు పోచమ్మ గుడికి చప్పుడుతో తీసుకుపోయి మొక్కి తీసుకొస్తారు. పోచమ్మ గుడికి పోయి ఇంటికి చేరేదాకా దుప్పటిని గొడుగులాగా పట్టుకొని నడుస్తారు. ఈ ఆచారం ఎందుకు మొదలైందో వాళ్లెవరికి తెలియదు. ఎవరో ఒకరు గుర్తు చేసినకొద్దీ చెప్పిందల్లా ఆచరించడమే ఆచారాల్లో వస్తున్న తీరు. ఇలా ఇంటి చాకలి అన్నం, కుంకుమ కలిపి వాళ్ళు ఇంట్లోకొచ్చేటప్పుడు మిత్తి తీస్తారు.

ఔసులోల్ల ఇంటి నుంచి స్వయంగా చేయించిన పుస్తెలు, మట్టెలు చప్పుడుతో

మంగలహారతితో ఎదుర్కొస్తారు. మైకులో పాటలజోరు ఊరంతా వినిపిస్తుంటే పచ్చ జొన్నలతో చాకలి వాళ్లతో, మంగలి వాళ్లతో మైలపోలు తీయిస్తారు.

పెండ్లి పిల్లవాడిని మార్కండేయ గుడి నుండి ఎదుర్కోలుగా పోయి చప్పుడుతో ఎదుర్కొస్తారు. ఎదుర్కోల్ల దగ్గర ఇరుపక్షాలు పసుపు, కుంకుమ, నోట్లో చక్కెర మర్యాదలు జరిగాయి. పెండ్లి పీటగా బట్టచుట్టే దోనుగుకు కంకణం కడతారు. దోనుగుమీద కూర్చోబెట్టి అల్లుని కాళ్లు కడుగుతారు. పెళ్లిలోనే అల్లునికి జంధ్యం వేయిస్తారు.

తరువాత కన్యాదానం కార్యక్రమం... జిలకర బెల్లం పెట్టడం పెళ్లికన్నా ముఖ్యం ఎందుకైందో ఎవరికి తెలియదు. కాళ్లు తొక్కిస్తారు. ఒకరి ఎంగిలి మరొకరికి తినిపిస్తారు. కొంగులు ముడివేస్తారు. పుస్తెలు కట్టిన తరువాత పట్టపగలే అరుంధతి నక్షత్రం అంటూ చూపుతారు. పత్తి గింజలు అలికిస్తారు. పెళ్లి పందిట్లో తరాజు పట్టుకొని పిల్ల పిలగాడు మూడు చుట్లు తిరుగుతారు. ఇంత వివరంగా హైద్రాబాద్‌లో తన పెళ్లిలో ఎందుకు జరగలేదో అని రవిప్రకాష్ మనస్సులో అనుకుంటాడు. ఊరికోతీరు పద్ధతి ఉంటుందని అంటాడు గంగాధర్.[24]

'ప్రశాంతం' కథలో ఎంత చెడ్డా బిడ్డ ఇంటికి అల్లుడింటికి పోకూడదనేది ఒక పాత సామెత. దసరా పండుగకు అల్లుడు బిడ్డను కొడుకు కోడలు రావడం ఒక సంస్కృతి. బైరాగితత్వం పాటలు ప్రకృతిలో మనిషికి సంబంధం తెగిపోయింది. ప్రకృతిని ప్రభుత్వం తన ఆస్తిని హక్కుగా మార్చుకుంది. ఇది ఈ కథలో కనిపిస్తుంది.

"అల్లుడు లక్ష్మణ్ బిడ్డ విమల కుటుంబంతో సహా ఇల్లు చేరిన్రు. అంతదాకా స్కూలు డ్రెస్సులు టైలేసుకొని ప్రయివేటు స్కూల్లో చదువుకున్న అతని పిల్లలు సాదా డ్రెస్సుల్లో సర్కారు బడికి పోతున్నారు.

లక్ష్మణ్‌కు ఆ పల్లె ఎంతో హాయిగా ఉందనిపించింది. ఆ పల్లె, చల్లగాలి అంతా మంచిగనే ఉందిగాని చేసుటానికి పనిలేదు. దున్నటానికి ఎవుసంలేదు. ఆగమాగంగ కార్మికునిగ డ్యూటీ చేసిన బతుక్కు తిరంలేకుండె. ఇప్పుడు పల్లె మొత్తం తిరమే. తీరుపాటంగ బతుకుడు అలవాటు చేసుకున్నడు లక్ష్మణ్.

పొయ్యిల కట్టెలులేవని విమలంటే గొడ్డలి తీసుకొని అడవిలకు పోయిండు లక్ష్మణ్. అడవిలో కట్టెలు కొడుతుంటే ఎన్నెన్నో చిన్నప్పటి ఆటలు పాటలు జ్ఞాపకాలు. చెమటలు కారుతుంటే అలసటకు బదులు ఆనందం కలిగింది లక్ష్మణ్‌కు.

సైకిల్‌కు సరిపడా కట్టెలు కట్టుకుని వస్తుండంగ ఫారెస్టుగార్డు అడ్డగించి పైసలు అన్నడు. గింతసేపు కట్టెలు కొడ్తె కనవడనోడు గిప్పుడెట్ల వచ్చే అనుకున్నడు లక్ష్మణ్. వాని పనే తప్పులు వట్టుడు అని లక్ష్మణ్‌కు తెలువది.

పైసలియ్యకపోతే కేసుపెట్టి జేల్లేపిత్త అన్నడు గార్డు.

"పైసలు తీస్కరాలె. మల్లస్త" అని సైకిలు అక్కన్నే పారేసి ఇల్లు చేరిండు లక్ష్మణ్. మల్లా అటు పోలేదు లక్ష్మణ్.

ఏం పని లేదా అని విమల ఊకె గులిగితే నాలుగు గాలాలు తీసుకొని చేపలకని బయల్దేరిండు లక్ష్మణ్. చేపలు బాగనే దొరికినై. తోవలో అది చూసిన బెస్తోల్లు ఊర్లె పంచాయితి పెట్టిన్రు. ఆ చెరువును వాల్లె గుత్తకు తీసుకున్నరట. ఆ చెరువు కింద బావులు కాడ చాపలు గూడా మావే అన్నరు. కాళ్ళు పట్టుకొని వాల్ల సంగానికి దండుగ కట్టి బయటపడ్డడు లక్ష్మణ్.

"అట్ల సైకిల్ పోగొట్టినవు. ఇట్ల దండుగు కట్టినవు. నువ్వు ఏ పని చేసినా ఇగగింతే. ఉన్నకాడ సప్పుడంట కూసో" అన్నది విమల.

అల్లుడు లక్ష్మణ్‌కు అంతా అయోమయంగా వుంది. ఈ భూమి, నీరు, చెరువు, అడవి, చెట్టు, కట్టెపుట్ట ఏది తనదికాదు.

ఈ ప్రకృతి ఎంత అందమైనదో, ఈ పల్లె ఎంత ప్రశాంతమైనదో...కాని ఇందులో తనకేమి చెందదు. ఈ గాలి కూడా తన దవునోకాదో...ఈ చెట్లు చేమలు పక్షులు చేపలు పొలాలు చెరువులు ఏవీ తనవి కావు. ఈ పల్లెను ఎట్లా ప్రేమించాలె. ఈ పల్లెల ఎట్ల వుండాలె.

ఇన్నాళ్ళు ఆ ఉద్యోగం తనది అనుకున్నడు. ఆ ఉద్యోగం పోయింది. ఉద్యోగ భద్రతకూడా పోయింది. తనకు జీవితంలో మిగిలిందేమిటి? ఈ పాత ఇల్లొకటేనా?"[25]

'జైలుజీవితం' కథలో గ్రామాల్లో పోలీసుల నీచ సంస్కృతిని చిత్రించారు. జైలులో సోషలిస్టు సంస్కృతి ఎలా ఉందో వర్ణించారు. గడపదాటనీయకుండా ఇంట్లో ఉంచడం జైలు సంస్కృతి అని మరో చోట చెప్పారు.

'ఇంటల్లుడు' కథలో అల్లుడు అనే పదానికున్న చెడ్డ అర్థాన్ని పూర్తిగా మార్చే సంస్కృతి, సంస్కారం కనబడుతుంది.

"""ఇగో అత్తా – ఏంజేసినా కొడుకు కొడుకే. ఎంతజేసినా అల్లుడు అల్లుడే. "అల్లుని మంచితనం... అని ఓ పద్యం ఉంది. అల్లుని మంచితనం లోకంల లేదని దాని అర్థం. నేను యింతజేసినా ఏమున్నది? ఒక్క మాటతోటి, ఒక్క సామెత తోటి కొట్టుకపాయె."

"ఎట్ల వుట్టినయో గా సామెతలు నాకు తెల్వయి. అల్లుడా! నూటికొకలు అల్లుల్లు లంగలుంటరు. అంత కొడుకులకే చెందాలె అని పుట్టిన సామెతలియి. ఏదో పండుక్కు చీరె తువ్వాలు కట్నాలు తప్ప లగ్గమైనంక బిడ్డకు అల్లునికి చెందేది ఏంలేకపాయె. అయినా

అల్లుల్లమీద అపనిందలు. అవి పుట్టిచ్చినోని తలపండు వలుగ. కొడుకుల తీర్గ బిడ్డలకు గూడ సరిసమానంగ అన్ని పంచిస్తె ఏ లొల్లి వుండకపోవు. అంత కొడుకులకే చెందాలె. కొడుకులే మంచిగ బతుకాలె అనుకు(ని. ఆడిది ఆడిదే (అక్కడిదే) అనుకుంట కన్న తల్లిదండ్రులే సక్కగ సూడకపోయిరి. లగ్గమయ్యేదాక అరవ సాకిరి చేయించుకునిరి. లగ్గమైనంక అత్తగారింట్ల సాకిరి. ఆడిదాని బతుక్కు ఎన్నడు సుకమున్నది కొడుకా!"[26]

'జీవనయానం' కథలో ప్రేమలు, వాటి వెనుక వుండే సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక కారణాలు, ప్రేమలో ఉండే వైవిధ్యం, కులాంతర వివాహాలు, మొదలైనవి చిత్రించారు. ఫెమినిజం జీవితంలో, సంస్కృతిలో తెచ్చిన మార్పు కథంతా సాక్ష్యం.

'జీవనయానం' పెద్ద కథ లేదా చిన్న నవల. అనేక స్వభావాలు చిత్రించబడ్డాయి. ఒక్కొక్క సంఘటనకు మనిషి, స్వభావం, మనస్తత్వం ఎలా మారుతూ ఉంటుందో లోతుగా చిత్రించారు. అరవింద్ పాత్ర మొత్తం కథలో ఎన్నో మలుపులు తిరుగుతుంది. అతని జీవితంలో ప్రవేశించే వ్యక్తులు వలన అతని జీవితం, స్వభావం, మలుపులు తిరుగుతూ ఉంటుంది. రాధను ప్రేమించిన అరవింద్ తనను ప్రేమించే లతను నిర్లక్ష్యం చేస్తాడు. అది గమనించి లత, విక్రాంత్‌ను పెళ్ళి చేసుకుంటుంది. రాధ వి.ఎల్.కాంట్‌ను పెళ్ళి చేసుకొని అమెరికా వెళ్ళిపోతుంది. దాంతో అరవింద్ కోలుకోలేని దెబ్బతింటాడు. ఆత్మహత్యా ప్రయత్నం చేస్తాడు. నారాయణ సేటు కూతురు నిర్మల, మేనమరదలు సావిత్రి కొత్తగా తన హాస్పటల్‌లో చేరిన యువ డాక్టర్ అరుణ, అరవింద్ జీవితంలో అనేక ప్రభావాలు వేస్తారు.

నారాయణ సేట్ పాత్ర ఒకనాటికి ఈనాటికి సంపన్నులు ప్రవర్తించే తీరును తెలుపుతుంది. అరవింద్ తల్లిదండ్రులు, అట్టడుగు నుండి తమ పిల్లలు ఎదిగే క్రమంలో ఎదగడం, బీడీ కార్మికురాలైన తల్లి, మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఎన్నిక కావడం, భర్తను కోల్పోయి ఇండియా చేరిన రాధ ఎమ్.ఎల్.ఏ.గా పోటీ చేయడం, గెలవడం, డాక్టర్ రాజేశ్వర్‌తో పెళ్ళి జరగడం, భర్త చనిపోయిన నిర్మల, ఒంటరిగా మిగిలిపోవడం వంటి పాత్రలు, స్వభావాలు నిజజీవితంలో తారసడతాయి.

జీవనయానంలో మానవ స్వభావాలు చిత్రణను విశ్లేషించడం దానికదే ఒక పాత్ర పరిశోధన.

వ్యాపారం చేసి సంపాదించే ఎన్నికల్లో పోగొట్టుకొని, పేదరికంలోకి జారిపోవడం, నారాయణ కొడుకు శ్రీనివాస్ పాత్రలో చిత్రించారు. క్రమశిక్షణ లేకపోతే ఎంతటి సంపదయినా తన తరువాతి తరం, వృధా చేస్తుందని నారాయణ సేటు, అతని కొడుకు శ్రీనివాస్, నిర్మల పాత్రల ద్వారా చిత్రించారు.

4.4. జీవనయానంలోని అంశాలు

అమర్త్యసేన్ సంక్షేమ అర్థశాస్త్రం కన్నా, క్యాపిటల్ సోషల్ ఎకానమి, సోషల్ దృక్పథానికి దగ్గరగా ఉందని ఈ కథలో ప్రారంభంలోనే కథలోని అంతస్సారాన్ని వివరించారు. ఇది వివరించడానికి అర్థ శాస్త్రం తెలియాలి. రాజకీయ అర్థశాస్త్రం తెలియాలి. సామాజిక అర్థశాస్త్రం తెలియాలి. కుల వ్యవస్థ నిర్మించే అర్థ శాస్త్రం తెలియాలి. కులం, సాంఘిక హోదా, ఆర్థిక స్థాయి నిర్వహించే పాత్రను రాధ తండ్రి, నారాయణ సేటు, విక్రాంత్ తల్లి, అరుణ తండ్రి పాత్రల ద్వారా చిత్రించారు. సాంఘిక, ఆర్థిక హోదా పెరిగే క్రమంలో బీడీ కార్మికురాలైన అరవింద్ తల్లి మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యే అవకాశం ఎలా వచ్చిందో చిత్రించారు. అరుణ తండ్రి తన బ్రాహ్మణ కులం ద్వారా సాంఘిక, ఆర్థిక హోదా ఎలా సాధించుకున్నాడో కూతురు పెళ్ళి తన చేతుల మీదుగా చేయకుండా ఎలా తప్పించుకొని డబ్బు మిగుల్చుకున్నాడో విక్రాంత్ మాటల ద్వారా రచయిత చిత్రించారు.

'జీవనయానం' ప్రేమలోని ఆర్థిక, సామాజిక కులాల అంతస్తులను పలు విధాలుగా చిత్రించారు.

1. రాధ అరవింద్ ప్రేమను నిరాకరించడంలో
2. అరవింద్ లత ప్రేమను నిరాకరించడంలో
3. అరవింద్ సావిత్రి ప్రేమను నిరాకరించడంలో
4. నారాయణ సేటు తన కూతురు నిర్మలను అరవింద్‌కు ఇవ్వ నిరాకరించడంలో డాక్టర్ అయ్యాక ఇస్తానని ముందుకు రావడంలో
5. విక్రాంత్ అరవింద్‌కు వీటిని వివరించడంలో
6. అరవింద్, అరుణ ప్రేమలో
7. నిర్మల విధవ కావడంతో అరవింద్ చేసుకుంటాడేమోనని అనుకోవడంలో
8. రాధ విధవై అమెరికా నుండి వెనక్కి వచ్చాక అరవింద్ చేసుకుంటాడనుకోవడంలో
9. అరవింద్ చిన్నప్పుడు చేసుకుంటాడని అనుకున్న సావిత్రిని తమ్ముడు ఆనంద్‌కు ఇవ్వడంలో
10. లత విక్రాంత్‌ను ఇష్టపడి పెళ్ళిచేసుకోవడంలో

4.5. ఒకరు ఎదిగితే ఎంతో మందికి ఆసరా

వర్షం పడిన తరువాత ప్రకృతి అంతా పచ్చగా ఎదుగుతుంది. కొడుకులు సాంఘిక

హోదా, ఆర్థిక హోదా పెరిగితే తల్లులకు పెరిగే గౌరవం దేవక్క బీడీ కార్మికురాలి నుండి మున్సిపల్ చైర్‌పర్సన్ కావడం. కమర్షియల్ టాక్స్ ఆఫీసర్‌గా పని చేసిన తండ్రి హోదాననుసరించి రాధ ఎమ్.ఎల్.ఏ. టిక్కెట్ సంపాదించి గెలవడం. ఇంటిలో ఒకరు ఎదిగితే పరస్పర సహకారంతో తమ్ముడు, తల్లిదండ్రులు, చెల్లెలు కాస్త మంచి జీవితం జీవించడం. సావిత్రి, సక్కుబాయి, ఆనంద్, దేవక్క, లత తల్లి, అన్న మున్సిపల్ ఆఫీసులో నాలుగో తరగతి ఉద్యోగులుగా పని చేయడం. లత డాక్టర్ అయ్యాక వారి హోదా, గౌరవం పెరగడం. లత ఎదగడంతో అన్నకు వ్యాపారం పెట్టించడం. మొదలైన పరిణామాల చిత్రణ ద్వారా ఒకరు ఎదిగితే ఎంతోమందికి ఆసరా ఎలా అవుతారో, ఎలా ఆసరగా వుండాలో 'జీవనయానం' నవలికలో ఆదర్శవంతంగా చిత్రించారు.

4.6. సామాజిక పరిణామాలు

ఓడలు బండ్లు కావడం, బండ్లు ఓడలు కావడం. కథ ప్రారంభంలో రాధ తండ్రి నారాయణ సేటు మంచి స్థితిలో వుంటాడు. అరవింద్ కష్టపడి చదువుకుంటాడు. విక్రాంత్ తండ్రిలేని పేద తల్లి, చెల్లెలు బీడీలు చేసి చదివిస్తే చదువుతుంటాడు. అరవింద్ తమ్ముడు చిన్న పనుల నుంచి ఎదుగుతాడు. నారాయణసేటు కొడుకు శ్రీనివాస్ రాజకీయాల్లో దిగి కుటుంబం మొత్తం ఆర్థికంగా చితికిపోతుంది. రాధ, నిర్మల జీవితాలు భర్తలు చనిపోవడంతో చితికిపోతాయి. విక్రాంత్ లెక్చరర్ రావడంతో వారి కుటుంబం మంచి స్థితికి వస్తుంది. అరవింద్ హాస్పటల్ పెట్టడంతో తమ్ముడు ఆనంద్, తల్లిదండ్రులు మంచిస్థితిలోకి ఎదుగుతారు.

ఇలా నారాయణసేటు, నిర్మల, రాధ కుటుంబాలు మంచి స్థితి నుండి చితికిపోతాయి. రాధ ఎమ్.ఎల్.ఏ. అయి తిరిగి జీవితాన్ని గెలుచుకుంటుంది. నిర్మల అలాగే మిగిలిపోతుంది. కష్టపడి చదువుకున్న అరవింద్, విక్రాంత్‌ల కుటుంబాలు క్రమంగా ఆర్థికంగా, సాంఘికంగా ఎదుగుతాయి. ఇలా సమాజంలో నిరంతరం ఓడలు బండ్లవుతాయి, బండ్లు ఓడలవుతాయని 'జీవనయానం'లో చిత్రించారు.

సంపద, అధికారం, మంచి స్థితి ఎప్పటికీ కొందరికే శాశ్వతం కాదని, పేదలు ఎప్పటికీ అలాగే వుండిపోరని, వారు మంచి స్థితిలోకి ఎదుగుతుంటారని ఒక చక్కని ఆశను, విశ్వాసాన్ని కలిగిస్తుంది చిత్రణ. అలాగే ప్రతితరం నిరంతరం కృషి చేసినప్పుడే ఎదుగుతారని కూర్చుని తింటే కొండలు కరిగిపోతాయని శ్రీనివాస్ పాత్రద్వారా సందేశాత్మకంగా ఈ కథలో చిత్రించారు. చదువుకుంటే పేదలు ఎదిగి ఎలా అభివృద్ధి చెందుతారో, అవకాశాలను ఎలా అందుకోవాలో 'జీవనయానం' కథలోను, 'బతుకుపయనం' కథలోను ఎదిగిన క్రమాలను చక్కగా సామాజిక పరిణామాలుగా చిత్రించి మనముందుంచారు.

4.7. స్త్రీల జీవన వాస్తవికత

ఈ ఏడు కథల్లోను స్త్రీల జీవితం లేని కథ లేదు. కొన్ని కథల్లో స్త్రీ పాత్రలు ప్రధానంగా కనబడతాయి. కొన్ని కథల్లో స్త్రీ పాత్రలు అంతర్లీనంగా ఉంటూ ప్రధాన పాత్ర నిర్వహిస్తుంటాయి. మరో మాటలో చెప్పాలంటే స్త్రీలకు ప్రాధాన్యత ఇస్తూ రాసిన కథలు అని చెప్పవచ్చు. ముఖ్యంగా 'నానమ్మ', 'రాత్రిపూలు', 'ప్రశాంతం', 'జీవనయానం'.

1. 'బతుకుపయనం', 'జైలుజీవితం', 'ఇంటల్లుడు' కథల్లో ఉన్న స్త్రీ పాత్రలు అప్రధానంగా కనబడతాయి కానీ జీవితంలో వాస్తవంగా ప్రధాన పాత్ర నిర్వహిస్తాయి.
2. 'నానమ్మ'లో సుగుణ, సుజాత, నానమ్మ, లేచిపోయిన పెళ్ళికాని ఆడపిల్ల.
3. 'రాత్రిపూలు'లో చెల్లెలు ప్రమీల, రమేష్ ప్రేమను నిరాకరించిన రాజ్యం. రమేష్ జీవితంలో ప్రధాన పాత్ర నిర్వహిస్తాయి.
4. 'బతుకుపయనం'లో బట్టలు నేసే తల్లి, బీడీలు చేసే చెల్లెల్లు, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేసే రవి ప్రకాష్ భార్య, స్త్రీ పాత్రలు వాస్తవికంగా చిత్రించారు.
5. 'ప్రశాంతం' కథలో రాపోలు ఎల్లయ్య, కూతురు విమల మొత్తం అందరి దుఃఖ భారానికి ప్రతీక.
6. 'జైలుజీవితం'లో జైలులో ఉండిపోయిన వారి తల్లి, భార్య, కష్టాలు, జీవితం.
7. 'ఇంటల్లుడు'లో భార్య పద్మావతి, అమ్మమ, అత్త, రాజేశ్వరి, పద్మావతి చెల్లెలు రవీంద్ర చెల్లెలు నవ్య, సాధన.
8. 'జీవనయానం'లో రాధ, లత, సావిత్రి, నిర్మల, అరుణ, దేవక్క విక్రాంత్ తల్లి, సక్కుబాయి మొదలైన వాళ్లు.

బతుకు పయనం కథల సంపుటిలోని కథలన్నీ స్త్రీ పాత్రలు ప్రధానంగా సాగుతాయి. స్త్రీలు అచంచల ఆత్మవిశ్వాసంతో జీవితాన్ని గెలుచుకుంటారు. కష్టాల్లో ధైర్యం కోల్పోకుండా నిబ్బరంగా నిలబడి ఎదుర్కొంటారు. అనుబంధాలు, ఆత్మీయతలు, ప్రేమలు, కుటుంబ సంబంధాలు, సంస్కృతి ఆచరణ మొదలైన విషయాల్లో స్త్రీలు ఎంత సెన్సిటివ్‌గా వుంటారో వారి సున్నిత మనస్తత్వాలు, స్వభావాలు, వారి సెంటిమెంట్లు మానవ సంబంధాలను, కుటుంబ సంబంధాలను, స్నేహ సంబంధాలను ఎంత ఆత్మీయం చేస్తాయో ఈ కథల్లో ఎంతో నిబద్ధతతో, జీవితానుభవంతో చిత్రీకరించారు. ఆయా సంబంధాలను ఆదర్శీకరించారు. ఆదర్శవంతంగా తామున్న పరిస్థితుల్లో ఎలా జీవించాలో మనముందుంచారు. ఇలా స్త్రీ పాత్రలను మహోన్నతంగా చిత్రించారు.

పాదసూచికలు

1. మమతలు-మానవ సంబంధాలు ముందుమాట - జి.గంగాధర్; పుట :XIV
2. పైదే పుట : XV
3. బతుకుపయనం సంపాదకీయం - కొక్కుల భాస్కర్, గూడూరి సీతారాం
4. బతుకుపయనం కథలు - నానమ్మ ; పుట : 1
5. బతుకుపయనం కథలు - రాత్రిపూలు ; పుట : 19
6. బతుకుపయనం కథ ; పుట : 36
7. బతుకుపయనం కథలు - ప్రశాంతం ; పుట : 45
8. బతుకుపయనం కథలు - జైలు జీవితం ; పుట : 54
9. బతుకుపయనం కథలు - ఇంటల్లుడు ; పుట : 55
10. బతుకుపయనం - నానమ్మ ; పుట : 11, 12
11. పైదే పుట : 13
12. పైదే పుట : 14
13. పైదే పుట : 15
14. బతుకుపయనం ; పుట : 20
15. పైదే పుట : 21
16. పైదే పుట : 22
17. పైదే పుట : 22
18. పైదే పుట : 23
19. పైదే పుట : 24
20. పైదే పుట : 26
21. పైదే పుట : 27
22. పైదే పుట : 27
23. పైదే పుట : 29
24. పైదే పుట : 29, 30
25. బతుకుపయనం కథలు - ప్రశాంతం ; పుట : 44, 45
26. బతుకుపయనం కథలు - ఇంటల్లుడు ; పుట : 57, 58

బతుకుపయనం కథల్లో శైలీశిల్ప వైవిధ్యం

సృష్టిలో అన్ని జీవరాసులకంటే మానవుడు ఉత్తమమైన జీవి. మిగతా జీవరాసుల కంటే తెలివి, ఆలోచన, సృజనాత్మకత మొదలైన విషయాల్లో ఏ జీవికి లేని ఈ లక్షణాలు ఉన్నాయి. అందువలన మానవ మస్తిష్కంలో దొంతర దొంతరలుగా రకరకాల ఆలోచనలు పుట్టే సందర్భంలో కథలు కూడా పుట్టి ఉంటాయి.

5.1. కథానిక ప్రక్రియ - పూర్వాపరాలు

ఇళ్ళల్లో బామ్మలు చెప్పిన కథలే చెప్తుంటే చెవిని అలా వదిలేసి వినేవాళ్ళు ఇప్పుడు ఉన్నారు. కథలు వినని వారు ఉండరు. కథ ఎప్పుడు మానసిక ఆనందాన్ని కలుగజేస్తుంది. కథల్లో కాశీ మజిలీ కథలని, మర్యాద రామన్న కథలని, జాతక కథలని, బేతాళ కథలని, మొదలైన రకరకాల కథలు పుట్టుకొచ్చాయి.

"అగ్నిపురాణం 337వ అధ్యాయంలో కావ్యాది లక్షణ నిరూపణ సందర్భంలో జరిగిన గద్య కావ్య విభాగం ఇది.

'అఖ్యాయికా కథా ఖండ కథా పరికథా తథా
కథానికేతి మన్యంతే గద్య కావ్యంచ పంచధా'

ఇతి వృత్తాన్ని బట్టి "కథ, ఆఖ్యాయికా, ఖండకథా, పరికథా, కథానిక, అను అయిదు గద్య ప్రబంధ భేదములు గలవని కావ్యదర్శ వ్యాఖ్యాత జీవానంద భట్టాచార్యులు తెలిపిరి."[1]

ఇప్పుడు తెలుగులో కథ, కథానిక అనేవి సమానార్థకాలుగా ప్రయోగింపబడుతున్నాయి. కానీ కథానిక అంటే చిన్న కథ అనే ప్రయోగంలో ఉంది. ఇంగ్లీషులో షార్టు స్టోరీ అని, హిందీలో కహానీ అని అంటారు.

తొలి తెలుగు కథ ఏది? అనే అంశంలో విస్తృతమైన పరిశోధన జరిగి కొత్త విషయాలు సరైన ఆధారాలతో వెలుగులోకి వచ్చే వరకు ఆ స్థానం 'గణపతియగు స్త్రీ'కి, రచయిత్రి భండారు అచ్చమాంబకు దక్కుతుంది. ఇప్పటికే కె.కె.రంగనాథాచార్యులు లాంటి విమర్శకులతో పాటు చాలామంది ఆమెను తొలి కథకురాలిగా గుర్తించారు...

బండారు అచ్చమాంబ మొట్టమొదటి కథలు రాయసం వెంకటశివుడు

సంపాదకత్వంలో వెలువడిన 'తెలుగు జనానా' పత్రికలో 1898 జులైలో 'ప్రేమ పరీక్షణము', 1898 సెప్టెంబరులో 'ఎఱువు సొమ్ము పరువు చేటు' పేరిట అచ్చయ్యాయి. ఈ విషయాన్ని స్వయంగా వెంకటశివుడు 1945లో హైదరాబాద్ నుంచి వెలువడ్డ 'తెలుగుతల్లి' కొమర్రాజు లక్ష్మణరావు స్మారక సంచికలో రాసిందు. అయితే ఇప్పటికీ 'తెలుగు జనానా' పత్రిక సంచికలు పూర్తిగా అందుబాటులో లేనందున అదే పత్రికలో 1901 మే నెలలో అచ్చయిన 'గుణవతి యగు స్త్రీ' మొట్టమొదటి కథగా స్వీకరించాల్సి వుంటుంది....

అచ్చమాంబ కథలన్నీ ఆధునిక భావాలకు వేదికలు. సమాజోద్ధరణ, మహిళాభ్యున్నతి, మెరుగైన సమాజం కోసం తహతహ ప్రతి కథలోని, ప్రతి అక్షరంలో ప్రత్యక్షమయ్యేవి. గుణవతియగు స్త్రీ కథలో పురాణ కథను తీసుకొని ఆధునికతను అద్ది పొదుపు ద్వారా సంసారాన్ని స్వర్గంగా ఎలా మార్చుకోవచ్చో చెప్పింది...[2]

బండారు అచ్చమాంబ జనవరి 1905లో మరణించారు. ఆమె 1898 నుండి 1904 వరకు 12 కథలు రాశారు. అవి 'గుణవతియగు స్త్రీ, లలితాశారదలు, జానకమ్మ, దంపతుల ప్రథమకలహం, సత్పాత్రదానము, స్త్రీవిద్య, ధనత్రయోదశి, భార్యభర్తల సంవాదము, అద్దమును సత్యవతియును, బీదకుటుంబము' అనే శీర్షికల కథలు. అచ్చమాంబ 1898లో రచించిన 'ప్రేమ పరీక్షణము', 'ఎరువు సొమ్ము పఱువు చేటు' కథలు రాయసం వెంకటశివుడు నిర్వహించిన 'తెలుగు జనానా' పత్రికలో 1898 జులై, సెప్టెంబర్ సంచికల్లో అచ్చయ్యాయి. ఆ కథల కోసం సంగిశెట్టి శ్రీనివాస్ చాలా శోధించాడు. కాని దొరకలేదు. ఆఖరికి నిరాశచెంది దొరికిన పది కథలనే పుస్తకంగా ప్రచురించారు.... బండారు అచ్చమాంబ ప్రసిద్ధ పరిశోధకుడు, తెలంగాణ వైతాళికుల్లో అగ్రేసరుడైన కొమర్రాజు వేంకట లక్ష్మణరావుగారి సొంత అక్క.[3]

భారతదేశం బుద్ధునికి పూర్వం నుండి కూడా ప్రపంచానికి కథా సాహిత్యానికి ఎంతో చేర్పును అందించింది. వేదాల్లోని కథలు, బుద్ధుని జాతక కథలు, గ్రీకు, చైనా, ఈజిప్టు, మెసపటోమియా దేశాలకు భారతదేశంతో దక్కను పీఠభూమితో నిరంతరం రాకపోకలు, సంబంధాలు కొనసాగాయి. శాతవాహనుల చరిత్ర కాలంలో ఇలాంటి పురావస్తు ఆధారాలు లభ్యమయ్యాయి. శాతవాహన కాలంలో గుణాఢ్యుడు రాసిన 'బృహత్కథ' ప్రపంచ కథలకు పుట్టినిల్లని, శాతవాహన రాజు హాలుడు సేకరించి గ్రంథస్థం చేసిన 'గాథాసప్తశతి', 'పంచతంత్ర కథలు', 'జాతకకథలు' భారతీయ ప్రాచీన కథా సాహిత్యానికి నిదర్శనం. ఈసప్ కథలు భారతీయ కథా సాహిత్యం నుండే రూపాంతరం చెందాయి. భారతీయ సుప్రసిద్ధ రచయిత మున్షీ ప్రేంచంద్ ఆధునిక సాహిత్యం ఎలా వుండాలో, ఏది సాహిత్యమో అనదగిన నిర్వచనాన్ని ఇలా ఇచ్చారు.

"రాయబడిందంతా సాహిత్యం అంటే నెనెపుడూ అంగీకరించను. సత్యాన్ని వ్యక్తీకరిస్తూ భాష సరళంగా, సుందరంగా ఉండి మనస్సు మీద, మేధస్సు మీద కూడా ప్రభావం చూపేది మాత్రమే సాహిత్యమనాలి. జీవితంలో వున్న నగ్న సత్యాలను, అనుభూతులను యథాతథంగా వర్ణించినపుడే ఈ లక్షణాలు ముఖ్యాంశాలుగా నిలబడుతాయి. రచయిత రచనలో సత్యము, సహజత వున్నట్లయితే రచన కొన్ని శతాబ్దాల వరకూ కొన్ని యుగాల వరకు మానవ హృదయాన్ని కదిలిస్తూనే ఉంటుంది. మన సభ్యత సాహిత్యం మీదే ఆధారపడి వుంటుంది. మన జీవితమంతా చివరకు మనం కూడా సాహిత్యం ద్వారానే నిర్మించబడ్డాం. సాహిత్యం ఔన్నత్యం పొందితేనే దేశం ఔన్నత్యం పొందుతుంది."[4]

కథా వస్తువులను, విశ్లేషణలను, కథా శిల్పాన్ని, కథగా మలచడంలో రచయితలకు ఎవరి ప్రత్యేకత వారికుంటుంది. వారి దృక్పథం కూడా రచయిత 'టోన్', కంఠస్వరం రూపంలో అంతర్లీనంగా కొనసాగుతూ వుంటుంది. రచయిత జీవితానికి, వర్గ స్వభావానికి తాను కథ రాసే వస్తువు, శిల్పాలకు మధ్య సంబంధం వుంటుంది. తనకు తెలిసినదే రాయడం సాధ్యం కనుక ఈ పరిమితి ప్రతి రచయితా ఎదుర్కొంటాడు. అందువల్ల ఆయా కథల్లో, నవలల్లో, సాహిత్యంలో స్థల, కాల, నిర్దిష్టతలతో పాటు వర్గ, కుల, స్త్రీ, పురుష స్వభావం ఏదో ఒక రూపంలో వ్యక్తమవుతుంటాయి.

జీవితంలోని పలు పార్శ్వాలను విశ్లేషించడానికి, సందేశం అందించడానికి కథా ప్రక్రియ ఆధునిక సాహిత్యంలో ఒక విశిష్టమైన స్థానాన్ని ఆక్రమించింది. ఇలా ఆధునిక కథానిక ప్రక్రియ మానవ సమాజ ఆచరణని, సంస్కృతిని, మనుషుల మనస్తత్వాలను, మానవీయ విలువలను చిత్రిస్తుంది, విశ్లేషిస్తుంది.

"ఒక కథ మంచి కథ అనిపించుకోవాలంటే అనేక అంశాలుంటాయ. వస్తు వైవిధ్యం, ఎత్తుగడ, కథా కథనం, పాత్రలు, సంభాషణలు, వర్ణనలు, శీర్షికలు, ముగింపు, శిల్పం, భాష, శైలి మొదలైనవి కథకు ముఖ్యమైన భాగాలు. ఇవన్నీ సర్వాంగ సుందరంగా వున్నప్పుడే కథకు సుస్పష్టమైన స్వరూపం ఏర్పడుతుంది. అప్పుడే అది మంచి కథ అనిపించుకుంటుంది."[5]

5.2. కథలో శైలీ శిల్పం

రాసే క్రమంలో ప్రతి రచయిత తనదైన శైలిని, శిల్పాన్ని రూపొందించుకోవడం జరుగుతుంది. ఆయా కాలాల్లో శైలీశిల్పం చారిత్రక పరిణామాలు పొందుతుంది. గాంధారి శిల్పం, గ్రీకు శిల్పం కాకతీయుల శిల్పం, మొగలుల శిల్పం, పల్లవుల శిల్పం, చోళుల శిల్పం ఆయా కాలాల్లో వచ్చిన శిల్పంలోని మార్పులను తెలుపుతాయి. శిల్పి రాయిని ఉలితో చెక్కి ఒక అందమైన రూపాన్ని అందమైన శిల్పం ద్వారా కథా నిర్మాణం చేస్తాడు. కథా శిల్పం కూడా ఒక కళే. అందుకే కథకు శిల్పం ప్రధానమైనదని చాలామంది

పేర్కొన్నారు. ఒక సంఘటనను అందంగా తీర్చిదిద్దడం కూడా శిల్పం అని అనవచ్చు.

కథకు అతిముఖ్యమైనది శిల్పం. "ఉద్దిష్ట ఫలితాన్ని సాధించడానికి అనువైన ప్రక్రియా పద్ధతులను వర్తింపజేసే దక్షత ప్రదర్శించే వివిధ రీతుల సమాహారమే కథా శిల్ప స్వరూపంగా వ్యక్తమవుతున్నది."[6]

శిల్పం అనేది కథాంశంలో ఏ ఒక్కదానికో సంబంధించినది కాదు. పాత్రలు, సన్నివేశ కల్పన, కథ నడిపే కథా, కథన పద్ధతి, కథ ఎత్తుగడ, ముగింపు, కొనసాగింపు, భాషా, శైలి అన్నింటిలో చక్కగా ప్రతిఫలించేది శిల్పం. ఏం చెప్పారు అనేది కథా వస్తువు. ఎలా చెప్పారు అనేది శైలి, శిల్పం. ఎలా ఎత్తుకున్నారు, ఎలా నడిపారు, ఎలా ముగించారు అనేది శైలి, శిల్పానికి సంబంధించిన అంశాలు. అందువల్ల కథా వస్తువు ఒక్కటే అయినప్పటికీ, జీవితం ఒక్కటే అయినప్పటికీ ఆయా రచయితల శైలి, శిల్పాలను అనుసరించి ప్రతి కథ ప్రత్యేకంగా స్వరూప, స్వభావాలను సంతరించుకుంటుంది.

తెలుగు సాహితీక్షేత్రంలో 1980 సంవత్సరం నుండి కథా ప్రక్రియలో బంగారాన్ని పండించిన రచయిత, బి.ఎస్.రాములు ఇంత తక్కువ కాలంలోనే ఇన్ని కథలు రాసిన ఆయన కృషి ప్రశంసనీయము. తెలంగాణ సామాజిక జీవితాన్ని చెప్తూ, భారతీయ కథా సాహిత్యంలో భాగంగా తన కథలను నిబిడీకృతం చేసిన రచయిత బి.ఎస్.రాములు.

ఈయన కథల్లో మనకు కథా లక్షణాలుగా క్లుప్తత, స్పష్టత, సంఘర్షణ, నిర్మాణసౌష్టవం, మొదలైన విషయాలన్ని కనిపిస్తాయి. ఈ కథల్లో మానవ సంబంధాలు, ఒకరికొకరు సహాయం చేసుకునేటటువంటి విధానం ఈయన కథల్లో సామాజికత ఉంటుంది.

'బతుకు పయనం' కథల సంపుటిలో ఎక్కువగా చేనేత కార్మికుల వ్యథ కనిపిస్తుంది. ప్రపంచీకరణ పరిణామాలు, ప్రభావాలు, తెలంగాణ సమాజం ఇందులోని కథావస్తువు. అది చేనేత బతుకుల జీవన చిత్రణ రూపంలో ఉంటుంది. ఈ కథల్లో ఒక స్థల, కాల, నిర్దిష్టతలో భాషా, సంస్కృతి, మానవీయ విలువలు, కుటుంబ సంబంధాలు, విశ్వజనీన సంస్కృతిలో భాగంగా చిత్రించబడ్డాయి. అట్టడుగు వర్గాల నుండి పెద్దస్థాయికి వెళ్ళడం, కథాగమనం కుంటుపడకుండా దిశానిర్దేశం చెయ్యడం అందులోని రసవత్తరమైన సన్నివేశాలు కల్పించి పాఠకుని యొక్క మదిలో నిలిచేటట్లు కథను తీర్చిదిద్దడంలో అందె వేసిన చేయి బి.ఎస్.రాములుది.

పేదవారు మధ్యతరగతిగా ఎదిగిన తీరు మధ్యతరగతి వారు ఇంకాపైకి ఎదిగే విధానం ఈయన కథల్లో కనిపిస్తాయి.

అంతేకాకుండా కథను మానవ సంబంధాలతో ముడిపెట్టి స్వార్థ చింతన లేకుండా

ఒకరి కోసం ఒకరు బతికే సన్నివేశాలు ఎక్కువగా కనిపిస్తాయి. 'రాత్రిపూలు' అనే కథలో ప్రమీల అనే చెల్లెలు రమేష్ అనే అన్నయ్యను పెళ్ళిచేసుకోమంటే ఆయన ఇలా అంటాడు. "ప్రమీ! నేను చాలా కోల్పోయానని, జీవితాన్ని నష్టపోయానని ఎందుకు బాధపడ్తావు. అది నీ దృష్టి... నేను కోల్పోయిందానికన్నా పొందిందే ఎక్కువ. మీ ప్రేమ నేను చేసిందానికన్నా ఎన్నో రెట్లు ఎక్కువ. నేను జీవితాన్ని ఓడిపోలేదని, ఉన్నతమైన జీవితాన్నే గెలుచుకున్నాననే తృప్తినైనా నాకు మిగల నివ్వు".[7] ఇలా రమేష్‌కు ఒక విధమైనటువంటి ఆత్మసంతృప్తి కలగడం వలన ఆయన అందులోనే సుఖం ఉందని నేను జీవితాన్ని గెలుచుకున్నానని మీ అందరి ప్రేమను పొందడమే నాకు ఎంతో గొప్పదైన జీవితం అని ఆయన చెప్పడంలో ఉన్న అంతర్యం అర్థమవుతుంది.

ఇలా కథలో వస్తువును ఒక సున్నితమైనటువంటి మనస్సుతో ఆవిష్కరించడంలో బి.ఎస్. ఘనాపాఠి. అలాగే 'నానమ్మ' కథలో కూడా ముసలి వాళ్లను ఇప్పటి రోజుల్లో వృద్ధాశ్రమలకు పంపి, పిల్లలు ఆదరించకుండా ఉండే విధానంలో ఒక కొత్తకోణం చూపించి సుగుణ అనే మనుమరాలుపై వాళ్ళ నాన్నమ్మపై చూపే వాత్సల్యం చాలా చక్కగా ఆవిష్కరించారు.

ఈ కథలో వృద్ధులపై రచయితకున్న ఆప్యాయత అనురాగం ఎంత చక్కనిదో గమనించవచ్చు. అందుకే వాళ్ళను దేవతలతో పోల్చారు. "నిజంగా నానమ్మలకు అమ్మమ్మలకు వయస్సుంటుందా! దేవతలకు వయస్సుంటుందా. వాళ్ళు ఎపుడూ ఒకేలా కనపడతారు. మనం ఎలా చూస్తే అలా కనబడతారు. ఎన్నేళ్ళయినా ఎన్ని తరాలు మారినా... చనిపోయినా... నానమ్మలూ దేవతలూ ఒకేలా కనబడతారేమో."[8]

"కథలో మంచి ప్రారంభం సగం పని పూర్తయినట్టే. ప్రారంభం తరువాత మొదటి సీన్, రెండవ సీన్, కాన్‌ఫ్లిక్ట్‌ను అభివృద్ధి పరచడం, విస్తరించడం జరగాలి. స్టీరియో టైప్ క్యారక్టర్లు ఆకర్షించవు. మొదట్లోనే ఎక్కువ క్యారక్టర్లు ప్రవేశ పెడితే చదవరులు అయోమయానికి గురవుతారు.

అన్ని రకాల సృజన రచనలను అయిదారు విధాలుగా వర్గీకరించవచ్చు. ప్రెజంటేషన్, ఇన్ఫర్మేషన్ నుండి సృజించే వాటిని వెరైటీ మోడల్స్ అంటారు. నమూనా అంటారు.

1. డైలాగ్ – సంభాషణ, చర్చ, సంవాదం, సంఘర్షణ, స్వీట్ నథింగ్స్...
2. డిస్క్రిప్షన్ – వర్ణన, చిత్రణ, సన్నివేశం, పాత్రల స్వరూపం, స్వభావం...
3. యాక్షన్ – పాత్రల హావభావాలు, నడక, స్వభావం, స్వరూపం...
4. థాట్స్ – పాత్రల ఆలోచనలు... సైకాజికల్ థింకింగ్... ఫంక్షనల్ థింకింగ్...

5. ఎక్స్‌పోజిషన్ – కాన్‌ఫ్లిక్ట్ – కథా విస్తరణ... కథలో సమస్యలు, సంక్లిష్టత, వాటి పరిష్కారం.

6. సోషల్ ఎవల్యూషన్ – సామాజిక పరిణామం... కుటుంబాల పరిణామం... ఉద్యమాల పరిణామం... వ్యక్తిత్వాల పరిణామం...

7. కథ థీమ్, కాన్సెప్ట్, లక్ష్యం, ఉద్దేశ్యం – సందేశం, స్ఫూర్తి...

కొందరు ఒక దానికి ప్రాధాన్యత ఇస్తారు. ఏదో ఒకదానిపై ఆధారపడతారు. ఏదో ఒకదాన్ని ప్రధానం చేస్తారు. కొందరు డైలాగులపై ఆధారపడుతుంటారు. రొమాన్స్ రాసే వాళ్లు వర్ణనలపై, ఆకర్షణీయ రూపాలపై, సన్నివేశాలపై, బట్టలపై ఆధారపడతారు. సమగ్రమైన కథ ఈ అయిదారు విధాలను కూడా ఉపయోగించుకుంటుంది.

కథంతా ప్రారంభం, ముగింపుల మధ్యనే వుంటుంది. కనుక సీరియస్ స్టఫ్ వుండాలి. ప్రారంభంతో కథ రైలు పట్టాలెక్కింది, ఫస్ట్‌గేర్ నుండి సెకండ్ గేర్‌లో పడింది. స్పీడు పెరగాలి. అంటే గేరు మార్చాలి. నీకెంతో తెలుసు. అదంతా కథలో పట్టదు. ఇమడ్చలేవు. ప్రారంభం తరువాత నుంచి ముగింపు దాకా వుండేది కథ. పాయింట్ ఆఫ్ వ్యూ క్యారెక్టర్ అనేది కథలో ఒకటి వుంటుంది. ఏ పాత్ర ద్వారా రచయిత ఫాలో అవుతూ కొన్ని విషయాలను చదువరులకు చెప్పాలనుకుంటాడో అది పాయింట్ ఆఫ్ వ్యూ క్యారెక్టర్. ఒక క్యారెక్టర్ చాలనప్పుడు రెండు క్యారెక్టర్‌లను తీసుకుంటారు."[9]

బి.ఎస్.రాములు కథలు శైలి, శిల్పాల రీత్యా చక్కని ప్రారంభాలను కలిగి వుంటాయి. సంభాషణలు నిశితంగా వుంటూ పాత్రల వ్యక్తిత్వాన్ని ప్రస్ఫుటం చేస్తాయి. సంభాషణలో జీవితానుభవాలను, తాత్వికాంశాలను సులభంగా అర్థం చేయిస్తారు. కథ ముగింపు కథ పట్టును, సారాంశాన్ని తెలుపుతుంది. బతుకుపయనం కథల్లో ప్రతి కథ ముగింపు ఒక సందేశాన్ని, జీవన సత్యాన్ని తెలుపుతుంది.

ఎంతో జీవితం గడిచిపోయాక ఒక సన్నివేశాన్ని తీసుకొని కథను రాసే శైలి, శిల్పం సంక్షిప్తంగా జీవిత కోణాలను విశ్లేషిస్తుంది. అనుభవం పండిన కథకులు ఇలాంటి ఎత్తుగడలను తీసుకుంటారు.

5.3. ఎంతో జీవితం గడిచిపోయాక ప్రారంభమయ్యే 'రాత్రిపూలు'

ఎంతో జీవితం గడిచిపోయాక కథ ప్రారంభిస్తే పాఠకుల ఊహాశక్తి, ఆసక్తి పెరుగుతుంది. కథ కూడా ఆసక్తికరంగా సాగుతుంది. 'రాత్రిపూలు' కథను ఎంతో జీవితం గడిచిపోయాక ఇలా సంభాషణతో ప్రారంభించారు.

"అన్నయ్యా! నీ భావాల వల్ల నువ్వు నీ జీవితాన్ని చాలా నష్టపోయావు. నీ బతుకుపొద్దు

పడమటికి వంగింది. నీతోటి వాళ్ళు ఎప్పుడో ఆగిపోయారు. వాళ్లు చేసిందానికన్నా ఎన్నో రెట్లు ఫలాలు అనుభవిస్తున్నారు. నువ్వు చేసినకాడికి చాలు. నువ్వు చెయ్యాల్సింది యిక యువతరం చేయాలి. చేస్తుంది. నేనింకా ఎన్నాళ్ళో బతకనని నీకు తెల్సు. నా చివరి కోరిక మన్నిస్తావు గదూ!"

ప్రమీల ఏడుస్తోంది.....

రమేశ్ మనస్సు భారమైంది... గొంతు పెకలలేదు.

ఆసుపత్రి గదిలో నిశ్శబ్దం... బెడ్‌పై ప్రమీల. మంచం ప్రక్కనే స్టూలు మీద రమేశ్.

చెల్లెలు ప్రమీల కళ్లను తుడిచాడు రమేశ్.

"ప్రమీలా! అలా అనకు. నువ్వు తప్పక బతుకుతావు. నిరాశ పనికిరాదు. ఆత్మవిశ్వాసం రోగాల్ని కూడా జయిస్తుంది."[10]

ఇలా కథ సాగుతుంది. సహజంగా సంభాషణ రూపంలో విరుద్ధాంశాల చర్చతో కథ ముందుకు సాగుతుంది. కథతో పాటు తాత్విక చర్చ కూడా ముందుకు సాగుతుంది. ప్రదేశం ఆసుపత్రి. సందర్భం చావుకు సమీపించిన చెల్లెలు. ప్రధాన పాత్ర అన్నయ్య రమేష్ త్యాగాలు, జీవితం. ఆ జీవితం యొక్క తాత్వీకరణ. రమేశ్ ప్రేమించి భంగపడ్డాడు. ఆమె మరొకర్ని పెళ్లి చేసుకొని హాయిగా వుంది. కానీ రమేశ్ పెళ్ళి చేసుకోలేదు. తమ్ముళ్లను, చెల్లెలను చదివించాలని, సామాజిక న్యాయం కోసం ఉద్యమాలు చేయాలని పెళ్లిని వాయిదా వేసుకొని జీవితాన్ని కొనసాగిస్తూ వస్తున్నాడు. ఆయన త్యాగాలు, నాయకత్వం ఆయన కోసం కాదు.

ఉద్యమం ఒక దశకు ఎదగగానే ఎవరో దాన్ని అందుకొని ముందుకు సాగుతుంటే రమేశ్ యువ నాయకత్వంతో పోటీ పడలేక ఓడిపోయాడు. ఆగిపోయాడు. ఆగిపోయిన చోటే త్యాగాలు చేస్తూ వస్తున్నాడు. అతని జీవితం అలా మారడానికి కారకులెవరు? ఎవరిని నిందించే అవకాశం లేదు. అనేక కారణాలు అందుకు తోడయ్యాయి. అయినా అతని త్యాగాలు వృధా పోలేదని చీకట్లో కనిపించే నక్షత్రాల్లా రాత్రి పూసే పూలలా తానూ ఒక కర్తవ్యం నిర్వర్తిస్తున్నానని ఒకతృప్తితో జీవిస్తున్నాడు. మనిషిలో ఇలాంటి తృప్తి ఏదో ఉంటుంది. తృప్తిలో ఒక అసంతృప్తి ఉంటుంది. కొంత తృప్తి వుంటుంది. తృప్తి పూర్తిగా సంతృప్తిగా మారితే మనిషి చనిపోతాడు. ఈ తాత్వికాంశాన్ని 'సదువు' కథలో గంగాధరి చనిపోవడంలో చిత్రించారు. అది చాలా మందికి చెప్పే దాకా తెలియదు. అలాగే రమేశ్ త్యాగాలు, తృప్తి, అసంతృప్తి, జీవిత పరిణామాలు చాలామందికి తెలియవు. చెల్లెలికి కూడా తెలియదు.

ప్రతి మనిషి తప్పో ఒప్పో తనకు అనుకూలమైన లాజిక్‌ను నిర్మించుకుంటాడు.

దొంగకు ఒక లాజిక్ వుంటుంది. లంచావతారాలకు కూడా ఒక లాజిక్ వుంటుంది. నేను పని చేసి పెడుతున్నాను. దాంతో కోట్లు సంపాదిస్తున్నాడు. వన్ పర్సెంట్ మార్జిన్ మామూలు తీసుకుంటే తప్పేమిటి? వాడు కాంట్రాక్టులో థర్టీ పర్సంట్ మార్జిన్ కొడుతలేడా? అని లాజిక్‌తో జీవిస్తుంటారు. ఈ లాజిక్ లేకపోతే వాళ్లు బతకలేరు. టెన్షన్స్, తప్పు చేశామనే భావన వెంటాడుతుంది. ఆరోగ్యం దెబ్బతింటుంది. షుగర్, అల్సర్స్, బీపీ మొదలైన రోగాలు వస్తాయి. తాను చేస్తున్న పనిని సమర్థించుకుంటూ ఆత్మవంచన, పరవంచన చేసుకున్నప్పుడే అతడు స్థిరంగా, హాయిగా, సుఖంగా జీవిస్తుంటాడు. అందువల్ల మోసగాళ్లు, దగాకోర్లు, నాయకులు తమదైన లాజిక్‌ని, సమర్ధనను తమకు తాము తయారు చేసుకుంటారు. దాన్ని చిత్రించడం అవసరం. అందుకు అలాంటి వారిని పరిశీలించడం అవసరం. ఇక్కడ రమేశ్ తన వైఫల్యాలకు లేదా త్యాగాలకు ఇచ్చుకున్న లాజిక్ ఎలా వుందో చూద్దాం.

"పెళ్ళి చేసుకొని మీరంతా ఏం సాధిద్దామనుకున్నారు? ఏం సాధించారని? ప్రకృతిలో పశు పక్ష్యాదులూ, ప్రతి ప్రాణీ పిల్లల్ని కంటున్నాయి. అదేనా మీరు సాధించింది.?"

"అన్నయ్యా!... అదే లేకపోతే ఈ ప్రపంచమే లేదు. నువ్వు లేవు. నేను లేను."

"అదే ప్రపంచమా!"

"కాదు."

"అయినపుడు నా యిష్ట ప్రకారం నన్ను బతకనీ"

ప్రమీల మూగబోయింది.

చెల్లెలు ప్రమీల సంసారం, కుటుంబం అనే జీవితాన్ని అందులో సాధించిన సౌఖ్యాలను తల్లితనాన్ని ఆదర్శీకరించింది. అన్నయ్య రమేష్ తన భావాలను, ఆ భావాల ఆధారంగా చేసిన త్యాగాలను, గడిచిన జీవితాన్ని సమర్థించుకున్నాడు. నా భావాలే నన్ను బతికిస్తున్నాయి అనేది గొప్పమాట. కోట్లాది మంది ప్రజలు తమ భావాల కోసం, బంధాల కోసం, అనుబంధాల కోసం, ఆత్మీయతల కోసం బతుకుతుంటారు. కష్టాలు ఓర్చుకుంటారు.

మరొకర్ని సంబోధిస్తూ కథ ప్రారంభించిన శైలి 'బతుకుపయనం' ఫోన్ సంభాషణ ద్వారా చూడవచ్చు.

ఉత్తరంతో ప్రారంభమయ్యే కథా శిల్పం 'నానమ్మ' కథలో చూడవచ్చు. కథ ప్రారంభాన్ని కథ మొత్తాన్ని సుగుణకు గంగాధర్ అన్నయ్య రాసిన ఉత్తరం ప్రేరణగా కథ కొనసాగించడానికి కారణంగా వుంటుంది. చక్కని సూత్రీకరణ, కొటేషన్లతో కొన్ని కథలు ప్రారంభిస్తుంటారు. అలాంటి వాటిలో 'జీవనయానం' కథ ప్రారంభంలో ఒక తాత్విక,

సామాజిక సూత్రీకరణతో ప్రారంభం అవుతుంది. విశేషం ఏమిటంటే కథంతా ఆ సూత్రీకరణను వివరించేదిగా, విశ్లేషించేదిగా ఉదాహరణ ప్రాయంగా సాగుతుంది. అనగా కథ యొక్క అంతస్సారాన్ని ఒక సూత్రీకరణగా మార్చి కథ ప్రారంభంలోనే కొటేషన్లుగా సంభాషణ రూపంలో నిక్షిప్తం చేశారు. పూర్వకాలం కథల్లో ఇలాంటి విశ్లేషణని, సందేశాన్ని, నీతిని కథాంతంలో చెప్పేవారు. ఆధునిక శైలి, శిల్ప రీతుల్లో తాత్విక కథగా మలిచిన 'జీవనయానం'లో ప్రారంభంలోనే చెప్పి పాఠకులను ముందుగానే తాము చదవబోయే అంశమేమిటో గమనించే విధంగా చిత్రించారు.

ఒక విషయాన్ని స్వయంగా ఉత్తమ పురుషలో నేను పాత్ర ద్వారా చెప్పడం ఒక శిల్ప వైవిధ్యం. నేను పాత్రతో కథ చెప్పడం ద్వారా కథకుడు స్వయంగా ఆ కథలోని జీవితాన్ని తన అనుభవంగా చెపుతున్నట్టుగా పాఠకులకు భావం కలుగుతుంది. తద్వారా పాఠకులు వాస్తవ జీవితమని ఆత్మీయతను, సాన్నిహిత్యాన్ని పొందుతుంటారు. అప్పుడప్పుడు అది నిజంగానే రచయిత జీవితమని అపోహ పడుతుంటారు. కొన్ని విషయాలను వివరించడానికి నేను అనే పాత్ర కోణం ద్వారా చెప్పడం ఎంతో సౌకర్యంగా వుంటుంది. అలా జైలు జీవితం కథలో ఎవరో చూసినట్టు, అనుభవించినట్టు కాకుండా ఉత్తమ పురుషలో నేను పాత్ర జైలుకు సంబంధించిన అనేక విషయాలను తన కళ్ళతో చూసి చెవులతో విని మన ముందుంచుతుంది. తద్వారా అదంతా స్వయంగా మనం విన్నట్టుగా, చూసినట్టుగానే అనిపిస్తుంది.

బతుకు పయనం కథల్లో ప్రేమ, శృంగార సన్నివేశాలు సృష్టించే అవకాశం ఎంతో వున్నప్పటికీ వాటిని చిత్రించలేదు. కొంతమంది రచయితలు వీటి పట్ల ఎక్కువ ఆసక్తి చూపుతారు. ప్రేమను, లలిత, శృంగారాన్ని, సెక్స్‌ను పాఠకులను ఆకర్షించడం కోసం నీచ, అభిరుచులను పెంచి పోషిస్తారు. ఉదాత్త కథకులు వాటిని ఉదాత్తంగానే చూపిస్తారు. 'బతుకుపయనం', 'జీవనయానం' కథల్లో ప్రేమికుల ప్రేమను ఎంతైనా చిత్రించే అవకాశం వున్నప్పటికి వదిలివేశారు. 'జైలు జీవితం' కథలో మహిళలపై ఘోరమైన పోలీసుల అత్యాచారాలను భయానకంగా బీభత్స రస ప్రధానంగా హృదయ విదారకంగా చిత్రించే అవకాశం వుంది. సినిమాల్లో విలన్ల ద్వారా ఇలాంటి సన్నివేశాలను కావాలని సృష్టించి ప్రేక్షకుల్లో నీచ అభిరుచులను పెంచుతారు. ఈ కథలో రచయిత అందుకు పూనుకోకపోవడంలో వారి హృదయ సంస్కారం శైలి, శిల్పంలో రూపుదిద్దుకున్న క్రమం కనిపిస్తుంది. ఈ విషయంలో ఆయన తన శైలి, శిల్ప దృక్పథాన్ని ఇలా తెలియజేశారు.

"శృంగార రసం వ్యక్తిగత ఆనందానికి ప్రయోజనాలకు సంబంధించినది. 'కరుణ' రసం ఇతరుల పట్ల స్పందించడానికి ప్రేరణ ఇస్తుంది. అందువల్ల 'కరుణ' రసం సామాజిక ప్రయోజనానికి సంబంధించినది. బౌద్ధం, క్రైస్తవం కరుణ రస ప్రధానమైనవి. బౌద్ధం

ఆవిర్భావంతో కరుణ రసానికి ఉన్నత స్థానం లభించింది. ఇతరుల సానుభూతి సహృదయత అవసరం అనుకున్నపుడు 'శృంగార రసం' కూడా కరుణ రసాన్ని ఆశ్రయించక తప్పలేదు. వియోగంలో, విషాద ప్రేమలో కరుణ రసమే ప్రేమికుల పట్ల స్పందింప చేస్తుంది. ప్రేయసి పట్ల వుండే ప్రేమ శృంగారానికి సంబంధించినదైతే తల్లిదండ్రి, చెల్లి, తమ్ముడు, పిల్లల పట్ల వుండే ప్రేమ కరుణ రసానికి సంబంధించినది. కరుణ రసంలో వాత్సల్య రసం కూడా అంతర్లీనంగా వుంటుంది. భక్తి, వీరరసాలు పాలకవర్గాలు, దోపిడి కులాలు, రాజులు, పూజార్లు, పార్టీలు ప్రజలను పరాయీకరించడానికి సంబంధించినవి. తోటి మనిషిపట్ల సానుభూతి కలిగించడం హృదయం స్పందింప జేయడం "కరుణ" రసంలోని మౌలికతత్వం. సాహిత్య మౌలిక తత్వం కూడా ఇదే."[11]

ప్రాచీన అలంకార శాస్త్రవేత్త ఉత్తర రామచరిత్ర రాసిన భవభూతి ఏకోరసఃకరుణఏవ అని కరుణ రసం ఒక్కటే రసం అని నొక్కి చెప్పారు. బౌద్ధం కరుణ, దయా రసాన్ని తన తాత్విక దృక్పథంగా తీసుకుంది. బౌద్ధ అలంకార శాస్త్రాల్లో కరుణమే ప్రధాన రసం. బౌద్ధాన్ని తన దృక్పథంగా భావించే బి.ఎస్.రాములు కథల్లోను ఇదే కనిపిస్తుంది.

"ప్రజల కష్టాల్లో రచయిత తోడున్నానని నిలబడాలి. ఆత్మవిశ్వాసం ఇవ్వాలి. వారిపట్ల ప్రపంచం కరిగి కదిలివచ్చేట్టు చేయాలి. కష్టాలు రాగానే వదిలేసి సుఖాలు రాగానే పట్టించుకుంటే పలాయనవాది అవుతారు. అవకాశవాది అవుతారు."[12] అని బి.ఎస్.రాములు అభిప్రాయపడతారు. అందుకని తన కథల్లో కష్టాల్లోను చిరు దీపంలా వెలుగును, భవిష్యత్తు పట్ల ఆశను చిత్రిస్తారు.

అయితే నానమ్మ, రాత్రిపూలు, జైలుజీవితం, ప్రశాంతం కథల్లో జీవితాలు విషాదాంతాలు కావడాన్ని చిత్రించారు. ఇది రచయిత ఉద్దేశించిన విషాదాంతాలు కావు. ప్రపంచీకరణలో ప్రజలు ఎలా ఉపాధి కోల్పోయి, కుటుంబాలు విడిపోయి జీవితాలు కోల్పోతు శిథిలమవుతున్నారో, సమాజం ఎలా శిథిలమవుతూ వస్తున్నదో సామాజిక వాస్తవికతను కళ్ళముందుంచారు.

అయినప్పటికీ విషాదాన్ని విషాదంతో ముగించకుండా 'నానమ్మ' కథలో మేనకోడలు సుజాతకు పెళ్ళి సందర్భంగా నగలు చేయించుకురాలేకపోతినే అనే మానవీయ సంబంధాలను గుర్తు చేస్తూ ముగించారు. 'రాత్రిపూలు' కథలో విషాదాంతాన్ని కథ మధ్యలోనే చెప్పి చెల్లెలు ప్రమీల తాను తల్లి తనాన్ని సాధించానని ఆత్మవిశ్వాసంతో ప్రకటించడం, అన్న రమేష్ తన భావాల కోసమే జీవించాననే తృప్తి తనకు వుందని చెప్పడం ద్వారా విషాదాంతంగా భావించకుండా ఒక తాత్విక గాఢతలోకి తీసుకెళ్ళి ముగిస్తారు. 'జైలు జీవితం'లో కూడా విషాదాంతాలను తిరిగి తేలికగా చేస్తూ 'వానికేందవ్వ జైల్లో వాడు మంచిగనే బతుకుతాండు. ఉన్న గోసంతా మాకే' అని చెప్పడం, జైలును

ప్రేమించ బుద్ధవుతుందని ప్రపంచమంతా జైలు లాగా అన్ని సమకూరే జీవితంగా మారాలని సందేశంతో ముగుస్తుంది.

'ప్రశాంతం' కథ ఒక్కటే పూర్తిగా నిరాశామయమైన విషాదాంతాన్ని చిత్రిస్తుంది. ప్రకృతి మీద మనిషి ఆధిపత్యం కోల్పోయిన క్రమాన్ని అదంతా ప్రభుత్వానికి ఇతర సామాజిక వర్గాలకు హక్కుభుక్తంగా మారి మనిషి పరాధీనుడు ఎలా అయ్యాడో చిత్రించిన తాత్విక అంశం వల్ల ఆ కథ విషాదాంతంగా ముగించారు. ఉద్యోగం పోయింది, కులవృత్తి పోయింది. ప్రకృతి మీద హక్కు పోయింది. ఈ విషాదాంతం ఇక బతకడానికి మనిషికి అంటూ మిగిలిందేమిటి అనే ప్రశ్నను మనముందుకు తెస్తుంది. తద్వారా పాఠకులు, సమాజం వారి పట్ల స్పందించాల్సిన అవసరం వుందని గుర్తు చేస్తుంది.

"సామాజిక వాస్తవికతతో పాటు ఆ సామాజిక వాస్తవికత ఆదర్శవంతంగా ఎలా వుంటే బాగుంటుందో కూడా చిత్రించడం సోషలిస్టు వాస్తవికత అంటారు. జీవితం ఎలా వుందో చెప్పడంతో పాటు ఎలా వుంటే బాగుంటుందో కూడా చెప్పడాన్ని సోషలిస్టు వాస్తవికత అంటారు. సామాజిక వాస్తవికతకు లేదా సహజత్వానికి కాస్తభిన్నంగా ఉన్నప్పటికీ కథ జీవితం చక్కగా వున్నప్పుడు దాన్ని సాహిత్య వాస్తవికత అంటారు.

విలువలను, సంస్కృతిని, పరిష్కారాలను ఆదర్శవంతంగా వాస్తవాలకు కాస్త భిన్నంగా చిత్రించినప్పుడు సాహిత్య వాస్తవికతగా గుర్తించి గౌరవిస్తారు. మంచే గెలవడం, కష్టాల్లో కూడా ఆశే నిలపడం కోసం రాసే అంశాలను సాహిత్య వాస్తవికతగా చెప్పవచ్చు. వాటిని సాహిత్య న్యాయం అంటారు. సాహిత్యంలో జీవితంలో వున్న దాని కన్నా ఆదర్శవంతంగా సాహిత్య న్యాయం చేకూర్చడం అవసరం."[13] అంటారు బి.ఎస్.రాములు.

బి.ఎస్.రాములు తన కథలను సామాజిక వాస్తవికతతో పాటు సంభావ్యత మీద, వాస్తవికతమీద ఆధారపడి చిత్రించారు. ప్రతి కథ అందుకు ఉదాహరణే. సోషలిస్టు వాస్తవికత అనేది దృక్పథంతో పాటు వస్తువును, శైలిని, శిల్పాన్ని తీర్చిదిద్దే ప్రధానమైన అంశం. ఈ జీవితం ఎలా వుందో చెప్పడమే కాకుండా, ఎలా వుంటే బాగుంటుందో ఆదర్శ పాత్రల ద్వారా మార్గదర్శనం చేయడమే సోషలిస్టు వాస్తవికత. 'నానమ్మ' కథలోని సుగుణ, సుజాత, 'రాత్రిపూలు'లోని ప్రమీల, రమేష్, 'బతుకుపయనం'లోని రవి ప్రకాశ్, చంద్రమౌళి, 'ఇంటల్లుడు'లోని రవీంద్ర, 'జీవనయానం'లోని అరవింద్, విక్రాంత్, రాధ, లత, నిర్మల, దేవక్క, చంద్రయ్య, అరుణ పాత్రలన్నీ సామాజిక వాస్తవికతలోంచి తీసుకొని ఆదర్శీకరించిన సోషలిస్టు వాస్తవికతను పుణికి పుచ్చుకున్న పాత్రలే.

కథ ఏదో ఒక అంశం మీద, ఏదో ఒక పాత్ర మీద కేంద్రీకరించడం, సూటిగా కథ నడపడం సులువవుతుంది. కథలో కొన్ని ప్రధాన పాత్రలు, ఇతర పాత్రలు వుంటాయి.

ప్రతిపాత్ర తనదైన వ్యక్తిత్వాన్ని, స్వభావాన్ని కలిగి వుండే విధంగా చిత్రించినప్పుడే జీవితం కథల్లో సాక్షాత్కరిస్తుంది. 'బతుకుపయనం'లో ప్రధాన పాత్రలు, ఇతర పాత్రలు ఇలా వున్నాయి.

5.4. కథలో ప్రధాన పాత్రలు-ఇతర పాత్రలు

	కథ పేరు	ప్రధానపాత్ర	ఇతర పాత్రలు
1.	నానమ్మ	సుగుణ	నానమ్మ, లక్ష్మీరాజం, సుజాత, లేచిపోయిన కూతురు
2.	రాత్రిపూలు	రమేష్	ప్రమీల, రాజ్యం
3.	బతుకుపయనం రవిప్రకాష్	శివరాజం,	చంద్రమౌళి, దివ్య, రామేశం, గంగాధర్, తల్లిదండ్రులు, చెల్లెల్లు, యుఎస్‌లో కొలీగ్స్, అమరేందర్, పార్థసారథి,
4.	ప్రశాంతం	లక్ష్మణ్	రాపోలు ఎల్లయ్య, కూతురు విమల, ఫారెన్స్ గార్డ్, వియ్యంకుడు వీరయ్య
5.	జైలు జీవితం	రవి	తల్లీ, కొడుకు, కోడలు, పోలీసులు
6.	ఇంటల్లుడు	మిట్టపెల్లి రవీంద్ర	పద్మావతి, చెల్లెలు సాధన, రవీంద్ర తమ్ముడు, బావమరిది, చిన్నమామ
7.	జీవనయానం	అరవింద్	విక్రాంత్, రాధ, నిర్మల, నిర్మల అన్న లత, నారాయణ సేేర్, సావిత్రి, తల్లి, చంద్రయ్య, దేవక్క అరవింద్ తమ్ముడు ఆనంద్, అరుణ.

సన్నివేశాలు చిత్రిస్తూ సంఘటనలు చిత్రిస్తూ మధ్య మధ్యలో కథ నడుస్తూ వుండాలి. సంఘటన తరువాత తిరిగి కథలోకి పాఠకులను తీసుకు వెళ్లాలి. ఇవన్నీ చిన్న చిన్న షిఫ్టులు. మెట్లు ఎక్కినట్లుగా, మెట్లు దిగినట్లుగా క్రమక్రమంగా ఈ మూడింట మధ్య లింకు సాధించుకుంటూ కథ నడపాలి.

1. సన్నివేశ చిత్రణ, 2. సంఘటన చిత్రణ, 3. కథ నడపడం.

బి.ఎస్.రాములు కథా నిర్మాణం ఎలా చేస్తారో పరిశీలించడానికి 'ప్రశాంతం' కథను ఉదాహరణగా తీసుకుంటాను.

దసరా పండుగకు అల్లుడు, బిడ్డ, వియ్యంకులు, కొడుకు, కోడలు, మనుమలు, మనుమరాండ్లతో ఎల్లయ్య పాత ఇల్లు నిండిపోయింది. ఎన్నాళ్లకో ఆ ఇల్లు ఆనందంతో కళకళలాడింది. అది ఎన్నో రోజులు మిగలలేదు. అల్లుడు లక్ష్మణ్ బాధపడ్తూ విషయం చెప్పిండు. అతన్ని కంపెనీలో డాక్టర్లు అన్‌ఫిట్ అన్నరని చెప్పిండు. స్వచ్ఛంద పదవీ విరమణ తీసుకొమ్మన్నరట. నన్నొక యంత్రంతీరు వాడుకొని వదిలేసుడేనా? నాకిచ్చిన జీతం ఎప్పటికప్పుడు ఖర్చయిపాయె. కాళ్లు చేతులు కూలవడ్డంక ఎట్ల బతుకుడు? పిల్లలను ఎట్లా చదివించుడు. మల్ల ఏం పని చేసుడు. ఇపుడు కొత్తగా మల్ల ఏం పని నేర్చుకునుడు? లక్ష్మణ్ అనడంతో దసరా పండుగకు కళకళలాడిన ఆ ఇల్లు తెల్లారే చిన్నబోయింది అని వర్ణిస్తారు రచయిత.

"కుక్కకున్న విశ్వాసం ఆ కంపెనీకి కార్మికుల మీద లేదు. గింత అన్యాయమా? ఎల్లయ్య కూతురు విమల తలబాదుకుంది."

"మనుషులకు పనిలేకుంట చేసే యంత్రాలు వస్తే మనుషులు ఏంపని చేసుకొని బతకాలె బావా?" అంటూ ఎల్లయ్య వియ్యంకుడు వీరయ్య ఎల్లయ్యనే అందుకు కారకుడైనట్టు నిలేసిండు."[14]

ఇందులో దసరా పండుగకు అనే పేరా కథ నడపడానికి సంబంధించింది. అందులో కొన్ని దృశ్యాలు కూడా వున్నాయి. అల్లుడు లక్ష్మణ్ బాధపడ్తూ విషయం చెప్పడం కొత్త సన్నివేశం ప్రారంభం కావడం.

నన్నొక యంత్రం తీరు వాడుకొని వదిలేసుడేనా? అనే భావాలు చర్చ లక్ష్మణ్ జీవితసారమంతా పిండుకొన్న తర్వాత మాట్లాడిన ఆవేశం, ఆక్రందన. దాంతో సన్నివేశం నుండి ఆనందకరమైన దసరా పండుగ తెల్లవారి విషాద సన్నివేశంలోకి షిఫ్ట్ అయింది. దాంతో ఇల్లు తెల్లవారే చిన్నబోయింది.

మళ్లీ ఒక సన్నివేశం, భావం, సంఘటన కథ గతాన్ని విశ్లేషించడం కొద్ది వాక్యాల్లోనే సాగింది. ఏమని?

'కుక్కకున్న విశ్వాసం కంపెనీకి లేదు' అనే ఒకటి. 'మనుషులకు పనిలేకుండా చేసే యంత్రాలు వస్తే మనుషులు ఏం పని చేసుకొని బతకాలె' ఇది మరొకటి.

సిద్ధాంత చర్చలు పెద్దగా చెయ్యనక్కర్లేకుండానే ప్రజలు తమ భాషలోనే పెద్ద పెద్ద విషయాలను ఎలా సూటిగా, స్పష్టంగా చర్చించుకుంటారో ఈ సంభాషణలో ప్రశ్నించడంలో

రచయిత చిత్రించారు.

ఇందులో సంభాషణా వుంది, సన్నివేశమూ వుంది, భావజాల చర్చ వుంది, సన్నివేశాల నుండి సంఘటనలకు షిఫ్టు కావడం వుంది. సంఘటనల నుండి తిరిగి కథలోకి మారడం కూడా వుంది. అది ఇలా లింకు కలిపారు.

"గదె నేను అడుగుదామనుకుంటాను. ఎవలనడగాల్నో తెలుస్తలేదు బావా?" అన్నడు ఎల్లయ్య.

ఇక్కడికి సంభాషణ, సన్నివేశం, సంఘటన అయిపోయింది. కథను ఇలా కలిపారు.

"వియ్యంకుడు వీరయ్య మట్టి పని చేసేవాడు. ట్రాక్టర్లు, ప్రొక్లెయినర్లు వచ్చినంక వీరయ్యకు పని దొరక్కుండాపోయింది. చిన్న కొడుకు అరబ్బు దేశంలో పని వెతుక్కుంటనని పైరవి చేస్తున్నడు." ఇది కథ.

తరువాత మళ్లీ సన్నివేశం, సంభాషణలోకి షిఫ్టు అవుతుంది.

"నీ దగ్గరేమన్న పైసలెల్లయా బావా? అనడిగిండు వీరయ్య." ఇలా దసరా పండుగకు అందరూ రావడం, ఆనంద పడడం అనే సన్నివేశాలు, ఉద్యోగం పోయిన సంఘటన వియ్యంకుడు కొడుకు అరబ్బు దేశాలకు పోదామనుకోవడం, అతను మట్టిపని చేసుకొని బతికిన గతం కథగా చెప్పిన క్రమమంతా సన్నివేశాలు, కథ, సంఘటన, సంభాషణ అన్నీ ఒక క్రమంలో కలుపుకుంటూ కథను కొనసాగించడం జరిగింది.

"కొందరు శిల్పం కోసం కథలోని వస్తువును, జీవితాన్ని బలి చేస్తారు. శిల్పం ప్రధానమై జీవితం అప్రధానం కావడం ఇలాంటి కథల్లోని లోపం. జీవితం ప్రధానంగా వుంటూ అందుకనుకూలంగా వుండే శిల్పమే మంచి శిల్పం అని రచయిత అభిప్రాయం."[15]

కథలో ముగింపులు ఎలాగైనా ఇవ్వచ్చు. కొందరు కొసమెరుపు ముగింపులు ఇస్తుంటారు. బి.ఎస్.రాములు కథల్లో కొసమెరుపు ముగింపులు కన్పించవు. జీవితంలో కొసమెరుపులు వుండవు. పరిణామాలే వుంటాయి. అందుకని ఆసక్తిగా చదివే విధంగా ముగింపులు వుంటే సరిపోతుందని రచయిత అభిప్రాయం.

5.5. 'నానమ్మ' ముగింపు

'నానమ్మ' కథలో చేనేత కార్మికుల ఆత్మహత్యలు, పెళ్ళి చేయలేక ఆడపిల్లలు లేచిపోవడాలు చిత్రిస్తూ అదే సమయంలో మానవీయ సంబంధాలు ఎలా కొనసాగాలో సన్నివేశాలు ప్రవేశ పెట్టారు.

"గాంధీతాతా! రాట్నాన్ని జాతి చిహ్నంగా జెండానెక్కించావు. మా బతుకులకేమిచ్చావు ఆధారం" అంటూ మనస్సు మూగగా ప్రశ్నించింది." సుగుణ మనస్సు ద్వారా చెప్పారు.

"సుగుణక్కా" అంటూ మేనకోడలు సుజాత పరుగున ఎదురొచ్చింది చూడలేదు. దాని మొహంలో పెళ్ళికళ. దాని మొహంలో నానమ్మే కనపడింది. మళ్ళీ పుట్టిన నానమ్మ నా దేవత. ఎనిమిదినెల్లల్లోనే ఎంత ఎదిగింది....! దేవకన్య వోలె ఎదురొచ్చింది. దీని పెండ్లికోసం పెండ్లి నగలేమి చేయించుకొని రాకపోతినని మనస్సు విలవిలలాడింది.

ఎందుకు చేయించుకు రాలేకపోయింది? దానికి కారణం చెప్పారు.

"అన్నయ్య ఉత్తరం వచ్చిన్నుంచి నా గురించే తప్ప దాని గురించి ఎందుకు ఆలోచన రాలేదో ఆశ్చర్యం... మళ్ళీ పుట్టిన నానమ్మకు ఏదైనా పెళ్లికి చేయించాలి."

ఇది పాఠకులకు ఇచ్చే సందేశం.

"నా చేతిలోని సూట్‌కేసు తీసుకొని సుజాత ఇంటికేసి దారితీసింది." సుజాతకు సుగుణకు గల అనుబంధం సూట్‌కేసు సుజాత తీసుకొని నడవడంలో గౌరవించడం, సాన్నిహిత్యం, ఆత్మీయత అన్నీ ఒక్క చర్యలో చూపించింది.

5.6. 'బతుకుపయనం' కథ ముగింపు

'బతుకుపయనం' కథ ".... పిల్లవాడు బెంగుళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తున్నాడు" అని ప్రారంభమవుతుంది. అమెరికా వెళ్ళి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా స్థిరపడి ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీ తామే పెట్టాలనుకునే ఆలోచనతో కథ ముగుస్తుంది. పిల్లవాడు చెల్లెండ్లు బీడీలు చేస్తుంటే ఆ పైసలతో చదువుకున్నాడు. తండ్రి బట్టలు నేసేవాడు. ఆ దశ నుండి ఎదిగి ఇంజనీరు అమ్మాయిని చేసుకున్నాడు. బెంగుళూరు నుండి అమెరికా వెళ్లాడు. పెద్దగా చదువుకోని చెల్లెళ్లను ఎక్కువ కట్నం ఇచ్చి టీచర్లకు ఇచ్చి పెళ్ళి చేశాడు. ఆ తరువాత బావలను కూడా అమెరికాకు పిలిపించుకోవడానికి సాఫ్ట్‌వేర్ ట్రెనింగ్‌లు చేయమంటాడు. వారి కోసం సంస్థనే పెట్టాలనుకుంటారు. ఇది ఎదిగిన క్రమం. ఒకే జీవితంలో కూలీ పని చేసుకొని బతికే స్థాయి నుండి పారిశ్రామిక వేత్తలుగా ఎదిగే క్రమం గ్లోబలైజేషన్‌లో అందివచ్చిన అవకాశం. దాన్ని మరింత ఎదగడం కోసం ఎలా ఉపయోగించుకోవాలో అనేది ముగింపు.

"మాకు వెనకటి కాలంలో టీచర్ ఉద్యోగం దొరకడమే గగనంగా వుండేది. మీ జనరేషన్లో కొందరైనా స్టేట్స్ పోగలిగారు. మిమ్మల్ని, మీ ఉత్సాహాన్ని చూస్తుంటే నాకు లాలా లజపతిరాయ్, గాంధీ, నెహ్రూ, అంబేద్కర్, ఎ.కె.రామానుజం, సర్వేపల్లి రాధాకృష్ణన్ గుర్తొస్తున్నారు. 150 ఏళ్ళ క్రితం నుండి వాళ్ళకు యితర దేశాలకు వెళ్ళే అవకాశాలు వచ్చాయి. అలాంటి అవకాశాలు యిప్పుడు మీకు వస్తున్నాయి. మీ జీవితం యిపుడే మొదలైంది. ఇక ఉన్నత శిఖరాలకు ఎదగడం మీ సంకల్ప బలాన్ని బట్టి, ఉత్సాహాన్ని బట్టి వుంటుంది. బిల్‌గేట్స్‌కు ఎవరు చెప్పారు ఎదగాలని? సత్యం, ఇన్ఫోసిస్

రామలింగరాజు, నారాయణ మూర్తి గారలకెవరు చెప్పారు? గుమాస్తా జీవితాన్ని ప్రారంభించిన రిలయన్స్ అంబానీకి ఎవరు చెప్పారు ఎదగాలని? అనాథగా పుట్టి పెరిగిన ఫోర్డ్‌కు ఎవరు చెప్పారు ఎదగాలని? అంతా సంకల్పబలం. పట్టుదల, నిరంత కృషి. విశ్వవిజేత అలెగ్జాండర్ ఒక మాటన్నాడు. గెలవదలుచుకున్న వారికి ఈ ప్రపంచం చాలా చిన్నది అని. నేను ఇంతకన్నా కొత్తగా, అదనంగా చెప్పడానికేమి లేదు. మీరు ఎంతగా ఎదిగితే అంతగా సేవ చేసే అవకాశం ఉంటుంది. ఈ విషయం మాత్రం మర్చిపోవద్దు. బెస్టాఫ్ లక్"[16] అని చెప్తాడు ఇండియా నుండి ఫోన్‌లో లెక్చరర్ చంద్రమౌళి.

బతుకుపయనం కథల్లో జిమ్మిక్కులకు, ట్విస్టులకు కొసమెరుపులకు అవకాశాలు తక్కువ. అలా జిమ్మిక్కులు, కొసమెరుపులు సృష్టిస్తే కథలోని గాఢత దెబ్బతింటుంది. చెప్పదలుచుకున్న వస్తువు, ఇతివృత్తం, సందేశం, జీవితం బలహీనపడుతుంది.

5.7. 'ప్రశాంతం' ముగింపు

'ప్రశాంతం' కథ గ్లోబలైజేషన్‌తో, ఆటోమైజేషన్‌తో విధ్వంసం అవుతున్న కుటుంబాల కథ ముగింపు ఇలా చిత్రించారు.

"ఆమె దుఃఖంలో కోపం లేదు... ప్రశాంతంగా ఏడుస్తోంది...

ఆ ప్రశాంతంలో ఒక నిరాశ. ఒక నిర్వేదం.

రేపటి సమాజం కూడా ఇంతేలే అని ఆశలన్ని సమాధి అవుతున్న దశ.

తండ్రి ఎల్లయ్య బైరాగి తత్వం రాగం తీస్తున్నడు.

ఇల్లంతా విధ్వంస చిహ్నాలకు బదులుగా విషాదం ప్రశాంతంగా చిక్కగా పరుచుకుంటున్నది."[17]

విధ్వంసం, విషాదం, బీభత్సం తరువాత ముగింపు ఇంకా ఎలా వుంటుంది? జీవితం సర్వనాశనం అయిపోయాక ఇంకా ట్విస్ట్‌లు, కొసమెరుపులు ఎలా వుంటాయి? విషాద బీభత్సం మానవాళికి అంతిమ ఘడియలు. అంతిమ ఘడియలకు కొసమెరుపులు, ట్విస్ట్‌లు వుండవు. కోట్లాది ప్రజల జీవితాలు విధ్వంసం అవుతున్నాయి. వాటికి కొసమెరుపులు వుండవు.

5.8. 'జైలు జీవితం' ముగింపు

అలాంటి ప్రయోగం ఒకటి 'జైలు జీవితం' కథలో చేశారు. అయితే అందులో విషాదాన్ని, విధ్వంసాన్ని సూచన ప్రాయంగా మాత్రమే చెప్పడం వీలు పడింది. అంటే విషాదం దాని స్థాయిలో రికార్డు కాలేకపోయింది. విషాద రసాన్ని సృష్టించే బదులుగా అది ధ్వనిగా మారిపోతుంది. తద్వారా కథ బాగా వుండవచ్చు కాని వారి జీవితం ధ్వనికోసం

ధ్వంసం కాకూడదు. విషాదం విషాదంగానే స్వీకరించాలి. అనుభవించాలి, పలవరించాలి, కన్నీరు కార్చాలి. అందువల్ల విషాదాలకు కొసమెరుపు ముగింపులు జీవితంలోని విషాదానికి న్యాయం చేయవు.

'జైలు జీవితం' కథలో ఒకసారి ఇద్దరు పోలీసులు వచ్చి కల్లు గుడాలు, మాంసం కావాలని వండించుకుని తింటారు. తరువాత అతని భార్యను చెర పట్టాలనుకుంటారు. ముప్పయ్యేళ్లుగా నిర్బంధం జీవితాలను ఎలా ధ్వంసం చేస్తున్నదో విధ్వంసం సృష్టిస్తున్నదో స్వయంగా చూస్తున్న వాడిని. దాన్ని మరింత భయానకంగా వర్ణించడం వల్ల ప్రజలు భయపడిపోవడమే తప్ప దాన్ని ఎదిరించడం సాధ్యం కాదు. అందుకని జైళ్లు ఇంతకన్నా ఎంతో బాగుంటాయి, జైళ్లంటే భయపడాల్సిన పని లేదు అని ఒక నైతిక ధైర్యాన్ని ఇస్తే ఎదిరించి పోరాడుతారు అని రచయిత దృష్టి. అందుకని విషాదాలను ముగింపులో కాకుండా కథ మధ్యలో చెప్పారు. ముగింపు ఇందుకనువుగా ఇలా చిత్రించారు.

"వానికేందవ్వా...! యాల్లకు తినుకుంట మంచిగనే వున్నడు. మంచిగ పానం పట్టిండు. ఉన్న గోసంతా మాకే. ఏం పని చేసుకొని బతుకాలె. ఎట్లా బతుకాలె. వానల్లేవు. కూలి పనుల్లేవు. వకీళ్ళకు ఫీజు ఎట్లియ్యాలె! వీని పిల్లగాండ్లను ఎట్ల చదివియ్యాలె. పిలగాండ్లను ఎవరూ జీతం వుంచుకుంటలేరు. ఏం బతుకో... జైళ్లనే నయం. ఏ రంధీ లేదు. మమ్ముల్నందర్నీ జైళ్లేసిన మంచిగుండు" అని వాపోతుంది తల్లి. వాళ్ళ మాటలు వింటుంటే అందరికీ భద్రత, మూడు పూటలా భోజనం. మనిషి వికాసానికి తోడ్పడే విధంగా ప్రపంచమంతా జైలుగా మారితే ఎంత బాగుండు అని అనిపిస్తున్నది. ఇప్పుడు నాకు జైలంటే భయంలేదు. పైగా జైలు మీద ప్రేమ కలుగుతున్నదని కథ ముగుస్తుంది.

5.9. రచయిత సామాజిక కర్తవ్యం

రచయితకు సామాజిక కర్తవ్యం వుంటుంది. దాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఆయా సందర్భాల్లో సామాజిక పరిణామాల్లో తనదైన కర్తవ్యం నిర్వర్తించాలి. 'ప్రశాంతం' కథలో చెప్పిన జీవన విధ్వంసం కన్నా భయంకరమైన విధ్వంసం, విషాదం వారి జీవితాల్లో పరుచుకున్నాయి.

'ప్రశాంతం' కథలో ఉపాధి మాత్రమే కోల్పోయారు. 'జైలు జీవితం' కథలో జీవితాల్నే కోల్పోయారు. ఈ విధ్వంసం పాలకులు తెచ్చి పెట్టింది. అయినా వాళ్లు ఏ ధైర్యంతో బతుకుతున్నారో ఏ ఆశతో బతుకుతున్నారో దానికి మరింత మద్దతు ఇవ్వాలి. మేమున్నామంటూ ధైర్యంగా వారి కోసం నిలబడాలి. అది ఈ కథలో కాన్సెప్టు. అలా లేకపోతే ఆ విషాదాన్ని ఎంతైనా రాయవచ్చు. అది పాఠకులపై బలమైన ప్రభావం వేస్తుంది. కానీ పాఠకుల కోసం కాకుండా ఆ జీవితాల కోసం ఆ కథ ఏం సందేశం ఇస్తున్నది

అనేది చాలా ముఖ్యమైనది. అందువల్ల పాఠకుల దృష్టిలో కాకుండా పాత్రలు, పాత్ర ధారుల దృష్టిలో ముగింపులు వుండడం అవసరం. కథ నడపడం అవసరం.

'ప్రశాంతం' కథ అందులోని పాత్రల కోసం రాసినట్టు కాదు. వారికి చేసిన మార్గదర్శనం, జీవితం గెలుచుకోవడానికి చేసిన సూచన ఏమీ లేదు. అందువల్ల అది పాఠకుల కోసం రాసినట్టు చెప్పవచ్చు. 'జైలు జీవితం' కేవలం పాఠకుల కోసం రాసినట్టు కాదు. అందులో పాత్రలకు మార్గదర్శనం వుంది. సమస్యల నుండి బయటపడే మార్గాలు వెతుక్కోవడం వుంది. అందువల్ల అది ప్రధానంగా అందులోని పాత్రల కోసం రాసింది.

కథ, నవల, వచన కవిత, సినిమా కూడా ప్రజల దగ్గరికి చేరాలి. ప్రజలతో మమేకం కావాలి. ప్రజలు దాన్ని చదవాలి, చూడాలి. పాటతో, ప్రసంగంతో పొందే ఉత్తేజాన్ని పొందాలి. తమ జీవితాలను మరింత బాగుపరుచుకొనే మార్గాలను సూచించాలి. కష్టాల్లోంచి బయటపడి జీవితాలని గెలుచుకొనే అనేక మార్గాలను చూపి జీవితం పట్ల కోల్పోయిన ఆశలను తిరిగి కల్పించాలి. అప్పుడే వాళ్లు ధైర్యంగా ముందుకు సాగుతారు. జీవితం గెలుచుకోవడం కోసం ఉద్యమిస్తారు. కష్టపడతారు.

5.10. 'ఇంటల్లుడు' ముగింపు

కథలు కొత్త అంశాన్ని పట్టుకొన్ని చెప్పగలగాలి. ఇంటల్లుడు కథలో ఈ ప్రయోగం చేశారు. అల్లున్ని శనిగ్రహం అని దశమ గ్రహం అని విమర్శిస్తుంటారు. వాస్తవ జీవితంలో అలా ఉండేది కొందరే. నిజంగా చాలామంది అల్లుళ్లు ఇంటికి పెద్ద కొడుకులాగా కర్తవ్యాలు, బాధ్యతలు నిర్వహిస్తుంటారు. బావమరుదుల, మరదళ్ల చదువులు, పెళ్లిళ్లల్లో తమ వంతు సహకారం చేస్తుంటారు.

"ఇంటల్లుడు పెద్ద కొడుకుతో సమానం. పెద్ద కొడుకు తండ్రి తర్వాత తండ్రంత. నువ్వు పూనుకోకపోతే నీ మరదలు పెళ్ళి ఎట్లయితది!" చిన్నమామ లక్ష్మీరాజం బతిమాలుతున్నాడు.

కథంతా చర్చలు, వాదోపవాదాలు, పెళ్లి ఎత్తిపోయే సీన్లు, పెళ్ళి కావలసిన పిల్ల ఏడ్వడాలు, అక్క సముదాయించడాలు, ఇంటల్లుడు రవీంద్ర చివరకు బాధ్యత తలకెత్తుకోవడం, పెళ్లి సజావుగా సాగిపోవడం సాగుతుంది. రవీంద్ర బావమరిది తన కొడుకును చదివించాలని కొత్త డిమాండు ముందుకు తీసుకొస్తాడు.

ముగింపు ఇలా ముగుస్తుంది. రవీంద్రకు సాయం చేయాలని వుంది. కానీ స్తోమత లేదు. అయినా అంగీకరించక తప్పలేదు. పదహారవ రోజు పెళ్లి పండగనాడు పెద్ద బావమరిది భార్యా పిల్లలను తీసుకు వచ్చాడు. పండగ అయిన తరువాత మరుసటి రోజు కొడుకును అక్కడే వుంచి భీవండికి బయల్దేరారు.

"పెట్టిన చెయ్యి ఊరకె ఉండది. నా బిడ్డ అన్నపూర్ణ." అంటూ మురిసిపోయింది పద్మావతి తల్లి. ఇలా ఎందుకు ముగించారు? నా అల్లుడు అని మురిసిపోవచ్చు కదా! ముందు అలా రాసి కొట్టేశారట! అది ఇంటల్లుడికి జరుగుతున్న అవమానాన్ని చెప్తదు. అన్నీ మేళ్లు పొంది చివరికి ఓడదాటాక బోడి మల్లయ్య అన్నట్టు అల్లున్ని చూసిన క్రమాన్ని ఒక మాటలో చెప్పాలి. అందుకని అత్త తన బిడ్డనే మెచ్చుకుంది. ఇలా అల్లుళ్లు ఎంత సేవ చేసినా వారికి గుర్తింపు లేకపోవడానికి వారి పట్ల సరైన అవగాహన, దృక్పథం లేకపోవడమే కారణం అని చెప్పడానికి ముగించారు. ఈ మాట ఒక వాక్యంతో చెప్పొచ్చు. అల్లుడు బాధపడ్డట్టు అతని డైలాగుతో ముగించవచ్చు. దానివల్ల ఏం జరుగుతుంది? చర్చకు జవాబు వస్తుంది. తనను తాను సమర్థించుకునే జవాబు వస్తుంది. అది పాఠకుల్లో స్థిరపడుతుంది. కనుక అల్లుని మంచితనమే తప్ప అతడు తనకు గుర్తింపు కోరుకున్నట్టు కనుక రాస్తే ఆ త్యాగం తిరగబడి ఆం ఏ పాటి చేశావులే అనే దుస్థితికి దిగజారుతుంది. ఇది తత్వశాస్త్రం, సైకాలజీ, సామాజిక శాస్త్రం, జీవితానుభవాలు వున్నప్పుడే తెలుసుకోవడం సాధ్యపడుతుంది. లేకపోతే అల్లుడు, బిడ్డ అత్తను పూర్వపక్షం చేసి రెండు డైలాగులతో కథను ముగిస్తారు.

5.11. కథల్లో సంభాషణ

బి.ఎస్.రాములు కథల్లో సంభాషణలు సహజసిద్ధంగా ఉంటాయి. ఎదురెదురుగా మనుషులు నిలబడి సంభాషించుకున్నట్లు చక్కగా సులభశైలిలో చదివే పాఠకునికి మదిలో ముద్రపడిపోతాయి.

"నిర్మలా! నీ పెళ్ళెపుడో!" నవ్వుతూ అడిగింది డాక్టర్ లత.

"నాకు రాధక్కలా నాన్న లేడు గదా! దారి చూపడానికి" అని నవ్వింది నిర్మల. ఆ నవ్వులో విషాదంపొర. మళ్ళీ తనే అంది.

"నాన్న నన్ను ఆనంద్ బావకిచ్చినా నా బతుకిలా అయ్యేది కాదు."

"నిర్మలా! గతం ఎపుడూ తిరిగిరాదు. గతాన్ని తలుచుకొని ఏడ్చి లాభంలేదు. గతాన్ని ద్వేషించి లాభం లేదు. ప్రస్తుతం ఏం చేయాలో గతం తాలూకు అనుభవాల్తో వర్తమానంలో నిలబడి వాస్తవికంగా ఆలోచించి గెలుచుకోవడమే జీవితం."[19]

అని సంభాషణలు తమంత తామే చెప్పుకున్నట్లుగా చక్కగా ఆవిష్కరిస్తారు బి.ఎస్.రాములు. అలాగే 'రాత్రిపూలు అనే కథలో కూడా సంభాషణలు ఇలా నడుస్తాయి. రమేష్ అనే అన్నయ్య పెళ్ళి చేసుకోకుండా ఉంటే వాళ్ళ చెల్లెలు ప్రమీల పెళ్ళి చేసుకుంటుంది. ఆ సంభాషణలు ఇలా సాగుతాయి. "ప్రమీ! పెళ్ళే జీవితానికి పరమార్థం అనుకోను" అని అంటే ఆ చెల్లెలు ప్రమీల ఇలా అంటుంది. "ఈ చెల్లెల్ల పెళ్ళిళ్ళు,

పురుళ్ళు, కట్నాలు, ఖర్చుల కోసం అని నీవు పెళ్ళి చేసికోవడం మానేశావు"

"అదేం కాదు."

"నువ్వు ప్రేమించిన రాజ్యం నిన్ను ప్రేమించలేదని వైరాగ్యమా!"

"మొదట అదే ఉండేది. ఇపుడు రాజ్యం మీద కోపం ఏమీ లేదు".

"నువ్వు అసలే పెళ్ళి చేసికోక పోవడం చూసి రాజ్యం బాధపడ్తోంది".

ఆమెను బాధపెట్టడం నా ఉద్దేశం కాదు. అలా అని ఆమె సంతోషం కోసం నేను పెళ్ళి చేసికోలేను. అని ఇద్దరి మధ్య సంభాషణలు దృశ్య కావ్యంలో చూసేటట్లు చదివే పాఠకుని మనసులో చిత్రం అంతా కనబడుతున్నట్లు ఉంటుంది. ఇంత చక్కగా కథల్లో సంభాషణలులో తనదైన ముద్రవేసుకుంటూ తెలుసు కథా రచయితల్లో తనకంటూ ఒక ప్రత్యేకమైన స్థానాన్ని పదిలపరచుకున్న రచయిత బి.ఎస్.రాములు.[20]

5.12. కథలో ఎత్తుగడ, కథ ప్రారంభం

"కథకుడు చెప్పదలచుకున్న అంశాన్ని ఆసక్తికరంగా ప్రారంభించటమే ఎత్తుగడ. కథా నిర్మాణ క్రమంలో ఎత్తుగడ ఒక ముఖ్య భాగం. ఎత్తుగడ బాగుంటే చదివే వారు కథ వెంట పరుగులు తీస్తారు. పునాదిని బట్టే భవన నిర్మాణం జరుగుతుంది. అలాగే ఎత్తుగడని బట్టే వస్తువుని కథగా మలచవచ్చు. ఎంత వస్తువుని ఏ విధంగా కథలోకి తీసుకురాగలమో అన్న అంశాన్ని ఎత్తుగడే నిర్ణయిస్తుంది. కథా ప్రారంభ సూచికమైన ఎత్తుగడ బలంగా ఉన్నప్పుడే, రచయిత తాను గ్రహించ దలచుకున్న విషయాన్ని కథలో వ్యక్తం చేయగలడు."[21]

పాఠకుని మనస్సుకు హత్తుకునే విధంగా కథ నాలుగు ఐదు వాక్యాలు చదివే సరికి కథలోనికి నిలబడి బయటికి రాకుండా చదివేటట్లు చేయగలగాలి. కథా ప్రారంభంలోనే ఆహా అని అనిపించేటట్లు ఉండాలి. ఎత్తుగడ అలా ఉంటే కథ చదివినంత సేపు మంచివిందు భోజనం ఆరగిస్తున్నట్లు ఉంటుంది. అది కథలో ఎత్తుగడను బట్టే వస్తుంది.

పాటకు పల్లవి ఎంత సొగసుగా, వినడానికి వినసొంపుగా ఉండి మనసును రంజింప చేస్తుందో, కథలో ఎత్తుగడ కూడా కథ చదివే పాఠకునికి ఆ విధమైన మానసిక ఆనందాన్ని కలగజేయాలి. అది ఎత్తుగడలో ఉన్న ప్రత్యేకత.

5.13. ఇంటల్లుడు కథ ఎత్తుగడ

'బతుకుపయనం' కథలు వివిధ ఎత్తుగడలతో ప్రారంభమవుతాయి. 'ఇంటల్లుడు' కథలో ఒకే పాత్ర మాట్లాడుతూ ప్రధాన పాత్రను ప్రవేశ పెట్టడం జరుగుతుంది.

"ఇంటల్లుడు పెద్దకొడుకుతో సమానం. పెద్దకొడుకు తండ్రి తర్వాత తండ్రంత. నువ్వు వూనుకోక పోతే ఈ పెండ్లెట్లయితది'' చిన్నమామ లక్ష్మీరాజం బతిమాలుతున్నాడు."[22] మిట్టపల్లి రవీంద్ర అనే అల్లుడిని లక్ష్మీరాజం అనే చినమామ బతిమాలుతూ కథ ప్రారంభమవుతుంది.

5.14. ప్రశాంతం కథ ఎత్తుగడ

"రాపోలు ఎల్లయ్య స్వచ్ఛంద పదవీ విరమణ చేసి పదేళ్ళయింది. నిజానికి అప్పుడీ పథకం లేదు. ఈ పేరూ లేదు. బొంబాయి బట్టల మిల్లులో సాంచాలు నడిపేవాడు. బిడ్డ విమల పెండ్లికెదిగింది. అంతదాకా బట్టకు పొట్టకు నడిచింది. బిడ్డ పెండ్లి ఎట్ల చేయాల్నో తోచలేదు. అప్పు ఎక్కడ పుట్టక ప్రావిడెంట్ ఫండ్ చేతికి రావడంకోసం చేస్తున్న పనికి రాజీనామా చేసిండు."[23] అని 'ప్రశాంతం' కథలో ఎత్తుగడగా సాగుతుంది. దీనిని మధ్యమ పురుషలో సాగే ఎత్తుగడగా చెప్పుకోవచ్చు.

5.15. రాత్రిపూలు కథ ఎత్తుగడ

"అన్నయ్యా! నీ భావాలవల్ల నువ్వు నీ జీవితాన్ని చాలా నష్టపోయావు. నీ బతుకుపొద్దు పడమటికి వంగింది. నీతోటి వాళ్ళు ఎపుడో ఆగిపోయారు. వాళ్ళు చేసిందానికన్నా ఎన్నో రెట్లు ఫలాలు అనుభవిస్తున్నారు. నువ్వు చేసినకాడికి చాలు. నువ్వు చెయాల్సింది యిక యువతరం చేయాలి. చేస్తుంది. నేనింకా ఎన్నాళ్ళో బతకనని నీకు తెల్సు. నా చివరి కోరిక మన్నిస్తావు గదూ!" ఇందులో ఒక చెల్లెలు, అన్నయ్యకోసం పడే తపన, అన్నయ్య జీవితంలో ఏమయిపోతుందో అనే ఆవేదనలో ఈ ఎత్తుగడ ప్రారంభమవుతుంది.

అదే విధంగా 'నానమ్మ', 'బతుకుపయనం', 'జైలుజీవితం', 'జీవనయానం' మొదలైన కథలు కూడా ఇదే రకమైన వర్ణనలతో ఎత్తుగడ ప్రారంభమవడం గమనించవచ్చు.

5.16. కథను ఎలా ముగించాలి

కథ గాని, కవితగాని, వ్యాసంగాని, ఏ ప్రక్రియకైనా సరే ముగింపుకు అత్యంత ప్రాధాన్యత ఉంటుంది.

కొసమెరుపు కథలు 'బతుకుపయనం' కథల్లో కనిపించవు. ఎందుకంటే అవి జీవన దృశ్యాలు కనుక.

5.17. కొసమెరుపు కథలు

కొందరు కొసమెరుపు ముగింపు ఇస్తారు. కొసమెరుపు ముగింపుతో మొత్తం కథంతా కరెంట్‌షాక్ కొట్టినట్టుగా మారుతుంది. అంతదాకా చదివింది కొత్త కోణంలో విస్ఫోటనం చెందుతుంది. కొసమెరుపు కోసం కథంతా ఆసక్తి కరంగా చదువుతారు. కొసమెరుపుతో

మెరుపు మెరుస్తుంది. అందుకోసం కథా క్రమం ఊహించని మలుపులు తిరుగుతూ వస్తుంది. మరింత ఉన్నతమైన మలుపుతో ముగింపు జరుగుతుంది. పాఠకుడు ఊహించలేని ముగింపు అయినప్పుడే కొసమెరుపు మెరుపు తీగవలె మెరుస్తుంది. కొసమెరుపులు అలాంటి జీవితాలకు వుండాలనుకుంటే కథ ప్రెజెంటేషనే మొత్తంగా మారిపోతుంది.

కథలో సామాజిక చరిత్ర చిత్రించేటప్పుడు ఊహించని మలుపులు సాధ్యమా? కొన్నిసార్లు సాధ్యం కాకపోవచ్చు. అయినా ముగింపు ఆకర్షణీయంగా వుండాలి. కథ పూర్తయ్యాక ఏదో కొత్త విషయం, చక్కని విషయం తెలుసుకున్నామనే తృప్తి, ఉత్సాహం పాఠకుల్లో కలగాలి.

ముగింపు చదివిన తరువాత ఆ కథను రెండవ సారి చదవడానికి ఆసక్తి వుండదు. ఎందుకంటే అది కొసమెరుపు ముగింపు గమ్యం కోసమే చకచకా నడుస్తూ ఆకర్షించింది. అందువల్ల కథలో చెప్పదలుచుకున్న మిగతా అంశాలన్నీ అప్రధానమై ముగింపు ఒక్కటే ప్రధానమై కూర్చుంటుంది. దానివల్ల కథలోని అంశాల ద్వారా పాఠకులకు అందాల్సింది సరిగ్గా అందదు.

కొసమెరుపులో చెప్పదల్చుకున్నదేమిటో కథ మధ్యలోనే ఎందుకు చెప్పకూడదు అన్పించి అలాంటి ప్రయోగాలు చేసి కథలు రాశారు. ముగింపును కథ మధ్యలోకి తెచ్చి కథను నడిపించారు. కథకు మళ్లీ ఏదో ఒక ముగింపు కావాలి. అది కూడా ఆసక్తికరంగా వుండాలి. కథను చదివించాలి. అలా కథకు రెండు ముగింపులు ప్రతి కథలో చేరాయి. ఒక ముగింపు కథ మధ్యలో వుంటుంది. అది కథలో భాగంగా కథ నడుస్తూ అది ముగింపు అన్పించదు, ఆకర్షించదు. రెండో ముగింపు మధ్యలో ఇచ్చిన ముగింపుకు తరువాయి భాగంగాను భిన్నంగాను కొనసాగించారు.

ముగింపు కథకు బలం చేకూర్చాలి. చీరకు అంచులాగా ప్రారంభం, ముగింపులు గట్టిగా, అందంగా వుండాలి. బూరెలు తియ్యగా వుంటాయి. లోపల పప్పు, బెల్లం లేదా చక్కెరతో చేసిన పదార్థం వుంటుంది. పైన రెండు పొరలు గోధుమ పిండితో చేసిన రొట్టె వుంటుంది. రొట్టెలో తీపి పదార్థం పెట్టి బూరెలు చేస్తారు. అలాగే కథ ప్రారంభం, ముగింపు వుంటుంది.

వాస్తవికమైన కథ అయినప్పుడు ముగింపు ఇవ్వడం పట్ల ఎక్కువ శ్రద్ధ పెట్టాల్సి వుంటుంది. కథంతా ఏమి హామి యిస్తున్నదో దాన్ని అనుసరించి ముగింపు వుండాలి. ఒక సమస్యను లేవనెత్తి కథగా మలిచినప్పుడు దానికి పరిష్కారం కూడా ముగింపులో వుండాలి. ప్రేమ, సామాజిక న్యాయం, సామాజిక మార్పు, స్నేహం, సాహసం, కరుణ, వాత్సల్యం, ఉద్యమం అనే అంశాలను తీసుకొని కథ రాసినప్పుడు మేధోపరమైన ఆలోచన, హృదయం రెంటిని సంతృప్తి పరిచే విధంగా ముగింపు వుండాలి.

బి.ఎస్.రాములు వీటిని తన కథల్లో చక్కగా సాధించారు. అందువల్లే కథా రూపం, కథా వస్తువు తెలిసినంత మాత్రాన కథలోని తత్వం, అంతస్సారం అంతసులభంగా పట్టుబడదు. మళ్ళీ మళ్ళీ చదివిన తరువాత దాని లోతుపాతులు తెలుస్తాయి. 'రాత్రిపూలు', 'ఇంటల్లుడు', 'నానమ్మ' కథలు చిన్న కథలైనప్పటికీ వాటిని వివరంగా విశ్లేషిస్తే గ్రంథాలు అవుతాయి. 'నానమ్మ', 'రాత్రిపూలు', 'జైలుజీవితం', 'ఇంటల్లుడు' కథలు విషాదాంతాలు అయినప్పటికీ ఆ విషాదాంతాలను కథ మధ్యలోకి మార్చి కాస్త సుఖాంతంగా కనపడే ముగింపులు ఇవ్వడం రచయిత దృక్పథానికి నిదర్శనం.

బతుకుపయనం కథల్లోని 'నానమ్మ'లో ఉండే ముగింపు "సుగుణక్కా" అంటూ మేనకోడలు సుజాత పరుగున ఎదురొచ్చింది చూడలేదు. దాని మొహంలో పెళ్ళికళ. దాని మొహంలో నానమ్మే కనపడింది. మళ్ళీ పుట్టిన నానమ్మ నాదేవత. ఎనిమిదినెల్లలోనే ఎంత ఎదిగింది. దేవకన్య వోలెఎదురొచ్చింది. దీని పెండ్లికోసం పెండ్లి నగలేమి చేయించుకొని రాకపోతినని మనస్సు విలవిలలాడింది.

అన్నయ్య ఉత్తరం వచ్చిన్నుంచి ఎప్పుడూ నాగురించే తప్ప దాని గురించి ఎందుకు ఆలోచన రాలేదో ఆశ్చర్యం... మళ్ళీ పుట్టిన నానమ్మకి ఏదైనా పెళ్ళికి చేయించాలి.

నా చేతిలోని సూటుకేసు తీసుకొని సుజాత ఇంటికేసి దారి తీసింది."[24]

అని 'నానమ్మ' కథ ముగుస్తుంది. ఇందులో చనిపోయిన వాళ్ళ నానమ్మ మరల వాళ్ళ అన్నయ్యకు కూతురుగా పుట్టిందని కాబట్టి ఎలాగైనా సరే మేనకోడలైన సుజాత పెళ్ళికి ఏదైనా చేయిస్తే తన నానమ్మకు చేయించినట్టు అవుతుందని భావిస్తుంది సుగుణ.

'రాత్రిపూలు' కథ విషాదాంతంగా ముగుస్తుంది. ఇందులో రమేష్ చెల్లెలు ప్రమీల ఇలా అంటుంది. "అన్నయా! నేను జీవితంలో అమృతనం సాధించాను. ఈ జీవితానికి యిది చాలు".

తృప్తిగా కళ్ళు మూసుకుంది ప్రమీల. రమేష్ ఆత్మీయంగా తలపై చెయ్యితో నిమిరాడు." కథ ఇలా ముగుస్తుంది.

కథను ముగించడంలో రచయితకు ఉన్న ప్రతిభ అమోఘమయింది. ఎందుకంటే కథను ఎలాబడితే అలా ముగిస్తే కథ అంతా కూడా కుంటుపడిపోవడానికి అవకాశం ఉంటుంది కాబట్టి కథలో ముగింపు కూడా ప్రముఖ పాత్ర పోషిస్తుందనడంలో సందేహం లేదు.

'బతుకుపయనం కథలో చేనేత కార్మికులుగా ఉంటూ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అయ్యే దశకు చేరడం ఇందులో తన కోసం కాకుండా కుటుంబం, వ్యవస్థ అందరినీ కూడా కలుపుకుని సాగిపోయే విధానం కనిపిస్తుంది. "అలాంటివాళ్లకోసమే ఈ సంస్థ పెదుతున్నది.

వాళ్లక్కడ కంప్యూటర్ ట్రైనింగ్ చేస్తే ఇక్కడ ఏదో చిన్నపనైనా ఇప్పియ్యవచ్చు. అదే మా ప్రయత్నం"[25] అని అమెరికాలో ఉన్న యువకులు ఇండియాలో ఉన్న వాళ్ళకు బాసటగా నిలుస్తాము అని ఆ పాత్రల ద్వారా చెప్పించారు రచయిత.

'జైలు జీవితం' అనే కథలో ఈ ప్రపంచం అంతా కూడా ఒక జైలుగా ఉండాలని ఇలా చెప్పారు. "వాళ్ళ మాటలు వింటుంటే అందరికీ భద్రత, మూడు పూటలా భోజనం మనిషి వికాసానికి తోడ్పడే విధంగా ప్రపంచమంతా జైలుగా మారితే ఎంత బాగుండు అనిపిస్తున్నది.

నేను అక్కణ్ణించి కదిలాను. ఇపుడు నాకు జైలంటే భయం లేదు. పైగా జైలు మీద ప్రేమ కలుగుతున్నది."[26] అని ముగించారు.

'బతుకుపయనం' కథా సంపుటిలోని చక్కనైన ఎత్తుగడ, కథ ముగింపును చెప్పడంలో శిల్ప సమర్ధతను సాధించారు రచయిత బి.ఎస్.రాములు.

5.18 కథా కథన శిల్పం

కథను నడిపించడంలో కథనం కూడా ఒక ప్రత్యేకమైన పాత్రను పోషిస్తుంది. కథనం వలన పేలవమైన కథ కూడా బలంగా ఉండేటట్లు కథా కథన శిల్పం ద్వారా తెలియజేస్తుంది. కథను నడిపించే పద్ధతినే కథనం అని చెప్పవచ్చు.

బి.ఎస్.రాములు 'బతుకుపయనం' కథల్లో తెలంగాణ ప్రజల భాషలో చాలా చక్కగా కథనాన్ని నడిపారు. వర్తమాన జీవితంలో చేనేత కార్మికులయొక్క జీవన స్థితిగతులు వాటిలో ఉండే వివిధ రకములైన అడ్డంకులు, అగచాట్లు మారుతున్న సమాజంతో పాటే మనుషులను కూడా మారేటట్లు చేసి వాస్తవ జీవితానికి దగ్గరగా కథనం చేశారు.

కథను చెప్పే పద్ధతిలో (1) ప్రథమ పురుష కథనం (2) ఉత్తమ పురుష కథనం (3) ఫ్లాష్‌బ్యాక్ కథనం అని మూడు రకాలు భేదాలను గమనించవచ్చు.

5.19. ప్రథమ పురుష కథనం

కథకుడు ప్రత్యక్షంగా కథలో పాల్గొనకుండా పాత్రల ద్వారా కథను నడిపిస్తే ఆ కథనాన్ని ప్రథమ పురుష కథనం అంటారు.

సంభాషణలను పాత్రను నడిపించడానికి వారి చేతుల్లో తన సామర్థ్యాన్ని ధ్వనించడానికి కథకునికి ఈ పద్ధతిలో ఎక్కువ అవకాశం ఉంది. దీనిలో కథకుడు కొన్నిసార్లు పాత్రలను పేర్లతో కాకుండా అతడు, ఆమె, వారు, వీరు మొదలైన సర్వనామాలతో సూచించి కథను ముందుకు నడిపిస్తాడు.

అరవింద్ అనే ఆయన రాధను ప్రేమిస్తే అరవింద్‌ను లత ప్రేమిస్తుంటుంది. ఇది

ఒక విధమైన ప్రేమ కథగా ఉంటుంది. 'జీవనయానం అనే కథలో ఇది కనిపిస్తుంది. "అరవింద్ ఆరాధనగా రాధకేసి చూస్తూ నవ్వాడు. రాధను కల్సుకోవడానికి ఇదొక మంచి ప్రదేశం అని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్ బయల్దేరదీసింది అరవిందే. నీ వెంట నేనూ వస్తా అని లత వెంటపడితే ఎలాగోలా తప్పించుకున్నాడు అరవింద్. ఆమె తనను లైక్ చేస్తోందని తెల్సు, కాని అరవింద్ రాధను లైక్‌చేస్తాడు."[27] ఈ విధంగా అరవింద్, రాధ, లత వీళ్ళ ముగ్గురి ప్రేమ కథ సాగిపోతుంది. ప్రథమ పురుష కథనంలో అలాగే 'నానమ్మ', 'ఇంటల్లుడు', 'రాత్రిపూలు' మొ॥లైన కథలు కూడా సాగిపోతాయి.

5.20. ఉత్తమ పురుష కథనం

కథలో కథకుడు స్వయంగా పాత్ర అయి 'నేను' అంటూ కథ చెప్పుకుంటు పోతాడు. ఆ పాత్రల భావాలు, జరిగిన సంఘటనలు, మనసులో ఉన్న స్వవిషయాలు వెలువడుతూ ఉంటాయి. ఇలాంటి సన్నివేశాలతో కథ నడుస్తుంది. అందులో 'జైలుజీవితం'లో ఇలా అంటాయి. "జైలుకు వెళ్ళడం నాకు అదే మొదటి సారి. భయంభయంగా ఉంది. జైలు గేటుముందు చాలామంది జైల్లో వాళ్ళని కలవడానికి వచ్చి ఎదురుచూస్తున్నారు. అందరూ ఎవరి గోసలో వాళ్ళున్నారు. ఒకరి గోస మరొకరు చెప్పుకుంటున్నారు.

నేను పెద్ద గేటు దగ్గరికి చేరాను. అక్కడ ఒక జైలు పోలీసు ఎవరు కావాలి అని అడిగాడు. పేరు చెప్పాను."[28] అని జైలుకి వెళ్ళడంతో అక్కడే ఉండే అనుభవాలను చెప్పినట్లుగా కనిపిస్తుంది. ఇది ఉత్తమ పురుష కథనంగా సాగుతుంది. అలాగే మిగతా కథల్లో కూడా.

5.21. ఫ్లాష్‌బ్యాక్ కథనం

కథ వర్తమానంలో ప్రారంభమై భూతకాలంలోకి నడిచి మళ్ళీ ప్రస్తుతానికి వస్తుంటాయి. దీనిని ఫ్లాష్‌బ్యాక్ పద్ధతి అంటారు.

"పని సరిగ్గా నడవకపోయినా పెద్దగ బాధనిపించలేదు. పనిలేన్నాడు బస్సెక్కి ఇంటి కచ్చిపడు. అక్కడి కష్టమంత మర్చిపోవు. ఇంటికాడ నికార్సయిన ఈత కల్లు దొరుకు. అది తాగితే కమ్మటి నిద్ర... ఇట్ల చేసీ చెయ్యక ఇంత పొట్టకు నడిపిస్తండు ఎల్లయ్య."[29]

ఈ 'ప్రశాంతం' కథలో రాపోలు ఎల్లయ్య బట్టల మిల్లులు సాంచాలు నడిపేవాడు. పనిపోయింది. అప్పుడు ఏం చేయాలో తోచక పట్నంలో పనికి వెళ్తాడు. అక్కడ దొరకకపోతే ఈత కల్లు తాగి గతాన్ని ఆలోచించుకుంటు కమ్మటి నిద్ర తీస్తుంటాడు. ఆ అనుభవాలన్నీ గుర్తు చేసుకుంటాడు. ఇదే కథనంలో కూడా 'జీవనయానం', 'నానమ్మ' కథల్లో కూడా ఫ్లాష్‌బ్యాక్ కథనం కనిపిస్తుంది.

'బతుకుపయనం' కథల్లో కొన్ని కథలు ఈ పద్ధతిలో కథనం చేయబడ్డాయి.

బి.ఎస్.రాములు తాత్వికుడు. పాఠకులను తికమక పెట్టే అంశాలు కాకుండా ఒక్కొక్క అశాన్ని వివరించుకుంటూ కథా కథన శిల్పాన్ని సాగించారు.

5.22. భావాల మధ్య సంఘర్షణ

జీవితంలో ఎంతటి వారైనా సరే, ఏదో ఒక విషయంలో ఒక విధమైన అలజడి రావడం సమంజసం. ఈ అలజడినే 'సంఘర్షణ' అని చెప్పవచ్చు. "సంఘర్షణ (conflict) శబ్దానికి తెలుగులో రాపిడి లేదా ఒరిపిడి అనే అర్థముంది. సాహిత్య పరిభాషలో కూడా ఇదే అర్థంలో ప్రయుక్తమవుతున్నది."[30]

సంఘర్షణకు కారణాలేవైనా సరే అవి బాహ్యమైన లేదా అంతరంగపరమైన పరిస్థితులు, ఏవైనా సరే సాంఘికంగా, రాజకీయంగా, ఆర్థికంగా, వివిధములైన సంఘర్షణలు ఏర్పడవచ్చు.

రచయిత తన కథలో ఎన్నుకునే సంఘర్షణ అతని అభిరుచిన బట్టి, జీవితానుభవాన్ని బట్టీ ఉటుంది అని వల్లంపాటి వెంకట సుబ్బయ్యగారు పేర్కొన్నారు కథాశిల్పంలో. అయితే సంఘర్షణను, రకరకాలుగా చిత్రిస్తున్నారు. వ్యవస్థలో వున్న వ్యక్తికి కూడా సంఘర్షణ పెరిగిపోతుంది. రచయిత కూడా తమదైన సామర్థ్యాన్ని ఉపయోగించి సంఘర్షణను చిత్రిస్తాడు.

"కథలోని సంఘర్షణ రచయిత దృక్పథానికి సంకేతం. మరొక రకంగా చెప్పాలంటే ఎలాంటి సంఘర్షణ లేని కథను రాసిన రచయితకు ఒక నిర్దిష్ట జీవిత దృక్పథం లేదని చెప్పవచ్చు."[31]

'నానమ్మ' కథలో పేదరికం ఉంది, మనవరాలు నానమ్మ జ్ఞాపకంలో ఉండేది. అలాగే కథ చివర్లో కట్నం ఇవ్వలేక ఒక అమ్మాయి లేచిపోతుంది. ఎదిగిన కూతురు ఎవరితోనో లేచిపోయింది. పెళ్ళి చేయలేదని నాన్నా బాధపడకు- మా బాధలేవో మేం పడుతాము. అని ఉత్తరం రాసిపెట్టిపోయిందట.[32] అని ఆ అమ్మాయి పడే సంఘర్షణ కనిపిస్తుంది.

'రాత్రిపూలు' కథలో రమేష్ పెళ్ళి చేసుకోకుండా ఉండిపోవడం అతని చెల్లెలు అడగాలా వద్దా అని సంఘర్షణ పడుతుంది. కాని ఆయన జీవితం అంతా నా తృప్తికోసమే అనే సంఘర్షణ కనబడుతుంది. నిరాశ ఉంది ఏం చేయాలి అని చెప్పలేకపోతాడు.

"ప్రమీ! నేను చాలా కోల్పోయానని, జీవితాన్ని నష్టపోయానని ఎందుకు బాధపడ్తావు. అది నీ దృష్టి... నేను కోల్పోయిందానికన్నా పొందిందే ఎక్కువ. మీ ప్రేమ నేను చేసిందానికన్నా ఎన్నో రెట్లు ఎక్కువ." నేను జీవితాన్ని ఓడిపోలేదని, ఉన్నతమైన జీవితాన్నే గెలుచుకున్నాననే తృప్తినైనా నాకు మిగల నివ్వు". అని అన్నయ్య పడే సంఘర్షణ దానికి

చెల్లెలు "అన్నయా! అంత మాటంటే నిన్ను ఏమీ అడగను". అన్నయ్య కళ్ళల్లోకి సుదీర్ఘంగా చూసి కన్నీళ్ళు పెట్టుకొంది ప్రమీల. కన్రెప్పలు మూత పడ్డాయి."[33] ఈ కథలో అన్నాచెల్లెల్లు పడే సంఘర్షణే ఈ 'రాత్రిపూలు' కథ.

అలాగే 'బతుకుపయనంలో చేనేత మగ్గం నేసే కుటుంబంలో ఉన్న రవిప్రకాష్ అనే కుర్రాడు బిడియల్ల్లో సైంటిస్ట్గా "కొంత కాలానికి రవిప్రకాశ్ తన తమ్ముడి కోసం యిండియాలో వున్న ఫ్రెండ్స్ను కదిలించి ఏదోలారీ ట్రాన్స్పోర్టు ఏజెన్సీ ఖాయంచేసి డిపాజిట్ కట్టాడు. అది బాగా నడుస్తోంది."[34]

ఇక్కడ రవిప్రకాశ్ కుటుంబం కోసం పడే సంఘర్షణ ఎదిగిన చోట అక్కడే ఉండిపోకుండా ఇంకా ఎదిగే లక్షణం కనిపిస్తుంది. మరల ఎదిగిన వాళ్ళు వారి సుఖం చూసుకోకుండా ఇతరులను కూడా సాయం చేసి చేరదీయడం ఆయన పడే సంఘర్షణ ఈ బతుకుపయనం కథలో కనిపిస్తుంది. అలాగే, 'ఇంటల్లుడు', 'జీవనయానం' కథల్లో కూడా ఈ సంఘర్షణ చక్కగా చిత్రించారు.

తెలంగాణ ప్రాంతంలో ఉండే చేనేత కార్మికులు వారు పడే కష్టాలతో అప్పులపాలైన మగ్గం పనిచేసే కార్మికులు అక్కడ వారు ఎదుర్కొంటున్న సమస్యలు, సాంఘికంగా వారు ఎలా నిలదొక్కుకోగలరు అనే అంశాలను ఈ 'బతుకుపయనం' కథల్లో వాస్తవానికి దగ్గరగా చిత్రించారు.

5.23. పాత్ర చిత్రణ

"రచయిత కథల్లో విశేషాంశాన్ని పాత్రల ద్వారా వ్యక్తం చేయిస్తాడు. పాత్రలను కథకు అనుగుణంగా మలచటంలో రచయిత ప్రతిభ వ్యక్తమవుతుంది. పాత్రలను కథలో ప్రవేశ పెట్టే క్రమంలో రచయిత రెండు రకాలయిన విధానాలు అవలంభిస్తాడు. ఒకటి ప్రత్యక్షంగా కథకుడే కథ చెప్పుకుంటూ ఒక్కో పాత్రని ప్రవేశ పెట్టటం. రెండోది పరోక్షంగా సంఘటనల కనుగుణంగా ఒక్కో పాత్ర ప్రవేశించటం."[35] అనేది సాధారణంగా కథా రచయితలు చేసేది.

పాత్ర చిత్రణ అంటే "ఒక పాత్ర యొక్క జీవితంలో ఒక హఠాత్పరివర్తనమును సంక్షిప్తంగాను, నాటకీయంగాను చక్కగా చెప్పడం." అని జేమ్స్విన్ అభిప్రాయం. James W.Linn : Lectures on the short story.[36]

బి.ఎస్.రాములు కథల్లో పాత్రను చిత్రించడం అనేది అదొక అద్భుతంగా ఉంటుంది. 'ఇంటల్లుడు' కథలో రవీంద్ర కష్టపడి పైకొస్తాడు. స్కూల్ అసిస్టెంటుగా ఉద్యోగం చేస్తాడు ఈ పాత్ర బలగాలే అక్కలు, బావలు, చుట్టాలు అందరు కూడా రవీంద్రనే ఆశ్రయిస్తారు. ఈ పాత్ర ఉన్నతమైనది. ఎందుకంటే చుట్టాలు, అందరిని కూడా కాదనకుండా బావలు,

వాళ్ళ పిల్లలని కూడా తన ఇంట్లో ఉంచుకుంటు అందర్ని చదివిస్తాడు. అందుకు అందరికి కూడా సాయపడే వ్యక్తిత్వం ఉన్న పాత్రగా రవీంద్ర మనకు కనిపిస్తాడు.

"అట్లంటె ఎట్ల కొడుక. నువ్వు నిలవడితె ఈంత కార్యం ఒడ్డెక్కుతది." పెండ్లి పిల్ల అమ్మమ్మ లక్ష్మవ్వ రవీంద్ర చేతులు, గదువపట్టుకొని పునికింది. బతిమాలింది. కన్నీళ్ళు పెట్టుకున్నది."[37] ఇందులో తన ఇంటల్లుడు అయిన రవీంద్రకు బతిమాలాడుతూ సాగే పాత్ర లక్ష్మవ్వ.

'రాత్రిపూలు' కథలో రమేష్, ప్రమీల, అన్నాచెల్లెల్లు, వారు ఒకరికోసం ఒకరు పడే తపన అంతా ఈ కథలో కనిపిస్తుంది. ఈ కథలో కొన్ని సిద్ధాంతాలు పాటిస్తూ పెళ్ళి చేసుకోకుండా ఉండిపోతాడు రమేష్. అలా కాదు నువ్వు పెళ్ళి చేసుకో అంటుంది ప్రమీల. మీరందరు పెళ్ళిళ్ళు చేసుకొని ఏం సాధించారని అని రమేష్ పాత్రలో ఉండే తత్వచింతన చక్కగా చిత్రించారు.

'నానమ్మ' కథలో సుగుణ అనే అమ్మాయి తనలో తాను ఇలా అనుకుంటుంది. నాపై నాన్న ముద్రా తాత ముద్రా తక్కువ. నా పై అమ్మకన్నా నానమ్మ ముద్ర ఎక్కువ. నా పెంపకం అలా జరిగింది. నన్ను నా స్నేహితురాళ్ళు అచ్చం నానమ్మల్లా మాట్లాడతవేమే అని వెక్కిరించేవాళ్ళు. నాకామాట కోపం తెప్పించే బదులు ఎంత సంతోషాన్నిచ్చేదో."[38] అని నానమ్మ తాలూకా పద్ధతులు, విధానం అంతా తలచుకుంటు స్వగతంలో ఉండే పాత్రగా ఈ కథలో నడుస్తుంది.

'జీవనయానం' కథలో కూడా చక్కటి పాత్రల విశ్లేషణతో సాగిపోతుంది. అరవింద్, విక్రాంత్‌లు పల్లెలో ఉండే చేనేత కార్మికుల స్థాయి నుండి ఒకరు డాక్టరు, ఒకరు లెక్చరర్ అయి సంఘంలో గుర్తింపు పొందుతారు. వీరి సంభాషణ్లో పాత్రలు చక్కగా పాఠకలోకానికి ఒక ఆదర్శంగా నిలిచే పాత్రలు.

"పైగా యిక్కడ ఉన్న గుర్తింపు గౌరవం, ప్రేమ సిటీలో ఎందుకుంటుంది? అక్కడ మనం మన సమాజానికి చేసే మేలంటూ ఏముంటుంది?"[39] అని అరవింద్, విక్రాంత్ పాత్రల సంభాషణల్లో కతలో క్లుప్తత స్పష్టంగా ఉండి, పాఠకుల మదిలో నిలిచిపోయే పాత్రలుగా బాగా కనిపిస్తాయి.

కథలో పాత్రలు ఇన్ని ఉండాలి అనే నిబంధన ఏది లేకపోవడం వలన, రెండు పాత్రలకు కూడా కథను నడిపించే కథలు 'బతుకుపయనం'లో ఉన్నాయి. ఈ కథలు తెలంగాణ గ్రామీణ నేపధ్యానికి సంబంధించినవి కనుక ఈ కథల్లో అక్కడ బతుకుల్లో ఉండేవే పాత్రలుగా దర్శనమిచ్చినట్లు కనిపించినా కథా గమనంలో చక్కగా ఇమిడిపోయి చక్కని శిల్ప సౌందర్యాన్ని సంతరించుకున్నాయి.

5.24. వర్ణనలు

కథను నడిపించేటప్పుడు కథలో ఉండే సన్నివేశాలను, మనోహరంగా హత్తుకు పోయేటట్లు చెప్పేదే వర్ణన. కథకుడు వర్ణనల విషయంలో హృదయానికి హత్తుకునేటట్ల చెప్తాడు. ఈ వర్ణనల వలన పేలవమైన కథ అంతా కూడా నిండుగనంగా ఉండి పాఠకుడికి ఎదురుగా ప్రత్యక్షంగా దృశ్యకావ్యం చూసే పులకింతకు బలైనట్లు ఉంటుంది వర్ణన. వర్ణనలు కథకు సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతాయి. అంతేకాకుండా, కథకు ఒక రకమైనటువంటి కొత్త సొగసులు కూడా తీసుకువస్తాయి.

బతుకుపయనంలో వర్ణనలు

గ్రామీణ ప్రాంతాలలో జరిగే పెళ్ళిళ్ళు ఆ విధానాల గురించి, 'బతుకుపయనం' కథలో ఇలా వర్ణించారు. "కుండలను సున్నంతో, ముగ్గులతో అలంకరించి ఐరేండ్ల పూజ చేశారు. ఏడు గాడిపొయ్యిలు తీశారు. వెనుకట ఎడ్లబండ్లమీద వచ్చేవాళ్లకోసం దుమ్ము ధూళి ఉంటుందని స్నానాలకు, వంటలకు గాడిపోయిలు పెట్టి అడివి నుంచి కట్టెలు కొట్టుకొచ్చి అట్లనే పొయ్యిలో పెట్టేవాళ్లు."[40] అని ఇంకా పెళ్ళి గురించి వర్ణన చేశారు.

"ఎదుర్కోల్ల దగ్గర ఇరుపక్షాలు పసుపు, కుంకుమ, నోట్లో చక్కెర మర్యాదలు జరిగాయి. పెండ్లి పీటగా బట్టచుట్టే దోనుగుకు కంకణం కట్టి పెట్టారు. దోనుగుమీద కూర్చోబెట్టి అల్లుని కాళ్లు కడిగారు. పెళ్లిలోనే అల్లునికి జంధ్యం వేయించారు.

తరువాత కన్యాదానం కార్యక్రమం... జిలకర బెల్లం పెట్టడం పెళ్లికన్నా ముఖ్యం ఎందుకైందో ఎవరికి తెలియదు. కాళ్లు తొక్కించారు. ఒకరి ఎంగిలి మరొకరికి తినిపించారు. కొంగులు ముడివేశారు. పుస్తెలు కట్టిన తరువాత పట్టపగలే అరుంధతి నక్షత్రం అంటూ చూపారు."[41]

ఈ కథలో ఇలా తెలుగు నేలపై జరిగే పెళ్ళి వర్ణన ఇంత చక్కగా చేసే రచయిత బి.ఎస్.రాములు.

నానమ్మ కథలో వర్ణనలు

'నానమ్మ' కథలో పెద్దవాళ్ళను, ముత్తయిదవులుగా, దేవతలుగా పోల్చి వర్ణించారు. "నిజంగా నానమ్మలకు అమ్మమ్మలకు వయస్సుంటుందా! దేవతలకు వయస్సుంటుందా. వాళ్ళు ఎపుడూ ఒకేలా కనపడతారు. మనం ఎలా చూస్తే అలా కనబడతారు. ఎన్నేళ్ళయినా ఎన్ని తరాలు మారినా... చనిపోయినా... నానమ్మలూ దేవతలూ ఒకేలా కనబడతారేమో."[42] ముసలివాళ్ళ పట్ల ఉండే ఆరాధనా భావం 'నానమ్మ' కథలో చూపించారు.

జైలు జీవితం కథలో వర్ణనలు

'జైలు జీవితం' కథలో జైలును కూడా చక్కగా వర్ణించారు. "ఇక్కడ ఒక నూతన మానవ సంబంధాలు ఆర్ద్రత రూపుదిద్దుకున్నాయి. నిజం చెప్పాంటే ఇది ఒక నూతన ఆదర్శ ప్రపంచం. జైల్లోనే దీన్ని నిర్మించుకోవడం సాధ్యపడింది. ఎందుకంటే ఇక్కడ ఆస్తి హక్కు తగాదాలు లేవు, హెచ్చుతగ్గులు అంతరాలు లేవు. అందరికీ ఒకే వంట. ఒకే కూర. ఒకే రకమైన జీవితం.

అందువల్ల అందరం సమసమాజం వలె ఇక్కడ బతుకుతున్నాం. కుటుంబాలు లేవన్నట్టుగాని ఇక్కడ ఎంత హాయిగా ఉందో నిజంగా రేపొచ్చే సమాజం కూడా నేను జైల్లో బతికినంత హాయిగా ఉంటుందో లేదో."[43] అని జైల్లో ఏ వ్యత్యాసాలు లేకుండా, ఎంతో హాయిగా జీవితం ఉండేటట్లుగా వర్ణనలు చేయడం అనేది బి.ఎస్.రాములుకే చెల్లింది. ఎందుకంటే బి.ఎస్.తాత్వికుడు. తన రచనల్లో కూడా తాత్వికతను చొప్పించి జైలు జీవితంలో ఎవరైనా సరే భయపడతారు. కానీ ఆ భయాన్ని వదిలించి, జైలులో కూడా అంతహాయిగా ఉంటుంది అనే వర్ణన మనోహరమైనది.

ప్రశాంతం కథలో వర్ణనలు

'ప్రశాంతం' కథలో "కుల వృత్తులు కూడు పెట్టకపాయె. ఈ కొత్త వృత్తులు ఎప్పుడు పోతయో తెల్వదాయె. రేపటిమీద ఆశలేకపాయె. ఎట్ల బతుకుడు? అని ఏదో తత్వం పాట అందుకున్నాడు ఎల్లయ్య."[44] ఈ వర్ణనలో ఈ యంత్రాలు వచ్చి పని చేసుకునే వాడికి పనిలేకుండా పోయిందని, కులవృత్తులు కూడా కాలగర్భంలో కలిసి పోతున్నాయని ఈ ప్రభుత్వాలు ఎన్ని ప్రణాళికలు వేసినా ఏం ప్రయోజనము లేదని రాపోలు ఎల్లయ్య ఆవేదనను ఈ కథలో చక్కగా వర్ణించారు.

చేనేత కార్మికుల దుస్థితి వారు ఈ పని చేసుకోలేక వేరే పనిలోనికి వెళ్ళలేక వారు పడే అవస్థలను ఈ 'బతుకుపయనం' కథల్లో వాస్తవానికి దగ్గరగా చూపించారు రచయిత. ఇంతటి చక్కని వర్ణనలు తెలంగాణ ప్రాంతం పరిసరాల్లో జరిగిన వాస్తవ సన్నివేశాలు, పాత్రల స్వభావాలు, కథలను, సహజ సిద్ధంగా వర్ణించి, మంచి పరిపుష్టిని కలిగించారు బి.ఎస్.రాములు.

5.25. కథల్లో కొటేషన్లు-నిర్వచనాలు

కథల్లో కొటేషన్లు కథకు ఎంతో అందాన్నిస్తాయి. పాఠకులకు అనేక విషయాలను తెలియజేస్తాయి. 'బతుకుపయనం' కథా సంపుటిలోని 'జీవనయానం' కథలో ఫెమినిజం తెచ్చిన వెలుగుతో పాటు జీవితంలో, దృక్పథంలో ఎలాంటి మార్పు తెచ్చిందో చూడవచ్చు.

జీవనయానం కథలో కొటేషన్లు-నిర్వచనాలు

"ఈ మొగోల్లు ఉత్తపనిదొంగలే. పని మనది పేరు వాళ్ళది. పడుగు పోసుడు, గంజి తెచ్చుడు, కండెలు చుట్టుడు, వంట చేసుడు, పోరగాన్లను సవరిచ్చుడు అన్ని చేసుకుంట మల్ల మొగ్గంనేయాలె. అంచునెయ్యాలె ఆడోల్లు. మొగోల్లు ఏమున్నదే పడుగు సరిచేసి నేసి అమ్ముకచ్చుడు. గంతే అమ్ముకరాను వోయి రాంగరాంగ తాల్లల్ల కల్లు దాగి అంత మందం ధర తక్కువకు అమ్మిందని అబద్దాలాడుతరు."

"ఈ సంసారం ఒక్కతీరు చేస్తే పురి కట్టిందానే! మనకు పొలాలు లేకపాయె, పెరండ్లు లేకపోయె. ఇత్తులు ఏది కొన్నా ధరలు అగ్గిమండె. కూలికి పోయి ఇత్తులు తెస్తుంటి. మక్క గట్క అందరు తింటే నాకు అది గూడ దొరకక పోవు. గంజిల ఉప్పురవ్వ ఏసుకుని తాగి పంటే ఆకలికి రాత్రికి పేగులు కడుపు నొప్పితోటి వడి తిరుగుతుండె."

"బట్టనేత అంటే ఆడిసేత లేనిది అసలే కాదే. ఇంట్ల ఆడిది పోతే కుల కశిపి పోయినట్టేనే. ఆ యిల్లు యిల్లు గాదు. గాడిదలు పొర్లినట్లుంటది. పోరగాన్ల దుబ్బల పొర్లినట్టుంటరు."

సామాజిక పరిణామంలో వలసలు సృష్టించిన క్రమాలు, గ్రామాలు శిథిలమవుతూ వస్తున్న తీరు గురించి "ఇరవై ఏండ్ల కింద నూరు కుటుంబాలుండె. ఆల్లందరు యిక్కన్నే వుంటే తక్కువకు తక్కువ మూడువందల కుటుంబాలైతుండె. కని యిప్పుడు 50 గడప వుండచ్చు. మిగిలినోల్లందరు పొట్ట చేతపట్టుకుని ఏదో ఒక పని వెతుక్కుంట ఎటెటో పోయిన్రు. ఒక ఊరుగాదు - ఒక రేవు గాదు. ఒక పని గాదు." శిథిలమైన కుటుంబాలు, సంబంధాలు...

జైలు జీవితంలో కథలో నిర్వచనాలు

'జైలు జీవితం' కథలో "ఊహలు వేరు. భయాలు వేరు. వాస్తవంగా చూడ్డం వేరు. పాము అని ఊహించుకుని ఉలికి పడ్డప్పుడు భయపడ్డాం. కానీ, నిజంగా పాము కనబడితే అంతగా భయపడం, దాన్ని చంపడమో మనమే తప్పుకుపోవడమో చేయాలనే ఆచరణాత్మక ఆలోచనలు కలుగుతాయి. ఊహల్లోని భయాలే ఎక్కువ భయపెడతాయి. అవి ఎదురైనప్పుడు నిజానికి అంతా భయమేమీ కాదు.

నేను లాకప్‌లో ఉన్నప్పుడు, జైలుకు వచ్చిన తరువాత కలిగిన అనుభవం ఇది. అంతకన్నా ముందు జైలంటే ఎంతో భయంగా ఉండేది. కానీ, ఇక్కడికొచ్చిన తరువాత ఆ భయం పోయింది. గాంధీ, నెహ్రూ వంటి ఎందరో గొప్పగొప్ప వాళ్ళు ఏళ్ళ తరబడి జైల్లో గడిపారు. నెల్సన్ మండేలా 27 ఏళ్ళు జైల్లోనే గడిపాడు. జైల్లో ఉన్నంత స్వేచ్ఛ నిజానికి బయటి ప్రపంచంలో ఉంటుందా?"

జీవనయానం నవలికలో నిర్వచనాలు-సూత్రీకరణలు

'జీవనయానం' నవలికలో "ప్రేమ, పెళ్ళి, కుటుంబ వ్యవస్థ, సామాజిక సంబంధాలు, సంస్కృతి, ఇవన్నీ రాజకీయాలే. ప్రతి వ్యక్తిగత విషయం కూడా రాజకీయమైనదే, సామాజికమైనదే. వీటితోపాటు ఉద్యమాల, పార్టీల, భావజాలాల, సంస్కృతుల పవర్ సెంటర్స్ అన్నీ సోషల్ క్యాపిటల్ సంచయాలే. ఇవన్నీ సోషల్ ఎకనమిక్స్ తాలూకు సోషల్ క్యాపిటల్ రూపాలు. ప్రేమ, పెళ్ళి, కుటుంబం మొ॥ రూపాల్లో పైసా పెట్టుబడి లేకుండా పురుషాధిపత్యం చెలాయించడం పితృస్వామిక సమాజ విలువల పట్ల సాధ్యపడుతున్నది."

"నేడు ప్రేమ అని చాలామంది ఫీలయ్యేదాన్లో ఫ్యూడల్ పెట్టుబడిదారీ దోపిడీ వర్గాల, పురుషాధిపత్యవాదుల దృక్పథమే ఉంది. రెండు హోదాల మధ్య, రెండు ఉద్యోగాల మధ్య, రెండు వ్యాపారాల మధ్య పెళ్ళిళ్ళవుతున్నాయే తప్ప అవి రెండు హృదయాల మధ్య కాదు. తల్లిదండ్రులు చూసే సంబంధాలు కూడా యివే. కాదంటే కట్నంతో కొందరు కాస్త పెద్ద హోదాతో పెళ్ళి చేస్తారు. అటువైపునుండి హోదాను, ఉద్యోగాన్ని బట్టి కట్నం లాగుతారు."

భారతదేశంలో మధ్య తరగతి రెండు పాయలుగా ఎదుగుతూ వస్తున్నది. వ్యవసాయక సమాజంలో మధ్య తరగతిగా, సంపన్నులుగా వున్న వాళ్లు పారిశ్రామిక, ఆధునిక సమాజంలో కూడా తిరిగి నూతన మధ్య తరగతిగా ఎదిగే వాళ్లు ఒక వైపు... కులవృత్తులు వదిలి ఆధునిక విద్యనందుకొని ఆధునిక సమాజంగా ఎదుగుతున్న శూద్ర కులాల మధ్య తరగతి ఒకవైపు... ఈ రెండో మధ్య తరగతి తమ కృషితో కింది స్థాయి నుండి మధ్య తరగతిగా ఎదుగుతూ లేదా ఎదగకుండానే కొద్దికాలంలోనే స్వయం కృషితో పారిశ్రామిక వేత్తలుగా, సంపన్నులుగా ఎదిగే క్రమాలు కొన్ని సంభవించాయి. వారు సాంప్రదాయకంగా ఎదుగుతూ వస్తున్న మధ్య తరగతికి భిన్నమైన సంస్కృతిని జీవితానుభవాలనుండి ఎదిగారు. వారికి కష్టం తెలుసు, సుఖం తెలుసు. అనేక డక్కామొక్కీలు తిని నిలదొక్కుకున్న వారు.

"త్యాగం చేశాననే భావనతో బతకడం, ఉత్తేజంగా జీవించడం గురించి 'రాత్రిపూలు' కథల్లో భిన్న కోణాల్లో చర్చించారు. నిరాశ గురించిన సూత్రీకరణ సైకాలజీ, తత్వశాస్త్రం నుండి తీసుకున్న అంశాలు. అధ్యయనం కథల నైపుణ్యాన్ని, గాఢతను పెంచుతాయి. తద్వారా చదువరులకు అనేక విషయాలను కథల ద్వారా తెలుసుకునే అవకాశం కలుగుతుంది. ఇలా కొటేషన్లు, నిర్వచనాలు కవుల్లాగా ఎన్నయినా చెప్పవచ్చు. కవిత్వం కూడా రాసి కథల్లో పెట్టవచ్చు. అలాంటి సందర్భాలను బి.ఎస్.రాములు కథల్లో చక్కగా ఉపయోగించుకున్నారు.

5.26. కథ పేర్లు, శీర్షికలు

ప్రతీ వ్యక్తికి పేరు ఉన్నట్లుగానే ప్రతీ కథకు కూడా పేరు ఉంటుంది. ఈ పేరునే

'శీర్షిక' అని కూడా అంటారు. శీర్షిక కథలో భాగం కాకపోయినా కథకు వన్నె తేవడంలో ప్రధాన పాత్ర శీర్షిక వహిస్తుంది.

"సుందరమైన విగ్రహానికి నొసటి తిలకంలాగే చక్కటి కథకు మరింత చక్కదనం చేకూర్చేది పేరు."[45] కథ రాయటం ఒక ఎత్తయితే, కథకు శీర్షిక పెట్టం మరో ఎత్తు. కథను నడిపించడంలో రచయితకు ఎంత ప్రతిభ ఉండాలో, శీర్షికను నిర్ణయించడంలో కూడా అంతే ప్రతిభ ఉండాలి. సాధారణంగా కథలలో ప్రధాన పాత్రను లేదా ఏదైనా సన్నివేశాన్ని గాని సూచించేదిగా శీర్షిక ఉండవచ్చు. కానీ కొన్ని కథల్లో ప్రతీకాత్మకంగా కూడా శీర్షికలు ఉంటాయి.

శీర్షిక ఆకర్షణగా ఉంటే కథ చదివే పాఠకుడు ఉబలాటపడతాడు. కానీ కథలో విషయం కాకపోతే, శీర్షిక ఎంత గొప్పదైనా సరే ప్రమాదమే. కాబట్టి శీర్షికను, కథకు సంబంధించినది ఉండాలి.

'బతుకుపయనం' కథలో బతుకు సాగే ప్రయాణం అంటే ప్రయాణం అనే పదానికి వికృతి పయనం, బతుకు వెళ్ళదీత అనే అర్థంలో చెప్పుకోవచ్చు. ఈ కథల్లో రచయిత తనదైన ప్రతిభను కనబరిచారు. ఈ కథల్లో అన్నీ కూడా జీవనం సాగించడానికి పడే ఆరాటం, కనిపిస్తుంది. అందుకే 'బతుకుపయనం' అనే శీర్షిక సరిగ్గా సరిపోయింది. ఈ కథల్లో చేనేత మగ్గం నేసే కుర్రాడు ఎంసెట్ చదవడానికి పడే ఆరాటం తరువాత అయిన అభివృద్ధిలోకి వచ్చేటప్పుడు, ఆ కుటుంబాన్ని అంతటిని చెల్లెల్ని పెళ్ళి చేయించి, అందరికి చేదుడు, వాదోడుగా ఉండి, బతుకపయనం సాగించాడు.

ఇంటల్లుడు పెద్దకొడుకుతో సమానం కాబట్టి ఆ ఇంట్లో ఏ కార్యక్రమమైనా సరే దగ్గరుండి జరిపి అందర్ని ఒక క్రమ పద్ధతిలో పెట్టి తన పెద్దరికాన్ని నిలుపుకుంటాడు. అందుకే 'ఇంటల్లుడు' శీర్షిక సరిగ్గా సరిపోయింది.

'నానమ్మ' కథలో ఒక మనవరాలు వాళ్ళ నానమ్మలా ఉంటుందని తనలోతానే అలా స్వగతంలో ఉంటూ కథ నడుస్తుంది. 'నానమ్మ' కథలో పేరు బాగుంది

'రాత్రిపూలు' కథ రాత్రులు చుక్కలు కనిపిస్తాయి. తెల్లారితే కనిపించవు కాబట్టి 'రాత్రిపూలు' అనే శీర్షిక అతికినట్టుంది.

'జీవనయానం'లో మొత్తం మానవ సంబంధాల మధ్య జీవనం ఎలా అనేది తెలుస్తుంది. ఒకరికి ఒకరు సహాయం చేసుకోవడం జీవితంలో అభివృద్ధి చెందిన వారు, పక్కవారికి చేయూతనివ్వడం మొదలైన సన్నివేశాలు, అలాగే ప్రేమలు, స్పర్థలు అన్నీ కూడా ఈ కథలో ఉన్నాయి. కాబట్టి 'జీవనయానం' అనే శీర్షిక ఈ కథకు వన్నె తెచ్చింది.

తెలంగాణ ప్రాంతంలో ఉండే వారి యొక్క జీవితాలను చిత్రించడం వలన జైలులో

కొడుకును పెట్టడం స్త్రీలపై జరిగే అత్యాచారాలు మొదలైన సన్నివేశాలు అన్నీ ఉండం వలన ఈ జైలు జీవితం శీర్షిక సరిపోయింది. ఈ శీర్షికలలో ఈ కథలకు అనుగుణంగా శీర్షికలు పెట్టడంలో తన ప్రతిభ చాటుకున్నారు.

5.27. భాషా శైలి

మానవ మనుగడకు అత్యంతావశ్యకమైనది భాష. భావ ప్రకటన సాధనాల్లో భాష అతి ముఖ్యమైంది. భాష నిరంతర ప్రవాహి, పరిణామ క్రమంలో మార్పులు కూడా సంభవిస్తాయి. భాష భావాన్ని వ్యక్తపరచడానికి, భావాన్ని తీసుకోవడానికి ఉపయోగపడుతుంది. భాషలో రకరకాలైన మాండలికాలు కూడా ఉంటాయి.

బి.ఎస్.రాములు రచించే రచనలో ఇంచుమించుగా అన్నీ కూడా తెలంగాణ ప్రజల భాషలో రచించారు. ప్రతీ ప్రాంతం ఏదో ఒక మాండలికాన్ని కలిగి ఉంటుంది. మాండలికమనేది భాషలో ఒక భాగంగా ఉంటూనే మరో విధంగా దాని ప్రత్యేకతను చాటుకుంటుంది. బి.ఎస్.రాములు తమ సాహిత్య సృజన అంతా సామాన్య జీవితాన్ని సాహిత్యానికి దగ్గరగా చేసి రచనలు సాగించారు.

ఒక రచయిత శైలి సహజంగా ఉండాలంటే సజీవ భాష సహాయపడుతుంది. బి.ఎస్.రాములు బతుకు పయనం కథా సంపుటిలోని కథలను తెలంగాణ భాషలో రాశారు. తెలంగాణ ప్రాంతభాష విశిష్టతను పాత్రల సంభాషణలో సహజత్వానికి దగ్గరగా తీర్చిదిద్దారు.

'బతుకుపయనం' కథలోని ఈ సంభాషణ పరిశీలిస్తే – "ఏం చెప్పాలె సార్ వాని కత? తల్లిదండ్రులు, తమ్ముడు, చెల్లెండ్లు అందరికి వాడొక్కడే పెద్ద దిక్కాయె. వాని సదువు కోసం పైసలు గావాల్నని బిడ్డలను ఏడో తరగతికే సదువు బందు పెట్టిచ్చి బీడీలు చెయ్యి పెట్టిన్రు. వాడు అమెరికా వోయె వెనకకు ఎదిగితే చెల్లెండ్లను కనీసం టీచర్లకన్న యియ్యాలెగద. ఏడో తరగతి పిలగాండ్లను ఈ కాలం టీచర్లు ఎవలు మెచ్చుతరు! తానంత చదివిన పిల్ల గావాలంటారు."[46]

ఇక్కడ మొత్తం భాష అంతా తెలంగాణ యాసలో ఉన్నది సదువు బందు పెట్టిచ్చి అంటే చదువు మానేసి అని తెలంగాణ మాండలికంలో అర్థం. 'పిలగాండ్లను' అంటే ఆడపిల్లలను అని అర్థం. 'మెచ్చుతరు' అంటే ఎవరు నచ్చుతారు అని సహజంగా తెలంగాణ భాష యాసలో సాగుతుంది.

"అట్లాగాక పోతే నేను రాధనే చేసుకుంట. ఇద్దరం కల్సి దవఖాన నడిపిస్తే తమ్ముడు మెడికల్ షాపు నడుపుకుంటాడు. అట్లా తమ్ముడు – మనం అందరం ఒక్క తీరు బతుకుతం గదనే"[47] దవఖాన అంటే – ఆసుపత్రి అనే అర్థం తెలంగాణలో ఉంది. ఒక్కతీరు – ఒకే

విధంగా అని అర్థం. ఈ సంభాషణల్లో కూడా తెలంగాణ భాషా శైలి జీవనయానం కథలో గమనించవచ్చు. మిగతా కథల్లో కూడా ఈ భాషా శైలి ఎక్కువగా పాఠకునికి దగ్గరగా ఉండేటట్లు ఉంటుంది. సందర్భానుసారంగా తెలంగాణ మాండలికంలో ఉండే పదాలను కూడా భాషలో చొప్పించడం వలన కథలు వాస్తవానికి దగ్గరగా చిత్రించబడ్డాయి.

5.28 తెలంగాణ పదాలు

'బతుకు పయనం' కథల సంపుటిలోని ప్రతి కథలో తెలంగాణ భాషా పదాలు ఎన్నో రికార్డు చేశారు. ఉదా.కు కొన్ని పేర్కొంటాను.

లొల్లి చేస్తివి – అల్లరి చేస్తున్నావు	పెండ – పేడ
కాళ్లగోల్ల – శోభనం	ఇత్తులు – విత్తనాలు
పోరగాన్లు – పిల్లలు	పడుగు – బట్టలోని నిలువుపోగు
సంచకరి – అడ్వాన్స్	సదిరిన – సర్దాను
పెట్టువోతలు – కట్న కానుకలు	ఏమనుకుంటున్రె-ఏమనుకుంటున్నారు
దొరింపు – కుదిరింది	ఐరేండ్లు – ఐరేని కుండలు
అందుగు – జిగురు కారే చెట్టు	ఔసులోల్ల – విశ్వబ్రాహ్మణుల
సొంచాలు – పవర్‌లూమ్స్	గట్ల – అలా
అంబటాల్లకు – అంబటివేళ	ఎవుసం – వ్యవసాయం
ఉద్దెరలెక్కొ – అరువు ఎక్కువ	పాయిఖానా – మరుగుదొడ్డి
ఇరాం – విశ్రాంతి	ఇన్ల – ఇక్కడ
నామర్ద – పరువు తక్కువ	తిరం – స్థిరం
తక్కోకు – తక్కువకు	బొక్కలు – ఎముకలు
ములాఖత్ – కలయిక	పానం – ప్రాణం
అచ్చిన్రు – వచ్చారు	సంతు – సంతానం
సైసదు – సహించదు	రంది – బాధ
దందా – వ్యాపారం	దావుకాన్ల – ఆసుపత్రి
తేపకోసారి – మళ్లీమళ్లీ	ఆగం – తొందర, విధ్వంసం
ఖిలా – కోట	నెగలనీయలేదు – నెగ్గనీయలేదు

మెచ్చుతలేదు - నచ్చట్లేదు

లగ్గం - లగ్నం

వచ్చిండు - వచ్చాడు

పెట్టిన్రు - పెట్టారు

దోస్తు - మిత్రుడు

ఎల్లది - వెళ్లదీసుకోవచ్చు

ఎటుపోయిన్రు - ఎటు వెళ్ళారు

బతికిన్రు - బతికారు

కూరాళ్ళు - తరవానికుండ

నికార్సయిన - అసలు సిసలైన

ఎనుక - వెనుక

తెలిండు - తేలాడు

తీస్కపోవుడు - తీసుకొని వెళ్లడం

బెదిరించిన్రు - బెదిరించారు

గోసంతా - కష్టమంతా

అసొంటిది - అలాంటిది

తెల్వదా - తెలియదా

నీలుగుడు - గర్వం

మిత్తి - వడ్డీ

పోయిండు - వెళ్ళాడు (పోయాడని కాదు)

ముట్టజెప్పిండనుకోన్రి - అప్పగించారు

ఎల్లదీసుడా - వెళ్లదీయడం

గుంటలు - గుంతలు

వాపసు - వెనక్కి తిరిగి ఇవ్వడం

పిలగానోళ్ళు - పెళ్ళి అబ్బాయి బంధువులు

కూసుండి - కూర్చుండి

పొద్దుందాక - పొద్దస్తమానం

వెతికిండు - వెతికాడు

ఆడించుడు - ఆడించడం

సావుగాను - చనిపోనీ

మంచిగుండు - బాగుండు

మర్రి పోతున్రు - వాపసు పోతున్నారు

గంతగనం - చాలా ఎక్కువ

పెరిగినం - పెరిగాము

దోసుగు - నేసిన బట్ట చుట్టుకునేది

తెర్లయిపోయింది - వృధా అయిపోయింది

అప్పాలు - నూనెలో వేయించిన పిండి పదార్థాలు

నరుప్పలుపుట్ట - దుర్వాసన వచ్చే మొక్కలు పుట్టాలి

గుడాలు - ఉడికించిన మొక్కజొన్నలు, అలిచింతలు

గుంజుకుపోయిన్రు - లాక్కుపోయారు

గింతమందిగల్సి - ఇంత మంది కల్సి

పింజెర - మగ్గంపైన చీరకు డిజైన్లు రావడానికి పెట్టే రాటు బొక్కెనలాగా తిరిగే చక్కల డిజైన్

5.29. చేనేత కులవృత్తి పదాలు

కండె	పోగు	ఏకులు
నూలుపోగులు	గంజి	నేయడం
దొడ్డునరులు	పింజర	సాదామొగ్గాలు
ఆముదంకండెన	పంటె	సంచకరి
ధని	లుంగీలు	తువ్వాలు
ఎనిమిది గజాల చీర	రాట్నం	పంటెలు
గిరిక	మగ్గంకొయ్యి	పడుగు
దోసుగు	నాడెలు	మగ్గంగుంట

5.30. 'బతుకుపయనం' కథల్లో 'రాత్రిపూలు' కథలో కొన్ని తాత్వికాంశాలు

1. ఆత్మవిశ్వాసం రోగాల్ని కూడా జయిస్తుంది. పుట : 17
2. కొన్ని నక్షత్రాలు చూడు వెన్నెల లేనపుడు దారిచూపుతాయి. పుట : 17
3. ఈ క్షణంలో నీవు చనిపోతావని తెల్సింది ఏం చేస్తావు! ఇప్పుడు అదే చేయి. పుట : 17
4. తనకు నచ్చని త్యాగాలను చూసి మనిషి అసూయ పడ్తాడా! ఆ అసూయ జీవి సానుభూతి రూపంలో వ్యక్తమౌతుందా! పుట : 17
5. "పెళ్లి చేసికొని మీరంతా ఏం సాధిద్దామనుకున్నరు? ఏం సాధించారని! ప్రకృతిలో పశుపక్ష్యాదులూ, ప్రతీ ప్రాణి పిల్లల్ని కంటున్నాయి. అదేనా మీరు సాధించింది." పుట : 19
6. నేను జీవితంలో అమ్మతనం సాధించాను. ఈ జీవితానికి ఇది చాలు. పుట : 19
7. "నేను జీవితాన్ని ఓడిపోలేదని ఉన్నతమైన జీవితాన్నే గెలుచుకున్నానే తృప్తినైనా నాకు మిగలనివ్వు." పుట : 17
8. జీవితం అంటే ఏమిటి : బ్రతుకంతా గడిచాక ఈ ప్రశ్న వేసుకొని ఏం లాభం. పుట : 17
9. పెళ్లే జీవితానికి పరమార్థం అనుకోను. పుట : 18

5.31. తిట్లు - శాపనార్థాలు

1. నీ ఇంట్ల పీనుగెల్ల అడ్సిపడ్డల (అకస్మాత్తుగా) ఎంత దెబ్బగాడ్తివి. పుట : 13
2. వాళ్ల కడుపు కాలవాళ్ల మొల్దారం తెంప. పుట : 47

3. వీళ్ళ సావుగాను వాళ్ళ దినాలుగాను. పుట : 47

4. వీళ్లను జెల్ది దుబ్బగడ్డకు వెట్ట. పుట : 47

5. వాళ్ళ వంశం నిర్వంశంగాను, వాళ్ళింట్ల నరుప్పులుపుట్ట. పుట : 47

5.32. సామెతలు

1. ఆ ఇల్లు ఇల్లు గాదు గాడిదలు పొర్లినట్టుంటది. పుట : 14
2. దేవకన్యవోలె ఎదురొచ్చింది. పుట : 15
3. కులం చెడ్డా సుఖం దక్కకపాయె. పుట : 47
4. ఇంటల్లుడు పెద్ద కొడుకుతో సమానం. పుట : 55
5. శనిగ్రహం తొమ్మిదోదైతే అంతటిబంటు ఇంటల్లుడు పదోగ్రహం. పుట : 56
6. అల్లుని మంచితనం లోకంల లేదు. పుట : 57
7. నూటి కొకలు అల్లుల్లు లంగలుంటరు. పుట : 57
8. తలప్రాణం తోకకు వచ్చింది. పుట : 71
9. ఓడిపోయి సింహాసనం దిగిన చక్రవర్తిలా. పుట : 72

పాదసూచికలు

1. కథానిక స్వరూప స్వభావాలు - పోరంకి దక్షిణామూర్తి ; పుట : 179
2. బండారు అచ్చమాంబ తొలి తెలుగు కథలు; 2010 - సం. సంగిశెట్టి శ్రీనివాస్ ముందుమాటలు - పుట : 27, 28, 29
3. భండారు అచ్చమాంబ తొలి తెలుగు కథలు-2010 - ముందుమాట ముదిగంటి సుజాతారెడ్డి; పుట : 7
4. సమగ్ర సామాజిక కథ తాత్విక భూమిక 50 ఏళ్ళ తెలుగు కథ తీరుతెన్నులు; (2003) బి.ఎస్.రాములు; పుట : 11
5. అడవిబాపిరాజు కథలు-కవిత్వం-పరిశీలన డా॥ వెలమల సిమ్మన్న; పుట : 2
6. కథానిక స్వరూప స్వభావాలు - పోరంకి దక్షిణామూర్తి ; పుట : 398
7. 'బతుకుపయనం' కథలు - రాత్రిపూలు ; పుట : 17
8. 'బతుకుపయనం' కథలు - నానమ్మ ; పుట : 10
9. కథ వస్తువు శైలి, శిల్పాలు - బి.ఎస్.రాములు ; పుట : 101
10. 'బతుకుపయనం' కథలు - రాత్రిపూలు ; పుట : 16, 17
11. కథ వస్తువు శైలి శిల్పం - బి.ఎస్.రాములు ; పుట : 145
12. పైదే పుట : 156
13. పైదే పుట : 170
14. 'బతుకుపయనం' కథలు - ప్రశాంతం ; పుట : 42, 43
15. రచయితతో సంభాషణ
16. 'బతుకుపయనం' కథలు ; పుట : 36, 37
17. 'బతుకుపయనం' కథలు - ప్రశాంతం ; పుట : 45
18. 'బతుకుపయనం' కథలు - జైలు జీవితం ; పుట : 54
19. 'బతుకుపయనం' కథలు - జీవనయానం ; పుట : 115, 116
20. 'బతుకుపయనం' కథలు - రాత్రిపూలు ; పుట : 18, 19
21. అట్టాడ అప్పల్నాయుడు ప్రత్యామ్నాయ కథలు-ఒక పరిశీలన - చౌదరి తారకేశ్వరరావు; పుట : 104
22. 'బతుకుపయనం' కథలు - ఇంటల్లుడు ; పుట : 55
23. 'బతుకుపయనం' కథలు - ప్రశాంతం ; పుట : 16
24. 'బతుకుపయనం' కథలు - నానమ్మ ; పుట : 14
25. బతుకుపయనం కథలు ; పుట : 37
26. 'బతుకుపయనం' కథలు - జైలు జీవితం; పుట : 54
27. 'బతుకుపయనం' కథలు - జీవనయానం; పుట : 63
28. 'బతుకుపయనం' కథలు - జైలు జీవితం; పుట : 46
29. 'బతుకుపయనం' కథలు - ప్రశాంతం; పుట : 39
30. కథానిక స్వరూప, స్వభావాలు - పోరంకి దక్షిణామూర్తి; పుట : 353
31. కథాశిల్పం - వల్లంపాటి వెంకట సుబ్బయ్య; పుట : 15
32. 'బతుకుపయనం' కథలు - నానమ్మ; పుట : 14
33. 'బతుకుపయనం' కథలు-రాత్రిపూలు; పుట :17
34. బతుకుపయనం కథలు ; పుట : 32
35. అట్టాడ అప్పల్నాయుడు ప్రత్యామ్నాయ కథలు-ఒక పరిశీలన - చౌదరి తారకేశ్వరరావు; పుట : 108
36. కథానిక స్వరూప, స్వభావాలు - పోరంకి దక్షిణామూర్తి; పుట : 325
37. 'బతుకుపయనం' కథలు - ఇంటల్లుడు; పుట : 56
38. 'బతుకుపయనం' కథలు - నానమ్మ; పుట : 9
39. 'బతుకుపయనం' కథలు - జీవనయానం; పుట : 110
40. బతుకుపయనం ; పుట : 29
41. బతుకుపయనం ; పుట : 30
42. 'బతుకుపయనం' కథలు - నానమ్మ; పుట : 10
43. 'బతుకుపయనం' కథలు - జైలు జీవితం; పుట : 50
44. 'బతుకుపయనం' కథలు - ప్రశాంతం; పుట : 43
45. కథానిక స్వరూప, స్వభావాలు - పోరంకి దక్షిణామూర్తి; పుట : 413
46. బతుకుపయనం కథలు ; పుట : 22
47. 'బతుకుపయనం' కథలు - జీవనయానం; పుట : 70

ముగింపు

సామాజిక తత్వవేత్త బి.ఎస్.రాములు గారు బాల్యం నుండి తన రచనా వ్యాసంగాన్ని సాగిస్తున్నారు. అప్పటి నుండి ఇప్పటివరకు అలుపెరుగని ఉత్సాహంతో వారు రచనలను వెలువరిస్తున్నారు. వచన కవిత్వం, వ్యాసం, కథ, తత్త్వశాస్త్రం, సాహిత్య విమర్శ, సామాజిక విశ్లేషణ మొదలైన ప్రక్రియలన్నింటిలో నిత్యం సాహిత్య, సామాజిక సేవ చేస్తున్నారు.

కథలో సమకాలీన సామాజిక అంశాలు ఎప్పటి విషయాలు అప్పుడే చిత్రించి, విశ్లేషించడం అంత సులువు కాదు. ఇది వారు స్వయంగా సామాజిక కర్తవ్యంగా స్వీకరించారు. అందువల్ల వారు తన కథల్లో సమకాలిన సామాజిక పరిణామాలను, కుటుంబాల పరిణామాలను, భావజాలాల మధ్య సంఘర్షణను, వ్యక్తిత్వాల మధ్య వైవిధ్యాన్ని, వైరుధ్యాన్ని, ప్రేమలు, పెళ్ళిల్లలో అంతర్లీనంగా సాగే సామాజిక, ఆర్థిక, కుల, వర్గ, ప్రాంతీయ కోణాలను విశ్లేషించారు. అందులో భాగంగా గత 70 ఏళ్ల సామాజిక పరిణామాలను, మానవ సంబంధాలను, సంస్కృతిలో వస్తున్న మార్పులను, సైన్సు, టెక్నాలజీలో వస్తున్న అభివృద్ధి, జీవితాల్లో నిర్వహిస్తున్న పాత్రను, గ్లోబలైజేషన్, ప్రైవేటేజేషన్ వల్ల కొందరు ఎదుగుతున్న తీరును, మరికొందరు ఉపాధి కోల్పోయి జీవితాలు కొడిగట్టి శిథిలమవుతున్న తీరును ఒక సామాజిక తత్వవేత్తగా తన లోతైన పరిశీలనా శక్తితో చిత్రించారు.

కథా రచనలో బి.ఎస్.రాములుగారిది ఒక ప్రత్యేక శైలీ శిల్పం, వస్తు వైవిధ్యం. 'బతుకుపయనం' కథా సంపుటిలో పాత్రల యొక్క పరిణామ క్రమాలు, చేనేత వృత్తిలో ఉంటూ వారు పడే కష్టాలు, కొందరు కష్టపడి ఉన్నతంగా ఎదిగే అవకాశాలను అందిపుచ్చుకొన్న తీరు, మరెందరో బట్టలు నేసే నేతన్నల దయనీయమై స్థితి ఈ కథలలో చిత్రించారు. బి.ఎస్. అదే సామాజిక వర్గానికి చెందినవారు కాబట్టి లోతుపాతులను, వారి కష్టాలను, కన్నీళ్లను చిత్రించగలిగారు. వారిలో ఉన్న మేధస్సుకు, విభిన్న దృక్పథాల అధ్యయనంతో వాటన్నిటినీ సమన్వయిస్తూ సాగే తాత్విక గాఢతకు, సృజనాత్మక శక్తికి ఈ కథలు సజీవ సాక్ష్యాలుగా నిలుస్తాయి.

ఈయన రచనలపై విశ్వవిద్యాలయాల్లో కొన్ని పరిశోధనలు జరిగాయి, జరుగుతున్నాయి. భవిష్యత్తులో ఈయన ఒక కథా నిఘంటువు వలె గోచరిస్తారు. తెలంగాణ ప్రజల సంస్కృతిని, సజీవంగా చిత్రిస్తూ సంస్కృతిలో వస్తున్న నూతన పరిణామాలను చక్కగా విశ్లేషించారు. సామాజిక తత్వవేత్తగా తన తాత్విక గాఢతను ప్రతి కథలో చూడగలిగిన వారికి ఆకాశమంత ఉన్నతంగానూ, సముద్రమంత లోతుగానూ చిత్రించిన క్రమం కనపడుతుంది. ఈ లఘు సిద్ధాంత గ్రంథంలో వాటన్నిటినీ వివరించటం దీని పరిధికి మించిపోతుంది. వీటిపై మరింత విస్తారంగా పిహెచ్.డి. పరిశోధనలు జరగవల్సి వుంది. అందుకు ఈ లఘు పరిశోధన కొంత స్ఫూర్తిని, ఆసక్తిని కలిగిస్తుందని భావిస్తాను.

అనుబంధం-1

బి.ఎస్.రాములు గారితో ఇంటర్వ్యూ

1. తెలంగాణ మాండలికంలోనే మీరు ఎక్కువగా కథలు రాయడానికి కారణం?

నేను కథలు, వ్యాసాలు, నవలలు పత్రికా భాషలోనే రాశాను. తెలంగాణ భాషలో రాయలేదు. రాస్తే ప్రచురించే పత్రికలు లేవు. సంభాషణల్లో తెలంగాణ భాష తెలంగాణలోని కరీంనగర్ జిల్లా ప్రజలు మాట్లాడుకునే సజీవ భాషను చిత్రించాను. అలాగే పత్రికా భాషలో తెలంగాణ పదాలను సామాన్యీకరించి ఉపయోగించాను. తెలంగాణలో పోయిండు, వచ్చిండు అంటారు. వాటిని పత్రికా భాషలోకి మార్చితే పోయాడు, వచ్చాడు అవుతుంది. పోయాడు అనే పదం కోస్తాంధ్ర భాషలో చనిపోయాడు అనే అర్థంలో వాడతారు. అందువల్ల వెళ్ళాడు అని రాశాను. తెలంగాణ భాషను వ్యవహారిక పత్రికా భాషగా మలిచే కృషి కొనసాగుతున్నది. అది పూర్తి స్థాయిలో వాడకంలోకి రాలేదు. కొందరు కవులు, రచయితలు పూర్తిగా తెలంగాణ భాషలో కొన్ని రచనలు చేశారు. కాని అందరికీ అలవాటు కాలేదు.

2. తెలంగాణలో జరిగే పోరాటాలు మీకు ఎలా ప్రేరణ కలిగించాయి?

తెలంగాణలో అనేక పోరాటాలు జరిగాయి. ట్రేడ్ యూనియన్ ఉద్యమాలు నాకు మొదటి ప్రేరణ. మా అమ్మ బీడీ కార్మికురాలిగా అప్పుడప్పుడు సమ్మెల్లో పాల్గొనాల్సి వచ్చేది. అలా ట్రేడ్ యూనియన్ ఉద్యమాలు పరిచయమయ్యాయి. హైస్కూల్లో విద్యార్థి ఉద్యమాలు తరువాత ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమాలు, అదే క్రమంలో ఆరెస్సెస్ నిర్మాణ ఉద్యమం, ధర్మపురి కాలేజిలో విద్యార్థుల ఉద్యమం, ఉద్యోగంలో చేరాక ఉద్యోగుల సంఘాల నిర్మాణం, ఉద్యమాలు నిర్మించడం, టిఎన్జీవోల, ఉపాధ్యాయుల ఉద్యమాలతో కలిసి నడవడం ఆ క్రమంలో విప్లవోద్యమాల పరిచయం ప్రభావం. భావజాలంలో మలుపు తీసుకొచ్చింది. దానికిముందు గోరా, సివి, నాస్తిక, హేతువాద రచనలు, అంబేడ్కర్ కుల నిర్మూలన, బోయిభీమన్న ధర్మంకోసం పోరాటం, ఎండ్లూరి చిన్నయ్య రాసిన అంబేడ్కర్ జీవిత చరిత్ర భావజాలంలో మౌలికమైన మార్పులకు దారితీశాయి. ప్రత్యక్షంగా విద్యార్థి, యువజన, రైతుకూలి ఉద్యమాలు అంబేడ్కర్ సంఘాల ఉద్యమాలు, పౌరహక్కుల ఉద్యమం, విప్లవ రచయితల సంఘం ఉద్యమాలు సమకాలీనంలో కొనసాగుతున్న క్రమంలో వాటితో కలిసి నడవడం సామాజిక కార్యకర్తగా వాటి నిర్మాణంలో, ఉద్యమాల్లో క్రియాశీలక పాత్ర నిర్వహించడం, నిర్బంధాలు ఎదుర్కోవడం, రచనలు చేయడం, ఉద్యోగ సంఘాల ఉద్యమాలు అందుకోసం 'సంఘమిత్ర' పత్రిక నిర్వహించడం అన్నీ ఏకకాలంలో జరిగాయి. ఇలా అన్ని సామాజిక ఉద్యమాల్లో కలిసిపనిచేయడం, క్రియాశీలంగా వుండే క్రమంలో ఉద్యోగాన్ని వదిలేసి పూర్తికాలం ఉద్యమాలకే అంకితం కావడం అనివార్యమైంది.

3. మీరు బీసీ అవడం వలన బీసీల సాహిత్యం రాస్తున్నారా?

అవును. నేను బీసీ కావడం వల్ల బీసీల సాహిత్యం రాయడం నా చారిత్రక కర్తవ్యం. అయితే వున్న ఫలాన ఈ అవగాహనకు రాలేదు. 'బతుకుపోరు' నవల బీడీ కార్మికుల జీవితాలకు సంబంధించిన నవలను 1982లో ప్రచురించాను. ఇది మా అమ్మ, మా ఆవిడ శ్యామల జీవిత చరిత్ర వంటిది. నా స్వీయచరిత్ర కూడా అందులో కలిసి వుంది. అది పద్మశాలి, చేనేత కులాల వారు కులవృత్తులు కోల్పోయిన తరువాత బీడీ కార్మికులుగా స్థిరపడిన బీసీల గురించిన జీవితాలకు సంబంధించిన నవల. అందులో చాకలి వారి జీవితం కూడా వుంటుంది. అయితే ప్రధానంగా మహిళా కార్మికులు ఇల్లాల్లుగా, తల్లిగా, ఉద్యమకారులుగా జీవిస్తున్న జీవితం, సంస్కృతి చిత్రించడానికి అది పరిమితం. అందులో భాగంగా ఉద్యమం ఎలా సాగుతున్నదో బొంబాయిలో 1982లో దత్తాసామంత్ సమ్మెతో లక్షలాది మంది పద్మశాలి బట్టల మిల్లు కార్మికులు ఉపాధి కోల్పోయి కరీంనగర్ జిల్లా సొంత గ్రామాలకు తిరిగి వచ్చిన క్రమం కొంత రాశాను.

1977-90 మధ్య విప్లవోద్యమ భావజాలం విప్లవించే ప్రజల జీవితాలు, సంస్కృతి గురించి కథలు రాశాను. 1985 నుండి కుల సమస్య పట్ల తీవ్ర సంఘర్షణకు లోనయ్యాను. వర్గ దృక్పథం ఒక్కటే సరిపోదని, కుల సమస్య, కుల వ్యవస్థ జీవితంలో ఎంతో ప్రధానమైన పాత్ర నిర్వహిస్తున్నదని వాటిని అర్థం చేసుకొని ఆ సమస్యల పరిష్కారానికి ఉద్యమ పోరాట రూపాలను, కార్యక్రమాలను రూపొందించుకోవాలని ఉద్యమాలు ఇంటా బయట చర్చలు సాగాయి. 1990 ఏప్రిల్‌లో బహిరంగ జీవితంలోకి వచ్చాక బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల ప్రజల గురించిన సాహిత్యం వారి జీవన పరిణామాలు సాహిత్య రంగంలో ప్రధాన సాహిత్య స్రవంతిగా ఎందుకు లేదో ప్రశ్నిస్తూ వ్యాసాలు, ప్రసంగాలు చేస్తూ 1992లో రచయితల, కళాకారుల, మేథావుల ఐక్యవేదిక నిర్మాణం చేసి వ్యవస్థాపక కన్వీనర్‌గా, అధ్యక్షుడిగా రాష్ట్ర వ్యాప్తంగా పర్యటిస్తూ నూతన తరాల నుండి ఈ దృక్పథంతో బుద్ధిజం, అంబేద్కరిజం వెలుగులో జీవితాన్ని పరిశీలించి రాయడం పట్ల సదస్సులు, శిక్షణా తరగతులు నిర్వహించాను.

ఆ క్రమంలో మొదట ఎస్సీల గురించి కథలు రాశాను. బీసీల గురించి ఎందుకు రాయటం లేదని చాలా మంది ప్రశ్నించడంతో బీసీల గురించి ఎలా రాయాలో ఒక నమూనాగా, మార్గదర్శకంగా వుండాలని విశ్లేషణాత్మకంగా బీసీల కథలు రాశాను. ఆ క్రమంలో మీరు పద్మశాలి కులంలో పుట్టి పద్మశాలి జీవితాల గురించి రాయకపోతే ఎలా ప్రశ్నిస్తూ పద్మశాలీల కులంలో పుట్టిన మీరు పద్మశాలీల గురించి రాయకపోతే మరెవరు రాస్తారు అని ఆవేదనగా అడగడంతో నేను తిరిగి నా కులాన్ని కొత్తగా అధ్యయనం చేసి పద్మశాలి, చేనేత కార్మికుల జీవితాల గురించి వందేళ్ళ పరిణామాల గురించి వచ్చిన కష్టాలు, నష్టాలు, ఎదిగిన క్రమాలు, శిథిలమవుతున్న జీవితాలు, అమెరికా దాకా వెళుతున్న శ్రేణులు అన్నింటిని చిత్రించాను. ఆదర్శవంతమైన జీవితం ఎలా వుండాలో అన్ని కథల్లో

చిత్రించాను. అలా రూపొందినవే 'బతుకుపయనం'లోని కథలు.

4. ఇన్ని రచనలు చేసిన దాంట్లో ఒకదానికైనా సరే గౌరవ డాక్టరేట్, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు, పద్మశ్రీ, జ్ఞానపీఠ్, లాంటి అవార్డులు రాకపోవడానికి కారణం ఏమిటి సార్?

నేను గౌరవ డాక్టరేట్‌లు, అకాడమీ అవార్డులు, పద్మశ్రీ, జ్ఞానపీఠ్‌లు తీసుకొనే బదులుగా నేనే వాటిని సరైన వారికి ఇవ్వాలనేది నా లక్ష్యం. అందుకే ప్రభుత్వాలు చేయాల్సిన పనిని విశాల సాహితీ ద్వారా పురస్కారాలు అందజేస్తున్నాను. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డులు ఇచ్చే పద్ధతేమిటో కొంత అవగాహన కలిగింది. కొంతకాలం క్రితం కేంద్ర సాహిత్య అకాడమీకి అవార్డులకు రచనలు సూచించాల్సిందిగా ఢిల్లీ నుండి నిర్వాహకులు కోరారు. అందులో ఎలా నిర్ణయిస్తారో, దాని క్రమమేమిటో కూడా తెలిపారు. తెలుగు విశ్వవిద్యాలయం వారు కూడా దాన్నే అనుసరిస్తున్నారు.

గౌరవ డాక్టరేట్‌లు రాజకీయాల ప్రమేయంతో ఇస్తున్నారు. ప్రధానంగా ఇప్పటికీ రాష్ట్రంలో, కేంద్రంలో బ్రాహ్మణులు, అగ్రకులాల వాళ్లు న్యాయ నిర్ణేతలుగా చక్రం తిప్పడం వల్ల గత యాభయ్యేళ్ళలో ఎంతోమంది బీసీ, ఎస్సీలకు కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారాలు, తత్సమానమైన ఇతర పురస్కారాలు అందడం లేదు. మూడు శాతం జనాభాలేని బ్రాహ్మణులు కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారాల్లో 70 శాతం పైగా కైంకర్యం చేసుకుంటున్నారు. గుళ్ళల్లో పూజారులుగా కూడా 90 శాతం పైగా వారే వుంటున్నారు. వేద విద్యలో, పురాణ పఠనంలో, ఐఏఎస్, ఐపిఎస్ వంటి ఉన్నత స్థాయిల్లో కూడా వారి జనాభాను మించి భారతదేశంలో అందరికన్నా కూడా ఈ ఒక్క కులం వారే అధికారం చెలాయిస్తున్నారు. అన్ని రంగాల్లో ఏ పార్టీ అధికారంలో వున్నప్పటికీ వీరే చక్రం తిప్పుతున్నారు. సమాజానికి, సాహిత్యానికి ఎంత సేవ చేశారు అనేది కాకుండా దాంతో పాటు తమ పార్టీకి ఎంత సేవ చేశారు అనేది రాజకీయ నిర్ణయాల్లో ముఖ్యపాత్ర నిర్వహిస్తున్నది. అందువల్ల పార్టీల కోసం ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ప్రయోజనం చేకూర్చే వారికే వీటిలో ప్రాధాన్యత ఇస్తున్నారు.

కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డులు, పురస్కారాల విషాయానికి వస్తే అన్ని ప్రక్రియలకు న్యాయం చేయడానికి ప్రస్తుత అవార్డులు సరిపోవు. కథ, నవల, కవిత, పద్యం, నాటకం, పాట, స్వీయచరిత్ర, ఇతరాలు వంటి వగైరా ప్రక్రియల్లో ప్రతి ప్రక్రియకు పురస్కారం ఇవ్వడం అవసరం. సినిమా రంగంలో ప్రతి చిన్న విభాగానికి పురస్కారాలు ఇస్తున్నారు. సాహిత్య పురస్కారాలకు ఇచ్చే బడ్జెట్ కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో చీమకాలు అంత కూడా కాదు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలకు అనుకూలంగా రాస్తూ ప్రభుత్వాన్ని ఎలా ప్రజానుకూలంగా వుండాలో సూచిస్తూ, హెచ్చరిస్తూ రాసే రచయితల పట్ల, మేథావుల పట్ల పాలకులకు భయముంటుంది. అందుకని మాలాంటి వారిని పురస్కారానికి ఎన్నిక చేయడానికి అన్ని దశల్లో ఎంతో గుండెబలం, ప్రభుత్వాన్ని నిలదీసే ధైర్యం వున్న

వాళ్ళున్నప్పుడే సాధ్యపడుతుంది.

అందరికీ సరైన న్యాయం జరగడానికి ఒక పెద్ద ఉద్యమం చేయాల్సిన అవసరం వుంది. ఆ అవసరాన్ని గురించి రెండు దశాబ్దాలుగా దేశ వ్యాప్తంగా రచయితలకు, కళాకారులకు వివరిస్తున్నప్పటికీ అసంఘటితంగా వుండిపోతూ ఉద్యమించలేకపోతున్నారు. అందుకు కారణాలేమిటో తెలియదు. పార్లమెంటులో బీసీ, ఎస్సీ, ఎస్టీ పార్లమెంటు సభ్యులు మూడవ వంతు వున్నప్పటికీ ఈ అన్యాయాలపై ఎన్నడూ నిలదీయలేకపోవడం వారి బలహీనత. జనాభా నిష్పత్తి ప్రకారం అన్ని రంగాల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీలు, మైనార్టీలు ఎదగడం ఉన్నతాధికారులుగా, రచయితలు, కళాకారులుగా, మేధావులుగా ఎదిగి స్థిరపడడం పురస్కారాలు, గౌరవాలు అందుకొని జాతి గౌరవాన్ని వైవిధ్య పూరితమైన సామాజిక జీవితాలను ప్రపంచానికి అందించడం జరిగినప్పుడే నిజమైన ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం పరిఢవిల్లుతున్నదని అర్థం.

5. సాహిత్యం ద్వారా మీరు ఎంతవరకు సమాజాన్ని ప్రతిబింబించారని అనుకుంటున్నారు?

నేను సాహిత్యంలో సమాజాన్ని నా శక్తి మేరకు, నాకున్న అవకాశాల మేరకు ప్రతిబింబించే కృషి చేశాను. ఇంకా ఎంతో కృషి చేయాల్సి వుంది. నేను రాయాల్సిన, విశ్లేషించాల్సిన జీవిత కోణాలు, పరిణామాలు ఎన్నో ఇంకా సాహిత్యంలో చిత్రించబడకుండా అలాగే వుండిపోతున్నాయి.

ఎంతోమంది రచయితలు చిత్రించినప్పటికీ సామాజిక, ఆర్థిక, చారిత్రక, సాంస్కృతిక పరిణామాలకు సంబంధించి ఒక సమగ్రతలో పాత్రల చిత్రీకరణ, సన్నివేశాల చిత్రీకరణ, సంఘటనల చిత్రీకరణ చేయడానికి ఆయా శాస్త్రాల అధ్యయనం అవసరం. అది ఎంతో సామాజిక ఉద్యమాల అనుభవం కూడా తోడయినప్పుడే సాధ్యమవుతుంది. అందుకని వైవిధ్యపూరితమైన జీవితానుభవాలు, సామాజిక ఉద్యమానుభవాలు వున్న మీరు రాయకపోతే ఎలా అని చాలా మంది వేదన పడుతుంటారు.

అచ్చువేసే ప్రచురణ కర్తలు లభించి వుంటే ఇప్పుడు రాసినదానికి పదిరెట్లు రాసి వుండే వాన్ని. రాయడంతో పాటు వాటిని ప్రచురించడం, ఆర్థికంగా పెట్టుబడి పెట్టాల్సి రావడం, మార్కెట్ చేయలేకపోవడం వల్ల సమయం వాటికి ఎక్కువ ఖర్చవుతున్నది.

అయినప్పటికీ ప్రేంచంద్ మార్గదర్శకంగా తీసుకొని నేను స్వాతంత్ర్యానంతర సామాజిక పరిణామాలను దళిత బహుజన జీవితాలను, సంస్కృతిని చిత్రించే కృషిలోనే వున్నాను. పూర్తికాలం రచనకే అంకితం చేశాను. బీసీ, ఎస్సీలు అన్ని రంగాల్లో ఎదగడానికి సైద్ధాంతిక రంగంలో వారు ఎలా ఎదగాలో వ్యక్తిత్వవికాసం, జీవితం అంటే ఏమిటి?, భారతీయ చరిత్ర-శూద్ర దృక్పథం, సామాజిక న్యాయం అంటే ఏమిటి? రాజ్యం-ప్రజలు వంటి పుస్తకాలను రాయాల్సిన చారిత్రక ఆవశ్యకత ముందుకు రావడం వల్ల ఫిక్షన్

రైటింగ్ వెనకబడింది. తెలంగాణ జీవితాలను రాస్తే సీమాంధ్ర యాజమాన్యంలో గల పత్రికలు, ప్రచురణా సంస్థలు అచ్చువేయడానికి నిరాకరిస్తున్నాయి. తెలంగాణ పత్రికలు, ప్రచురణా సంస్థలు లేకుండా ఒక పద్ధతి ప్రకారం అణచివేత కొనసాగింది.

ఇలా గత యాభయ్యేళ్ళుగా తెలంగాణ కథ, నవల, సాహిత్యం, సిద్ధాంతాలు, రచనలు, రచయితలు నిరాదరణకు, అణచివేతకు గురవుతూ వస్తున్నారు. సరైన స్థాయిలో తెలంగాణ నిష్పత్తి ప్రకారం పత్రికల్లో, ప్రచురణల్లో 40 శాతం మేరకు అవకాశం ఇచ్చి వుంటే పాఠక శ్రేణి రెట్టింపయ్యేది. తెలంగాణ రచయితలు 10 రెట్లు రాసివుండేవాళ్లు. అలాంటి అవకాశాలు లేకపోవడం వల్ల నేను కూడా రాయాల్సినంతగా రాయలేకపోవడానికి ప్రధాన కారణం.

6. అన్ని రంగాల్లో యువత ఎక్కువగా వస్తోంది. ఈ సాహిత్య రంగంలోకి రాకపోవడానికి కారణాలేమిటి?

1990 తరువాత ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ, సరళీకరణ ఆర్థిక విధానాల వల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలు తగ్గిపోతూ వచ్చాయి. వున్న వారిని కంపల్సరీ రిటైర్‌మెంట్, వాలంటరీ రిటైర్‌మెంట్, ప్రభుత్వ పరిశ్రమలను ప్రైవేటీకరించడం ద్వారా ఉద్యోగాల్లోంచి తీసివేయడం వల్ల సామాజిక పరిణామం ఒక అగాధానికి లోనైంది. సజావుగా నడిచే క్రమం ఆగిపోయింది. ఒక దశ దాకా తొలితరం నుండి ఎదిగిన వాళ్లు తిరిగి పేదరికంలోకి నెట్టివేసే క్రమం సాగింది. ఇది ఒక వైపు. మరొకవైపు ఎం.సెట్, ఐ.సెట్, ఎడ్‌సెట్ వంటి పరీక్షల కోసం నిరంతరం చదువు, లాంగ్‌టర్మ్ కోచింగ్‌లు... విద్యార్థులకు కనీసం క్రీడలు, సాహిత్య, సాంస్కృతిక రంగాల్లో కృషి, స్కూలు, కాలేజి వార్షిక మ్యాగజైన్‌లు మొదలైన వ్యక్తిత్వ వికాసానికి సంబంధించివన్నిటినీ అణగదొక్కి నిర్లక్ష్యం చేసి లేచిననుంచి పడుకునే దాకా చదువుచదువు అని వారి ప్రాణం తీస్తున్నారు. వ్యక్తిత్వం లేని జీవితాలుగా పౌల్ట్రీ ఫారం లోని బ్రాయిలర్ కోళ్లలాగా మార్చుతున్నారు.

విద్య ప్రైవేటీకరణ, సాఫ్ట్‌వేర్‌రంగం, ఎం.సెట్ వంటి ప్రవేశ పరీక్షలు లేకముందు విద్యార్థులు, యువకులు చదువుతో పాటుగా క్రీడలు, సాహిత్య, సాంస్కృతిక, సామాజిక, రాజకీయ రంగాల్లో క్రియాశీలంగా పాల్గొనే వారు. ఎంతోమంది ఎన్నో రంగాల్లో చిత్రకారులుగా, కళాకారులుగా, గాయకులుగా, రచయితలుగా, క్రీడాకారులుగా, వ్యాపారవేత్తలుగా, కాంట్రాక్టర్లుగా, జర్నలిస్టులుగా ఎదిగారు. 1990 నుంచి పై పరిణామాల వల్ల ఈ క్రమం వెనకబడిపోయింది. అలా జరిగి వుండకపోతే రవీంద్రనాథ్ ఠాగూర్, శరత్‌బాబు, ప్రేంచంద్, ఆర్.కె.నారాయణ్, అరుధంతి రాయ్‌లాంటి రచయితలు భారతీయ భాషల్లో వందలాది మంది ఎదిగి వుండేవారు. దీనికి తోడుగా క్రికెట్, టీవీ ఛానల్స్ వచ్చి మనిషిని, యువతరాన్ని క్రియాశీలంగా పాల్గొనే బదులుగా వాటిని చూసే ప్రేక్షకులుగా మాత్రమే వెనక్కి నెట్టివేసింది. అందులో భాగస్వామ్యం లేకుండా అవి అందని వారిగా మార్చివేసింది. నాటకాలను, గ్రామీణ ప్రదర్శన కళారూపాలను వెనక్కి నెట్టి సినిమా

కూడా క్రియాశీల కళాకారులుగా స్థానికంగా ఎదిగే క్రమాన్ని కళాకారుల కులాల కళలను, నైపుణ్యాన్ని దెబ్బతీసింది. టీవీ ఛానల్స్ దీన్ని మరింత చొచ్చుకుపోయి ప్రజల్లోని కళాత్మకతను, సృజనాత్మకతను దెబ్బతీశాయి. ప్రేక్షకులుగా మార్చాయి. స్థానికంగా ఎక్కడికక్కడ వికేంద్రీకృతంగా శతాబ్దాలుగా ఎదుగుతూ వచ్చిన కళాకారులు, గాయకులు, క్రీడాకారులు ఎదగడం అడ్డగించబడి కేంద్రీకృతంగా టీవీ చానల్స్ ద్వారా, సినిమాల ద్వారా, క్రికెట్ వంటి భారీ క్రీడా రంగాల ద్వారా కొందరిని మాత్రమే ఎదగడానికి అనుమతించే క్రమాలు సాగాయి.

సాంకేతిక పరిజ్ఞానం, సాఫ్ట్‌వేర్‌రంగం, సినిమా మొదలైనవన్నీ కలిసి గ్రామీణ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల నుండి ఎదిగే వారందరినీ అణచివేయడానికి ఎదిగించడానికి కులం ప్రాతిపదికగా వారి మనస్సుల్లో స్థిరపడిపోవడం వల్ల భారతదేశంలో మాత్రమే ఇలా సాహిత్యకారులు, రచయితలు, కళాకారులు, క్రీడాకారులు యువతరం నుండి ఎదగలేకపోతున్నారు. కొందరు పొట్టచేతపట్టుకొని ఉపాధి కోసం వలస వెళుతున్నారు. కొందరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల కోసం పరుగు తీస్తున్నారు. కర్ణుడి చావుకు కారణాలు ఎన్నో అన్నట్టుగా యువతరం సాహిత్య రంగంలో విస్తృతంగా ఎదిగి రాకపోవడానికి ఇవన్నీ కారణాలే.

7. యువ కథా రచయితలకు మీరిచ్చే సందేశం ?

యువ రచయితలు స్థానిక సమాజాన్ని దగ్గరగా పరిశీలించాలి. ప్రజల్లో కలిసి జీవిస్తూనే వాటిని విశ్లేషించే శక్తి సమకూర్చుకోవడానికి సామాజిక శాస్త్రాలను, అలంకార శాస్త్రాలను అధ్యయనం చేయాలి. సినిమా రంగానికి సంబంధించిన అలంకార శాస్త్రాలు ఎంతో ఎదిగాయి. అవి ఇంగ్లీషులో వున్నాయి. ఇంగ్లీషులో వచ్చిన అలంకార శాస్త్రాలను, సాహిత్య విమర్శలను సినిమా విశ్లేషణలను అధ్యయనం చేయడం అవసరం. సామాజిక ఆచరణలో వున్నప్పుడే ఇవన్నీ జీవితంలో, దృక్పథంలో భాగంగా మారతాయి. లేకపోతే వేదాలు, ఎక్కాలు వల్లించినట్టు జీవితానికి అన్వయించే స్థాయికి ఎదగడం సాధ్యం కాదు. ప్రపంచ సాహిత్యాన్ని అధ్యయనం చేయడం ఎంతో అవసరం. యూరప్‌లో, అమెరికాలో మంచి సాహిత్యం కూడా మిలియన్ల కాపీలు కొంటున్నారు. తెలుగులో అలా ఎందుకు కొనడం లేదో ఎలా రాస్తే కొంటారో అధ్యయనం చేయడం అవసరం. అందుకు శైలి, శిల్పాలను, కథా, నవల రచన నైపుణ్యాన్ని సాధన ద్వారా అభివృద్ధి పరచుకోవడం అవసరం.

తేది : 08-05-2010
సమయం : ఉ.11.00 గం.లకు

శ్రీమతి బి.శ్యామల గారితో ఇంటర్వ్యూ

(శ్రీమతి శ్యామల గారితో అనేక దఫాలుగా సంభాషించాను. ఎన్నో విషయాలు వివరించారు. అందులోని అనేక అంశాలను ఈ పరిశోధనా గ్రంథంలో ఆయా అధ్యాయాల్లో చేర్చాను. మరికొన్ని ముఖ్యాంశాలను ఇక్కడ పొందుపరుస్తున్నాను.)

బి.ఎస్.రాములు మీ పెళ్ళయ్యాక రాయడం ప్రారంభించారా?

నా పెళ్ళి కాకముందు నుంచీ ఆయన కథలు రాస్తుండే వారు. చందమామలో, బాలజ్యోతిలో కథలు వస్తుండేవి. మా అమ్మకు ఎనిమిది మంది మేము. వ్యవసాయ పనుల్లో వుండేవారం. మేం చదువుకోలేదు. పెళ్ళయిన తరువాత చదువుకున్నా. పిల్లల్ని పట్టుకొనుటకు ఇంటికాడనే వుండేదాన్ని. ప్రాథమికంగా చదువటం వచ్చు. రాయటం లేదు. కానీ స్కూలుకు వెళ్ళి చదువుకోలేదు. నాకు బాగా నచ్చిన కథలు 'బతుకు పోరు' నవల. 'నానమ్మ' కథ.

కథలు రాయడంలో కొడుకుల్ని తీర్చిదిద్దారా?

పెద్దకొడుకు పాణిగ్రాహి 1974లో పుట్టాడు. 1988-90లో ఇంటర్‌లో కొన్ని కథలు రాశాడు. బాలజ్యోతి, బొమ్మరిల్లు, చందమామలో వచ్చాయి.

మంచి అవార్డులు ఇస్తున్నప్పుడు మీకేం అనిపించింది?

దాశరథి గారు దంపతులిద్దర్ని సత్కరించారు. కొండా లక్ష్మణ్ బాపూజీ గారు కూడా సత్కరించారు. మాష్టార్జీ గారు దళిత కళా మండలి తరపున సత్కరించారు. కత్తి పద్మారావు పొన్నూరులో పట్టుబట్టలు పెట్టి మమ్మల్ని సత్కరించారు.

మీరెప్పుడైనా బి.ఎస్.రాములు గారికి కథలు రాయడానికి సూచనలిచ్చారా?

పాత్రల పేర్లు పాతవి కాకుండా ఎల్లయ్య, మల్లయ్య కాకుండా నరేష్, సురేష్ వంటి పేర్లు ఈ కాలానికి సంబంధించిన పేర్లు వుండాలని సూచించాను. కథలో మలుపులు తిప్పకుండా, కథ డైరెక్టుగా వుంటే పాఠకుడికి మంచిగా వుంటుందని చెప్పే దాన్ని. కాని ఆయన కథల్లో మలుపులు తిరుగుడు ఎక్కువగా వుంటాయి.

మీరు కథలు ఎప్పుడైనా రాద్దామని ప్రయత్నం చేశారా?

టీవీ సీరియళ్ళు చూస్తుంటే రాయాలనిపిస్తుంది. ఏవీ మంచిగ లేవు. నాకసలు ఆ

సీరియళ్ళు కూడా చూడబుద్ధి కావట్లేదు. నేరాలు-ఘోరాలు అసలు బాగుండవు.

పిల్లల మీద అత్యాచారాలు, యాసిడ్ దాడులు జరుగుతున్నాయి మీకేమనిపిస్తుంది?

అమ్మాయిల మీద దాడులు జరగటం మీడియా పాత్రే ఎక్కువ వున్నది. అమెరికాలో అయితే రక్తంగాని, ఘోరమైన చిత్రాలుగాని అక్కడ టీవీల్లో చూపించరు. అమెరికాలో కొడుకుల దగ్గర కొన్ని రోజులు వున్నప్పుడు టీవీల్లో ఇలాంటివి నాకు కనిపించలేదు. మన దగ్గర ఎక్కువ అవే చూపెడుతున్నారు. చిన్న పిల్లల మీద ఆ ప్రభావం బాగా పడుతున్నది.

మీ చిన్నప్పుడు కథలు వినేవాళ్ళా, పాటలు పాడేవాళ్ళా?

మా నాన్న నాటకాలు వేస్తుండే వాడు. వ్యవసాయ పనుల పాటలు పాడుతుండేవాడు. నాటకాల్లో, పద్యాలు పాడుతుండేవాడు. నేను అవి వినేదాన్ని. నేను గాయకురాల్ని కాదు. బతుకమ్మ పాటలు, మంగళహారతులు వచ్చు నాకు.

ఉద్యమంలో వున్నప్పుడు పోలీసు నిర్బంధం ఎప్పుడైనా వచ్చిందా?

బతకడం కష్టంగా వుండేది. ఎక్కడ ఎన్‌కౌంటర్‌లైనా భయంగా వుండేది. రాత్రి పూట పోలీసులు మా ఇంటికొచ్చినప్పుడు పెద్దపెద్ద లైట్లు తీసుకొని తలుపు కొట్టి లేపేవారు. పార్టీలో తిరగడం వల్ల మాకు చాలా ఇబ్బందైంది. పార్టీవాళ్ళు మా ఇంటికి వస్తే మా పిల్లలు రావద్దనే వాళ్ళు. మా బాల్యం ఎంత ఘోరంగా గడిచిందో అని చెప్పేవాళ్ళు. మా ఇంటి మీద ఎప్పుడూ పోలీసుల నిఘా వుండేది. నలుగురు పిల్లల్ని ఎట్లా సాదుతున్నది, సాయం ఎక్కడి నుంచి అందుతున్నది అని ఆరా తీసెటోళ్ళు.

ఆనాడు మీ పరిస్థితి ఎలా వుండేది?

పిలగాళ్ళకు పలకా, బలపం పుస్తకాలు కావాలని అడిగినా నా దగ్గర డబ్బులు వుండేవి కావు. ఏం చేయలేక కొట్టేదాన్ని. మా పరిస్థితి చూసి పక్కింటి వాళ్ళే సాయం చేసే వాళ్ళు. వాళ్ళని ఇప్పటికీ మేము మర్చిపోం. బీడీలు చేసేదాన్ని. సీజన్ లేనప్పుడు బీడీలకు ఆకు, తంబాకు తక్కువ ఇచ్చే వాళ్ళు. పిల్లలు వుండి బాధ పడుతుంటే చూసి బీడీ కంపెనీ బ్రాంచి టేకేదారు నా పరిస్థితి చూసి ఎంత ఆకు, తంబాకైనా ఇచ్చే వాళ్ళు. అందరికీ తక్కువ ఇస్తే నాకు ఎక్కువగా ఇచ్చే వాళ్ళు. మాకు రేషన్ కార్డు లేదు. వాళ్ళ తమ్మునిది, మా చెల్లెది మేం వాడుకునే వాళ్ళం. మా పెద్దకొడుకు పాణి రేషన్ షాపు కాడ నాలుగైదు గంటలు నిలబడి నూనె, చక్కెర తీసుకొచ్చెటోడు. మా బతుకు బీడీలు చేయటమే. 16 రూ.లకు ఒక జనతా చీర ఎన్టీఆర్ టైంలో ఇచ్చిండ్రు. 2 రూ.లకు కిలో బియ్యం, అవే బియ్యం, అవే బట్టలు. నాకు చదువు లేదు కాబట్టి నాకు చదువు మీద ఎక్కువ ఇంట్రస్టు వుండేది. అందుకే మా పిల్లల మీద ఎక్కువ దృష్టి పెట్టి చదివించినా.

ఇంకా మీ ఇంట్లో పరిస్థితి ఎలా వుండేది?

మాకు బట్టలు సరిపడా వుండేవి కాదు. మా పెద్దకొడుకు 10వ తరగతి వరకు చినిగిన లాగులు వేసుకొని తిరిగిండు. పదో తరగతి చదివిన తరువాతనే ప్యాంటు వేసుకొన్నడు. మా ఇంట్లో గడియారం కూడా లేకుంటుండె. పెద్దోడు ఇంటర్‌లో ట్యూషన్‌కు పోదామని ఉదయం అయిదు అయిందనుకొని లేచి క్లాక్‌టవర్ చేరేసరికి రాత్రి మూడు గంటలు కనపడింది. దాంతో రెండు గంటలు అక్కడే చలిలో ఉండి టైము కాగానే ట్యూషన్ సార్ దగ్గరికి పోయేవాడు. మా నాన్న వెయ్యి రూపాయలు ఇస్తే ట్యూషన్‌కు పోయిండు. మా చిన్న కొడుక్కు 6 సం॥ వచ్చే వరకు నాన్న ఎలా వుంటాడో తెలియదు. ఉద్యమం అంటూ వాని కన్న తరువాత పోయిండు. నేను పువ్వులు, బొట్టు పెట్టుకుంటే చుట్టుపక్కల పెద్దమనుషులు ఎప్పుడు చచ్చిపోయిండో ఈమె ఇంకా పూలు పెట్టుకొని, బొట్టు పెట్టుకుంటున్నదని విమర్శించెటోళ్ళు. వాళ్ళను ఏమనలేక ఏడ్చుకుంటూ ఇంట్లో వుండేదాన్ని. అన్నంలేక బీడీలు చుట్టుకుంటూ రాత్రుళ్ళు ఎన్నోసార్లు నీళ్ళు తాగి పండుకునే దాన్ని. మా బంధువులు నాకు బాగా సపోర్టు ఇచ్చిండ్రు. నన్ను కష్టాలలో ఆదుకున్నారు. ఇప్పుడు పిల్లలు ఎదిగనంక వారికి పెళ్ళిళ్ళకు, చదువులకు తోచినంత సహాయం చేస్తున్న.

అప్పటి జీవితానికి, ఇప్పటి జీవితానికి ఏ ఏ మార్పులు వచ్చాయి?

అప్పటికీ ఇప్పటికీ చాలా మార్పులు వచ్చాయి. ఇప్పుడు పిల్లలు ఎదిగి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లయి ఉద్యోగాలు చేస్తున్నారు. అప్పుడు తింటానికి తిండిలేదు. ఫ్యాన్లు లేవు, గడియారాలు లేవు, సరైన బట్టలు వుండేవి కావు. ఆ రోజుల్లో కట్టెల పొయ్యి, ఇంటి ముందు ముగ్గులు వేయడం, బతుకమ్మ పాటలు పాడటం వుండేవి. మా పిల్లలు కష్టపడి బాగా చదువుకొని సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా విదేశాల్లో మంచి జీవితం జీవిస్తున్నారు కంప్యూటర్లు, కార్లు అన్ని సమకూర్చుకొని తమ పిల్లలను చక్కగా ఏ కష్టం రాకుండా చూసుకుంటున్నారు. నేను మా పిల్లల దగ్గరికి అమెరికాకి మూడుసార్లు వెళ్ళి వచ్చాను. అప్పటికీ ఇప్పటికీ తేడా ఏమిటంటే అప్పుడు ఏ కాస్తా తీరిక దొరికేది కాదు. అప్పుడు బతుకంతా దుఃఖమే. ఎట్లా తెల్లారుతుందో తెలియదు. ఇప్పుడు పిల్లలు బాగా చదువుకున్నారు. కొడుకులంత చదువుకున్న చక్కని కోడళ్ళు దొరికారు. వారిని, మనమవలను చూసుకుంటున్నాను. అమెరికా నుండి వారానికోసారి కొడుకులు ఫోన్ చేయకపోతే ఏం తోచదు. అప్పుడు నవ్విన వాళ్ళు ఇప్పుడు గౌరవిస్తున్నారు. కొందరు అసూయ పడుతున్నారు.

తేది : 08-05-2010
సమయం : సా.4.30 గం.లకు

ఉపయుక్త గ్రంథ సూచి

క్ర.సం.	గ్రంథకర్త	గ్రంథ నామం - ప్రచురణ	సం॥
1.	తారకేశ్వరరావు.సి.హెచ్.	అట్టాడ అప్పల్నాయుడు ప్రత్యామ్నాయ కథలు - ఒకపరిశీలన పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయానికి సమర్పించిన లఘు సిద్ధాంత వ్యాసం	2008
2.	దక్షిణామూర్తి పోరంకి	'కథానిక - స్వరూప స్వభావాలు' శ్రీ బి.నాగేందర్, శివాజీ ప్రెస్, 4-4-53 గంజ్ బజార్, సికింద్రాబాద్	1988
3.	మాలతి చంద్ర పల్లా	'బతుకుపోరు నవల - పరిశీలన' ఎం.ఫిల్ పరిశోధనా గ్రంథం. సామాజిక తాత్విక విశ్వవిద్యాలయం, విశాల సాహితీ అకాడమీ 2-2-186/53/5, రామకృష్ణానగర్, బాగ్ అంబర్‌పేట, హైదరాబాద్ - 500 013.	2008
4.	రాములు బి.ఎస్.	బతుకుపయనం కథల సంపుటి సామాజిక తాత్విక విశ్వవిద్యాలయం, విశాల సాహితీ అకాడమీ 2-2-186/53/5, రామకృష్ణానగర్, బాగ్ అంబర్‌పేట, హైదరాబాద్ - 500 013.	2005
5.	రాములు బి.ఎస్.	'సమగ్ర సామాజిక కథ - 50 ఏళ్ళ తెలుగు కథ తీరు తెన్నులు' సామాజిక తాత్విక విశ్వవిద్యాలయం, విశాల సాహితీ అకాడమీ 2-2-186/53/5, రామకృష్ణానగర్, బాగ్ అంబర్‌పేట హైదరాబాద్ - 500 013.	2003
6.	రాములు బి.ఎస్.	'తెలంగాణ కథకులు-కథన రీతులు' - పైదే -	2008
7.	రాములు బి.ఎస్.	కథ వస్తువు - శైలి, శిల్పాలు (అముద్రితం)	
8.	రాములు బి.ఎస్.	మమతలు మానవ సంబంధాలు కథల సంపుటి - పైదే -	2000
9.	రాములు బి.ఎస్.	వేపచెట్టు తెలంగాణ కథలు - పైదే -	2003
10.	రాములు బి.ఎస్.	తేనెటీగలు కథల సంపుటి - పైదే -	2004
11.	రాములు బి.ఎస్.	ఆంధ్ర-తెలంగాణ రాష్ట్రాలు- ఉద్యమాలు - పైదే -	2008
12.	రాములు బి.ఎస్.	సామాజిక న్యాయం అంటే ఏమిటి? - పైదే -	2008
13.	రాములు బి.ఎస్.	ఆధునిక కథా సరిత్సాగరం - పైదే -	2003
14.	వెంకట సుబ్బయ్య వల్లంపాటి	కథా శిల్పం విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, విజ్ఞాన్ భవన్ 4-1-435, బ్యాంక్ స్ట్రీట్, హైదరాబాద్ - 500 001.	2000
15.	శ్రీనివాస్ సంగిశెట్టి	భండారు అచ్చమాంబ తొలి తెలుగు కథలు కవిలె, తెలంగాణ రీసెర్చ్ అండ్ రెఫరల్ సెంటర్, హైదరాబాద్.	2010
16.	సదాశివ్ కర్రె	'బి.ఎస్.రాములు కథలు -పాలు, స్మృతి, వేపచెట్టు, మమతలు-మానవ సంబంధాలు ఒక పరిశీలన' ఎం.ఫిల్ పరిశోధనా గ్రంథం. తెలంగాణ రాష్ట్ర కళాకారులు రచయితలు, మేధావుల ఐక్యవేదిక 2-2-647/ఎ/57, సాయిబాబా నగర్, శివంరోడ్, హైదరాబాద్-13	2007
17.	సిమ్మన్న వి.	అదవిబాపిరాజు కథలు, కవిత్వం-పరిశీలన దళిత సాహిత్య పీఠం, విశాఖపట్నం	1991

గ్రంథకర్త పరిచయం

పేరు	:	మొయిలి మోహనరావు
తల్లిదండ్రులు	:	మొయిలి లచ్చుమ్మ, అప్పారావు
పుట్టినతేది	:	06-10-1978
స్వస్థలం	:	కాజీపేట, అరసవల్లిపోస్ట్, శ్రీకాకుళం జిల్లా - 532 401
తొలిబడి	:	కాజీపేట మండల పరిషత్ ప్రాధమిక పాఠశాల
మలిబడి	:	మున్సిపల్ హైస్కూల్, అరవసల్లి
ఇంటర్	:	చైతన్య సహకార జూనియర్ కళాశాల, శ్రీకాకుళం
బి.ఏ.	:	ప్రభుత్వ డిగ్రీ కళాశాల (పురుషులు) శ్రీకాకుళం
ఎం.ఏ.	:	తెలుగు ప్రభుత్వ కళాశాల, రాజమండ్రి
తెలుగు పండిట్ శిక్షణ	:	శ్రీగరిమెళ్ళ సత్యనారాయణ ప్రభుత్వ ఉన్నత విద్యా అధ్యయన సంస్థ, రాజమండ్రి
ఎం.ఫిల్	:	'బి.ఎస్.రాములు బతుకుపయనం కథలు-పరిశీలన' అనే అంశంపై పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, సాహిత్య పీఠం, బొమ్మూరు, రాజమండ్రి.
భార్యా, పిల్లలు	:	శ్రీమతి హారతి, చి॥విజయ్ కృష్ణ, చి॥శ్రీనిధి
ఉద్యోగం	:	శివాని డిగ్రీ కళాశాల, శ్రీకాకుళం
చిరునామా	:	కాజీపేట (గ్రామం), అరసవల్లి (పోస్ట్), శ్రీకాకుళం (మండలం & జిల్లా) - 532 401